ఈనాడు

విజయవాడ 9-1-2019 బుధవారం సిటీ సంపుటి 45 . సంచిక 150


THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 20+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఓటెత్తిన కోటా

పేదల రిజర్వేషన్లకు లోక్‌సభ ఆమోదం



- రాజ్యాంగ సవరణకు పచ్చజెండా
- దాదాపుగా అన్ని పార్టీల మద్దతు
- ఏఐఏడీయంకే వాకౌట్
- వ్యతిరేకించిన మజ్లిస్
- సుప్రీంకోర్టు తీర్పు అడ్డంకి కాదు: జైట్లీ
- న్యాయ సమీక్షలో నిలబడదన్న విపక్షాలు
- నేడు రాజ్యసభకు రానున్న బిల్లు

అనుకూలం	323
వ్యతిరేకం	3


బిల్లును స్వాగతించిన చంద్రబాబు

సస్పెన్షన్ కారణంగా సభకు దూరమైన తెదేపా ఎంపీలు

మాట్లాడే అవకాశం దక్కని ఏపీ భాజపా ఎంపీలు

దిల్లీ: ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 10% రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన చరిత్రాత్మక బిల్లు మంగళవారం సుదీర్ఘ చర్చ తర్వాత ఆమోదం పొందింది. విపక్షాలు కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా చివరకు సరేనన్నాయి. అయితే న్యాయ సమీక్షలో ఇది నిలబడదని చెప్పాయి. రాత్రి 10 గంటల ప్రాంతంలో జరిగిన ఓటింగులో బిల్లుకు అనుకూలంగా 323 ఓట్లు, వ్యతిరేకంగా కేవలం మూడు ఓట్లు పడ్డాయి. రాజకీయంగా కీలకమైన అంశానికి పార్టీలకు అతీతంగా మద్దతు లభించింది. బిల్లు ఆమోదానికి అవసరమైన మూడింట రెండొంతుల ఆధిక్యాన్ని మించిన మద్దతును ప్రభుత్వం కూడగట్టగలిగింది. ప్రభుత్వ ఉద్దేశంపై విపక్షాలు తొలుత అనుమానాలు వ్యక్తం చేశాయి. పేదలకు రిజర్వేషన్ కల్పించడానికి తాము వ్యతిరేకం కాదని చెప్పాయి. కేంద్ర మంత్రి థావర్‌చంద్ గహ్లోత్ ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుపై రాత్రి పొద్దుపోయేవరకు లోక్‌సభ చర్చించింది. తర్వాత గహ్లోత్ సమాధానమిస్తూ- సుప్రీంకోర్టు దీనిని అంగీకరిస్తుందని తాను నమ్మకంతో చెప్పగలనన్నారు. సంశయాలకు ఎంత మాత్రం ఆస్కారం లేదని చెప్పారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. తామెంతమాత్రం తొందరపడలేదని చెప్పారు. ఏ మతానికి (మిగతా 6లో)

'కలకాలం నిలిచిపోయే క్షణం'



"పేదలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించే బిల్లుకు ఆమోదం లభించడం మనదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే క్షణం. ప్రతి నిరుపేదా అన్ని రకాల అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఉపకరించే సమర్థ ప్రక్రియకు బిల్లు ఆమోదం శ్రీకారం చుట్టింది. కుల, మతాలతో నిమిత్తం లేకుండా ప్రతి పేదవ్యక్తీ హుందాగా జీవించేలా చూడటమే మా లక్ష్యం. అన్ని అవకాశాలూ వారు అందిపుచ్చుకోగలగాలి. ఈ బిల్లును సమర్థించిన అన్ని పార్టీల ఎంపీలకు కృతజ్ఞతలు. అందరితో కలిసి....అందరి అభివృద్ధి అనే లక్ష్యానికి చిత్తశుద్ధితో కట్టుబడి ఉన్నాం."

– ప్రధాని నరేంద్రమోదీ (ట్వీట్)



దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌కి వెంకటేశ్వరుని విగ్రహాన్ని బహూకరిస్తున్న చంద్రబాబు

కోల్‌కతాలో కలుద్దాం

- భవిష్యత్తు కార్యాచరణపై 19న భేటీ కానున్న భాజపాయేతర పార్టీలు
- మమతా ర్యాలీకి హాజరుకు చంద్రబాబు, పవార్ నిర్ణయం
- రాహుల్, కేజ్రీవాల్, పవార్, ఫరూక్‌లతో బాబు భేటీ

ఈనాడు, దిల్లీ: భాజపాయేతర కూటమి మరో భేటీకి సిద్ధమైంది. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు ఈనెల 19న కోల్‌కతాలో సమావేశం కానుంది. అదే రోజున కోల్‌కతాలో జరిగే తృణమూల్ కాంగ్రెస్ ర్యాలీలో పాల్గొన్న అనంతరం నేతలంతా భేటీ కానున్నారు. అందులో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఒక రోజు పర్యటన కోసం మంగళవారం దిల్లీ వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలువురు నేతలతో సమావేశమయ్యారు. తొలుత కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌తో (మిగతా 6లో)

ఉద్యోగార్థులకు మార్గదర్శి

ఈనాడు చదువు

అవకాశాల పాలపుంత.. అంతరిక్షం

- ఉపాధి అవకాశాలను అందించే స్పేస్ సైన్స్ కోర్సుల వివరాలు..
- అభ్యర్థుల సందేహాలకు నిపుణుల సమాధానాలు..
- తాజా విద్యా, ఉద్యోగ ప్రకటనల సమాహారం..



'చదువు' పేజీలో

వీరి వీరి వంకాయ.. దీనిపేరు యహోదా

- కుప్పంలో సాగవుతున్న భారీ వంకాయ రకం పంట 11లో

ఆలోక్‌కు మళ్లీ పగ్గాలు





- సీబీఐ డైరెక్టర్‌ను బదిలీ చేసే అధికారం ప్రభుత్వానికి లేదు
- సుప్రీంకోర్టు తీర్పు
- ఆయన అధికారాలపై తుది నిర్ణయం అత్యున్నత స్థాయి కమిటీదే
- వారంలోగా సమావేశం కావాలి
- అప్పటివరకు విధానపరమైన అంశాల జోలికి వర్మ వెళ్లకూడదు
- ధర్మాసనం స్పష్టీకరణ

12లో

అత్యున్నత స్థాయి కమిటీ నుంచి ముందస్తు అనుమతి లేకుండా సీబీఐ డైరెక్టర్ అధికారాలు, విధులను వెనక్కి తీసుకునేందుకు ప్రభుత్వానికి చట్ట ప్రకారం ఎలాంటి అధికారం లేదు. అత్యున్నత స్థాయి కమిటీ నిర్ణయం తీసుకునేవరకూ ఆలోక్ వర్మ ప్రస్తుతం కొనసాగుతున్న రోజువారీ విధులను మాత్రమే నిర్వహించాలి. - సుప్రీం కోర్టు

ప్రభుత్వ నిర్ణయం సబబే

సీబీఐ నిబద్ధతను పరిరక్షించడానికే ఆ దర్యాప్తు సంస్థలోని ఇద్దరు అధికారులను సెలవుపై పంపాలన్న నిర్ణయాన్ని కేంద్రం తీసుకుంది. ఆ చర్య పూర్తిగా చట్టబద్ధమైంది. తాజా తీర్పు చాలా సమతౌల్యంగా ఉంది. సీబీఐ నిష్పాక్షిక పనితీరు పరిరక్షణ కోసం ఆ సంస్థ డైరెక్టర్‌కు ఇచ్చిన ప్రత్యేక మినహాయింపులను కోర్టు బలోపేతం చేసింది.

- కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

మోదీని ఎవరూ కాపాడలేరు

సుప్రీం కోర్టు తాజా తీర్పుతో రఫేల్ యుద్ధవిమానాల ఒప్పందంపై దర్యాప్తు జరపకుండా ప్రధాని మోదీని ఎవరూ కాపాడలేరు. రఫేల్ ఒప్పందంపై దర్యాప్తును సీబీఐ డైరెక్టర్ ఆలోక్ వర్మ ప్రారంభించనున్న నేపథ్యంలో అర్ధరాత్రి ఆయనకు ఉద్వాసన పలికారు. ఇప్పుడు వర్మను తిరిగి ఆ పదవిలో కోర్టు కూర్చోబెట్టింది.

- రాహుల్, కాంగ్రెస్ అధ్యక్షుడు

ఇదీ సంగతి!



వీడిని సైన్స్ కాంగ్రెస్‌కు పంపించాల్సింది డియర్, పొరపాటు చేశాం, మంచి పేరు తెచ్చుకునేవాడు అందరిలో.

ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు!



341 రోజులు.. 3,648 కిలోమీటర్లు

జగన్ పాదయాత్ర సాగిందిలా...

నేడే ముగింపు, ఇచ్ఛాపురంలో భారీ సభ

వైకాపా అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహనరెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర బుధవారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగియనుంది. కడప జిల్లా ఇడుపులపాయలో 2017 నవంబరు 6న ప్రారంభమైన ఆయన పాదయాత్ర 13 జిల్లాల మీదుగాసాగింది.

యాత్రా మార్గంలో నగర, పట్టణ, గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ప్రజల్ని కలుస్తూ.. వారి కష్ట, నష్టాల్ని తెలుసుకుంటూ.. 'వచ్చేది మన ప్రభుత్వం.. మీ సమస్యలన్నీ పరిష్కరిస్తాం' అని భరోసానిస్తూ ఆయన ముందుకు కదిలారు. మొత్తంమీద జగన్ 124 బహిరంగ సభల్లో ప్రసంగించారు. వివిధ సామాజిక వర్గాలు, కులవృత్తుల వారితో ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. ఎన్నో హామీలిచ్చారు. వచ్చే ఎన్నికలకు సంబంధించి వైకాపా ప్రధాన హామీలైన నవరత్నాల గురించి బహిరంగ సభల్లో వివరించారు. ముగింపు సందర్భంగా నేడు ఇచ్ఛాపురంలో వైకాపా భారీ బహిరంగ సభను నిర్వహిస్తోంది.

– పూర్తి కథనం 11లో



₹1035 ₹1700
గోల్డెన్ హార్వెస్ట్ సోనా మసూరి ఏకాదశి బియ్యం (25 కిలోలు)
₹41 ₹44
గోల్డెన్ హార్వెస్ట్ మైదా పిండి (1 కిలో)
బాంబినో సేమియాలు (875 గ్రా.)
₹65 ₹75
₹69.50 ₹76
శనగపప్పు ప్రీమియం విడిగా (1 కిలో)
ఫ్రెష్ & ప్యూర్ ఆవు నెయ్యి (1 లీ.)
₹389 ₹530
₹463 ₹555
ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ రిఫైన్డ్ ఆయిల్ (5 లీ.)
ఈ పండుగ సంబరాలను సరికొత్తగా జరుపుకోండి
₹75 ₹84
మినప గుండ్లు తెల్లని ప్రీమియం విడిగా (1 కిలో)
₹214 ₹370
కార్మిక్ జీడిపప్పు ప్లెయిన్ (200 గ్రా.)
పంచదార విడిగా (1 కిలో)
₹34.50 ₹38
కార్మిక్ బాదాములు ప్లెయిన్ (200 గ్రా.)
₹167 ₹250
₹86 ₹88
గోల్డెన్ హార్వెస్ట్ బెల్లం క్యూబ్ (1 కిలో)
గోల్డెన్ హార్వెస్ట్ బియ్యం పిండి (1 కిలో)
₹37 ₹39
ప్రతి పండుగ సంబరానికి
BIG BAZAAR
ఇండియాని చేస్తుంది బ్యూటిఫుల్
కస్టమర్ హెల్ప్‌లైన్ నెంబర్:
1800 266 2255
/bigbazaar @bigbazaar
/big.bazaar bigbazaar.com
స్టోర్‌లో ఇంకా ఎన్నో ఆఫర్స్ లభ్యం.
బిగ్ బజార్: – వి.వి.కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ.
*నిబంధనలు వర్తిస్తాయి: స్టాక్స్ ఉన్నంత వరకే ఆఫర్ వర్తిస్తుంది. ఉత్పత్తి చిత్రాలు ఆఫర్ యొక్క సూచనాప్రాయం మాత్రమే, నిజమైన ఉత్పత్తితో మ్యాచ్ కావు. రిటేల్ వినియోగదారులకు మాత్రమే ఆఫర్ వర్తిస్తుంది. పరిమాణ నిబంధనలు వర్తించును. ఎప్పుడైనా కాని ఎలాంటి ముందు సూచన ఇవ్వకుండానే నియమాలు మరియు నిబంధనలు, ఇంకా ఆఫర్స్‌ని విరమించుకునే, మార్చే లేదా సవరించే హక్కు ఫ్యూచర్ రిటేల్ లిమిటెడ్‌కి ఉంటుంది. వివాదాలు ఏవైనా ముంబాయిలోని న్యాయస్థానాల పరిధికి లోబడి ఉంటాయి. ఫ్యూచర్ రిటేల్ లిమిటెడ్‌వారి నిర్ణయం తుదిది మరియు దానికి కట్టుబడి ఉండాలి మరియు ఈ విషయంలో ఎలాంటి ఉత్తరప్రత్యుత్తరాలకు తావుండదు. జనవరి 14, 2019 వరకు ఆఫర్స్ వర్తిస్తాయి. ఆఫర్స్ విజయవాడ స్టోర్స్‌లో మాత్రమే వర్తించును.

ప్రయాణికులతో మర్యాదగా మెలగాలి

ఆర్టీసీ ఎండీ సూచన

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ బస్సులను మార్గమధ్యలో తనిఖీ చేసే అధికారులు.. ప్రయాణికులు, సిబ్బంది పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని ఆర్టీసీ ఎండీ ఎన్.వి. సురేంద్రబాబు సూచించారు. ఏవో కేసులు పెట్టాలన్న ధోరణితో కాకుండా నిజమైన లోటుపాట్లు గుర్తించేలా తనిఖీలు ఉండాలన్నారు. ఏదైనా తప్పు జరిగిందని గుర్తించినప్పుడు.. అది ఉద్దేశపూర్వకంగా జరిగిందా? లేదా పొరపాటున జరిగిందా అనేది ఆలోచించాలన్నారు. విజయవాడలో మంగళవారం ఆర్టీసీ తనిఖీ అధికారులు, రోడ్డు ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లకు శిక్షణతరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ డ్రైవింగ్‌ను గుర్తించేందుకు తనిఖీ అధికారులు ప్రయాణికులతో కలిసి ప్రయాణించాలన్నారు.

3 రోజుల సీఐడీ కస్టడీకి నౌహీరా

చిత్తూరు, న్యూస్‌టుడే: గొలుసుకట్టు పథకం పేరిట కోట్లాది రూపాయలు స్వాహా చేసిన 'హీరా' గ్రూపు కంపెనీల ఛైర్‌పర్సన్ నౌహీరా షేక్‌ను 3 రోజుల పాటు సీఐడీ పోలీసుల కస్టడీకి అనుమతిస్తూ మంగళవారం చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. చిత్తూరు జిల్లాలోని కలకడ, తిరుపతిలో హీరా గ్రూప్‌పై నమోదైన కేసుల్లో ఆమెను ఈ నెల మూడో తేదీన చిత్తూరులోని జిల్లా సెషన్స్ కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. కోర్టు ఆమెకు ఈ నెల పదో తేదీ వరకూ రిమాండు విధించింది.

డ్రోన్ కార్పొరేషన్ సీఈఓగా రవీంద్రరెడ్డి

ఈనాడు–అమరావతి: ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా ఆళ్ల రవీంద్రరెడ్డిని నియమిస్తూ ఇంధన, మౌలిక సౌకర్యాలు, పెట్టుబడుల శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులిచ్చారు. కార్పొరేషన్ అధ్యక్షుడిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సభ్యులుగా పంచాయతీరాజ్, ఇంధన, ఆర్థికశాఖల కార్యదర్శులు, ఏపీఎస్ఎఫ్ఎల్ ఛైర్మన్, ఎండీ సభ్యులుగా ఉంటారు.

ఏపీఆర్వో పోస్టుల అర్హతలపై గందరగోళం

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ఏపీఆర్వో పోస్టుల భర్తీకి డిసెంబరు 26న విడుదల చేసిన ఉద్యోగ ప్రకటనలోని అర్హతలపై అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థులు జర్నలిజం లేదా 'ప్రజా సంబంధాల్లో' (పబ్లిక్ రిలేషన్స్) డిగ్రీ/డిప్లొమో చేసి ఉండాలని అందులో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇంచుమించు 1996 వరకు వివిధ విశ్వవిద్యాలయాలు బీజేఎంసీ/బీసీజే పేరిట ఒక సంవత్సరం కోర్సును అందించాయి. దీనికి అనుబంధంగా ఎంజేఎంసీ/ఎంసీజే పేరిట మరో కోర్సు కూడా నిర్వహించాయి. డిగ్రీ తరువాత బీజేఎంసీ/బీసీజే చేసిన వారికి ఎంజేఎంసీ/ఎంసీజే చేయడానికి అవకాశం కల్పించారు. అనంతరం యూజీసీ సూచనల మేరకు దేశవ్యాప్తంగా పలు విశ్వవిద్యాలయాలు బీజేఎంసీ/బీసీజే కోర్సును రద్దు చేసి ఎంజేఎంసీ కోర్సునే రెండేళ్ల కోర్సుగా మార్చి అందిస్తున్నాయి. మరోవైపు, ఎంజేఎంసీకి డిగ్రీస్థాయిలో మూడేళ్ల కోర్సు పూర్తిస్థాయిలో ఎక్కడా అందుబాటులో లేదు. జర్నలిజం వైపు వెళ్లాలనుకునే అతికొద్దిమంది మాత్రమే ఇంటర్ తరువాత బీఏ (జర్నలిజం) కోర్సు చేస్తున్నారు. ఈ డిగ్రీకి ఆదరణ చాలా తక్కువగా ఉండడంతో రాష్ట్రంలో అతి తక్కువ కళాశాలల్లో మాత్రమే అందుబాటులో ఉంది. ఈ నేపథ్యంలో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఏపీఆర్వో పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం బీఏ జర్నలిజం చేసిన వారు మినహా ఇతరులెవ్వరూ ఆ పోస్టులకు అర్హులయ్యే పరిస్థితి లేదు. జర్నలిజం, ప్రజా సంబంధాల ఉద్యోగాలకు అవసరమయ్యే సమగ్ర నైపుణ్యాలు ఉండేలా తీర్చిదిద్దిన ఎంజేఎంసీ కోర్సు అభ్యర్థులను ఏపీ ఆర్వో పోస్టులకు అనర్హులను చేయడంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

ఈనాడు

వ్యవస్థల్ని నిలబెట్టాలి!

కేంద్ర దర్యాప్తు సంస్థ (కేదస- సీబీఐ) సంచాలక పదవి నుంచి తనను బలవంతాన తప్పించి సెలవుపై పంపించడాన్ని సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం తలుపు తట్టిన ఆలోక్ కుమార్ వర్మకు పాక్షిక ఉపశమనం లభించింది. ఎవరెంతటివారైనా సరే, రాజ్యాంగ చట్టం వారికంటే ఉన్నతమైనదని గతంలో పలుమార్లు కరాఖండీగా ప్రకటించిన సుప్రీంకోర్టు- అదే ప్రాతిపదికపై కేదస అంతర్గత రగడకు సంబంధించిన వ్యాజ్యాన్ని తాజాగా పరిష్కరించింది. గడచిన అక్టోబరు 23వ తేదీ నడిరాత్రి కేదస సంచాలకుడు ఆలోక్ వర్మ, ప్రత్యేక సంచాలకుడు రాకేశ్ అస్థానాలను అర్ధాంతరంగా బాధ్యతల వెలికి గురిచేసిన కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని న్యాయస్థానం నిష్కర్షగా తోసిపుచ్చింది. ఆలోక్ వర్మపై అవినీతి అభియోగాలు ఉన్నందువల్లనే బాధ్యతల నుంచి దూరం జరిపామే గాని, కేదస సంచాలక పదవిలో ఆయననే కొనసాగిస్తున్నామంటూ కేంద్రం చేసిన వాదన ఆమోదయోగ్యం కాదని చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ సారథ్యంలోని ధర్మాసనం స్పష్టీకరించింది. పరస్పరం తీవ్ర అవినీతి ఆరోపణలు గుప్పించుకున్న వర్మ, అస్థానాలను సెలవుపై పంపించే అధికారం కేంద్రానికి లేదన్న న్యాయస్థానం, త్రిసభ్య అత్యున్నత నియామక సంఘం సమ్మతితోనే ఆ ప్రక్రియ చేపట్టి ఉండాల్సిందని విపులీకరించింది. జనవరి 20, 2017న కేదస సంచాలకుడిగా నియమితులైన వర్మ ఇంకొన్ని రోజుల్లో పదవీ విరమణ చేయనున్న దృష్ట్యా- ఆలోపు ఆయన కీలక నిర్ణయాల జోలికి పోరాదనీ కోర్టు గిరిగీసింది. అవినీతి ఆరోపణలకు సంబంధించి కేంద్ర నిఘా సంఘం (సీవీసీ) నివేదికానుసారం వర్మపై తదుపరి నిర్ణయం తీసుకోగల అధికారం ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీం ప్రధాన న్యాయమూర్తితో కూడిన సంఘానిదేనన్న కోర్టు- వారంలోగా ఆ కమిటీ కొలువు తీరాలనీ నిర్దేశించింది. ఏం జరిగినా చట్టబద్ధంగా జరగాలన్నది నిన్నటి సుప్రీం తీర్పు సారాంశం. చట్టాన్నే చుట్టబండలు చేసేలా అడపాదడపా దుర్రాజకీయాలు కోర చాస్తుండటమే ఎంతటి వ్యవస్థల ప్రతిష్ఠనైనా కదలబారుస్తున్న వైపరీత్యం!

సారథ్యం వహించే వ్యక్తుల నడతనుబట్టే ఆయా వ్యవస్థలు రాణిస్తాయన్న రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ అంబేడ్కర్, కీలక నియామకాల విషయంలో ఎంత జాగరూకత అవసరమో ఏనాడో అన్యాపదేశంగా ఉద్బోధించారు. వాస్తవంలో అటువంటి జాగ్రత్తలు గాలికెగిరిపోయిన దుష్పరిణామాల్ని జాతిజనులు దశాబ్దాలుగా నిర్వేదంతో పరికిస్తున్నారు. నిన్నటి విశిష్ట తీర్పులో 1997 డిసెంబరు నాటి వినీత్ నారాయణ్ కేసును పలుమార్లు ప్రస్తావించిన సర్వోన్నత న్యాయస్థానం, ఆ స్ఫూర్తికి అనుగుణంగా రాజకీయ జోక్యానికి తావే లేని పటిష్ఠ దర్యాప్తు సంస్థగా కేదస వన్నెలీనాలని అభిలషిస్తోంది. రాజకీయ పనిముట్టుగా దిగజారిన కేదస దుస్థితిని ఎలుగెత్తిన ఆనాటి కేసు విచారణలో- పోలీస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వంటి వ్యవస్థలూ స్వేచ్ఛగా స్వతంత్రంగా వ్యవహరించే వాతావరణం నెలకొనాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. బ్రిటన్‌లోని డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ తరహాలో పటుతర సంస్థనొకదాన్ని అవతరింపజేసి కేదస, ఈడీ సాగించే విచారణల పర్యవేక్షణ బాధ్యతను దానికి కట్టబెట్టాలనీ దిశానిర్దేశం చేసింది. సంయుక్త కార్యదర్శి, ఆపై అధికారుల మీద దర్యాప్తు చేసేందుకు సంబంధిత విభాగం ముందస్తు అనుమతి తప్పనిసరి అంటున్న నిబంధనను సుప్రీం అప్పట్లో కొట్టేసినా- అనంతర కాలంలో వాజ్‌పేయీ జమానా మళ్ళీ చేర్చింది. 2014 మే నెలలో సర్వోన్నత న్యాయస్థానం వేటు వేసినా, అది తిరిగి మొలుచుకొచ్చి- అవినీతిపరులకు రక్షాకవచమై వర్ధిల్లుతోంది. న్యాయస్థానం వద్దన్న ముందస్తు నిబంధనను ముద్దు చేస్తున్న పాలక పక్షాలకు, అత్యావశ్యకమన్న సమర్థ నిష్పాక్షిక సంస్థ ఏర్పాటు సంగతి పరగడుపున పడిపోయింది. న్యాయస్థానం హితబోధను ప్రభుత్వాలు పెడచెవిన పెట్టిన పర్యవసానంగానే, దర్యాప్తు సంస్థల పరువు ప్రతిష్ఠలకు నేడిలా తూట్లు పడుతున్నాయి.

వీరప్ప మొయిలీ సారథ్యంలోని రెండో పరిపాలన సంస్కరణల సంఘం- దర్యాప్తులో రాజకీయ జోక్యం తాలూకు దుష్ప్రభావ తీవ్రతను సోదాహరణంగా విశదీకరించింది. బ్రిటన్‌లో రామ్‌సె మెక్‌డొనాల్డ్ నేతృత్వాన ఏర్పడ్డ మొట్టమొదటి లేబర్ ప్రభుత్వం ఒక దేశద్రోహం కేసులో నేరాభియోగాల్ని కేవలం రాజకీయ కారణాలతో ఉపసంహరించాలని నిర్ణయించింది. నాడు రేగిన పెను రాజకీయ దుమారంలో ప్రభుత్వమే పతనమైంది. ఆ దెబ్బతో దర్యాప్తు, విచారణల్లో వేలుపెట్టడానికి బ్రిటన్ మంత్రులు, ఉన్నతాధికారులు ఇప్పటికీ హడలెత్తిపోతుంటారు. అక్కడికి ఇక్కడికి ఎంత తేడా! తెరచాటు నియంత్రణల పుణ్యమా అని సరైన సాక్ష్యాధారాలు దొరకలేదన్న సాకుతో ఎన్నో కేసులు మూతపడుతుండటాన్ని సుప్రీంకోర్టే తప్పుపట్టింది. ఉన్నత స్థానాల్లో అవినీతిపై ముక్కుసూటిగా దర్యాప్తు చేపట్టే 'స్వతంత్రత' కేదసలో కొరవడిందని గతంలో కేంద్ర హోంశాఖ నియమించిన మాధవ మీనన్ కమిటీయే నిగ్గుతేల్చింది. దేశానికి స్వాతంత్ర్యం లభించి ఏడు దశాబ్దాలు గతించినా సరైన వ్యవస్థల్ని నిర్మించుకోలేకపోవడమే దురదృష్టకరం. పరిశ్రమ, నిష్పక్షపాతం, నిజాయతీ స్వీయ లక్ష్యాలని కేదస ఘనంగా చాటుకుంటున్నా- వాటిని గాలికిపోయే పేలపిండి చేసి, జోహుకుం శైలిల్ని ముఖ్య పదవుల్లో కొలువుతీర్చి వ్యవస్థల్ని నీరుకారుస్తుండబట్టే, దిగ్భ్రాంతకర ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. చిత్తశుద్ధి, నైతిక నిష్ఠ, సజ్జనత్వం కలగలిసిన బ్యూరోక్రాట్ల నుంచే సీవీసీ ఎంపిక జరగాలంటూ దాదాపు రెండు పుష్కరాల నాడు సర్వోన్నత న్యాయస్థానం నిర్దిష్ట విధివిధానాల్ని ఖరారు చేసింది. ఆ కొలమానాన్నే కేదస, ఈడీలకూ ఎందుకు వర్తింపజేయకూడదు? దుర్రాజకీయాల భల్లూక పట్టు నుంచి దర్యాప్తు విచారణ సంస్థలు, రాజ్యాంగ వ్యవస్థలు విముక్తం కావడమే- వ్యవస్థల్లో విలువల పతనానికి సరైన విరుగుడు!

రైతు కష్టాలు ఇన్నన్ని కాదయా...



కె.నరసింహమూర్తి


వ్యవసాయ రుణమాఫీ ఈమధ్య కాలంలో దేశవ్యాప్త చర్చనీయాంశంగా మారింది. రుణమాఫీపై ఎన్నికల్లో వివిధ పార్టీలు హామీ ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయడం చూస్తూనే ఉన్నాం. సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా రుణమాఫీ చేయాలనే డిమాండ్లు ఊపందుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ రుణాల మాఫీ ఏ మేరకు సమంజసం, ఇప్పటివరకూ వ్యవసాయ రుణాలు మాఫీ చేసిన సందర్భాల్లో రైతులకు నిజంగా ఎంతవరకు మేలు జరిగింది, ఈ మాఫీ రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుస్తోందా, దేశ ఆర్థిక వ్యవస్థపై దీని ప్రభావం ఏమిటి, ఈ తరహా పరిస్థితి ఇతర దేశాల్లో ఉందా వంటి అంశాలను కూలంకషంగా చర్చించాల్సి ఉంది.

కొందరికే సాంత్వన

భారత్‌లో వ్యవసాయ రుణాల మాఫీ ప్రక్రియ ఇవాళ్టి మాట కాదు. 1980లో నాటి ఉపప్రధాని దేవీలాల్ రూ.10,000 కోట్ల వ్యవసాయ రుణమాఫీని ప్రకటించారు. ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే ఇది రూ.50,000 కోట్ల రుణమాఫీ అవుతుంది. వాస్తవానికి రూ.2,800 కోట్ల మేరకు మాత్రమే రుణమాఫీని అమలు చేయగలిగారు. దానివల్ల రైతులకు పెద్దగా మేలు చేకూరిందని చెప్పే పరిస్థితి లేదు. అనంతరం 2008లో కేంద్రంలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం రూ.71,680 కోట్ల వ్యవసాయ రుణమాఫీ ప్రకటించింది. కానీ అందులో సగమైనా అమలు కాలేదు. కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (సీఏజీ) ఈ రుణమాఫీ అమలు తీరుపై ఎన్నో అభ్యంతరాలు వ్యక్తం చేసింది. రుణమాఫీకి అర్హులైన రైతుల్లో 13.5 శాతానికి మాత్రమే లబ్ధి చేకూరింది. మరోవంక అర్హత లేకున్నా ఎనిమిది శాతం మంది రుణాలు రద్దయ్యాయి. దాదాపు ఆరు శాతానికి ఉన్న దానికన్నా తక్కువ రుణం రద్దు అయింది. ఇంకా 34.3 శాతం దొంగ లెక్కలతో రుణమాఫీ లబ్ధి పొందారని తేలింది. పైగా ఈ రుణమాఫీ బ్యాంకింగ్ వ్యవస్థను గందరగోళంలోకి నెట్టింది. బ్యాంకుల్లోనూ ఎన్నో అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఒక ఆడిటర్‌గా ఈ లావాదేవీలను పరిశీలించే అవకాశం అప్పట్లో నాకు వచ్చింది. మొత్తమ్మీద చూస్తే ఈ వ్యవహారం పూర్తిగా అటు రైతాంగానికి కాని, ఇటు వ్యవసాయ రంగానికి కాని మేలు చేసిందని నిర్ధారణకు రాలేని పరిస్థితి ఏర్పడింది.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా వ్యవసాయ రుణాలు రూ.14.9 లక్షల కోట్లు ఉన్నాయి. అందులో రూ.8.29 కోట్లు వ్యవసాయ రుణాలు. గిడ్డంగుల నిర్మాణం నుంచి ట్రాక్టర్ల కొనుగోలు వరకు అన్ని వ్యవసాయ సంబంధిత అంశాల కోసం పలు రకాల అప్పులు వ్యవసాయ రుణాల పరిధిలో ఉంటాయి. ఇక పంట రుణాల విలువ రూ.6.6 లక్షల కోట్లు. అందులో లక్ష రూపాయల్లోపు రుణాలు 71 శాతం వరకూ ఉంటాయి. బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతుల్లో సన్న, చిన్నకారు రైతులు సగం మందైనా లేరు. అంటే బ్యాంకుల నుంచి పెద్ద రైతులకు మాత్రమే వ్యవసాయ రుణాలు లభిస్తున్నాయన్న మాట. జాతీయ నమూనా సర్వే అధ్యయనం ప్రకారం వ్యవసాయ రుణాల్లో సంస్థాగత రుణాలు 60 శాతమే ఉన్నాయి. మిగిలిన 40 శాతం రుణాలను వడ్డీ వ్యాపారులు, సూక్ష్మరుణ సంస్థలు, బ్యాంకింగేతర సంస్థల నుంచి రైతులు తీసుకుంటున్నారు. ఇటువంటివారంతా చిన్న, సన్నకారు రైతులే. అందువల్ల ప్రభుత్వం వ్యవసాయ రుణమాఫీ చేస్తే పెద్ద రైతులకే ప్రయోజనం కాని, నిజంగా కష్టాల్లో కూరుకుపోయిన చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరడం లేదని స్పష్టమవుతోంది. పైగా రుణమాఫీ వల్ల లాభపడిన పెద్ద రైతులు తమవద్ద మిగిలిన సొమ్మును వ్యవసాయంపై పెట్టుబడిగా పెట్టకుండా సొంత, వ్యక్తిగత అవసరాలకు ఖర్చు చేస్తున్నట్లు తేలింది.

వ్యవసాయ రుణాలు మాఫీ చేయడం వల్ల బ్యాంకులపై ఒత్తిడి పెరిగిపోతోంది. బ్యాంకుల్లోని సొమ్ము ఎక్కువగా చిన్న, మధ్య తరగతి డిపాజిటర్లదేనన్న విషయం గుర్తించాలి. ఇచ్చిన అప్పులు వసూలుకాక బ్యాంకులు తీవ్రంగా నష్టపోయి ఆర్థికంగా కుంగిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. దీనివల్ల సమాజంలో 'రుణ సంస్కృతి' (క్రెడిట్ కల్చర్) దెబ్బతింటోంది. తీసుకున్న రుణాలు తిరిగి



రుణమాఫీతో తీరవు వెతలు

చెల్లించాల్సిన అవసరం లేదనే అభిప్రాయం బలపడుతోంది. మరోపక్క ప్రభుత్వాలు ఆర్థికంగా కుంగిపోతున్నాయి. ఇటీవలి కాలంలో వ్యవసాయ రుణమాఫీని అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితే దీనికి ఉదాహరణ. 2014-18 మధ్యకాలంలో రూ.1,82,800 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ చేశారు. దీనివల్ల ప్రభుత్వాల ఆర్థిక లోటు పెరిగిపోయింది. మూలధన సమీకరణ తగినంతగా జరగలేదు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ప్రభుత్వం వద్ద తగినంతగా నిధులు లేని పరిస్థితి ఏర్పడింది.

భారత్‌లో వ్యవసాయ రంగం ఎందుకు కుదేలవుతోంది, రైతన్న కష్టనష్టాల్లోనే ఎందుకు కొట్టుమిట్టాడుతున్నాడు, సేద్య సంక్షోభానికి శాశ్వత పరిష్కారాలేమిటి అన్న అంశాలపై ఇప్పటివరకూ సరైన అధ్యయనాలు జరగలేదు. దానికి బదులు రుణమాఫీ వంటి తాత్కాలిక పరిష్కార మార్గాలకే పెద్దపీట వేస్తున్న పరిస్థితి కనిపిస్తుంది. రైతు కుంగిపోవటానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. ప్రధానంగా కరవు పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు అన్నదాతలను ఉసూరుమనిపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా వ్యవసాయ దిగుబడులు పెరిగాయి. గిరాకీ కంటే అధికంగా ఉత్పత్తి కనిపిస్తోంది. ఫలితంగా ధరలు కుంగిపోతున్నాయి. ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పెంచినా మార్కెట్లో ఆ ధర రావడం లేదు. కాబట్టి రైతులకు తగినంత ఆదాయం ఉండటం లేదు. ప్రభుత్వం చేపట్టే మార్కెట్ నియంత్రణ కార్యకలాపాలు (మార్కెట్ ఇంటర్వెన్షన్) సఫలీకృతం కావడం లేదు. వ్యవసాయ ఉత్పత్తులకు అధిక ధర రావాలని ప్రభుత్వం వరి, గోధుమ అధికంగా కొనుగోలు చేస్తున్న ఫలితంగా మిగులు నిల్వలు (బఫర్ స్టాక్) పెరిగిపోతున్నాయి. మనదేశంలో ఏడు కోట్ల 61 లక్షల టన్నుల ధాన్యం నిల్వలు ఉండాలి. ఇప్పుడు ఆ నిల్వలు 14 కోట్ల 73 లక్షల టన్నులకు పెరిగిపోయాయి. అదే విధంగా గోధుమ నిల్వలు 13 కోట్ల 80 లక్షల టన్నుల నుంచి 30 కోట్ల 62 లక్షల టన్నులకు చేరుకున్నాయి. దీనివల్ల ప్రభుత్వంపై ఆహార రాయితీ భారం పెరిగిపోతోంది. 2014-15లో రూ.1.26 లక్షల కోట్లుగా ఉన్న ఆహార సబ్సిడీ, తాజాగా రూ.1.69 లక్షల కోట్లకు ఎగబాకింది. ఆర్థిక వ్యయాలు (ఎకనామిక్ కాస్ట్) ఇందుకు అదనం. కొంతకాలంగా ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా పతనం కావడానికీ ఇదే కారణం. 2017 నవంబరులో ఆహార ద్రవ్యోల్బణం 4.5 శాతం ఉంటే, 2018 నవంబరుకు అది 1.7శాతానికి పడిపోయింది. ఈ పరిస్థితుల్లో తాము పండించిన పంటలకు తగిన ధర రాక రైతు డీలా పడిపోతున్నాడు. ఉల్లి, టమోటా రైతులు తమ పంటను రోడ్లపై పారబోయడం వెనక ఉన్న వ్యథ ఇదే!

ఇటీవలి కాలంలో వ్యవసాయ రుణ మాఫీ అమలు చేసిన/ ప్రకటించిన రాష్ట్రాలు, దానివల్ల స్థూల రాష్ట్రోత్పత్తి (జీఎస్‌డీపీ)కి కలిగిన నష్టం

రాష్ట్రం	ప్రకటించిన రుణ మాఫీ (రూ.కోట్లలో)	జీఎస్‌డీపీకి నష్టం (శాతంలో)
ఆంధ్రప్రదేశ్	24,000	4.6
తెలంగాణ	17,000	3.4
మహారాష్ట్ర	34,000	1.3
తమిళనాడు	-	6.5
ఉత్తర్ ప్రదేశ్	36,000	2.7
పంజాబ్	10,000	2.1
రాజస్థాన్	8,000	0.9
కర్ణాటక	34,000	2.4

విదేశాల్లో ఆదుకునే తీరిది!



నేరుగా వ్యవసాయ రుణాలు మాఫీ చేయడం ఇతర దేశాల్లో ఎక్కడా కనిపించదు. కానీ, వివిధ మార్గాల్లో రైతులకు మద్దతునిచ్చే చర్యలు మాత్రం కనిపిస్తాయి. అమెరికాలో 1929 ఆర్థిక మాంద్యం (గ్రేట్ డిప్రెషన్) తరవాత వ్యవసాయ రంగంలో సంక్షోభం ఏర్పడింది. దానికి విరుగుడుగా అమెరికా ప్రభుత్వం 'యూఎస్ వ్యవసాయ బిల్లు' తీసుకువచ్చింది. అమెరికాలో కనీస అమ్మకం ధర (ఎంఎస్‌పీ) రైతుకు లభించని పక్షంలో ప్రభుత్వమే పంట కొనుగోలు చేసే పద్ధతి ఉంది. నిరుడు ఉత్తర ఐరోపాలో 'శీతోష్ణ గాలులు' వీచడంతో రైతులు నష్టపోతే కనీస అమ్మకపు ధరను అక్కడి ప్రభుత్వాలు అమలు చేశాయి. నెలన్నర క్రితం న్యూజిలాండ్‌లో పాల ధర పతనమై రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడినప్పుడు రైతుల నష్టం భర్తీ చేసే పథకాన్ని అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లోనూ రైతులను సందర్భానుసారం ఆదుకునే పథకాలు అమలవుతున్నాయి. కానీ తీసుకున్న అప్పులు రద్దు చేయడం వంటి పద్ధతులు లేవు. అసలు గ్యాట్ (జనరల్ అగ్రిమెంట్ ఆన్ ట్రేడ్ అండ్ టారిఫ్స్) ఒప్పందం ప్రకారం ఇష్టానుసారం వ్యవసాయ రాయితీలు ఇవ్వకూడదు. కానీ వాటిని మనదేశంతో సహా ఎన్నో అభివృద్ధి చెందిన దేశాలు సక్రమంగా అమలు చేయలేకపోతున్నాయి.

సమగ్ర పరిష్కారమే జవాబు

వ్యవసాయ రుణమాఫీ రైతుకు తగినంత మేలు చేయలేకపోతున్నట్లు స్పష్టమవుతోంది. పైగా దీనివల్ల చిన్న రైతులు కాకుండా పెద్ద రైతులు లాభపడే పరిస్థితి ఉంది. రుణమాఫీ వల్ల తగినంత ప్రయోజనం ఉండటం లేదని ఇటీవల ప్రధాన నరేంద్ర మోదీ సైతం అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఎలా ఆదుకోవాలి, రైతాంగ సంక్షోభానికి పరిష్కారం ఏమిటి వంటి ప్రశ్నలకు సరైన సమాధానాలు అన్వేషించాల్సి ఉంది. కనీస మద్దతు ధరను శాస్త్రీయంగా నిర్ణయించడం, దాన్ని కచ్చితంగా అమలు చేయటం రైతులకు కొంత మేలు చేస్తుంది. ఉత్పత్తి అనంతర విధానాలను (పోస్ట్ హార్వెస్టింగ్ టెక్నాలజీస్) కొలువుతీర్చి, వాటిని రైతులకు విస్తృతంగా చేరువ చేయడంపై ప్రభుత్వాలు పెద్దయెత్తున పెట్టుబడులు పెట్టాలి. శీతల గిడ్డంగులు, నిల్వ, రవాణా సదుపాయాలు పెంపొందించాలి. అధిక దిగుబడులు నమోదవుతున్నాయి కాబట్టి, ఆహార శుద్ధి పరిశ్రమను విస్తరించి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని పెంచాలి. సహకార వ్యవసాయం (కో-ఆపరేటివ్ ఫార్మింగ్) వంటి కొత్త పద్ధతులను అమలులోకి తెచ్చి వ్యక్తిగతంగా రైతు నష్టపోకుండా కాపాడాలి. రైతులకోసం ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) వంటి పథకాలను ప్రవేశపెట్టడాన్నీ పరిశీలించవచ్చు. రైతుకు నేరుగా నగదు అందజేస్తే- ఆ సొమ్ముతో వడ్డీ వ్యాపారులు, సూక్ష్మ రుణ సంస్థల వద్ద తీసుకున్న రుణాల నుంచి చిన్న రైతులు బయటపడగలుగుతారు. తాత్కాలిక లబ్ధి చేకూర్చే విధానాలను పక్కనపెట్టి- సేద్య రంగాన్ని, అన్నదాతను సమస్యలనుంచి శాశ్వతంగా బయటపడవేసే నిర్మాణాత్మక చర్యలపై వివిధ రాజకీయ పక్షాల నాయకులు, వ్యవసాయ రంగ నిపుణులు ఏకాభిప్రాయంతో కార్యాచరణను సిద్ధం చేయాలి!

(రచయిత- ఆడిటర్, ఆర్థిక వ్యవహారాల నిపుణులు)

మారాలి చదువుల తీరు

ప్రపంచంలో నైపుణ్య లేమితో సతమతమవుతున్న యువతకు ఉపాధి అవకాశాలు దొరకడం కష్టతరంగా మారింది. ఉన్నత చదువులు చదివినా పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు అలవరచుకోకుంటే యువతకు ఉపాధి అవకాశాలు దూరమవుతాయి. వాస్తవానికి మార్కుల చట్రంలో కూరుకుపోతున్న విద్యార్థులకు అదనపు నైపుణ్యాల ఊసుపట్టడం లేదన్నది చేదు వాస్తవం. భారత్‌లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. వివిధ రంగాల్లో అభివృద్ధి చెందిన దేశాలైన దక్షిణాఫ్రికాలో 96 శాతం, జపాన్‌లో 80, జర్మనీలో 75, యూకేలో 68, అమెరికాలో 52 శాతంమేర నైపుణ్యం గల కార్మికులు అక్కడి పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. భారత్‌లో వీరు కేవలం 2.3 శాతం ఉండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. 15-35 వయోవర్గంలోని భారతీయ యువత నేటికీ నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించకపోవడం వల్ల అతి తక్కువ జీతభత్యాలకు పరిమితమవుతున్నారు.

పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను దేశ యువతకు అందించడానికి ప్రభుత్వపరంగా కృషి ఇప్పుడిప్పుడే మొదలైంది. ప్రపంచ నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 2015, జులై 15న ప్రధానమంత్రి 'కౌశల్ భారత్' పథకానికి శ్రీకారం చుట్టారు. చదువు మానేసిన, నిరక్షరాస్య యువతను గుర్తించి, వారికి నైపుణ్య శిక్షణ ఇప్పించి తద్వారా ఉపాధి కల్పన చూపించాలనేది పథకం ప్రధాన లక్ష్యం. 2016-2020 మధ్యకాలంలో కోటిమంది యువతను గుర్తించి, వారికి ఉపాధి శిక్షణ అందజేయాలని నిర్ణయించుకున్నారు. కేంద్రప్రభుత్వం 79.5 లక్షల మందికి, రాష్ట్ర ప్రభుత్వాలు 20.5 లక్షల మందికి శిక్షణ ఇచ్చే విధంగా విధివిధానాలు రూపొందించారు. ఇందుకు రూ. 12 వేల కోట్లను 2016లో కేంద్రం కేటాయించింది. దేశవ్యాప్తంగా 654 జిల్లా కేంద్రాల్లో పథకం అమలవుతోంది. 428 శిక్షణ భాగస్వాములతో 6,882 శిక్షణా కేంద్రాల్లో 34 ఉద్యోగ రంగాలకు సంబంధించిన శిక్షణ ఆయా కేంద్రాల్లో అందజేస్తున్నారు. తెలంగాణలో 3.05 లక్షలు, ఆంధ్రప్రదేశ్‌లో 3.87 లక్షల మంది యువతను శిక్షణకోసం గుర్తించారు. నైపుణ్యాలు కొరవడిన యువత దేశంలో ఎంతగా ఉన్నదీ ఈ గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి.

ఈశాన్య భారతాన అత్యంత వెనకబడిన తెగలైన బ్రూ, కట్కూరి, చక్మాలకు చెందిన యువకులు ఇప్పుడు శిక్షణతో రాటుతేలుతున్నారు. శరణార్థుల శిబిరాల్లోని యువతపైనా అధికారులు



నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా విద్యాలయాలు

దృష్టి సారించారు. పథకం ద్వారా శిక్షణ పొందిన యువతకు నూటికి నూరు శాతం ఉపాధి కల్పిస్తున్నారు. అందుకోసం ప్రభుత్వం పలు కార్పొరేట్ సంస్థలతో ఒప్పందాలు సైతం కుదుర్చుకుంది. తీవ్రవాద ప్రాబల్యం గల 63 జిల్లాలపైనా సర్కారు దృష్టి సారించింది. నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలన్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం తప్పనిసరి. ముఖ్యంగా గ్రామీణ యువతకు

ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన అమలు తీరు (జనవరి 6, 2019 నాటికి)

వివరాలు	2016-17	2017-18	2018-19	మొత్తం
స్వల్పకాలిక శిక్షణ పొందినవారు				
నమోదైనవారు	3,96,433	18,91,514	24,89,201	47,77,148
శిక్షణ పొందినవారు	50,778	16,24,697	23,79,824	40,55,299
ఉత్తీర్ణులైనవారు	10,248	11,86,914	19,61,237	31,58,399
ఉపాధి పొందినవారు	281	4,52,828	10,15,556	14,68,665
నిరక్షరాస్యులకు శిక్షణ				
నమోదైనవారు	2,00,781	5,16,928	10,95,067	18,12,776
శిక్షణ పొందినవారు	1,73,031	5,30,063	10,50,470	17,53,564
ఉత్తీర్ణులైనవారు	74,856	4,35,300	7,32,471	12,42,627

ఆధారం: కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ గణాంకాలు

పథకం నేటికీ చేరువకాకపోవడం దురదృష్టకరం. ప్రసార సాధనాల ద్వారా పథకం వివరాలను గ్రామీణులకు మరింతగా చేరువ చేయాలి. నైపుణ్య శిక్షణ కేంద్రాలను రెట్టింపు చేసి, వాటిని గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి. అప్పుడే గ్రామీణ యువత ఈ పథకం వైపు ఆకర్షితులవుతారు. నిరుద్యోగ సమస్యను రూపుమాపాలంటే పౌర సమాజ సహకారమూ అత్యంత కీలకం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ సదుపాయాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత విద్యావంతులపైనా ఉంది. శిక్షణ వైపు మొగ్గుచూపేలా గ్రామీణ యువతను వారు ప్రోత్సహించాలి. ముఖ్యంగా బహిరంగ పాఠశాలల(ఓపెన్ స్కూల్) ద్వారా విద్యనభ్యసిస్తున్నవారిపై దృష్టి సారించి, శిక్షణ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. వారికి ప్రభుత్వమే సత్వరమే ఉపాధి మార్గం చూపగలిగితే ఈ పథకానికి గ్రామీణ ప్రాంతాల్లో ఆదరణ ఊపందుకుంటుంది. ఏది ఏమైనా దేశ విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చి పాఠశాలలను, కళాశాలలను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విద్యార్థుల్లో సహజ ప్రతిభా పాటవాలను గుర్తించి, వారిలోని నైపుణ్యాలను వెలికితీసేలా విద్యాబోధన సాగాలి. ఆ మేరకు ఉపాధ్యాయులు, అధ్యాపకుల్లోనూ ఆసక్తిని పెంచడానికి ప్రణాళికలు రూపొందించాలి. చదువుతోపాటు నైపుణ్యాభివృద్ధి అవసరంపై విద్యార్థుల్లో అవగాహన పెంచేలా బోధన సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా చదువుల తీరూ మారాలి. అప్పుడే పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల చదువులు ముందుకు సాగుతాయి. పరిశ్రమల సందర్శన ద్వారా నైపుణ్యాభివృద్ధి ఆవశ్యకతను విద్యార్థులకు తెలియపరచాలి. ఆ మేరకు పాఠశాలలు, కళాశాలలు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలి. పారిశ్రామిక సంస్థలూ విద్యార్థులను కర్మాగారాలకు రప్పించి వారిలో కనీస అవగాహన పెంచడానికి పాటుపడాలి. వారిలో సృజనను వెలికితీయడానికి సైతం ఈ సందర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ తరహా చర్యలు చేపట్టినప్పుడే అసలైన నైపుణ్య యువభారతం సమీప భవిష్యత్తులో ఆవిష్కృతమవుతుంది!

– డాక్టర్ సిలువేరు హరినాథ్

(రచయిత– ఆర్థిక, సామాజిక అంశాల అధ్యయన కేంద్రం (సెస్)లో పరిశోధకులు)

ఈనాడు లేఖలు

ఇక పోరాడండి...

రాష్ట్ర విభజన వల్ల నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన నిధుల వివరాలను ప్రజాస్వామ్య పీఠం న్యాయ నిపుణుల సంఘం వాస్తవాలను తెలియజేసిన నేపథ్యంలో కేంద్రం నుంచి వాటిని రాబట్టడానికి రాజకీయ పక్షాలన్నీ ఐక్యపోరాటం చేయవలసి ఉంది. విభజన వల్ల రాష్ట్రం నష్టపోయిన తీరును నిపుణుల సంఘం విపులీకరించింది. ఇక రాజకీయ పక్షాలు ముఖ్యంగా భాజపా నాయకులు తమ కర్తవ్యం ఏమిటో సమీక్షించుకోవాలి. కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టే విషయంలో రాష్ట్ర రాజకీయ నాయకుల నిష్క్రియాపరత్వం ప్రజలను నిరాశా నిస్పృహలకు గురిచేస్తోంది. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో నిపుణుల సంఘం వాస్తవాలను బయటపెట్టినందువల్ల వాటిని సాధించుకోవడానికి ముందుకు రాకుంటే అందుకు నాయకులు తగిన మూల్యం చెల్లించుకోవలసి ఉంటుంది!

- గరిమెళ్ళ రామకృష్ణ, ఏలూరు, పశ్చిమగోదావరిజిల్లా

అపురూప విజయం

స్వదేశీ గడ్డ మీదే భారత క్రికెట్ జట్టు విజృంభిస్తుంది, విదేశాలకు వెళ్తే చతికిలపడుతుందన్న అపప్రదను విరాట్ కోహ్లి సేన తుడిచిపెట్టేసింది. ఆస్ట్రేలియాను ఆ దేశంలోనే టెస్టు సిరీస్‌లో కంగుతినిపించడం ద్వారా క్రికెట్ ప్రపంచంలో టీమిండియా తన సాధికారతను తిరుగులేని విధంగా చాటిచెప్పింది. ఒకరిని మించినవారు మరొకరు అన్నట్లుగా జట్టు సభ్యులు ప్రతిభను ప్రదర్శించడం ద్వారా తమది ఎంతటి పటిష్ఠమైన జట్టో కోహ్లి సేన నిరూపించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లలో సమాన ప్రావీణ్యం కనబరచింది. వికెట్ కీపర్ రిషభ్ పంత్ సైతం క్యాచులు ఒడిసి పట్టడంలో అద్భుతంగా రాణించడమే కాక, బ్యాటింగులోనూ తనదైన ముద్ర వేశాడు. మొత్తంగా జట్టుగా సమన్వయంతో ఆడటమే టీమిండియా విజయరహస్యం. భవిష్యత్తులోనూ ఇదే ధాటిని కనబరచి రాబోయే ప్రపంచకప్పులోనూ విజయకేతనం ఎగరేయాలి!

- టి.చంద్రమోహన్, గాజులరామారం, హైదరాబాద్

అనామకుడు


సమస్త జీవరాశిలో ఆలోచించడం, విచక్షణతో ప్రవర్తించడం, ఇతర జీవాలపట్ల కారుణ్య భావన కలిగి ఉండటం లాంటి ప్రత్యేకతలతో మనిషి తన ప్రత్యేక ఉనికిని చాటుకుంటున్నాడు. అనాగరిక మానవుడి స్థాయి నుంచి మేధా మథనంతో అనేక రంగాల్లో ప్రతిభ చూపుతూ, అప్రతిహతంగా ఎదుగుతూ నవ నాగరిక మానవుడిగా వెలుగుతున్నాడు.

అన్ని జీవాల్లాగానే పుట్టిన మనిషికి శైశవ దశలో నామకరణం జరగడంతో అసలు కథ ప్రారంభం అవుతుంది. మరణించేదాకా ఆ పేరుతోనే చలామణీ అవుతాడు. మనసులో ఉద్భవించే ఆలోచనలతో దేహం చేసే మంచి అయినా, చెడు అయినా పేరుకు వర్తిస్తుంది. పిల్లలు సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని పెద్దలు తాపత్రయపడేది అందుకే. చరిత్రపుటల్లో నిలిచేది వ్యక్తుల పేర్లే. ప్రాజెక్టుల శంకుస్థాపన సమయంలో శిలాఫలకాలపై పెద్ద పెద్ద అక్షరాలతో చెక్కే పేర్లు చిరకాలం నిలిచి ఉంటాయి. ప్రజోపయోగ కార్యఫలాలను చూసినప్పుడు వాటి వెనక తగిన కృషి చేసిన మహానుభావులు స్ఫురిస్తారు. అందరిలో మరింత స్ఫూర్తిని రగిలిస్తారు.

కలియుగంలో మోక్షగాములం కావాలంటే పూజలు పునస్కారాలు చెయ్యనక్కరలేదు. భగవంతుడి నామ స్మరణ చేస్తే చాలు. పేరుకు దైవానికి తేడాలేదు. నామ ఉచ్చారణను మించిన ఉపాయం లేదని విజ్ఞుల మాట. విష్ణు నామ సంకీర్తనం వల్ల పృథివిలో గల సర్వ తీర్థాల ఫలం, సర్వ దేవాలయాల దర్శన భాగ్యం కలుగుతుందని పెద్దలంటారు. శ్రీరామ నామ మహత్తు మనకు తెలియనిది కాదు. మహాభారతంలోని విరాట పర్వంలో పాండవుల అజ్ఞాత వాస ఘట్టం కంటతడి పెట్టించక మానదు. దాసదాసీ జనం చేత సేవలు చేయించుకోవలసినవాళ్ళు విరాటరాజు కొలువులో పడిన అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. ఈ పర్వంలో అతి ముఖ్యమైన అంశం పాండవులు తమ పేర్లు మార్చుకుని ఉనికిని కప్పిపెట్టి ఉంచడం. అది ఎంత కష్టమో అనుభవించేవారికి తెలుస్తుంది.

కొంతమంది కేవలం పనికి ప్రాధాన్యం ఇస్తారు. వారికి తమ పేరును విశ్వవ్యాప్తం చేసుకోవాలన్న కాంక్ష లేకపోయినప్పటికీ, వారు చేసిన మంచి కార్యాలను లోకం గుండెల్లో దాచుకుంటుంది. కలకాలం గుర్తుంచుకుంటుంది. రామరాజ్యం, కృష్ణతత్వం అందుకు ఉదాహరణ.

బహిర్ ప్రపంచానికి తెలియకుండా లోకానికి తమవంతు సహకారాన్నిచ్చే మహాత్ములు కొందరు ఉంటారు. వారు పేరు కోసం పాకులాడరు. ఈ దేహం తమది కాదన్న స్పృహతో



అంతర్యామి

ఉంటారు. ఆలోచనలు కార్యరూపం దాల్చడానికి, శరీరం ఒక పనిముట్టులా సహకరిస్తుండటం వల్ల, కార్య సాఫల్యాలను పేరుకు ఆపాదించి మురిసిపోవడం సరికాదన్నది వారి నిశ్చిత అభిప్రాయం.

అనేక దేవాలయాల్లో అజ్ఞాత భక్తులు వేసే మొక్కుబడులు అసంఖ్యాకం. గుప్తదానాలు చేసేవారు మానవుల్లో పునీత మనస్కులు. దేశ స్వాతంత్ర్య సముపార్జనలో మహాత్మా గాంధీ, నెహ్రూలే కాదు- అజ్ఞాతంగా ఎంతో మంది తమ పరిధిలో కృషిచేశారు. ప్రాణాలర్పించారు. పేరు ప్రభావాన్ని బాగా ఒంటికి పట్టించుకున్న మనిషి, ఆ పేరును సదా వెలుగులో ఉంచడానికి తీవ్రంగా తపన పడతాడు. భూరి దానాలు చేస్తాడు. గుళ్ల గోపురాల గోడలపై తన పేరు చెక్కించుకుంటాడు. విరాళం ఇచ్చినా, దానధర్మాలు చేసినా పేరు ప్రస్ఫుటంగా కనపడేలా, వినపడేలా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాడు. దీన్నే కీర్తి కండూతి అంటారు.

మనిషి అంతగా కీర్తి కోసం పాకులాడకూడదన్నది ప్రాజ్ఞుల ఉవాచ. గీతలో కృష్ణ భగవానుడు చెప్పినట్లు- కర్మ చేస్తూ పోవడమే మన పని. ఫలితం భగవద్ కృప. మనమే కర్తలమని పొంగిపోవడం సరికాదు. వ్యక్తిని గుర్తించడానికి పేరు తప్ప ఆడంబర జీవితానికి అది సూచిక ఎంతమాత్రం కాదు. ఇది తెలుసుకుంటే మనిషిగా, ఆడంబరంగా, యాంత్రికంగా జీవించకుండా, మనసుతో పరిపూర్ణంగా జీవించి మానవత్వ పరిమళాలను సర్వత్రా వెదజల్లుతాడు. అనామకుడైతేనేం- అందరి మనసులకూ దేవుడిలా దగ్గరవుతాడు!

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు

ఇంటర్‌లో సబ్జెక్టుల వారీ గ్రేడింగ్

- ఈ ఏడాది సీనియర్లకు అమలు
- ఇంటర్ స్వర్ణోత్సవాల్లో కమిషనర్ వెల్లడి
- తెనాలిలో ప్రారంభమైన రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

ఈనాడు – గుంటూరు: 'గత ఏడాది జూనియర్ ఇంటర్‌లో సబ్జెక్టుల వారీగా గ్రేడింగ్ ఇచ్చి తుది ఫలితాలు వెల్లడించాం.. ప్రస్తుత విద్యా సంవత్సరంలో సీనియర్ ఇంటర్ ఫలితాలను సబ్జెక్టుల వారీగా గ్రేడింగ్‌లు ఇచ్చి ప్రకటిస్తాం' అని ఇంటర్ బోర్డు కమిషనర్ బి.ఉదయలక్ష్మి తెలిపారు. ఇంటర్ విద్యా బోధనలో దేశంలోనే కాదు.. ప్రపంచానికే ఆంధ్రప్రదేశ్ ఇంటర్ బోర్డు ఒక నమూనాగా ఉందన్నారు. ఇంటర్ బోర్డు ఏర్పడి 50 ఏళ్లు అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి ఇంటర్ స్వర్ణోత్సవాలు జరపాలని బోర్డు నిర్ణయించింది. అందులో భాగంగా విద్యార్థులకు సాంస్కృతిక, క్రీడా పోటీలు జిల్లా స్థాయిలో నిర్వహించారు. రాష్ట్రస్థాయి పోటీలు గుంటూరు జిల్లా తెనాలిలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఉదయలక్ష్మి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యం కలిగి ఉండటం వల్ల క్రమశిక్షణ, నిబద్ధత అలవడుతుందని వివరించారు. మాజీమంత్రి, తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ క్రీడలకు తొలి నుంచి తెదేపా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. పిల్లలకు ఆస్తులు పంచటం కాదని వారికి మానవతా విలువలు నేర్పాలని తల్లిదండ్రులకు ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ సూచించారు. కార్యక్రమంలో మహిళాకమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ప్రైవేటు ఇంటర్ కళాశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు ఎంఎస్ఆర్ ఆంజనేయులు, గుంటూరు ఆర్జేడీ, ఆర్.ఐ.ఓ కోటేశ్వరరావు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ రాష్ట్రస్థాయి స్వర్ణోత్సవాల ప్రారంభం సందర్భంగా జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్సీ రామకృష్ణ, నన్నపనేని రాజకుమారి, ఇంటర్ బోర్డు కమిషనర్ ఉదయలక్ష్మి

చెన్నైకి తాగునీటి సరఫరాపై నేడు ప్రత్యేక కమిటీ భేటీ

ఈనాడు, హైదరాబాద్: కృష్ణాబేసిన్‌లోని రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం చెన్నై నగరానికి తాగునీటి సరఫరాపై చర్చించేందుకు బుధవారం ప్రత్యేక కమిటీ సమావేశం జరగనుంది. కృష్ణా బేసిన్‌లోని మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లు ఐదు టీఎంసీల చొప్పున మొత్తం 15 టీఎంసీలు చెన్నైకి సరఫరా చేసేలా 1983 ఏప్రిల్ 18న ఒప్పందం జరిగింది. అయితే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ 3.3 టీఎంసీలు, తెలంగాణ 1.7 టీఎంసీలు విడుదల చేయాల్సి ఉంది. అన్ని అంశాలను సమగ్రంగా చర్చించి సవ్యంగా తమిళనాడుకు నీటిని విడుదల చేసేలా చూసేందుకు కేంద్ర జలవనరుల శాఖ గత ఏడాది కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. బోర్డు ఛైర్మన్ ఈ కమిటీకి ఛైర్మన్ కాగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు, కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజినీర్ సభ్యులుగా, బోర్డు సభ్యకార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. జులై నుంచి నీటివిడుదలపై ఈకమిటీ బుధవారం చర్చించనుంది.

బ్రహ్మోత్సవాల్లో ఆర్జిత సేవల నిలుపుదల

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 12 నుంచి 18 వరకు జరిగే సంక్రాంతి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆ రోజుల్లో శాశ్వత, పలు ఆర్జిత సేవలను నిలిపివేస్తున్నారు. విషయాన్ని ఆలయ ఈవో శ్రీరామచంద్రమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.





నెల్లూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం

- 30 మందికి గాయాలు

బిట్రగుంట, న్యూస్‌టుడే: నెల్లూరు జిల్లా బోగోలు(బిట్రగుంట) మండలం కొండబిట్రగుంట సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 30 మంది గాయపడ్డారు. మ్యాంగో జ్యూస్ కంటైనర్ అదుపుతప్పి విశాఖపట్నం నుంచి నెల్లూరు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. దీంతో బస్సు బోల్తాపడింది. ఓ ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో కంటైనర్ డ్రైవర్ ఆకస్మికంగా బ్రేక్ వేయటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడగా మరో 25 మందికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిలో నెల్లూరు జిల్లాతో పాటు కడప, ప్రకాశం, విజయనగరం, తూర్పుగోదావరి, కృష్ణా, ఖమ్మం, హైదరాబాద్, చైన్నై ప్రాంతాలకు చెందిన వారున్నారు.

నవోదయ బడుల్లో 192 సీట్ల పెంపు

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ఉన్న 24 జవహర్ నవోదయ విద్యాలయాల(జేఎన్‌వీ)లో వచ్చే విద్యాసంవత్సరం మొత్తం 192 సీట్లు పెరగనున్నాయి. దేశవ్యాప్తంగా జేఎన్‌వీలలో 5,000 సీట్లు పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం తెలిసిందే. ప్రారంభ తరగతిలో 10శాతం సీట్లు పెంచుతున్నారు. అంటే, 6వ తరగతిలో ప్రస్తుతం ఉన్న 80 సీట్లు ఇక 88 అవుతాయి. తెలంగాణలో 9, ఏపీలో 15 విద్యాలయాలు ఉన్నాయి. వాటికి ఈ సీట్ల పెంపుదల వర్తిస్తుంది. ఉత్తర్వులు త్వరలో రావచ్చని జేఎన్‌వీ హైదరాబాద్ రీజియన్ ఉప కమిషనర్ ఏవై రెడ్డి తెలిపారు.

పార్ట్‌టైం వీఆర్వోల పారితోషికం పెంపు

ఈనాడు, అమరావతి: గ్రామరెవెన్యూ అధికారుల (పార్ట్‌టైం-అసిస్టెంట్స్) పారితోషికాన్ని పెంచుతూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం వీఆర్వోలకు నెలకు రూ.10వేలు ఇస్తున్నారు. దీనిపై మరో రూ.5 వేలు (మొత్తం-రూ.15000) పెంచారు. ఈ పెంపు తక్షణం అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘాధ్యక్షుల విజ్ఞప్తి మేరకు ఈ పెంపు జరిగింది.

శాసనమండలి ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ విడుదల

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలి ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం చేపట్టింది శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయ, ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్, కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను ప్రధాన ఎన్నికల అధికారి ఆర్.పి.సిసోడియా మంగళవారం ప్రకటించారు.

★ ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల: 10.01.2019
★ క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ: 10.1.19 నుంచి 10.2.19 వరకూ
★ తుది ఓటర్ల జాబితా విడుదల: 20.02.2019

ఆహారశుద్ధి రంగంలో 35 ప్రాజెక్టులు

చిత్తూరులో ఫ్యూచర్ గ్రూప్ పార్కుకు సూత్రప్రాయ అంగీకారం

ఈనాడు–అమరావతి: రాష్ట్రంలో 35 ఆహారశుద్ధి ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇందులో ఫ్యూచర్ కన్స్యూమర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లాలో రూ.42.92 కోట్ల వ్యయంతో ఏర్పాటయ్యే పర్ణిక్ ఫుడ్‌పార్కుకు సూత్రప్రాయ అంగీకారం తెలిపింది. ఎస్‌హెచ్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ స్థల మార్పిడి ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి ఎం.గిరిజాశంకర్ ఉత్తర్వులిచ్చారు.

పురపాలక ఉపాధ్యాయులకు జీపీఎఫ్ ఖాతాలే కావాలి: ఎంటీఎఫ్

ఈనాడు, అమరావతి: పురపాలక ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ జీవో ఎంఎస్-300ను 2009లో విడుదల చేశారని, జీపీఎఫ్ ఖాతాలు తెరవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నా జాప్యం జరుగుతోందని పురపాలక ఉపాధ్యాయుల సంఘం (ఎంటీఎఫ్) అధ్యక్షుడు రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పుంగనూరు, మార్కాపురం పురపాలక సంఘాల్లో జీపీఎఫ్ ఖాతాలు నిర్వహిస్తున్నా, ఇది ఇతర ప్రాంతాల్లో అమలు కావడం లేదని పేర్కొన్నారు. మంత్రి నారాయణ జీపీఎఫ్ ఖాతాల ఏర్పాటుకు ఇటీవల హామీ ఇచ్చారని, జీపీఎఫ్ ఖాతాలు కాకుండా పురపాలక ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలనే వాదనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు.

గిడ్డంగుల సంస్థ ఛైర్మన్‌గా ఎల్‌వీఎస్ఆర్‌కే ప్రసాద్ కొనసాగింపు


ఈనాడు–అమరావతి: ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల సంస్థ ఛైర్మన్‌గా ఎల్‌వీఎస్ఆర్‌కే ప్రసాద్ కొనసాగనున్నారు. ఆయనను మరో మూడేళ్ల పాటు డైరెక్టర్, ఛైర్మన్‌గా నియమిస్తూ వ్యవసాయ సహకార (మార్కెటింగ్) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులిచ్చారు.


రాష్ట్ర శకటాన్ని తిరస్కరించడం అవమానించడమే: సీపీఎం

ఈనాడు, అమరావతి: గణతంత్ర వేడుకలకు రాష్ట్ర శకటాన్ని తిరస్కరించడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు మంగళవారం తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన శకటాన్ని ఎలాంటి కారణాలు లేకుండా కేంద్ర ప్రభుత్వం తిరస్కరించిందని, ఇది తెలుగు ప్రజలను అవమానించడమేనని పేర్కొన్నారు.

పార్ట్‌టైమ్ జూనియర్ లెక్చరర్లకు వేతనం పెంపు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గంటల ప్రాతిపదికన పని చేస్తున్న పార్ట్‌టైమ్ లెక్చరర్లకు వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గంటకు రూ.150 ఇస్తుండగా.. దీన్ని రూ.375కు పెంచారు.





ఎన్నికల స్టంటు... అయినా ఆహ్వానిస్తున్నాం...

'విద్య, ఉద్యోగ రంగాల్లో అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ కల్పించాలనేది ఎన్నికల స్టంటు. ఓ రాజకీయ ఎత్తుగడ. ప్రభుత్వ చర్య అపరిపక్వమైనదే అయినా మా పార్టీ దీనిని ఆహ్వానిస్తోంది. ప్రభుత్వ పదవీ కాలం ముగియవస్తున్న తరుణంలో కాకుండా తగినంత ముందుగానే ఇలాంటి నిర్ణయం తీసుకుంటే బావుండేది.'

– పత్రికా ప్రకటనలో బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి




దిల్లీలోని ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ నివాసంలో మంగళవారం ఆయనతో చర్చలు జరుపుతున్న చంద్రబాబు, పక్కన నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ● ఏపీ భవన్‌లో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో చంద్రబాబు చర్చలు

ఓటెత్తిన కోటా

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించినవారనే అంశంతో సంబంధం లేకుండా ముస్లింలు, క్రైస్తవులు సహా అందరికీ రిజర్వేషన్ ప్రయోజనం సిద్ధిస్తుందన్నారు.

శాసనసభల ఆమోదం అవసరం లేదు: జైట్లీ

ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ జోక్యం చేసుకుంటూ- అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ సహా దాదాపు అన్ని పార్టీలూ తమ తమ ఎన్నికల ప్రణాళికల్లో పేర్కొన్నాయని గుర్తు చేశారు. మొత్తం కోటా 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు విధించిన పరిమితిని ప్రభుత్వం ఉల్లంఘిస్తోందన్న విమర్శల్ని తోసిపుచ్చారు. కుల ప్రాతిపదికన ఇచ్చే రిజర్వేషన్లకే ఆ పరిమితి వర్తిస్తుందని, బిల్లు మాత్రం జనరల్ కేటగిరిలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కోటాను ప్రతిపాదిస్తోందని వివరించారు. 'వీరికి రిజర్వేషన్లు ఇవ్వడానికి కేంద్రం, కొన్ని రాష్ట్రాలు గతంలోనూ ప్రయత్నించాయి. సాధారణ నోటిఫికేషన్లు, లేదా సాధారణమైన చట్టబద్ధ నిబంధనల ద్వారా ప్రయత్నించడం వల్ల అవన్నీ విఫలమయ్యాయి. ఆర్థికంగా వెనుకబడ్డవారికి రిజర్వేషన్లు ఇచ్చేందుకు అవసరమైన రాజ్యాంగ సవరణకు ప్రభుత్వం ఈ బిల్లు ప్రవేశపెట్టింది. ఎందుకంటే ప్రస్తుత నిబంధన ప్రకారం సామాజిక, విద్యాపరమైన వెనుకబాటునే కోటాకు ప్రామాణికంగా తీసుకోవాల్సి వస్తోంది. దీనిని అధిగమించి, పేదలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు బిల్లును తెచ్చాం. విపక్షాలన్నింటికీ ఇదొక పరీక్షలాంటిది. బిల్లును పార్లమెంటు ఆమోదిస్తే వెంటనే అమల్లోకి వస్తుంది. రాష్ట్రాల శాసనసభలు దీనిని ఆమోదించాల్సిన అవసరం లేదు' అని జైట్లీ చెప్పారు.

ప్రైవేటు రంగంలోనూ అమలు చేయాలి: పాసవాన్

ప్రైవేటు రంగంలో, న్యాయసేవల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర మంత్రి రాంవిలాస్ పాసవాన్ అభిప్రాయపడ్డారు. న్యాయపరమైన చిక్కులను అధిగమించేందుకు బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. ఆర్థికంగా వెనుకబడినవారికి రిజర్వేషన్లు కల్పించాలని 1990 లోనూ తాను చెప్పానని, రాజ్యాంగపరమైన పరిమితుల వల్ల అది సాధ్యం కాలేదని పాసవాన్ చెప్పారు. అగ్రవర్ణాలకు చెందిన అనేకమంది కూడా బీసీల కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. కీలకమైన బిల్లుపై చర్చ జరిగిన సమయంలో ప్రధాని నరేంద్రమోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ తదితరులంతా సభలో ఉన్నారు. ఓటింగ్ సమయంలో అన్నాడీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగపరంగా మోసమేనని అసదుద్దీన్ ఒవైసీ (ఏఐఎంఐఎం) వ్యాఖ్యానించారు. బిల్లును తాము వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. చర్చలో తృణమూల్, ఎన్సీపీ, ఎస్పీ, ఐఎన్ఎల్‌డీ, బీజేడీ, సీపీఎం తదితర సభ్యులు పాల్గొన్నారు. బిల్లును గురువారం రాజ్యసభలో ప్రవేశపెడతారు.

లోక్‌సభ నిరవధిక వాయిదా

కీలకమైన రెండు బిల్లులకు ఆమోదం తెలిపిన తర్వాత లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. 16వ లోక్‌సభకు ఇది చిట్టచివరి పూర్తి కాలపు సమావేశం. ఈసారి సమావేశాల్లో 5000 ప్రశ్నలకు సమాధానాలు లభించాయని స్పీకర్ సుమిత్రా మహాజన్ చెప్పారు.

సామాన్యుల కోసం కట్టుబడిన సర్కారు

'బిల్లుకు ఆమోదం తెలిపిన సభ్యులకు కృతజ్ఞతలు. ఇదొక చరిత్రాత్మక ముసాయిదా. నరేంద్రమోదీ సర్కారు పనితీరులో నిజమైన స్ఫూర్తిని ఇది ప్రతిఫలిస్తోంది. సామాన్య ప్రజల కోసమే ప్రభుత్వం కట్టుబడి ఉందని బాధ్యతలు చేపట్టిన మొట్టమొదటి రోజే ప్రధాని చెప్పారు. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ కల్పించాలనే బిల్లు 21 సార్లు ప్రైవేటు బిల్లుల రూపంలో పార్లమెంటు ముందుకు వచ్చింది.'

–కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి థావర్‌చంద్ గహ్లోత్.



విజయ సంకేతం చూపిస్తున్న కేంద్ర మంత్రి థావర్‌చంద్ గహ్లోత్

కోల్‌కతాలో కలుద్దాం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన నివాసంలో సుమారు గంటపాటు భేటీ అయ్యారు. అనంతరం ఏపీ భవన్‌లో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో కలిసి భోజనం చేశారు. తర్వాత శరద్ పవార్ నివాసానికి వెళ్లి ఆయనతోపాటు జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాలతో సుమారు గంటపాటు భేటీ అయ్యారు. అనంతరం చంద్రబాబు విలేకరులతో మాట్లాడారు.

'ఈనెల 19వ తేదీన కోల్‌కతాలో జరిగే ర్యాలీకి మమతా బెనర్జీ మా అందరినీ ఆహ్వానించారు. దీనిపై శరద్ పవార్‌తో మాట్లాడాం. వెళ్లాలని నిర్ణయించాం. మిగతా పార్టీలవారూ వస్తారని అనుకుంటున్నాం. 19వ తేదీ మేమంతా అక్కడ కలిస్తే చర్చించుకుంటాం. అవసరమైతే దిల్లీలోనూ సమావేశమై ఎలా ముందుకెళ్లాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటాం' అని పేర్కొన్నారు. ఈ ర్యాలీకి ఎన్ని పార్టీలు హాజరవుతాయనుకుంటున్నారన్న ప్రశ్నకు... రేపో, ఎల్లుండో ఆ విషయం చెబుతామన్నారు. ఒకవైపు పార్టీలను కూడగట్టే ప్రయత్నం చేస్తున్నా మరోవైపు ఉత్తర్ ప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ సొంతంగా సీట్ల సర్దుబాటు చేసుకుంటున్నాయి కదా? అన్న ప్రశ్నకు... ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అందరూ ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని చంద్రబాబు చెప్పారు. 'దేశంలో ప్రస్తుతం ప్రజాస్వామ్య అనివార్యత ఉందని తొలి నుంచీ నేను చెబుతున్నా. దేశాన్ని రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అందువల్ల అన్ని పార్టీలు చేతులు కలపాలి. కొన్ని రాష్ట్రాల్లో కొన్ని పార్టీలకు ఇబ్బందులున్నప్పటికీ జాతీయ స్థాయిలో అందరూ కలిసి ఎలా ముందుకెళ్లాలన్న అంశంపై కసరత్తు చేస్తున్నాం. లౌకిక పార్టీలన్నింటినీ భాజపా వ్యతిరేక వేదికపైకి తీసుకొచ్చేందుకు అవసరమైన సహకారం అందించాల్సిన బాధ్యత సీనియరు నాయకులుగా మాపై ఉంది' అని పేర్కొన్నారు. రాహుల్ గాంధీతో సాధారణ అంశాలపైనే చర్చ జరిగినట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మరోసారి నేతలందరితో మాట్లాడబోతున్నట్లు తెలిపారు. మమతా బెనర్జీ ర్యాలీకి కాంగ్రెస్‌కు ఆహ్వానం అందలేదన్న వార్తలొస్తున్నాయి కదా? అన్న ప్రశ్నకు... అది కరెక్టు కాదనుకుంటానని పేర్కొన్నారు. లోక్‌సభలో ఈబీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడాన్ని చంద్రబాబు స్వాగతించారు. తాము ఆ బిల్లుకు మద్దతు పలుకుతున్నట్లు చెప్పారు. అదే సమయంలో కేంద్రం పరిష్కరించాల్సిన అంశాలు చాలా ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలని, కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానాలు, బిల్లులు ఆమోదించి పంపామని గుర్తు చేశారు. కేంద్రం తనకు కావాల్సింది చేసుకుని రాష్ట్రాల సిఫార్సులను విస్మరిస్తోందని విమర్శించారు. ఈబీసీ బిల్లును కేంద్రం ఒక రోజులో తెచ్చిందని, ఒకవేళ వారికి దీనిపై చిత్తశుద్ధి ఉంటే ముందే తీసుకొచ్చి అందరితో సంప్రదించి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. శరద్ పవార్ మాట్లాడుతూ... 'సాధారణంగా చంద్రబాబు ఎప్పుడు దిల్లీకొచ్చినా చాలామంది భాజపాయేతర పార్టీ నాయకులను సంప్రదిస్తుంటారు. ఆ నేపథ్యంలోనే మేం కలిశాం. ఈనెల 19వ తేదీన కోల్‌కతాలో నిర్వహించే ర్యాలీలో పాల్గొనాలని మమతా బెనర్జీ ఆహ్వానించారు. ఆ ఆహ్వానాన్ని గౌరవించి ఆ ర్యాలీలో పాల్గొనాలని ఇద్దరం నిర్ణయించాం' అని చెప్పారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు కేవలం 4 గంటలే దిల్లీలో గడిపారు. రాత్రి 7 గంటలకు దిల్లీ చేరుకున్న ఆయన 11 గంటలకల్లా బయలుదేరి అర్ధరాత్రికి విజయవాడ చేరుకున్నారు.

బిల్లులో పలు లోపాలున్నాయి...

'హడావుడిగా ఈ చట్టాన్ని ప్రతిపాదిస్తున్నారు. ఒక్కరోజు ముందే కేబినెట్ ఆమోదించిన ఈ బిల్లులో పలు లోపాలున్నాయి. ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనేక అనుమానాలున్నాయి. దీనిని క్షుణ్నంగా పరిశీలించడానికి సంయుక్త పార్లమెంటరీ సంఘానికి పంపాల్సిందే. గతంలో పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు ఇలాంటి ప్రయత్నం చేసినప్పుడు దానిని సుప్రీంకోర్టు కొట్టివేసింది.'

–కె.వి.థామస్, కాంగ్రెస్ సీనియర్ నేత

'పేద కుటుంబాల యువకులకు మోదీ సర్కారు ఇస్తున్న కానుకే 10% రిజర్వేషన్లు. ఏళ్ల తరబడి బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్న పార్టీలకు ఇదొక గుణపాఠం. పేదలకు రిజర్వేషన్లపై న్యాయసమ్మతమైన నిర్ణయం తీసుకున్న ప్రధానికి, మంత్రులకు అభినందనలు.'

– ట్విటర్‌లో భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షా

'ఎన్నికల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఈ బిల్లు తీసుకువచ్చింది. ఇన్నాళ్లు వదిలేసి ఇప్పుడు ఈ బిల్లు తీసుకురావడమే ప్రభుత్వ ఉద్దేశాన్ని చాటుతోంది. రూ.8 లక్షల వార్షిక ఆదాయ పరిమితి చాలా ఎక్కువ.'

– విలేకరుల సమావేశంలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



లోక్‌సభలో మంగళవారం కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

దస్త్రాల ధ్వంసం వెనక ఏముంది?

- అయేషామీరా కేసులో సీబీఐ దర్యాప్తు ప్రారంభం
- తొలుస్తున్న ప్రశ్నలు అనేకం

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేకెత్తించిన అయేషామీరా కేసులో దస్త్రాల ధ్వంసం వెనుక అసలు కారణాలేమిటి? అది యాదృచ్ఛికంగా జరిగిందా? కావాలనే చేశారా?.. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారుల మనసును తొలుస్తున్న ప్రశ్నలివే. అందుకే తొలుత వాటిపైనే దృష్టిపెట్టారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు అయేషామీరాపై 'హత్యా'చారం కేసులో మళ్లీ కొత్తగా సీబీఐ దర్యాప్తు ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందుకోసం విశాఖపట్నం, హైదరాబాద్ సీబీఐ విభాగాల ఆధ్వర్యంలో ఓ డీఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక బృందం ఏర్పాటుచేశారు. ఈ కేసులో అరెస్టయి, జైలులో ఉండి, హైకోర్టు తీర్పు మేరకు విడుదలైన సత్యంబాబు దోషా, నిర్దోషా అనే విషయాన్ని ఈ బృందం తేల్చనుంది.

ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని ఇబ్రహీంపట్నంలో 2007 డిసెంబరు 27 తెల్లవారుఝామున బీఫార్మసీ విద్యార్థిని ఆయేషామీరాపై అత్యాచారం, హత్య అప్పట్లో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో కింది కోర్టు దోషిగా ప్రకటించిన సత్యంబాబును హైకోర్టు నిర్దోషిగా పేర్కొంటూ విడుదల చేసింది. ఆయేషా తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు కేసును సీబీఐతో మళ్లీ దర్యాప్తు చేయించాలని ఆదేశించింది. ఈ మేరకు హైదరాబాద్ సీబీఐ విభాగం.. దస్త్రాల ధ్వంసం, అయేషామీరాపై హత్యాచారంపై వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేసింది. ఘటన జరిగి 11 ఏళ్లు దాటిపోవటంతో కేసు దర్యాప్తు సంక్లిష్టంగా మారింది.

ఆ కోణంపైనే దృష్టంతా.. ఈ వ్యవహారంలో ప్రధానంగా దస్త్రాలు ధ్వంసం చేయటంపై సీబీఐ అధికారులు ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. 2010 అక్టోబరులో సత్యంబాబును దోషిగా పేర్కొంటూ స్థానిక మహిళా న్యాయస్థానం పదేళ్ల జైలుశిక్ష విధించింది. తీర్పుపై సత్యంబాబు హైకోర్టును ఆశ్రయించారు. ఈలోపే కేసు దర్యాప్తునకు సంబంధించిన దస్త్రాలు తగలబెట్టారు. ఇలా ఎందుకు చేయాల్సి వచ్చిందనేది ఇప్పుడు సీబీఐ అధికారులను వేధిస్తున్న ప్రశ్న. దస్త్రాలు అందుబాటులో లేకపోవడంతో కేసు పూర్వాపరాలు, అప్పట్లో దర్యాప్తు తీరుతెన్నులు తెలుసుకోవడం వారికి కష్టంగా మారింది. దస్త్రాల తగలబెట్టడం యాదృచ్ఛికంగా జరిగిందా? కావాలనే చేశారా? అన్న కోణంలో దర్యాప్తు మొదలుపెట్టారు. దీనిపై అప్పట్లో విధుల్లో ఉన్న కోర్టు సిబ్బందిని ప్రశ్నించనున్నారు. ఏదైనా కేసులో తీర్పు వెలువడ్డాక సంబంధిత దస్త్రాలను న్యాయస్థానం అనుమతితో ధ్వంసం చేయడం అనవాయితీ. కానీ, అయేషామీరా కేసులో దస్త్రాల ధ్వంసానికి ఎవరూ న్యాయస్థానం అనుమతి తీసుకోలేదు. పైగా కిందికోర్టు ఇచ్చిన తీర్పుపై సత్యంబాబు చేసిన అప్పీలు హైకోర్టులో ఉంది. ఈలోపే దస్త్రాలు ధ్వంసం చేయడమూ అనేక అనుమానాలు రేకెత్తించింది. అసలు దస్త్రాలను ఎవరు తగలబెట్టారన్న దాని పైనా స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో వ్యవహారం మొత్తం అనుమానాస్పదంగా మారింది. దస్త్రాల ధ్వంసానికి కారణాలు తెలిస్తే కేసులో మిగతా అంశాలపై స్పష్టత వస్తుంది. సత్యంబాబును కావాలనే ఈ కేసులో ఇరికించారనేది మరో ఆరోపణ. సీబీఐ దర్యాప్తులో ఇది కూడా నిగ్గు తేల్చాల్సి ఉంది. ఒకవేళ నిజంగా సత్యంబాబు నిర్దోషి అయితే అసలు దోషి ఎవరన్నదీ వెల్లడి కావాల్సి ఉంది. దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఈ కేసు దర్యాప్తులో పాలుపంచుకున్న పోలీసులను సైతం విచారించనున్నారు.

తాబేలు.. బెంబేలు

- మృత్యువాత పడుతున్న ఆలివ్‌రిడ్లీ తాబేళ్లు
- తీరం వెంట కొట్టుకొస్తున్న కళేబరాలు
- కృష్ణా అభయారణ్యంలో రక్షణ చర్యలు

ఈనాడు, విజయవాడ: అరుదైన ఆలివ్‌రిడ్లీ తాబేళ్లకు కష్టకాలమొచ్చింది. కృష్ణా అభయారణ్యంలో ఇవి మృత్యువాత పడుతున్నాయి. వీటి కళేబరాలు నిత్యం పదుల సంఖ్యలో సముద్రం ఒడ్డుకు కొట్టుకు వస్తున్నాయి. జాలర్ల వలల్లో చిక్కుకోవడం, మర పడవలకు ఉన్న పంకాలకు తగలడంతో ఎక్కువగా మరణిస్తున్నాయి. ఒడ్డుకు వచ్చి అవి పెట్టిన గుడ్లను జంతువులు తినేస్తున్నాయి. గుడ్లను సంరక్షించి పిల్లలను తిరిగి సముద్రంలోకి వదిలేందుకు అటవీ శాఖ చర్యలను కొనసాగిస్తోంది. 2009-10 నుంచి ఇప్పటివరకు దాదాపు మూడు లక్షల గుడ్లను సేకరించి రక్షించి.. పిల్లల య్యాక సముద్రంలో విడిచిపెట్టింది. అయినప్పటికీ అంతరించిపోయే ప్రమాదం ఉన్న జీవుల జాబితాలో ఉన్న వీటి మనుగడకు ముప్పు పొంచే ఉంది.



సాగరసంగమం వద్ద ఆలివ్‌రిడ్లీ తాబేలు కళేబరం

ఈ తాబేళ్లు వందేళ్లకుపైగా జీవిస్తాయి. అరగంటకోసారి నీటిపైకి వచ్చి గాలి పీల్చుకుంటాయి. ఆహారం కోసం 20 వేల కి.మీ. వరకు ప్రయాణిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఏడు రకాలు ఉండగా మన దేశంలో ఐదు రకాలు కనిపిస్తాయి. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికే ఎక్కువగా ఈ తాబేళ్లు వస్తుంటాయి. ఏటా జనవరి నెలాఖరు నుంచి మేనెల వరకు గుడ్లు పెడతాయి. ప్రస్తుతం తీరంలో నిత్యం 70 నుంచి వంద వరకు మరణించి ఒడ్డుకు కొట్టుకువస్తున్నాయి.

ప్రమాదాలు, సంరక్షణ ఇలా..

- జాలర్లు వేసే పెద్ద వలలు సముద్రం అడుగు భాగం వరకు చేరుకుంటాయి. వారు ఏడెనిమిది గంటలకు కానీ వలలు తీయరు. దీనివల్ల ఇవి వలలో చిక్కి చనిపోతున్నాయి.
- మరపడవలకు కింది భాగంలో ఉండే పంకాల రెక్కలు తగలకుండా పంకాలు ఉండే చోట బిగించేలా ప్రత్యేక పరికరాలను మత్స్యకారులకు రాయితీపై అందించాలి.
- తెగిన వలలను మత్స్యకారులు సముద్రంలోనే విడిచిపెడుతున్నారు. వీటికి చిక్కుకుని మరికొన్ని చనిపోతున్నాయి.
- తాబేళ్ల ప్రత్యేకతలపై మత్స్యకారులకు అవగాహన కల్పించి వలలో చిక్కుకుంటే సురక్షితంగా తిరిగి సముద్రంలోకి వదిలేలా చూడాలి.
- అటవీశాఖలోని వన్యప్రాణి విభాగం, మత్స్య శాఖ సమన్వయంతో పనిచేయాల్సి ఉంది.

ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం

ఆలివ్‌రిడ్లీ తాబేళ్ల సంరక్షణకు అభయారణ్యం పరిధిలో ఐదు చోట్ల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటుచేశాం. పాలకాయతిప్ప, సాగరసంగమం, లైట్‌హౌస్, లైట్‌హౌస్ దీవి, ఏలిచెట్లదిబ్బ ప్రాంతాలలో ఇవి ఏర్పాటయ్యాయి. తీరంలో పెట్టిన గుడ్లను సేకరించి నక్కలు, తోడేళ్ల బారినుంచి కాపాడుతున్నాం. రాత్రి సమయాలలో సంరక్షణ కోసం సిబ్బందిని నియమించాం. స్వచ్ఛంద సంస్థల సాయాన్నీ తీసుకుంటున్నాం.

– అనంత్‌శంకర్, డివిజనల్ అటవీ అధికారి (వన్యప్రాణి విభాగం), ఏలూరు

మరొకరి బదులు సైనిక్‌స్కూల్ పరీక్ష రాసిన పదేళ్ల విద్యార్థి

చండీగఢ్: దేశవ్యాప్తంగా గల సైనిక పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశానికిగాను ఆదివారం నిర్వహించిన ప్రవేశపరీక్షలో ఆశ్చర్యకరమైన సంఘటన చోటుచేసుకుంది. హరియాణలోని రేవాడీలో ఓ పదేళ్ల విద్యార్థి మరో విద్యార్థికి బదులు పరీక్ష రాస్తూ ఇన్విజిలేటర్‌కు పట్టుబడ్డాడు. అసలు విద్యార్థికి బదులు 'ఓఎంఆర్' సమాధానపత్రంపై తన పేరు రాయడంతో ఈ విషయం బయటపడింది. 'పేరు ఎందుకు తప్పు రాశావు?' అని ఇన్విజిలేటర్ ఆ పదేళ్ల బాలుడిని ప్రశ్నించడంతో అమాయకంగా జరిగిందంతా చెప్పేశాడు. దీంతో ఈ కుట్రకు పాల్పడిన రేవాడీలోని కనీనా పట్టణంలో గల ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపల్, ఇద్దరు ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేశారు. పరీక్ష రాసిన పదేళ్ల విద్యార్థిని హిసార్‌లోని బాలనేరస్థుల కేంద్రానికి తరలించారు. పరీక్ష రాయాల్సిన అసలు విద్యార్థి, అతని తల్లిదండ్రుల పాత్రపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. దేశంలోని సైనికస్కూల్‌లో ఆరో తరగతిలో చేరడానికి ఏప్రిల్ 2007 నుంచి మార్చి 31, 2009 మధ్య పుట్టినవారు అర్హులు. ఈ పరీక్ష ఫలితాలు ఫిబ్రవరి 4న వెలువడనున్నాయి.

పునరావృతం కాదు..

మనం పురోభివృద్ధి సాధించాలంటే చరిత్రను పునరావృతం చేయటం కాదు.. కొత్త చరిత్రను సృష్టించాలి. మన పూర్వీకులు వదిలి వెళ్లిన తరతరాల వారసత్వానికి కొత్త జోడింపులు చేస్తేనే ముందుకు కదులుతాం!

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

9–1–2019 బుధవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
తదియ: ఉ. 11.57 తదుపరి చవితి
ధనిష్ఠ నక్షత్రం: రా. 12.36 తదుపరి శతభిషం
అమృత ఘడియలు: మ. 1.04 నుంచి 2.50 వరకు
వర్జ్యం: లేదు
దుర్ముహూర్తం: ఉ. 11.45 నుంచి మ.12.30 వరకు
రాహుకాలం: మ. 12.00 నుంచి 1.30 వరకు
సూర్యోదయం: ఉ.6-37; సూర్యాస్తమయం: సా.5-38

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	7.8	28.5
మెదక్	10.6	32.1
హన్మకొండ	12.0	27.0
రామగుండం	12.0	27.2
నిజామాబాద్	13.6	29.2
హైదరాబాద్	13.9	29.2
కడప	14.0	33.0
గుంటూరు	14.1	30.2
విశాఖపట్నం	15.0	29.8
తిరుపతి	15.0	31.0
విజయవాడ	16.6	30.4
అనంతపురం	16.6	31.8
సూర్యాపేట	17.0	29.0
శ్రీకాకుళం	17.0	30.0
ఖమ్మం	17.0	32.0
కర్నూలు	17.2	31.9
రాజమహేంద్రవరం	17.5	34.0
తాడేపల్లిగూడెం	18.5	27.1
ఒంగోలు	18.5	33.2
నరసాపురం	18.9	28.0
నెల్లూరు	20.0	31.0

విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తేనే గొప్ప

- ఉత్పత్తి వ్యయం తగ్గుతున్నా వినియోగదారుకు దక్కని ప్రయోజనం
- ప్రజాభిప్రాయ సేకరణలో రైతులు, ప్రజాసంఘాల ధ్వజం

ఈనాడు, అమరావతి: సౌర, పవన విద్యుదుత్పత్తి వల్ల ధరలు దిగొస్తున్నా ఈ ప్రయోజనాలు వినియోగదారులకు ఎందుకు బదలాయించడం లేదని విద్యుత్‌రంగ నిపుణులు, రైతు, ప్రజాసంఘాల ప్రతినిధులు ప్రశ్నించారు. విద్యుత్ ఛార్జీలు పెంచకపోవడం కాదు..రూ.500 బిల్లును రూ. 200కు తగ్గిస్తే అదే అద్భుతమని స్పష్టం చేశారు. అవసరం లేకున్నా 20, 30ఏళ్ల కాలానికి విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడంపైనా మండిపడ్డారు. వీటికి విద్యుత్ నియంత్రణ మండలి ఎలా అనుమతిస్తుందని ప్రశ్నించారు. రెవెన్యూలోటు భారీగా పెరుగుతుండటాన్ని ప్రస్తావించారు. మిగులు విద్యుత్ ఉందని చెబుతున్నా రైతులకు కనెక్షన్లు ఇవ్వడం లేదని గుర్తు చేశారు. మంగళవారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ జస్టిస్ జి.భవానీప్రసాద్ అధ్యక్షతన '2019-20 సంవత్సరానికి రిటైల్ సరఫరా, వ్యాపారం, నాలుగో నియంత్రణ కాలానికి (2019-24) పంపిణీ వ్యాపారం కోసం ఆర్థిక ఆవశ్యకత, టారిఫ్ ప్రతిపాదనల'పై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఇంధనశాఖ సలహాదారు రంగనాథం ప్రభుత్వ ప్రకటనను చదివారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఛార్జీలు పెంచడం లేదని, విద్యుత్ నియంత్రణ మండలి సిఫారసు మేరకు లోటు భర్తీ చేస్తామని ప్రకటనలో ప్రభుత్వం పేర్కొంది. 24 గంటల నిరంతర సరఫరా, రైతులకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని తెలిపింది. వంద శాతం కుటుంబాలకు విద్యుత్తు సరఫరా చేస్తున్న మూడో రాష్ట్రంగా ఏపీ నిలిచిందని వివరించింది.

2019-20 టారిఫ్ ప్రతిపాదనలు.. మార్పులు

- ఛార్జీల పెంపు లేదు.
- దోభీఘాట్లకు, గ్రామీణ ఉద్యాన నర్సరీలకు ఉచిత విద్యుత్
- విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లలో ధర యూనిట్‌కు రూ.5.95 నుంచి రూ.4.95కు తగ్గింపు (రాత్రి 10 నుంచి ఉదయం ఆరు వరకు)

మచ్చగా మిగులుతుందేమో..

ఏ వ్యక్తికి చెందిన ప్రైవేటు ఆస్తిలో అయినా టవర్లు, లైన్లు నిర్మిస్తే నష్టపరిహారం చెల్లించాల్సిందేనని విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ జస్టిస్ జి.భవానీప్రసాద్ స్పష్టం చేశారు. చాలా మంది రైతులకు ఇది తెలియకపోవడం, పరిహారం అందకపోవడం మన సామర్థ్యానికి మచ్చగా మిగులుతుందేమోనని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టప్రకారం వారికున్న హక్కులను తెలియజేయాల్సిన బాధ్యత విద్యుత్ ఉద్యోగులు తీసుకోవాలని సూచించారు. పలువురు రైతులు తమ పొలాల్లో వేసిన టవర్లకు నష్టపరిహారం చెల్లించలేదని మండలి దృష్టికి తెచ్చారు. పరిహారం కోసం తొలుత కలెక్టర్‌ను సంప్రదించాలని, అక్కడ ఇవ్వకుంటే మండలి దృష్టికి తీసుకురావచ్చని జస్టిస్ భవానీప్రసాద్ సూచించారు. కేంద్ర పరిధిలోని సంస్థల ఆధ్వర్యంలో టవర్లు నిర్మిస్తే కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలిని సంప్రదించవచ్చని వివరించారు.

పాతికేళ్ల క్రితం డిగ్రీ తప్పారా.. దిగులొద్దు

బ్యాక్‌లాగ్ సబ్జెక్టుల పూర్తికి ఏయూ అవకాశం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ చదివి కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిలై పట్టభద్రులు కాలేకపోయిన వారికి సువర్ణావకాశం లభించింది. బ్యాక్‌లాగ్ సబ్జెక్టులను మళ్లీ రాసుకొని డిగ్రీ పట్టా పొందే అవకాశాన్ని ఏయూ యూజీ పరీక్షల విభాగం ప్రత్యేక డ్రైవ్ ద్వారా అవకాశం కల్పిస్తోంది. ఈ ప్రకటన మంగళవారం విడుదల చేశామని ఏయూ పరీక్షల కంట్రోలర్ ఎస్.వి.సుధాకర్ రెడ్డి తెలిపారు. 1991-92 విద్యా సంవత్సరం నుంచి 2008-09 విద్యా సంవత్సరాల మధ్య సెమిస్టర్ల విధానం లేకుండా నాన్ గ్రేడింగ్ విధానంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఎం, బీహెచ్ఎంసీటీ (కామన్ కోర్ సిలబస్)లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు ప్రత్యేక డ్రైవ్‌లో తప్పిన సబ్జెక్టులను రాసే అవకాశం కల్పించారు. 2000 సంవత్సరానికి ముందు విద్యార్థులు తత్సమాన సిలబస్‌ను, 2000 సంవత్సరం తరువాతి విద్యార్థులు ప్రస్తుత సిలబస్‌లోను పరీక్షలు రాయాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రం ఏయూలోనే ఉంటుంది. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో ఈ పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని సుధాకర్‌రెడ్డి తెలిపారు. త్వరలో మరిన్ని వివరాలు ఏయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు. దరఖాస్తులను ఏయూ www.aucoe.info వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని మార్చి 31లోగా అదే విధానంలో పంపించాలని సూచించారు.

70+ విశ్రాంత ఉద్యోగులకు పింఛను +10%

ఈనాడు, అమరావతి: విశ్రాంత ఉద్యోగులకు ప్రయోజనం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 70 సంవత్సరాల వయసు కలిగి పింఛన్ పొందే వారికి అదనంగా 10% ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకారం తెలిపారు. దీనివల్ల నెలకు పదివేల రూపాయలు పింఛన్ పొందే వ్యక్తికి అదనంగా మరో వెయ్యి రూపాయలు రానుంది. ఈ తాజా నిర్ణయంతో సుమారు 75వేల మంది పింఛన్‌దారులు ప్రయోజనం పొందనున్నారు. ప్రస్తుతం 75 సంవత్సరాల వయస్సు కలిగిన వారికి ఈ అదనపు ప్రయోజనాన్ని వర్తింప చేస్తున్నారు. ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

మకుటాయమాన వంతెన 12న శంకుస్థాపన

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిని విజయవాడ-హైదరాబాద్ మార్గంతో అనుసంధానిస్తూ కృష్ణా నదిపై ఇబ్రహీంపట్నం వద్ద నిర్మించనున్న ఐకానిక్ బ్రిడ్జికి ఈ నెల 12న ఉదయం పదింటికి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారు. ఐకానిక్ బ్రిడ్జిని తెలుగు సంస్కృతికి అద్దం పట్టేలా కూచిపూడి నాట్య ముద్రను పోలిన ఆకృతిలో నిర్మించనున్నారు. రూ.1,387 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ పనులను ఎల్ అండ్ టీ సంస్థ దక్కించుకుంది. 3.2 కి.మీ. పొడవైన ఈ వంతెనను ఆరు వరుసలుగా రెండేళ్లలో నిర్మించాలన్నది లక్ష్యం. శంకుస్థాపన చేసిన వెంటనే పనులు ప్రారంభించనున్నారు.

ఒకటి కంటే ఎక్కువ పింఛన్లు..

మానసిక వైకల్యం ఉన్న పిల్లల కుటుంబాలకు అవకాశం



ఈనాడు డిజిటల్, అమరావతి: ఒక కుటుంబానికి (రేషన్ కార్డుపై) ఒకే పింఛన్ అన్న నిబంధనను ప్రభుత్వం మానసిక వైకల్యం ఉన్న పిల్లల కుటుంబాల విషయంలో కాస్త సడలించింది. అలాంటి పిల్లలున్న ఇంట్లో ఇప్పటికే వృద్ధులు, దివ్యాంగులు, ఇతర కోటాలో పింఛన్ పొందుతున్నా రెండో పింఛన్ ఇచ్చేందుకు సమ్మతించింది. కుటుంబంలో ఒకరికి మించి మానసిక వైకల్యం ఉన్న పిల్లలుంటే మూడో పింఛన్ కూడా ఇవ్వనుంది. మానసిక వైకల్యంగల పిల్లలకే కాక ఇంట్లో మంచం నుంచి లేవలేని పిల్లలకు కూడా ఇవ్వాలని నిర్ణయించింది. అర్హులను గుర్తించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలతో కదిలిన అధికారులు సదరం ధ్రువీకరణ పత్రాల ఆధారంగా రాష్ట్రంలో ఈ తరహా కుటుంబాలు తొమ్మిది వేల వరకున్నట్లు గుర్తించారు. ఇతర కోటాలో పొందుతూ రెండో పింఛన్ మంజూరు చేయాల్సిన కుటుంబాలు 3,500 వరకున్నాయని తేల్చారు. వీరికి ప్రభుత్వం ఫిబ్రవరి నుంచి నెలకు రూ.1,500 చొప్పున చెల్లించనుంది. అర్హులు జన్మభూమి గ్రామసభల్లో దరఖాస్తు చేసుకునే వీలు కల్పించింది.

సహాయ ఆచార్యుల మౌఖిక పరీక్షలకు షెడ్యూల్

ఈనాడు, అమరావతి: విశ్వవిద్యాలయాల్లో సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీకి మౌఖిక పరీక్షలకు వర్సిటీలు ప్రాథమిక షెడ్యూల్‌ను విడుదల చేశాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో కలిపి 1,109 పోస్టులను భర్తీ చేయనున్నారు. నియామకాల్లో పారదర్శకతను తీసుకువచ్చేందుకు ఈసారి ఏపీపీఎస్సీ ద్వారా అభ్యర్థులకు ప్రాథమిక పరీక్ష నిర్వహించారు. అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాలను వర్సిటీలకు ఇప్పటికే పంపించారు. ఒక్కో అభ్యర్థి రెండు, మూడు వర్సిటీలకు దరఖాస్తు చేసినందున దీని కోసం ప్రత్యేక షెడ్యూల్‌ను రూపొందిస్తున్నారు. ఉపకులపతుల పదవులు ఖాళీగా ఉన్న వర్సిటీల్లో మౌఖిక పరీక్షలను నిర్వహించడం లేదు. ఆంధ్ర వర్సిటీలో ఇటీవల జరిగిన నియామక ప్రక్రియపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం నియమించిన కమిటీ విచారణ చేపడుతోంది. ఈ నేపథ్యంలో ఈ వర్సిటీ మౌఖిక పరీక్షల షెడ్యూల్‌నూ ప్రకటించలేదు. యోగి వేమన వర్సిటీ 19న, రాయలసీమ 20న, విక్రమ సింహపురి 22న, అంబేడ్కర్ 23న, జేఎన్‌టీయూ కాకినాడ 30న, జేఎన్‌టీయూ అనంతపురం ఫిబ్రవరి 1, 2తేదీల్లో మౌఖిక పరీక్షలు నిర్వహించేందుకు ప్రాథమిక షెడ్యూల్‌ను ప్రకటించాయి. దీన్ని ఉన్నత విద్యామండలి ఖరారు చేయాల్సి ఉంటుంది.

ఇంజినీరింగ్ విద్యపై అవగాహన సదస్సులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్య, కళాశాలల్లోని మౌలికవసతులపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏపీ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్య సంఘం (ఏపీపీఈసీఎంఏ) అధ్యక్షుడు శాంతిరాముడు తెలిపారు. విజయవాడలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జేఎన్‌టీయూ కాకినాడ, అనంతపురంతో కలిసి సదస్సులు, కార్యశాలలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 25న నెల్లూరు, 27న కర్నూలు, 28న కడప జిల్లాలో ఈ సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కొన్ని ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన వారు రాష్ట్రంలోని కళాశాలలు, ఇంజినీరింగ్ విద్యపై చెడుగా ప్రచారం చేస్తున్నారని, రాష్ట్ర విద్యార్థులు స్థానికంగా ఉన్న విద్యావకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. పరిశ్రమలు భారీగా వస్తున్నందున భవిష్యత్తులో ఇంజినీర్లకు మంచి డిమాండ్ ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలలు మారుతున్న కాలానికి అనుగుణంగా, పరిశ్రమల అవసరాలకు తగినట్లు విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు.

రైల్లో ఉపరాష్ట్రపతి



రేణిగుంట నుంచి వెంకటాచలానికి ప్రయాణం

- రైల్వే ప్రాజెక్టులపై సమీక్ష
- డైనమిక్ టికెట్ల ధరలు తగ్గించాలని సూచన

ఈనాడు- తిరుపతి, రేణిగుంట, వెంకటాచలం- న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని రైల్వే ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ఆదేశించారు. కడప జిల్లా ఓబులవారిపల్లె నుంచి కృష్ణపట్నం పోర్టు వరకు వెళ్లే రైల్వే ట్రాక్ పనులను ఈ ఏడాది ఫిబ్రవరి 25లోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన సువిధ రైళ్లలో డైనమిక్ ఫేర్ టికెట్ల ధరలు అధికంగా ఉన్నాయనే వార్తలొస్తున్నాయని, వాటి ధరలు మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక విమానంలో మంగళవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయన అక్కడి నుంచి నెల్లూరు జిల్లా వెంకటాచలానికి ప్రత్యేక రైల్లో ప్రయాణించారు. ఈ సందర్భంగా రైల్లోనే ఆయన ఆ శాఖ ఉన్నతాధికారులతో వివిధ ప్రాజెక్టుల స్థితిగతులపై సమీక్షించారు. సమీక్షా సమావేశంలో దక్షిణమధ్య రైల్వే జీఎం ఆర్కే కుల్‌శేష్ఠ్ర, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీరు శివప్రసాద్, గుంతకల్ డీఆర్ఎం విజయ్ ప్రతాప్ సింగ్, చీఫ్ ప్రాజెక్టు మేనేజరు కమలాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమీక్ష అనంతరం ఉప రాష్ట్రపతి విలేకరులతో మాట్లాడారు.

రూ. 400 కోట్లతో తిరుపతి స్టేషన్ అభివృద్ధి

'తిరుపతి రైల్వేస్టేషన్‌లో రూ.400 కోట్లతో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు జరగనున్నాయి. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఈ నెల 16లోగా వస్తుంది. 'దక్షిణం వైపున 6 లక్షల చదరపు అడుగుల విస్తరణలో నిర్మాణాలు జరగనున్నాయి. ఉత్తరంవైపు జాతీయ రహదారి ఉంది. అక్కడకు వాహనాలు రాకుండా మళ్లిస్తే ఆ ప్రాంతాన్నీ అభివృద్ధి చేయిస్తా. కడప జిల్లా ఓబులవారిపల్లె నుంచి కృష్ణపట్నం పోర్టు వరకు వెళ్లే రైల్వే లైనులో ప్రయాణికుల రైళ్లు వెళ్లే విధంగా మార్పులు చేయాలని అధికారులకు సూచించా. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైను పనులు పురోగతిలో ఉన్నాయి. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వం కొంత భూమి ఇవ్వాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వంతో చర్చించి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూస్తా. నెల్లూరు, గూడూరు, రేణిగుంట రైల్వేస్టేషన్లలో వచ్చే నెలలోనే వైఫై సేవలు అందుబాటులోకి రానున్నాయి. డైనమిక్ ఫేర్ పేరుతో ప్రయాణికుల నుంచి అధిక మొత్తం వసూళ్లు చేస్తున్న విషయం నా దృష్టికి వచ్చింది. ఈ ధరలు తగ్గించాలని ఇప్పటికే రైల్వే బోర్డు ఛైర్మన్‌తో మాట్లాడా. గూడూరు- విజయవాడ మూడో లైను విద్యుదీకరణ పనులను వేగవంతం చేయాల్సి ఉంది' అని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతిగా తొలిసారి ఆయన రైలులో ప్రయాణించారు. తన అత్త దశ దిన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెంకటాచలం వచ్చారు.

యువత, అనుభవజ్ఞుల కలయిక

- 175 స్థానాల్లో పోటీపై స్పష్టత ఉంది
- పండగలోగా తాత్కాలిక కమిటీలు
- పవన్ కల్యాణ్ వెల్లడి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో ఎన్ని అనుభవజ్ఞులకు ఇవ్వాలి? ఎన్ని కొత్త వారికి ఇవ్వాలనే విషయంలో తమకు పూర్తి స్పష్టత ఉందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. కొత్త పార్టీ అంటే అంతా కొత్త నాయకులే ఉన్నా నిలవలేమని, పార్టీ సిద్ధాంతాలకు దగ్గరగా ఉన్న సీనియర్ల అవసరమూ ఉందని చెప్పారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం కర్నూలు జిల్లాకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో విడివిడిగా జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. మెజారిటీ స్థానాల్లో కొత్త వారు ఉండాలనే ఉద్దేశంతోనే 60శాతం సీట్లు వారికి ఇద్దామని నిర్ణయించామని తెలిపారు. ప్రతి సమస్యపైనా తాను బలంగా మాట్లాడుతున్నా, పోరాటం చేస్తున్నా జనంలోకి తీసుకెళ్లేందుకు పార్టీకి మీడియా లేదని అభిప్రాయపడ్డారు. పండగ లోగా జనసేన పార్టీ తాత్కాలిక కమిటీలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు.

ఎస్సీ, బీసీ హాస్టళ్లు అని విడదీయబోం

విద్యార్థి దశ నుంచే ఎస్సీ, బీసీ హాస్టళ్లు అంటూ కుల వ్యవస్థను పెంచి పోషిస్తున్నారని పవన్‌కల్యాణ్ విమర్శించారు. జనసేన పార్టీ అలా చేయబోదని ప్రకటించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. విద్యార్థుల్లో రాజకీయ చైతన్యం రావాలన్నారు.

పవన్ కల్యాణ్‌తో వామపక్ష నేతల భేటీ

పవన్ కల్యాణ్‌తో సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు మధు, రామకృష్ణ సమావేశమయ్యారు. పవన్ నివాసంలో మంగళవారం జరిగిన ఈ భేటీలో ఎన్నికల్లో పొత్తులు, సీట్ల సర్దుబాటుపై చర్చించారు.

వైకాపాకు ఆదిశేషగిరిరావు రాజీనామా

ఈనాడు, అమరావతి: వైకాపా రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా ఉన్న ఘట్టమనేని ఆదిశేషగిరిరావు తన పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను మంగళవారం వైకాపా అధ్యక్షుడు జగన్‌కు పంపించారు. వ్యక్తిగత కారణాల వల్ల తాను పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఆదిశేషగిరిరావు సినీ నిర్మాత. ప్రముఖ సినీనటుడు కృష్ణ సోదరుడు.

సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే

- ఎన్టీఆర్ కథానాయకుడు విడుదల.. మా అదృష్టం
- కొత్త కోణాలు ఆవిష్కరించాం
- నటుడు బాలకృష్ణ వెల్లడి
- తిరుపతిలో చిత్ర యూనిట్ సందడి

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: 'ఎన్టీఆర్ అంటే నందమూరి తారక రామారావే కాదు... ఎన్ అంటే నట సింహుడు, టీ అంటే తార ధ్రువ తారకుడు, ఆర్ అంటే రాజకీయ దురంధర యుగంధరుడు, రమణీయ రమ్య కమనీయ సౌమ్య గుణధాముడు అని అర్థం. తెలుగు అనే మూడు అక్షరాలు వింటే రక్తం ఎలా ఉప్పొంగుతుందో.. ఎన్టీఆర్ అనే మూడు అక్షరాలు వింటే మనసు పులకిస్తుంది' అని ప్రముఖ సినీ నటుడు బాలకృష్ణ అన్నారు. ఈ నెల 9న ఎన్టీఆర్ బయోపిక్ 'కథానాయకుడు' చిత్రం విడుదల సందర్భంగా చిత్రం యూనిట్ మంగళవారం తిరుపతిలో సందడి చేసింది. నగరంలోని పీజీఆర్ థియేటర్‌కు ఆ చిత్రం నటీనటులు బాలకృష్ణ, నటి విద్యాబాలన్, సుమంత్, కల్యాణ్‌రామ్ హాజరై బయోపిక్ ట్రైలర్‌ను అభిమానులతో కలిసి వీక్షించారు. అనంతరం బాలకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ తండ్రి ఎన్టీఆర్ ఆలోచనలు, పట్టుదల, క్రమశిక్షణ, వేషం వారసత్వంగా తనకు సంక్రమించడం అదృష్టమని తెలిపారు. తన అశేష అభిమానులు, ప్రజలకు సేవచేయాలని.. ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశం చేసిన విషయం తెలిసిందేనన్నారు. ఇంకా తెలియని కొత్త కోణాలను ఆవిష్కరించేవే 'కథానాయకుడు, మహానాయకుడు' చిత్రాలు అని ఆయన వివరించారు. 1983 జనవరి 9న ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన రోజే ఈ చిత్రం విడుదల కావడం పుణ్యదంపతుల ఆశీర్వాదమని బాలకృష్ణ చెప్పారు. ప్రపంచంలో ఓ కొడుకు.. తండ్రి పాత్ర పోషించడం, చిత్రం నిర్మించడం ఎక్కడా జరగలేదన్నారు. ఇందులో ప్రధానంగా అమ్మ పాత్రలో విద్యాబాలన్, నాన్న స్నేహితుడు అక్కినేని నాగేశ్వరరావు పాత్రలో ఆయన మనవడు సుమంత్ నటించినట్లు వివరించారు. అనంతరం థియేటర్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి జ్యోతి వెలిగించారు. కార్యక్రమంలో తిరుపతి శాసనసభ్యురాలు సుగుణమ్మ, తుడా ఛైర్మన్ నరసింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో చిత్ర బృందం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారిని ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ మంగళవారం దర్శించుకున్నారు. 'ఎన్టీఆర్ కథానాయకుడు' చిత్రం బుధవారం విడుదల అవుతున్న నేపథ్యంలో చిత్ర నటీనటులు విద్యాబాలన్, సుమంత్, కొర్రపాటితో కలిసి చిత్రబృందం సోమవారం రాత్రి తిరుమలకు చేరుకుంది. ఉదయం స్వామివారి సేవలో పాల్గొంది. హుండీలో కానుకలు సమర్పించుకున్న అనంతరం రంగనాయకుల మండపానికి రాగా.. అక్కడ పండితులు వేదాశీర్వచనం చేశారు. తితిదే అధ్యక్షుడు పుట్టా సుధాకర్ యాదవ్ నటీనటులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయం ఎదుట బాలకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ 'కథానాయకుడు చిత్రం విడుదల నేపథ్యంలో శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చాం. నాన్న ఎన్టీఆర్ పాత్రలో నటించే మహాభాగ్యం కలిగింది. చిత్రం విజయవంతం కావాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించాన'ని అన్నారు. బాలకృష్ణను చూడటానికి భక్తులు, అభిమానులు పోటీపడ్డారు.



శ్రీవారిని దర్శించుకుని వస్తున్న విద్యాబాలన్, బాలకృష్ణ, సుమంత్



ఆభరణాలను పరిశీలిస్తున్న విజయవాడ సీపీ ద్వారకా తిరుమలరావు

రూ.5 కోట్ల విలువైన ఆభరణాలు స్వాధీనం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: బిల్లులు లేకుండా అక్రమంగా బంగారు ఆభరణాలను తరలిస్తున్న నలుగురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి ఏకంగా రూ.5.05కోట్ల విలువైన 16.617 కిలోగ్రాముల బరువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ముంబయికి చెందిన జయేష్ జైన్ (42), శిల్పేష్ జైన్ (25)లు ముంబయి కేంద్రంగా చేసుకుని బంగారాన్ని అక్రమంగా దిగుమతి చేసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. వీరు విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు తదితర ప్రాంతాల్లోని పేరొందిన బంగారు నగల దుకాణాలకు ఎలాంటి పత్రాలు లేకుండా, పన్నులు చెల్లించకుండా అక్రమంగా బంగారాన్ని సరఫరా చేస్తూ ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగిస్తున్నట్లు సమాచారం అందింది. వీరిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా పెట్టారు. విజయవాడకు చెందిన మనీష్ జైన్, పంకజ్ జైన్‌లకు నిందితులు బంగారు ఆభరణాలను ఇస్తుండగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజీవ్‌కుమార్, సీఐ సురేష్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు.

అమరావతి ఆలయానికి 31న భూకర్షణ

తిరుమల, న్యూస్‌టుడే: అమరావతిలో శ్రీవేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి అవసరమైన భూమిని అనుసంధానిస్తూ ఆధీనంలోకి తీసుకునే ప్రక్రియ(భూకర్షణ)లో భాగంగా ఈనెల 31న ఉదయం ఆగమోక్తంగా వైదిక కార్యక్రమాలు నిర్వహించాలని తితిదే ధర్మకర్తల మండలి నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ క్రతువు చేపట్టాలని సంకల్పించింది. రూ.150కోట్లతో చేపట్టనున్న ఆలయానికి ఫిబ్రవరి 10న శంకుస్థాపన చేయాలని తీర్మానించింది. ఆలయ నిర్మాణానికి ఇప్పటికే నాలుగు దశల్లో పిలిచిన టెండర్లకు ఆమోదముద్ర వేసింది. తిరుమలలో మంగళవారం ఛైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్ అధ్యక్షతన తితిదే పాలకమండలి సమావేశం జరిగింది. తీర్మానాలు, నిర్ణయాలను అధ్యక్షుడితో పాటు ఈవో అనిల్ కుమార్ సింఘాల్ కలిసి ప్రసార మాధ్యమాలకు వెల్లడించారు.

- తిరుపతిలోని అలిపిరి వద్ద భక్తుల కోసం 2వేల గదుల నిర్మాణంలో భాగంగా తొలి దశలో 384 గదుల నిర్మాణానికి రూ.67.29 కోట్లతో టెండర్లకు ఆమోదం
- వైకుంఠం-2 నుంచి ఆళ్వారు ట్యాంకు వసతి సముదాయం గేటు వరకు రూ.17.21 కోట్లతో అత్యాధునిక క్యూలైను నిర్మాణానికి టెండరు ఖరారు
- తితిదే ఆగమ సలహా మండలి సభ్యులు వేదాంతం దేశికాచార్యులు మరణంతో ఏర్పడిన ఖాళీని శ్రీవారి ఆలయ అర్చకులు ఎ.అనంతశయన దీక్షితులుతో రెండేళ్ల కాలపరిమితిపై భర్తీ
- ఏజెన్సీ ప్రాంతాలైన విజయనగరం జిల్లా పార్వతీపురంలో రూ.2.90 కోట్లు, శ్రీకాకుళం జిల్లా సీతంపేటలో రూ.2.86 కోట్లు, తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురంలో రూ.2.99 కోట్లతో శ్రీవేంకటేశ్వర దివ్యక్షేత్రాల నిర్మాణానికి టెండర్లు ఆమోదం



ధర్మకర్తల మండలి నిర్ణయాలను వివరిస్తున్న సుధాకర్ యాదవ్, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

అర్చకుల వ్యవహారంపై అప్పీలుకు

వయోపరిమితి నిబంధనతో ఉద్యోగ విరమణ చేసిన ఇద్దరు అర్చకుల విషయంలో ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీలుకు వెళ్లాలని ధర్మకర్తల మండలి తీర్మానించింది. కోర్టు తీర్పును అమలుచేస్తే శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకులకు కూడా అవకాశం ఇవ్వాల్సి ఉంటుందనే చర్చ జరిగింది.

'ఏలేరు'పై విచారణ జరపండి: హైకోర్టు

ఈనాడు, అమరావతి: ఏలేరు భూపరిహారం కుంభకోణానికి చెందిన వ్యాజ్యాల్లో హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం పలు అంశాల్లో స్పష్టతనిస్తూ ఇటీవల కీలక ఉత్తర్వులు జారీ చేసింది. అక్రమాలపై ప్రాథమిక విచారణ జరిపి బాధ్యులపై మొదటి తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేసే అధికారాన్ని విశాఖ జిల్లా అనకాపల్లి, చోడవరంలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులకే ఉంటుందని తేల్చి చెప్పింది. అనకాపల్లి పట్టణ ఠాణాలో 1996లో నమోదు చేసిన కేసు అధారంగా దర్యాప్తును పూర్తి చేసి జాప్యానికి తావు లేకుండా సంబంధిత కోర్టులో అభియోగపత్రం దాఖలు చేయాలని సీఐడీకి సూచించింది. కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు, ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తే.. హైకోర్టు పరిపాలనాపరమైన నిర్ణయం తీసుకునేందుకు వినతి సమర్పించవచ్చని తెలిపింది. భూసేకరణ పరిహారం విషయంలో అక్రమాలకు పాల్పడ్డారంటూ పలువురు నిందితులపై అనకాపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇచ్చిన ఫిర్యాదును అనకాపల్లి మొదటి తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు విచారణకు పరిగణనలోకి తీసుకోవడాన్ని (కాగ్నిజెన్స్), సమన్లు జారీ చేయడాన్ని తప్పుబట్టింది. ఆ ఉత్తర్వులను రద్దు చేసింది. భూసేకరణ పరిహారం విషయమై కోర్టు ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డవారిపై 'ఫిర్యాదు' చేసేలా అనకాపల్లి, చోడవరంలోని సీనియరు సివిల్ జడ్జిలను ఆదేశించాలని అభ్యర్థిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సమర్థించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎస్వీ భట్, జస్టిస్ ఎం.సీతారామమూర్తిలతో కూడిన ధర్మాసనం హైకోర్టు విభజనకు ముందు ఈ తీర్పు ఇచ్చింది.

సెన్సెక్స్ ▲ 131 **35981** | నిఫ్టీ ▲ 30 **10802** | డోజోన్స్ 23672 ▲ 140 | నాస్‌డాక్ 6849 ▲ 26 | రూపాయి 70.21 ▼ 53 పైసలు (ఒక అమెరికా డాలరుకు) | ముడి చమురు 58.50 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).



ఘనం (+)

నిఫ్టీ	8న	మార్పు%
SUN PHARMA	448.05	4.00
ICICI BANK	380.15	3.39
SBI	305.30	3.04
YES BANK	192.35	2.78
TATA MOTORS	179.95	2.62
INDIABULLS HSG	812.55	2.35
AXIS BANK	650.90	2.11

గ్రహణం (-)

నిఫ్టీ	8న	మార్పు%
ZEE ENTERTAINMENT	451.65	-2.44
UPL	752.20	-1.51
KOTAK MAHI BANK	1228.90	-1.42
NTPC	146.95	-1.11
BPCL	351.95	-1.01
HINDALCO	206.50	-0.98
M & M	723.40	-0.84


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం			
అమెరికా డాలరు	63.63	73.78	బహ్రెయిన్ దీనార్	172.21	197.03
పౌండ్ స్టెర్లింగ్	81.22	94.21	కువైట్ దీనార్	190.81	237.53
యూరో	72.78	84.42	ఒమన్ రియాల్	168.51	193.04
జపనీస్ యెన్/100	58.54	67.90	సౌదీ రియాల్	16.92	20.05
ఆస్ట్రేలియా డాలరు	45.39	52.51	యూఏఈ దిర్హమ్	17.32	20.23
సింగపూర్ డాలరు	46.87	55.54	మలేషియా రింగిట్	15.16	18.64
థాయ్ బాత్/100	198.28	237.13	చైనీస్ యువాన్	7.22	11.72

మంగళవారం నిఫ్టీ కదలికలు



ద్విచక్ర వాహనాలపై 18% జీఎస్‌టీ

టీవీఎస్ మోటార్ ఛైర్మన్ డిమాండ్




వేణు శ్రీనివాసన్

దిల్లీ: ద్విచక్ర వాహనాలపై వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)ను తగ్గించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. అత్యధికులకు కనీస అవసరంగా మారిన ద్విచక్ర వాహనాలపై జీఎస్‌టీని 18 శాతానికి తగ్గిస్తే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని గత వారం హీరో మోటోకార్ప్ ఛైర్మన్ పవన్ ముంజాల్ అభిప్రాయపడిన సంగతి తెలిసిందే. తాజాగా టీవీఎస్ మోటార్ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలపై 28 శాతం జీఎస్‌టీ విధిస్తున్న సంగతి తెలిసిందే. ఎక్కువ మంది ప్రజలకు ద్విచక్రవాహనం ప్రాథమిక అవసరంగా మారినందున, వీటిపై విధించే జీఎస్‌టీ రేట్లను పునఃసమీక్షించాలని శ్రీనివాసన్ కోరారు. పట్టణీకరణ అధికమవ్వడం, ప్రజల కొనుగోలు శక్తి పెరగడం, చిన్న పట్టణాల మధ్య అనుసంధానత ఏర్పడటం వల్ల ద్విచక్ర వాహనం ప్రతి ఒక్కరికి ప్రాథమిక అవసరంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో విలాసవంత వస్తువులకు విధిస్తున్న 28 శాతం పన్ను శ్లాబులో ద్విచక్రవాహనాలను ఉంచడం సరైన నిర్ణయం కాదన్నారు. కొత్త భద్రతా ప్రమాణాలు, బీఎస్6 ఉద్గార నిబంధనలు అమలైతే ద్విచక్ర వాహనాల ధరలు మరింత పెరుగుతాయని చెప్పారు. జీఎస్‌టీ రేటు కూడా ఎక్కువగా ఉంటే అది కొనుగోలుదారుపై భారాన్ని పెంచుతుందని చెప్పారు.

బ్యాంకింగ్ షేర్ల జోరు

- కొనసాగిన సూచీల లాభాలు
- 139 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

సమీక్ష



వరుసగా మూడో రోజూ సూచీలు సత్తా చాటాయి. బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం కలిసొచ్చింది. బ్యాంకుల పనితీరుపై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సంతృప్తి వెలిబుచ్చడమే ఇందుకు కారణం. సానుకూల అంతర్జాతీయ పరిణామాలు కూడా లాభాలకు దోహదపడ్డాయి. కార్పొరేట్ కంపెనీ మూడో త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభం కానుండటం, అమెరికా- చైనాల మధ్య చర్చలతో మదుపర్లు కొంత అప్రమత్తంగా వ్యవహరించారు. అంతర్జాతీయంగా చూస్తే.. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా షేర్లు లాభాల్లో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 35,964.62 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. బలహీన రూపాయి, ముడి చమురు ధరలు పెరగడంతో డీలాపడిన సూచీ.. రోజులో ఎక్కువ భాగం నష్టాల్లోనే కదలాడింది. అయితే ఆఖరి గంటన్నర ట్రేడింగ్‌లో పుంజుకున్న సెన్సెక్స్, ఇంట్రాడేలో 36,037.35 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 130.77 పాయింట్ల లాభంతో 35,980.93 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 30.35 పాయింట్లు పెరిగి 10,802.15 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,733.25- 10,818.45 పాయింట్ల మధ్య కదలాడింది.

బంధన్ బ్యాంక్ కుదేల్: విలీన ప్రతిపాదనల నేపథ్యంలో గృహ్ ఫైనాన్స్, బంధన్ బ్యాంక్ షేర్లు కుప్పకూలాయి. ఇంట్రాడేలో 17.35 శాతం పతనమైన గృహ్ ఫైనాన్స్ షేరు.. చివరకు 16.39 శాతం నష్టంతో రూ.256 వద్ద ముగిసింది. ఇక బంధన్ బ్యాంక్ షేరు సైతం ఒకానొకదశలో 6 శాతం పడి రూ.470.85 వద్ద కనిష్ఠానికి చేరింది. చివరకు 4.80 శాతం కోల్పోయి రూ.477.05 దగ్గర స్థిరపడింది.

✦ జేఎల్ఆర్ అమ్మకాలు దన్నుగా నిలవడంతో టాటా మోటార్స్ షేర్లు రాణించాయి. ఇంట్రాడేలో 2.99 శాతం పెరిగిన షేరు. . చివరకు 2.34 శాతం లాభంతో రూ.179.35 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 17 లాభాలతో ముగిశాయి. సన్‌ఫార్మా 3.98%, ఐసీఐసీఐ బ్యాంకు 3.46%, ఎస్‌బీఐ 3.18%, యెస్ బ్యాంక్ 2.86%, టాటా మోటార్స్ 2.34%, యాక్సిస్ బ్యాంక్ 2.11%, భారతీ ఎయిర్‌టెల్ 1.36%, బజాజ్ ఆటో 1.25%, ఇండస్ఇండ్ బ్యాంక్ 1.24%, వేదాంతా 1.16% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. కోటక్ బ్యాంక్ 1.23%, ఎన్‌టీపీసీ 0.98%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.81%, హిందుస్థాన్ యునిలీవర్ 0.79%, బజాజ్ ఫైనాన్స్ 0.69% మేర నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో బ్యాంకింగ్ అత్యధికంగా 1.31% పెరిగింది. ఆరోగ్య సంరక్షణ, పీఎస్‌యూ, లోహ, వాహన, మౌలిక షేర్లు అదే బాటలో నడిచాయి. యంత్ర పరికరాలు, విద్యుత్, మన్నికైన వినిమయ వస్తువులు, ఐటీ స్క్రిప్‌లు డీలాపడ్డాయి. బీఎస్ఈలో 1,247 షేర్లు లాభాల్లో, 1328 షేర్లు నష్టాలతోనూ ముగిశాయి. 177 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.

నేటి మార్కెట్

సూచీల లాభాలు కొనసాగొచ్చు. అంతర్జాతీయ మార్కెట్లు ఇందుకు దన్నుగా నిలవొచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నేడు ఇండస్ఇండ్ బ్యాంక్ అక్టోబరు- డిసెంబరు త్రైమాసిక ఫలితాలు వెలువడనున్నాయి. మార్కెట్ల ధోరణిపై ఇవి ప్రభావం చూపొచ్చు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగం కీలకం కానుంది. అమెరికా- చైనా వాణిజ్య చర్చలు, అమెరికా ఫెడరల్ రిజర్వు గత సమావేశ నిర్ణయాల నుంచి మదుపర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. దిగ్గజ ఐటీ సంస్థలు టీసీఎస్, ఇన్ఫోసిస్ ఫలితాలు ఈ వారమే వెలువడనుండటంతో మదుపర్లు అప్రమత్తత పాటించే అవకాశం ఉంది. ఇన్ఫోసిస్ షేర్ల బైబ్యాక్, ప్రత్యేక డివిడెండుపై ఆసక్తిగా ఉన్నారు.

ఎన్ఎండీసీ షేర్ల బైబ్యాక్

- రూ.1,000 కోట్లు కేటాయింపు
- ఒక్కో షేరుకు రూ.98 చెల్లింపు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ రంగ ఖనిజాల సంస్థ అయిన ఎన్ఎండీసీ లిమిటెడ్ ఈక్విటీ షేర్లను తిరిగి కొనుగోలు (ఈక్విటీ షేర్ల బైబ్యాక్) చేయనుంది. ఎన్ఎండీసీ బోర్డు డైరెక్టర్ల సమావేశం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. రూ.1 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ.98 చెల్లించి బైబ్యాక్ చేయాలని ప్రతిపాదించింది. ఇందుకు రూ.1000 కోట్లు కేటాయిస్తారు. దీని ప్రకారం చూస్తే... 10,20,40,815 ఈక్విటీ షేర్లు కొనుగోలు చేయవచ్చు. కంపెనీ జారీ మూలధనంలో ఈ షేర్లు 3.23 శాతానికి సమానం. బైబ్యాక్‌ను 'టెండర్ ఆఫర్' పద్ధతిలో చేపడతారు. దీనికి ఈ నెల 18వ తేదీని రికార్డు తేదీగా నిర్ణయించారు. ఆ రోజు నాటికి ఎన్ఎండీసీ వాటాదార్లుగా ఉన్నవారికి బైబ్యాక్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం ఎన్ఎండీసీ లిమిటెడ్ జారీ మూలధనం రూ.316.38 కోట్లు (రూ.1 ముఖ విలువ గల 316,38,90,474 ఈక్విటీ షేర్లు) ఉంది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా 72.43 శాతం. మ్యూచ్యువల్ ఫండ్లకు 1.84 శాతం, విదేశీ సంస్థాగత మదుపరులకు 3.85 శాతం, ఆర్థిక సంస్థలు/బ్యాంకులకు 3.44 శాతం వాటా ఉంది.

బీఎస్ఈలో ఎన్ఎండీసీ షేరు రూ.94.95 వద్ద స్థిరపడింది.

హైదరాబాద్ విమానాశ్రయం గ్రౌండ్ హ్యాండ్లింగ్ పనులు సెలెబీకి

ఈనాడు, హైదరాబాద్: జీఎంఆర్ గ్రూపు నిర్వహిస్తోన్న హైదరాబాద్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో గ్రౌండ్ హ్యాండ్లింగ్ పనులను టర్కిష్ సంస్థ సెలెబీ ఏవియేషన్ హోల్డింగ్ చేజిక్కించుకుంది. పదేళ్లపాటు ఈ సేవలు నిర్వహించేందుకు నిర్వహించిన బిడ్డింగ్‌లో సెలెబీ దీన్ని దక్కించుకుంది. దీనికోసం 5-6 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. సెలెబీకి ఇటీవలే బెంగళూరు విమానాశ్రయం, కేరళలోని కన్నూర్ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవలు నిర్వహించే కాంట్రాక్టు లభించింది. విమానాలను శుభ్రం చేయడం, ఆహార, పానీయాలు నింపడం, ప్రయాణికుల సామగ్రి, సరకు నిర్వహించడంలాంటివన్నీ ఈ సేవల కిందకు వస్తాయి. విమానయాన రంగంలో భారత్ ఎంతో కీలకపాత్ర పోషిస్తోందనీ, ఈ నేపథ్యంలో భారత్‌లో విస్తరించేందుకు వ్యూహాత్మకంగా ప్రణాళికలు వేస్తున్నట్లు సెలెబీ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మురళీ రామచంద్రన్ అన్నారు. ఏడాదికి 2 కోట్ల మందికి పైగా ప్రయాణికులకు సేవలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

ఆభరణాల రంగాన్ని ఆ రెండే దెబ్బతీశాయ్

- పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ వల్ల వృద్ధిపై ప్రభావం
- జీజేసీ ఛైర్మన్ అనంత్ పద్మనాభన్

కోయంబత్తూర్: పసిడి ఆభరణాల రంగ వృద్ధి గత రెండేళ్లుగా నిలిచిపోయిందని, ఇందుకు పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) కారణమని జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) ఛైర్మన్ అనంత్ పద్మనాభన్ అన్నారు. బంగారు ఆభరణాల కొనుగోలును దీర్ఘకాల పెట్టుబడిగా పాతతరం వారు భావించడం వల్ల మిగులు నిధులున్నపుడల్లా సమీకరించేవారన్నారు. అయితే యువత మాత్రం పర్యటనలు, వాహనాల కొనుగోలుకు నిధులు వెచ్చిస్తూ, ఆభరణాలపై అంతగా మొగ్గుచూపడం లేదని తెలిపారు. బంగారం దిగుమతిలో ప్రపంచంలోనే రెండో స్థానంలో మన దేశం ఉన్నా, పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు తరవాత దేశంలో ఆభరణాల పరిశ్రమ వృద్ధి స్తంభించిందని వివరించారు. దేశీయంగా వినిమయం ఎంత ఉందో కచ్చితమైన గణాంకాలు లేకున్నా, ఈ ఏడాది ఆరంభం నుంచి పసిడి దిగుమతుల్లో ప్రతికూల వృద్ధి నమోదవుతోందనే సమాచారం ఉందన్నారు. దేశీయంగా ఆభరణాల తయారీని ప్రోత్సహించేందుకు 3 రోజుల కార్యక్రమాన్ని సంఘం ఇక్కడ నిర్వహిస్తోంది.

మోన్‌శాంటోకు సుప్రీంలో ఊరట

బీటీ పత్తి విత్తనాలపై సంస్థ పేటెంట్లు చెల్లవన్న హైకోర్టు తీర్పును పక్కనపెట్టిన ధర్మాసనం

దిల్లీ: జన్యు మార్పిడి బీటీ రకం పత్తి విత్తనాలపై మోన్‌శాంటో సంస్థకున్న పేటెంట్లు చెల్లవంటూ దిల్లీ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు పక్కనపెట్టింది. జస్టిస్ ఆర్.ఎఫ్.నారీమన్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది. మోన్‌శాంటో, బేయర్, డుపాంట్ పయోనీర్ సహా భారత్‌లో జన్యు మార్పిడి పంటలపై తమకున్న పేటెంట్లను కోల్పోతామన్న ఆందోళనలో ఉన్న వివిధ అంతర్జాతీయ సంస్థలకు ఇది ఊరటనిచ్చే పరిణామం. మహికో మోన్‌శాంటో బయోటెక్-ఇండియా (ఎమ్ఎమ్‌బీ) పేరుతో నెలకొల్పిన సంస్థ ద్వారా భారత్‌కు మోన్‌శాంటో బీటీ విత్తనాలను తీసుకువచ్చింది. దేశంలోని 40కి పైగా విత్తన సంస్థలు మోన్‌శాంటో నుంచి లైసెన్సు పొంది బీటీ విత్తనాలను విక్రయిస్తున్నాయి. ఇదే తరహాలో నూజివీడు సీడ్స్ సంస్థతో మహికో మోన్‌శాంటోకు ఉన్న లైసెన్స్ ఒప్పందం 2015లో రద్దైంది. అయితే ఆ తర్వాత కూడా తాము పేటెంట్ పొందిన బీటీ పత్తి విత్తనాల విక్రయాలను నూజివీడు సీడ్స్ కొనసాగించిందని పేర్కొంటూ ఆ సంస్థపై మోన్‌శాంటో దిల్లీ హైకోర్టులో దావా వేసింది. భారత పేటెంట్ చట్టం ప్రకారం జన్యు మార్పిడి పత్తి విత్తనాలపై మోన్‌శాంటోకున్న పేటెంట్లు చెల్లవంటూ నూజివీడు సీడ్స్ అప్పుడు కోర్టులో వాదించింది. తీర్పు మోన్‌శాంటోకు ప్రతికూలంగా వచ్చింది. దీనిపై మోన్‌శాంటో అప్పీలుకు వెళ్లింది. దిల్లీ హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీం కోర్టు తాజాగా కొట్టివేసింది. తమ మేధోహక్కులను నూజివీడు సీడ్స్ ఉల్లంఘించిందని మోన్‌శాంటో చేసిన ఆరోపణలపైనా దిల్లీ హైకోర్టు విచారణ జరుపుతుందని స్పష్టం చేసింది. పేటెంట్ నిబంధనల విషయంలో అనిశ్చితి కారణంగా భారత్‌లో నూతన సాంకేతికత విడుదలను చాలా సంస్థలు నిలిపివేశాయని.. సుప్రీం తాజా ఆదేశం వల్ల రైతులకు మేలు కలుగుతుందని 'షెట్కారీ సంఘటన' రైతు సంఘం నాయకుడు అజిత్ నార్దే అన్నారు. మోన్‌శాంటోను జర్మనీకి చెందిన బేయర్ ఏజీ సంస్థ ఏడు నెలల క్రితం కొనుగోలు చేసింది. భారత్‌లో పత్తి పంట సాగు విస్తీర్ణంలో దాదాపు 90 శాతం వాటా మోన్‌శాంటో బీటీ రకాలదే.

జేఎల్ఆర్ రికార్డు అమ్మకాలు



దిల్లీ: టాటా మోటార్స్‌కు చెందిన జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) గతేడాది భారత్‌లో 4,596 వాహనాలు విక్రయించింది. 2017లో విక్రయించిన 3,954 కార్లతో పోలిస్తే ఇవి 16.23 శాతం అధికం. కంపెనీ ఒక ఏడాదిలో నమోదు చేసిన అత్యధిక విక్రయాలు ఇవే కావడం విశేషం. ల్యాండ్ రోవర్ డిస్కవరీ స్పోర్ట్, రేంజ్ రోవర్ ఎవోక్, జాగ్వార్ ఎఫ్-పేస్, ఎక్స్ఈ, ఎక్స్ఎఫ్ మోడళ్లు ఇందుకు దన్నుగా నిలిచాయని కంపెనీ వెల్లడించింది. '2018లో వాహన పరిశ్రమ అనేక అవరోధాలు ఎదుర్కొంది. ముఖ్యంగా ద్వితీయార్థంలో నగదు లభ్యత సమస్యలు తలెత్తాయి. బీమా ఖర్చులు, వడ్డీ రేట్లు పెరగడం భారంగా మారింది. అయినప్పటికీ జాగ్వార్ ల్యాండ్ రోవర్ అమ్మకాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. 2019లో కొత్త కార్ల విడుదల, వినియోగదారుల సేవలు మెరుగుదలపై దృష్టి పెట్టనున్నాం' అని జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇండియా అధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ సూరి పేర్కొన్నారు.

హాంకాంగ్ సంస్థ ఆర్థిక వివరాలివ్వండి

రీడ్&టేలర్ ఉద్యోగ సంఘానికి ఎన్‌సీఎల్‌టీ ఆదేశం

ముంబయి: రీడ్ అండ్ టేలర్‌ను హాంకాంగ్ సంస్థతో కలిసి కొనుగోలు చేయాలనుకుంటున్నందున, సదరు సంస్థ ఆర్థిక వివరాలు సమర్పించాల్సిందిగా రీడ్ అండ్ టేలర్ ఉద్యోగుల సంక్షేమ సంఘాన్ని జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆదేశించింది. రేపు విచారణ మొదలయ్యేలోగా వీటిని అందజేయాలని భాస్కర పంతుల మోహన్, వి.నల్లసేనాపతితో కూడిన ముంబయి ఎన్‌సీఎల్‌టీ ధర్మాసనం సూచించింది. బకాయిల వసూలు నిమిత్తం రీడ్ అండ్ టేలర్ ఆస్తుల విక్రయానికి బ్యాంకులు మొగ్గు చూపిన వేళ.. సంస్థను టేకోవర్ చేసేందుకు రీడ్ అండ్ టేలర్ ఉద్యోగుల సంఘం ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. సంఘం వేసిన బిడ్‌ను ఈనెల 4న ధర్మాసనం అంగీకరించింది కూడా. హాంకాంగ్‌కు చెందిన ఎస్‌పి గ్రోత్ పార్ట్‌నర్స్‌తో కలిసి సంస్థను స్వాధీనం చేసుకోవాలన్నది ఉద్యోగుల సంఘం ప్రణాళిక. ఈ నేపథ్యంలోనే హాంకాంగ్ సంస్థకు సంబంధించి 2017-18 ఆర్థిక వివరాలను సమర్పించాలని ఎన్‌సీఎల్‌టీ ఆదేశించింది. అలాగే అమెరికా, బ్రిటన్ నుంచి పెట్టుబడులు పెట్టనున్న పేరు వెల్లడించని మరో 2 సంస్థల వివరాలను కూడా బహిర్గతం చేయాలని తెలిపింది.

జూన్‌లోపు భారీ దిద్దుబాటు!

- అధిక స్థాయిలో షేర్ల విలువలే కారణం
- స్థిర ప్రభుత్వం ఏర్పడితే సూచీలు ముందుకు
- 2019 చివరికల్లా నిఫ్టీ లక్ష్యం 11300
- బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్లించ్ అంచనా

ముంబయి: ప్రస్తుతం దేశీయ స్టాక్ మార్కెట్ విలువ బాగా పెరిగి ఉన్నందున, 2019 తొలి ఆరు నెలల్లో రెండంకెల దిద్దుబాటుకు ఆస్కారం ఉందని బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్లించ్ (బీఓఎఫ్ఏ) అంచనా వేసింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం స్థిరమైన ప్రభుత్వం ఏర్పడితే రెండో అర్ధ భాగంలో మార్కెట్ పుంజుకునేందుకు అది దోహదం చేస్తుందని అభిప్రాయపడింది. మొత్తానికి ఈ సంవత్సరాంతానికి నిఫ్టీ 11,300 స్థాయికి చేరుతుందని అంచనా వేసింది. మంగళవారం ముగింపు (10802)తో పోలిస్తే ఇది 4.6 శాతం ఎక్కువ. సెన్సెక్స్ లక్ష్యాన్ని గురించి ఈ విదేశీ బ్రోకరేజీ సంస్థ ప్రస్తావించకపోవడం గమనార్హం.

'ఈ సంవత్సరం కఠినంగానే గడవచ్చు. ఇప్పటికే మార్కెట్ నుంచి మదుపర్లు బాగా సంపాదించుకోవడంతో సూచీలు ప్రస్తుతం అధిక స్థాయిల వద్ద ఉన్నాయ'ని బీఓఎఫ్ఏ పరిశోధన విశ్లేషకుడు సంజయ్ మూకిమ్ అన్నారు. భారత మార్కెట్‌పై సానుకూల ధోరణి కనబర్చేందుకు పెద్దగా కారణాలేవీ కనిపించడం లేదని చెప్పారు. అయితే బ్యాంకింగ్ రంగం ఒక్కటే మదుపర్లకు లాభాలు పంచే అవకాశం ఉందని తెలిపారు. మొండి బకాయిల సమస్య నుంచి ఇవి ఇప్పుడిప్పుడే బయట పడుతుండటం ఇందుకు కారణమని పేర్కొన్నారు. బాగా పెరిగిన షేర్ల విలువలే కాకుండా అంతర్జాతీయంగా ఎదురయ్యే ప్రతికూలతలు కూడా మార్కెట్‌ను తిరోగమన బాట పట్టిస్తాయని అభిప్రాయపడ్డారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని దేశీయ షేర్లకు దూరంగా ఉండి, బయటి షేర్లలో అవకాశాలను వెతుక్కోవాలని సంస్థాగత మదుపర్లకు సూచించారు. కొన్ని దిగ్గజ షేర్ల ధరలు ఇప్పటికీ ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ, సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మదుపర్లు జాగ్రత్తగా వ్యవహరించే అవకాశం ఉండటంతో వీటికి పెద్దగా కొనుగోళ్ల మద్దతు లభించకపోవచ్చని అన్నారు. గతేడాది బాగా దిద్దుబాటుకు లోనైన మధ్యతరహా షేర్ల విషయంలోనూ ఇదే జరగొచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రైతులకు పెట్టుబడి సహకారం, రుణ మాఫీ పథకాల అండతో రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చేస్తాయని అనుకోలేమని అన్నారు. ముడి చమురు ధరలు తగ్గిన ప్రభావం ఇప్పటికే స్టాక్ మార్కెట్‌పై పడినందున, మున్ముందు ధరలు మరింత దిగివచ్చినా కూడా షేర్లకు పెద్దగా కలిసిరాకపోవచ్చని అన్నారు.

బీడీఎల్‌కు భారత సైన్యం నుంచి రూ.760 కోట్ల కాంట్రాక్టు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) భారత సైన్యం నుంచి రూ.760 కోట్ల విలువైన క్షిపణి సరఫరా కాంట్రాక్టు దక్కించుకుంది. భారత సైన్యంతో ఈ కాంట్రాక్టు ఒప్పందంపై దిల్లీలో బీడీఎల్ డైరెక్టర్ (ప్రొడక్షన్) వి.గురుదత్త ప్రసాద్ సంతకం చేశారు. దీని ప్రకారం బీడీఎల్ యాంటీ- ట్యాంక్ గైడెడ్ మిస్సైల్స్, లాంచర్స్ భారత సైన్యానికి సరఫరా చేస్తుంది. రష్యా సాంకేతిక సహకారంతో హైదరాబాద్ సమీపంలోని భానూర్ బీడీఎల్ యూనిట్లో వీటిని తయారు చేస్తారు.

8న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	453	వరంగల్	455
చిల్లరగా(ఒక గుడ్డు)	5.15	విశాఖపట్నం	458
బెంగళూరు	455	చెన్నై	460
9వ తేదీకి...		చిత్తూరు	453
విజయవాడ/గోదావరి	453	నమక్కల్	445

ఎన్ఎస్ఈ

మంగళవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT &	378.75 (381.65) 2154121
ASIAN PAINTS	1401.25 (1396.00) 1232440
AXIS BANK LT	650.90 (637.45) 11879875
BAJAJ AUTO L	2694.85 (2658.55) 486654
BAJAJ FINANC	2537.05 (2553.60) 1233379
BAJAJ FINSER	6443.05 (6407.15) 111249
BHARTI AIRTE	329.25 (324.95) 6484522
BHARTI INFRA	297.95 (293.75) 4648636
BPCL	351.95 (355.55) 2171045
CIPLA	513.65 (514.05) 1765015
COAL INDIA L	233.30 (234.50) 4206563
DR. REDDYS	2570.50 (2558.65) 689498
EICHER MOTOR	20044.65 (19830.40) 366429
GAIL	354.60 (357.10) 2397084
GRASIM IND	836.60 (820.65) 1023730
HCL TECH	945.15 (941.55) 1515788
HDFC	1958.95 (1972.90) 2061919
HDFC BANK	2103.00 (2120.65) 2085865
HERO MOTOCOR	2970.30 (2957.95) 354130
HINDALCO IND	206.50 (208.55) 13402916
HINDUSTAN UN	1770.85 (1784.95) 1262707
HPCL	247.95 (249.80) 1994005
ICICI BANK	380.15 (367.70) 21501136
INDIABULLS H	812.55 (793.90) 6561538
INDIAN OIL	134.00 (133.45) 6870682
INDUSINDBANK	1577.75 (1559.15) 1479592
INFOSYS LTD	670.05 (671.70) 8621545
ITC	284.25 (281.65) 7480522
JSW STEEL LT	293.90 (289.85) 4528899
KOTAK MAHIND	1228.90 (1246.60) 1661528
LARSEN & TOU	1382.20 (1383.80) 1437271
M&M	723.40 (729.55) 4764487
MARUTI SUZIK	7439.50 (7362.05) 516841
NTPC LTD	146.95 (148.60) 5547244
ONGC	147.45 (147.85) 6163846
POWER GRID C	197.35 (198.45) 2244865
RELIANCE IND	1104.65 (1104.75) 5625153
SBI	305.30 (296.30) 22949961
SUN PHARMA	448.05 (430.80) 12368631
TATA CONSULT	1893.55 (1897.90) 1691756
TATA MOTORS	179.95 (175.35) 20128985
TATA STEEL L	491.35 (485.50) 6269706
TECH MAHINDR	689.85 (687.50) 1300906
TITAN IND	946.15 (944.05) 2039160
ULTRATECH	3916.30 (3926.75) 271012
UPL LIMITED	752.20 (763.75) 981440
VEDANTA LIMI	195.65 (193.45) 14295380
WIPRO	325.55 (324.25) 2084659
YES BANK LTD	192.35 (187.15) 40559174
ZEE ENTERTAI	451.65 (462.95) 4224183

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB	1299.40 (1301.80) 39949
ACC	1480.40 (1477.95) 312812
ADITYA BIRLA	97.35 (97.60) 1606253
AMBUJA CEMEN	218.70 (218.00) 1678459
ASHOK LEYLAN	93.05 (93.45) 30663741
AUROBIND PHA	746.55 (724.75) 4416254
AVENUE SUPER	1572.40 (1571.15) 270790
BANDHAN BANK	477.05 (498.05) 7365909
BANK OFBAROD	123.85 (122.70) 11438177
BEL	90.85 (91.40) 4701564
BHEL	71.35 (72.25) 7453809
BIOCON LTD	629.15 (620.65) 1470954
BOSCH LTD	19300.60 (19510.40) 6385
BRITANNIA	3089.55 (3143.80) 217274
CADILA HEALT	349.25 (348.90) 998829
COLGATE PALM	1310.75 (1303.00) 297256
CONTAINER	680.40 (681.15) 394126
DABUR INDIA	416.40 (420.45) 1412597
DLF LIMITED	181.50 (179.80) 4704040
GENERAL INS	264.30 (263.60) 30765
GODREJ CONSU	779.45 (800.55) 981603
HAVELLS INDI	669.70 (693.55) 1686230
HDFC STAND L	394.70 (393.05) 391569
HINDUSTAN ZI	274.30 (274.55) 227088
ICICI LOMBAR	864.20 (865.45) 162872
IDEA CELLULR	36.95 (36.65) 9699415
INTERGLOBE A	1110.30 (1113.75) 987270
L&TFIN.HOLD	148.30 (145.70) 3082948
LIC HOUS.FIN	480.90 (479.35) 1454000
LUPIN	841.70 (820.45) 1404676
MARICO LIMIT	381.85 (386.80) 2451013
MCDOWELL	600.30 (607.60) 1324469
MOTHERSON	158.25 (157.10) 2886186
MRF	66439.90 (66978.55) 2284
NHPC LTD	26.00 (25.95) 4473109
NMDC LTD	94.95 (94.95) 4769899
OIL INDIA	176.45 (174.60) 1095398
ORACLE FIN S	3581.60 (3596.20) 22956
P&G HYG&HEAL	9978.45 (9804.20) 8842
PETRONET LNG	220.05 (217.05) 2348310
PIDILITE IND	1102.90 (1102.60) 211092
PIRAMAL ENTE	2308.55 (2279.55) 495313
SAIL	54.35 (53.40) 8420840
SBI LIFE INS	612.50 (602.45) 214725
SHREE CEMENT	16753.85 (16921.70) 10883
SHRIRAM TRAN	1192.75 (1176.30) 760825
SIEMENS	1052.30 (1062.05) 234628
SUN TV LTD	599.85 (595.35) 854643
THE NEW INDI	178.75 (179.50) 32796

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN	7.07 (7.44) 180
AISHWARYA TE	2.82 (2.80) 2768
ALPHAGEO	473.60 (467.05) 1899
AMAR RAJA BA	738.55 (735.65) 15591
ANDHRA BANK	30.25 (29.75) 33533
ANDHRA CEMEN	5.90 (5.80) 105379
ANDHRA PAPER	453.80 (448.35) 8276
ANDHRA PETRO	72.15 (68.80) 265537
ANDHRA SUGAR	335.95 (333.55) 1906
ANJANI PORTL	131.90 (131.30) 2
ASTRA MICROW	80.35 (80.90) 6784
AUROBINDO PH	746.35 (723.60) 444349
AVANTEL SOFT	231.40 (230.30) 1635
AVANTI FEEDS	382.85 (382.85) 15213
AVON ORG	6.46 (6.80) 158
BALAJI AMIN	450.45 (448.50) 1224
BARTRONICS	7.48 (7.50) 2
BHAGIRA CHEM	425.05 (429) 3895
BHAGYA NAG	33.70 (34) 322
BN RATHI SEC	27.25 (25.75) 285
BRILLIANT SE	1.14 (1.20) 83548
CAMBRIDGE TE	47.70 (50.85) 16017
CONT COFFEE	271.85 (267.85) 350
COROMAN FERT	453.35 (462.90) 2288
CUBEX TUB	15.01 (15) 1782
CYBERMATE	2.19 (2.25) 16154
CYIENT LIMIT	605.55 (608.25) 5095
DIVI'S LAB	1458.70 (1483.70) 33398
DIVYA GRANIT	85 (85.05) 810
DR REDDY	2570.35 (2556.55) 30645
FOUR SOFT	41.90 (43.55) 9203
GATI CORPN	84.15 (84.65) 31408
GAYATRI PROJ	177.05 (177.80) 344
GMR INFRASTR	16.05 (15.85) 677453
GOLDST INFRA	238.45 (242.70) 10922
GOLDSTONE EN	16.45 (16.15) 537
GRANULES (I)	89.25 (88.65) 14424
GSS AMERICA	128.20 (128.80) 6391
GVK POWER	7.76 (7.77) 247703
HBL NIFE POW	27.95 (27.40) 6196
HERITAGE FOO	527.15 (527.90) 686
HIFCO MARWEL	68.55 (69.90) 1
HIL LTD	1996.30 (1995.75) 523
HIND FLUROCA	16.40 (16.30) 1081
IDL INDUSTRS	290 (297.75) 572
ILFS ENGINEE	14.75 (15) 4578
INCAP	39.05 (40) 315
IVRCL INFRAS	1.01 (1.01) 28402
JEEVAN SCIEN	37.70 (35.20) 2
KAKATIYA CEM	197.45 (197.15) 541
KALLAM SPG	18.45 (18.35) 17961
KAVERI SEED	537.90 (546.55) 75986
KCP LTD	90.45 (90.90) 5849
KNR CONSTRUC	215.60 (217.50) 2012
KREBS BIO	111.95 (111.45) 296
LANCO INDUS	181 (182.10) 1590
LAURUS LABS	374.75 (376.80) 748
LOKESH MACH	45.25 (45.50) 2293
MADHUCON PRO	6.92 (6.64) 3583
MEDINOVA DIA	17.15 (16.35) 1200
MEGA SOFT	7.15 (7.25) 5142
MIC ELECTRON	1.28 (1.34) 11211
MOLD-TEK.TEC	44.05 (44.05) 545
MOLDTK PLA	260.15 (260.60) 3446
MSR INDIA LT	12.40 (12.63) 1758
NAGARJAGRICH	28 (28) 14757
NAGARJAGRITE	5.06 (5.32) 100
NATCO PHARMA	693.65 (692.45) 6685
NAVA BH VENT	117.80 (117.90) 15102
NCC	88.85 (88.10) 543562
NCL IND	136 (135.05) 6895
NEHA INTER	4.31 (4.43) 18920
NETTLINX	51.80 (51.65) 45353
NEULAND LAB	482.40 (488.25) 590
NIHAR INFO	14.25 (15) 15
NILE	375 (376.45) 830
NORTHGATE TE	0.91 (0.95) 18477
OIL COUNTRY	15.85 (16.20) 1869
PANYAM CEMEN	13.62 (13.55) 648
PENNER IND	37.55 (37) 25116
PIONEER DIST	163.80 (165.70) 144
PITTI LAMIN	65.65 (66.85) 11254
POKARNA	157.55 (158.80) 404
PRAJAY ENGS	8.80 (8.85) 10549
PREMIER EXPL	240.95 (242.20) 628
PRISM CEMENT	86.90 (87.60) 26706
PRUDENTL PHA	3.66 (3.70) 17362
RAASI REFRAC	11.50 (11.25) 655
RAIN INDUSTR	119.60 (121.35) 137969
RAJ PACKAGIN	27.05 (28) 1072
RAM INFORMAT	40 (40.10) 732
REG.CERAMIC	3.72 (3.55) 1150
SAGAR CEM	665 (668.55) 62
SAMKRG PIST	189.70 (189.25) 2552
SATVAH. ISPA	9.98 (9.65) 100
SMS PHARMA	72.75 (71.70) 13450
SOUTH BIO TE	2.04 (2) 22272
SREE RAYAL A	34.25 (33.35) 44025
SRI KPR INDU	17.55 (17.55) 100
SRINIVASA SH	46 (46.90) 960
STARCHIK SP	22.55 (22.55) 275
STEEL EXCHAN	14.65 (14.80) 1614
SUJANA METAL	0.38 (0.39) 15631
SUJANA TOWER	1.10 (1.05) 100
SURANA TELE	4.70 (4.75) 3050
SURYALAKSH.C	42.05 (43) 5452
SURYALATA SP	127.25 (127.30) 1425
SUVEN PHARMA	229.50 (230.65) 23343
TAJ GVK HOTE	172.80 (174.60) 4027
TANLA	30.85 (30.65) 7413
TERA SOFTWAR	41.95 (40.85) 5102
TRANS BIOTEK	3.70 (3.55) 110171
TRENDY KNIT	0.19 (0.19) 77259
VBC FERRO	40.50 (41.65) 155
VICEROY HOTE	4.67 (4.87) 30052
VIJAY TEXTIL	44.20 (42.20) 1514
VIMTA LABS	291.45 (303.65) 1551
VISAKA IND	429.05 (431.75) 755
VISTA PHARMA	28.35 (28.90) 35545
VIVIMED LABS	34.55 (35.90) 54849
VJIL CONSULT	44.10 (46.20) 12271
VST INDUS	3152.05 (3231.40) 36
YBRANT DIGIT	2.69 (2.69) 135707
ZENOTECH LAB	35.70 (35.60) 2068
ZENTECH	74.90 (73.80) 8795

రిటైల్.. మొబైల్.. మీడియాల్లో.. ముకేశ్ హవా!

● మార్కెట్ విలువ రూ.21 లక్షల కోట్లకు ● 2027కు సాకారం: ఎలారా క్యాపిటల్

ముంబయి

రిటైల్, టెక్నాలజీ (మొబైల్), ప్రసార మాధ్యమాలు-వినోదం (మీడియా) రంగాల్లో ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) మరింత దూసుకెళ్లనుంది. ప్రస్తుతం రూ.7 లక్షల కోట్లకు పైగా మార్కెట్ విలువ కలిగిన రిలయన్స్ ఇండస్ట్రీస్, వచ్చే దశాబ్దంలో దేశంలోనే అగ్రగామి వినియోగదారు సంస్థగా అవతరించే అవకాశం ఉందని బ్రోకరేజీ సంస్థ ఎలారా క్యాపిటల్ తాజా నివేదికలో పేర్కొంది. 2027కు సంస్థ మార్కెట్ విలువ 300 బిలియన్ డాలర్లకు (రూ.21 లక్షల కోట్లకు పైగా) చేసే అవకాశం ఉందని తెలిపింది. అమెరికాకు చెందిన 'ఫాంగ్' (ఎఫ్ఏఏఎన్‌జీ) స్టాక్స్ సరసన ఆర్ఐఎల్ చేరొచ్చన్న అభిప్రాయాన్నీ వ్యక్తం చేసింది. అమెరికా స్టాక్ మార్కెట్‌లో అత్యంత ప్రముఖమైన, ఉత్తమ ప్రదర్శన కనబరుస్తున్న అయిదు సాంకేతిక దిగ్గజ సంస్థలైన ఫేస్‌బుక్ (ఎఫ్), యాపిల్ (ఏ), అమెజాన్ (ఏ), నెట్‌ఫ్లిక్స్ (ఎన్), గూగుల్ (జీ)లను ఫాంగ్ స్టాక్స్‌గా పిలుస్తుంటారు. ఇదే తరహాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశీయంగా అతిపెద్ద వినియోగదారు సంస్థగా అవతరిస్తుందన్న ఎలారా క్యాపిటల్ నివేదికలో ఇంకా ఏముందంటే..

✦ ఆర్ఐఎల్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ దూరదృష్టి, తెలివితేటల్ని ప్రశంసించి తీరాల్సిందే. ఆయన సారథ్యంలో సంస్థ మరెన్నో ఉన్నత శిఖరాలకు చేరడం ఖాయం. దీన్ని విస్మరిస్తే మదుపరులు లాభాలు కోల్పోయే అవకాశం ఉందని ఎలారా క్యాపిటల్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) హరేంద్ర కుమార్ తమ ఖాతాదారులకు రాసిన నోట్‌లో పేర్కొన్నారు.

✦ రిలయన్స్ రిటైల్, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్, మీడియా కంపెనీల సాయంతో ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్, వినియోగదార్ల పరంగా అగ్రగామి ఎఫ్ఎంసీజీ కంపెనీ హిందుస్థాన్ యునిలీవర్ (హెచ్‌యూఎల్)ను అధిగమించడానికి ఎంతో కాలం పట్టదు. ప్రస్తుతం అతి పెద్ద ఎంఎఫ్‌సీజీ సంస్థగా కొనసాగుతున్న హెచ్‌యూఎల్‌కు 70 కోట్ల మంది వినియోగదారులున్నారు.

✦ ఆర్ఐఎల్ వద్ద కొన్ని మంచి బ్రాండ్లు ఉన్నాయి. ప్రతి ఇద్దరు భారతీయుల్లో ఒకరు వీటిని కొనేందుకు ప్రస్తుతం ఆసక్తి చూపిస్తున్నారు.

✦ ఆర్ఐఎల్ తమ సంప్రదాయ చమురు ఉత్పత్తి, శుద్ధి వ్యాపారంపై ప్రస్తుతం ఎక్కువగా లాభాలు ఆర్జిస్తోంది. రిటైల్, టెలికాం వ్యాపారాలు ఇంకా ఊపందుకోవాల్సి ఉంది. వచ్చే అయిదేళ్లలో ఇవి గణనీయంగా వృద్ధి చెంది ఆర్ఐఎల్ స్టాక్ 24 శాతం వరకు ప్రతిఫలం అందించే అవకాశం ఉంది.

✦ వినియోగదారు కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం బాగా పెరిగితే, కమొడిటీ మార్కెట్ నుంచి వీటిని విడదీసే అవకాశం కూడా కనిపిస్తోంది.

✦ ఆర్ఐఎల్ నిర్వహిస్తున్న వినియోగదారు వ్యాపారం నుంచి రూ.లక్ష కోట్ల నిర్వహణ లాభం ఆర్జించాలనేది ముకేశ్ అంబానీ లక్ష్యం. దీన్ని వచ్చే దశాబ్దంలో (2027 నాటికి) చేరుకోగలరని అనిపిస్తోంది. ప్రస్తుతం అలీబాబా ఆర్జిస్తున్న లాభానికి ఇది దగ్గరగా ఉంది.

✦ ముకేశ్ ఆశించినట్లు జరిగితే ఆర్ఐఎల్ మార్కెట్ విలువ ప్రస్తుత స్థాయి 100 బిలియన్ డాలర్ల నుంచి మూడు రెట్లకు (300 బి.డాలర్లు- రూ.21 లక్షల కోట్లు) పెరిగే అవకాశం కనిపిస్తోంది.

✦ బీఎస్ఈలో మంగళవారం ఆర్ఐఎల్ షేరు 0.05 శాతం లాభంతో రూ.1103.95 వద్ద ముగిసింది.



డిజిటల్ చెల్లింపులపై నందన్ నీలేకని కమిటీ

అయిదుగురు సభ్యులతో నియమించిన ఆర్‌బీఐ



ముంబయి: దేశంలో డిజిటల్ చెల్లింపుల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు ఆధార్ రూపకర్త నందన్ నీలేకని ఆధ్వర్యంలో అత్యున్నత స్థాయి అయిదుగురు సభ్యుల కమిటీని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నియమించింది. ఈ కమిటీలో ఆర్‌బీఐ మాజీ డిప్యూటీ గవర్నర్ హెచ్ ఆర్ ఖాన్, విజయా బ్యాంక్ మాజీ ఎండీ, సీఈఓ కిశోర్ సాన్సి, ఐటీ-ఉక్కు మంత్రిత్వ శాఖల మాజీ కార్యదర్శి అరుణా శర్మ, ఐఐఎమ్ అహ్మదాబాద్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ సంజయ్ జైన్‌లున్నారు. ఈ కమిటీ తొలి సమావేశం జరిగిన 90 రోజుల్లో నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో లోటుపాట్లను గుర్తించి, వాటిని పూడ్చడానికి సలహాలు ఇవ్వాలని ఆర్‌బీఐ కోరింది. చెల్లింపుల భద్రతను బలోపేతం చేసే చర్యలు సూచించడంతో పాటు వినియోగదార్లకు విశ్వాసం పెరిగేందుకు మార్గసూచీ రూపొందించాల్సి ఉంటుంది.

అర్జాస్ స్టీల్‌గా మారిన జెర్డావ్ స్టీల్ ఇండియా

ఈనాడు, హైదరాబాద్: జెర్డావ్ స్టీల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యంతో పాటు ఈ సంస్థ పేరు కూడా మారింది. జెర్డావ్ స్టీల్ ఇండియాకు ఆంధ్రప్రదేశ్‌లోని తాడిపత్రిలో ఏటా 3 లక్షల టన్నుల స్టీలు తయారు చేసే ప్లాంటు ఉంది. వాహన పరిశ్రమ, సైన్యం, రైల్వేల అవసరాలకు అనువైన స్పెషాలిటీ స్టీలు ఈ ప్లాంటులో తయారు చేస్తారు. జెర్డావ్ స్టీల్ ఇండియా, స్పెయిన్‌లోని జెర్డావ్ హంగ్రియా కేఎఫ్‌టీ అనే సంస్థకు అనుబంధ సంస్థ. ఈ స్పెయిన్ సంస్థ అసలు యజమాని బ్రెజిల్‌లోని జెర్డావ్ ఎస్ఏ., అనే సంస్థ. ఈ మాతృ సంస్థ గత ఏడాది అక్టోబరులో స్పెయిన్ సబ్సిడరీని, దాని భారతీయ అనుబంధ సంస్థను హాంకాంగ్, సింగపూర్, షాంఘై, ముంబయి నగరాల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న ఏడీవీ పార్ట్‌నర్స్ సారథ్యంలోని రెండు పీఈ (ప్రైవేట్ ఈక్విటీ) ఫండ్స్‌కు విక్రయించింది. దీంతో యాజమాన్యం మారిపోయింది. తత్ఫలితంగా ఇప్పుడు సంస్థ పేరును అర్జాస్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ అని మార్చారు. కొత్త యాజమాన్యం సారథ్యంలో కంపెనీ మరింత ప్రగతి సాధిస్తుందని ఆశిస్తున్నట్లు అర్జాస్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శ్రీధర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సంస్థలో 1600 మంది సిబ్బంది పనిచేస్తున్నారని, అనంతపురం పరిసరాల్లో విస్తరిస్తున్న వాహన పరిశ్రమకు అనువైన సరికొత్త స్టీలు ఉత్పత్తులపై దృష్టి సారించినట్లు వివరించారు.

సరకు రవాణా సేవల్లోకి ట్రూజెట్

సరకు రవాణా (ఎయిర్‌కార్గో) సేవలను విస్తరించేందుకు ప్రైవేట్ విమానయాన సంస్థ ట్రూజెట్ సన్నాహాలు చేస్తోంది. హైదరాబాద్‌కు చెందిన ట్రూజెట్ తొలుత ప్రాంతీయ విమానయాన సంస్థ సేవలు ప్రారంభించినా, దేశవ్యాప్తంగా సేవలు విస్తరించేందుకు కావాల్సిన నేషనల్ పర్మిట్‌ను గత అక్టోబరులో పొందింది. ఇదే క్రమంలో కార్గో సేవలకూ అనుమతులు సాధించి గత 2 రెండు నెలలుగా ప్రయోగాత్మకంగా సేవలందిస్తోంది. ఇక ఇప్పుడు విస్తరణపై దృష్టి పెట్టింది. రోడ్డు మార్గంలో దూర ప్రాంతాలకు రవాణా చేసేందుకు అధిక సమయం పడుతోంది కనుక ఔషధాలు, యంత్ర విడిభాగాల వంటి వాటి రవాణాకు గిరాకీ లభిస్తోందని సంస్థ చెబుతోంది.

ట్రూజెట్ సంస్థ ప్రస్తుతం 5 విమానాల ద్వారా రోజూ 32 సర్వీసులు నిర్వహిస్తోంది. కొత్తగా నాసిక్, అహ్మదాబాద్, పోర్‌బందర్, జైసల్మేర్, కాండ్లాలకు సర్వీసులు ప్రారంభించనుంది. దీంతో రోజువారీ సర్వీసుల సంఖ్య 50కి పెరుగుతుంది. కార్గో విషయానికి వస్తే... ఇప్పటికే అయిదు నగరాల నుంచి ఔషధాలు, యంత్ర విడి భాగాలు రవాణా చేస్తున్నారు. ప్రయాణికుల విమానాల్లోనే సరకుకు ప్రత్యేకంగా కేటాయించిన స్థలం ఉంటుంది. ఇందులోనే సరకు తీసుకెళ్తారు. ఈ సేవలను తమ సర్వీసులు నడుస్తున్న అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నందున ముమ్ముందు ఎక్కువ సరకు రవాణా చేయగలుగుతామని ట్రూజెట్ యాజమాన్య సంస్థ అయిన ఎంఈఐఎల్ డైరెక్టర్ కె.వి.ప్రదీప్ తెలిపారు.

కొత్తగా మరో 4 విమానాలు

త్వరలో 4 కొత్త విమానాలు సమకూర్చుకునేందుకు ట్రూజెట్ సన్నద్ధం అవుతోంది. ఒక విమానంతో రోజూ 10 వరకు సర్వీసులు నిర్వహించవచ్చు. కొత్త విమానాలు వస్తే రోజుకు 30-40 సర్వీసులు పెంచుకునే అవకాశం వస్తుంది. ప్రస్తుతం ఇంధన ధరలు తక్కువగా ఉన్నాయి. అందువల్ల త్వరగా కొత్త విమానాలు తెప్పించుకొని సర్వీసులు పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం సీట్ల భర్తీ 79 శాతం ఉన్నట్లు సంబంధిత వర్గాలు వివరించాయి. ఉదయాన్నే వెళ్లి, రాత్రి మళ్లీ తిరిగి వచ్చే వ్యాపారస్తులు, ఉన్నతోద్యోగులు, అత్యవసరంగా వెళ్లి వచ్చేవారికి అనుకూలంగా విమాన వేళలు ఉండాలి. స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రాంతీయ సేవల్లో ఇలా నిర్ణయించగలుగుతున్నారు. సరైన వేళలు నిర్ణయించినందున కడప సర్వీసు బాగా నడుస్తోందని, ఈ విమానాల్లో లోడ్‌ఫ్యాక్టర్ 70-79 శాతంగా ఉంటోందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఇదే తరహాలో పర్యాటక-ఆధ్యాత్మిక ప్రాంతాలకు సర్వీసులు నిర్వహించాలనేది ట్రూజెట్ ప్రణాళిక. ఈ ఆలోచనతో ఏపీ, తెలంగాణ పర్యాటక శాఖలతో ఒప్పందం చేసుకుంది. దీనికి అనుగుణంగా తిరుమలకు వెళ్లి వచ్చేందుకు ప్యాకేజీ రూపొందించింది. గోవా ప్యాకేజీ ప్రకటించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. విద్యార్థులు, సీనియర్ సిటిజన్లను కూడా ఆకర్షించేందుకు 10 శాతం వరకు రాయితీని సంస్థ అందిస్తోంది.

'ప్రైవేటు' సేవలకు గిరాకీ!

ఇటీవల కాలంలో గేటెడ్ కమ్యూనిటీల్లో ఉండే వారు, కార్పొరేట్ సంస్థల ఉద్యోగులు బృందాలుగా ఏర్పడి ప్రైవేటుగా ఛార్టర్డ్ విమానాన్ని బుక్ చేసుకొని విహార యాత్రలకు వెళ్లటం పెరుగుతోంది. ఈ విభాగం నుంచీ ట్రూజెట్‌కు వ్యాపారం లభిస్తోంది. హైదరాబాద్ నుంచి ఎన్నో దూరప్రాంతాలకు ఇటీవల కాలంలో ప్రైవేటు జెట్ సేవలు అధికంగా నిర్వహిస్తున్నట్లు సమాచారం. తమకు గత నెలలో మహారాష్ట్ర నుంచి ఆరు, హైదరాబాద్ నుంచి రెండు ప్రైవేటు జెట్ బుకింగ్‌లు వచ్చినట్లు ట్రూజెట్ వర్గాలు తెలిపాయి. వృత్తి పనుల్లో తీరిక లేకుండా ఉండే వైద్యులు రెండు మూడు రోజుల సెలవు దొరికితే విహారయాత్ర పెట్టుకొని ఛార్టర్డ్ విమానాలను ఆశ్రయిస్తున్నారు. వివాహాలకు వీఐపీలను తీసుకెళ్లేందుకు సైతం ఇటీవల పలువురు ఈ విధానాన్ని ఆశ్రయిస్తున్నారు.

– ఈనాడు, హైదరాబాద్



ఈనాడు బిజినెస్

హైదరాబాద్‌లో ఇండియాసాఫ్ట్ ప్రదర్శన

ఫిబ్రవరి 4- 5 తేదీల్లో

ఈనాడు, హైదరాబాద్: ఈ ఆర్థిక సంవత్సరంలో ఐటీ, ఐటీ ఆధారిత ఉత్పత్తుల ఎగుమతుల్లో 8-10 శాతం వృద్ధి లభించవచ్చని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఈఎస్‌సీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.కె.సారీన్ తెలిపారు. గత మూడేళ్లుగా హార్డ్‌వేర్, ఎలక్ట్రానిక్ పరికరాల ఎగుమతులు ఆకర్షణీయంగా లేవని,. ముమ్ముందు ఈ రంగంలో 7-8 శాతం వృద్ధి ఉండొచ్చని తెలిపారు. చిన్న, మధ్య తరహా ఐటీ కంపెనీలను ప్రోత్సహించే లక్ష్యంతో ఫిబ్రవరి 4, 5 తేదీల్లో హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించనున్న 19వ ఇండియాసాఫ్ట్ 2019 ప్రదర్శన వివరాలను ఆయన వెల్లడించారు. మన దేశం నుంచి సాఫ్ట్‌వేర్, ఐటీ ఆధారిత సేవల ఎగుమతుల్లో 90శాతం అమెరికా, ఐరోపా దేశాలకే ఉన్నాయనీ, అక్కడి పోటీని చిన్న సంస్థలు తట్టుకోలేకపోతున్నాయని వివరించారు. ప్రత్యామ్నాయంగా ఆఫ్రికా, మధ్యతూర్పు దేశాలపై చిన్న సంస్థలు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశీయంగా ఉన్న చిన్న, మధ్య తరహా సంస్థలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఇండియాసాఫ్ట్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఇండియాసాఫ్ట్ నిర్వహణ కమిటీ ఛైర్మన్ నళిన్ కోహ్లి మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనకు దాదాపు 60 దేశాల నుంచి, 500లకు పైగా ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఈ ప్రదర్శన పాల్గొనే అంకుర సంస్థలకు ప్రభుత్వం సగం మేర అద్దె రాయితీగా ఇస్తుందని, మహిళా సంస్థలకు పూర్తి ఉచితమని తెలిపారు. సెక్యూరిటీ, ఫైనాన్స్, బ్యాంకింగ్, బీమా, విద్య, శిక్షణ, ఎంబీడెడ్ సాఫ్ట్‌వేర్, యానిమేషన్ సంస్థలు పాల్గొంటాయని వివరించారు.

తెలుగు రాష్ట్రాల్లో డాక్‌ప్రైమ్ సేవలు

ఈనాడు, హైదరాబాద్: ఆన్‌లైన్‌లో వైద్యుల సేవలను పొందడంతో పాటు, వారి అపాయింట్‌మెంట్ తీసుకోవడం, రోగ నిర్ధారణ కేంద్రాల్లో చేయించుకునే వైద్య పరీక్షలకు రాయితీలు ఇవ్వడం లాంటి సేవలతో డాక్‌ప్రైమ్ డాట్‌కాం అందుబాటులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో సహా దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో ఈ సేవలను ప్రారంభించినట్లు సంస్థ తెలిపింది. బీమా రంగంలో సేవలు అందిస్తున్న పాలసీబజార్ డాట్‌కాం ఆధ్వర్యంలో వచ్చిన డాక్‌ప్రైమ్‌లో దేశవ్యాప్తంగా 20,000 మంది వైద్యులు, 5వేల డయాగ్నస్టిక్ ల్యాబ్ సేవల వివరాలుంటాయి. విస్తరణలో భాగంగా 2019 చివరికల్లా 100 పట్టణాల్లోని.. లక్ష మంది వైద్యులు, 20వేల రోగనిర్ధారణ కేంద్రాలతో ఒప్పందం కుదుర్చుకోబోతున్నట్లు సీఈఓ ఆశిష్ గుప్తా వెల్లడించారు.

ఇన్ఫీ నుంచి మరో బైబ్యాక్!

● ప్రత్యేక డివిడెండు చెల్లింపు కూడా ● 11న జరిగే బోర్డు సమావేశంలో నిర్ణయం

దిల్లీ/ బెంగళూరు

ఇన్ఫోసిస్ మరోమారు షేర్ల బైబ్యాక్‌కు శ్రీకారం చుట్టబోతోంది. 2017 డిసెంబరులో రూ.13,000 కోట్ల విలువైన షేర్లను ఇన్ఫీ తిరిగి కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా మరోమారు బైబ్యాక్‌పై ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అంతే కాదు ప్రత్యేక డివిడెండు కూడా ప్రకటిస్తుందని అంటున్నారు. మూలధన కేటాయింపు విధానం అమల్లో భాగంగా షేర్ల బైబ్యాక్, ప్రత్యేక డివిడెండుతో పాటు మరికొన్ని ఇతర ప్రతిపాదనలపై ఈనెల 11న (శుక్రవారం) జరిగే సమావేశంలో డైరెక్టర్ల బోర్డు చర్చిస్తుందని ఇన్ఫోసిస్ వెల్లడించింది. ఇదే రోజున అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి ఆర్థిక ఫలితాలను కూడా ఈ ఐటీ దిగ్గజం వెల్లడించనుంది. సమావేశానంతరం బోర్డు తీసుకునే నిర్ణయాలను వెల్లడిస్తామని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇన్ఫోసిస్ తెలిపింది. కాగా.. వాటాదార్లకు ప్రతిఫలం రూపంలో చెల్లించేందుకు రూ.13,000 కోట్లను గతేడాది ఏప్రిల్‌లో ఇన్ఫోసిస్ బోర్డు గుర్తించింది. ఇందులో నుంచి ప్రత్యేక డివిడెండు రూపేణ ఒక్క షేరుకు రూ.10 చొప్పున మొత్తంగా రూ.2,600 కోట్లను 2018 జూన్‌లో చెల్లించింది. అలాగే 2018-19 ఆర్థిక సంవత్సరంలో వాటాదార్లకు చెల్లించేందుకు రూ.10,400 కోట్లను బోర్డు గుర్తించింది. బోర్డు నిర్ణయానికి అనుగుణంగా ఈ చెల్లింపులు చేయనున్నట్లు 2018 ఏప్రిల్‌లో ఎక్స్ఛేంజీలకు కంపెనీ తెలియజేసింది.



మరో ఉన్నతాధికారి గుడ్‌బై

ఇన్ఫోసిస్ నుంచి మరో ఉన్నత స్థాయి అధికారి వైదొలిగారు. కంపెనీలో ఇంధనం, యుటిలిటీస్, వనరులు, సేవల విభాగానికి గ్లోబల్ హెడ్‌గా ఉన్న సుదీప్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. ఇన్ఫీలో దాదాపు రెండు దశాబ్దాల పాటు ఆయన పనిచేశారు. అయితే సుదీప్ రాజీనామాపై స్పందించేందుకు కంపెనీ నిరాకరించింది. సుదీప్ నేతృత్వం వహిస్తున్న ఇంధనం, యుటిలిటీస్ విభాగం పోర్ట్‌ఫోలియో దాదాపు 1.5 బిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. గతేడాది అక్టోబరులో ఇన్ఫోసిస్ కన్సల్టింగ్ గ్లోబల్ హెడ్ కెన్ టూంబ్స్ కూడా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈయన కంటే ముందు కంపెనీలో అత్యంత ప్రాధాన్యమున్న అధికారుల్లో ఒకరైన ఎం.డి.రఘునాథ్ తన సీఎఫ్ఓ పదవికి రాజీనామా చేశారు.

సెలెక్ట్ మొబైల్స్ సిసేఫ్

నెల నుంచి ఏడాది వరకు అదనపు వారెంటీ సేవలు



సి-సేఫ్ కార్డులను విడుదల చేస్తున్న సెలెక్ట్ మొబైల్స్ సీఎండీ వై.గురు

ఈనాడు, హైదరాబాద్: విక్రయశాలలో అయినా, ఆన్‌లైన్‌లో అయినా స్మార్ట్‌ఫోన్ కొన్నాక, పొరపాటున చేజారి తెర (స్క్రీన్) పగిలితే సంబంధిత కంపెనీ సేవా కేంద్రానికి వెళ్లాల్సిందే. వీటిని వెతుక్కుంటూ వెళ్లడం, అధికమొత్తాలు వెచ్చించడం వినియోగదార్లకు కష్టమవుతోంది. కొన్ని స్మార్ట్‌ఫోన్లకు మాత్రం శామ్‌సంగ్ వంటి కంపెనీలు వారంటీలోపు తెర మార్చి ఇచ్చే సౌలభ్యం కల్పిస్తున్నాయి. ఈ ఇబ్బందులు నివారిస్తూ, తమ విక్రయశాలల్లో కొనుగోలు చేసిన స్మార్ట్‌ఫోన్లకు కాస్త అదనంగా చెల్లిస్తే, కొత్త తెర అమర్చి పెడతామని సెలెక్ట్ మొబైల్స్ తెలిపింది. 'సి-సేఫ్' పేరుతో ఈ సేవలను తీసుకొచ్చినట్లు సెలెక్ట్ మొబైల్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై.గురు మంగళవారం ఇక్కడ చెప్పారు. రూ.199 అదనంగా చెల్లిస్తే, మొబైల్ కొన్న 30 రోజుల వరకు ఈ రక్షణ లభిస్తుందని తెలిపారు. 6 నెలలకు అయితే ఫోన్ ధరలో 3-7 శాతం, ఏడాది అదనపు వారెంటీకి అయితే ఫోన్ ధరలో 2-4% తీసుకుని ఈ సేవలు అందిస్తామన్నారు.

ఎక్కడ కొనుగోలు చేసిన పాత ఫోన్ అయినా కొత్త ఫోన్లతో మార్పిడి చేసుకోవచ్చన్నారు. సి-సేఫ్ యాప్‌లో వివరాలు నమోదు చేస్తే, ఇంటి వద్దకే వచ్చి మొబైల్ తీసుకెళ్లి, మరమ్మతు చేసి ఇస్తామని చెప్పారు. సీసేఫ్ పథకంలో ఉండి, తెర పగిలినప్పుడు, మొబైల్‌ను వాపసు ఇచ్చేస్తే, 50 శాతం మొత్తాన్ని అతని సిసేఫ్‌లో జమచేస్తామని, తమ విక్రయశాలలోనే ఆ మొత్తంతో ఏమైనా కొనుగోలు చేసుకోవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలలో ఉన్న దాదాపు 50 సెలెక్ట్ మొబైల్స్ కేంద్రాల్లో ఈ సేవ అందుబాటులో ఉంటుందన్నారు.

స్థిరాస్తి మార్కెట్ దూకుడు

● కార్యాలయ లీజులో 2018 కొత్త రికార్డు ● హైదరాబాద్ మార్కెట్లో గణనీయ వృద్ధి

ఈనాడు – హైదరాబాద్

స్థిరాస్తి మార్కెట్ 2018లో పలు సరికొత్త రికార్డులు నమోదు చేసింది. దేశవ్యాప్తంగా వాణిజ్య, కార్యాలయ లీజులో 4.69 కోట్ల చదరపు అడుగులతో సరికొత్త చరిత్ర సృష్టించింది. రాష్ట్ర విభజన తర్వాత గృహ, వాణిజ్య విపణి హైదరాబాద్‌లో గరిష్ఠ స్థాయిలను తాకింది. జులై-డిసెంబరు 2018 స్థిరాస్తి నివేదికను నైట్‌ఫ్రాంక్ ఇండియా మంగళవారం హైదరాబాద్‌లో వెల్లడించింది. 8 నగరాల్లో గృహ, 7 నగరాల్లో కార్యాలయ, వాణిజ్య విపణుల వివరాలను సంఘటిత సంస్థల నుంచి సేకరించి, ఈ నివేదికలో పొందుపరిచింది. ఆ సంస్థ హైదరాబాద్ శాఖ డైరెక్టర్ శాంసన్ నివేదికలోని అంశాలతో పాటు, పూర్తి ఏడాదిలో స్థిరాస్తి విపణి ఎలా నడిచిందో విశ్లేషించారు.

✦ జాతీయ స్థాయిలో నివాస గృహాల మార్కెట్లో వృద్ధి కనిపించినా.. వేగం తగ్గింది. 2,42,328 ఇళ్లు అమ్ముడయ్యాయి. 2017 కంటే 6 శాతం అధికం.

✦ వాణిజ్య కార్యాలయ విపణిలో సరఫరా (19%), లీజింగ్ (24%) రెండూ అధిక స్థాయిల్లో జరిగాయి.

హైదరాబాద్ విపణి


దేశంలోని ఇతర విపణులతో పోలిస్తే 2018లో అమ్మకాలు, కొత్త ప్రాజెక్ట్‌ల రాక, ధరల పెరుగుదల హైదరాబాద్‌లో ఎక్కువగా ఉంది.

✦ ద్రవ్యోల్బణాన్ని మించి 7 శాతానికి పైగా ధరలు పెరిగింది ఒక్క హైదరాబాద్‌లోనే. మిగతా చోట్ల ధరల్లో పెద్దగా పెరుగుదల లేకపోగా.. కొన్నిచోట్ల తగ్గాయి.

✦ 2018లో 15,591 ఇళ్లు విక్రయమయ్యాయి. ఏడాది క్రితంతో పోలిస్తే 9 శాతం అధికం. ద్వితీయార్థంలో చూస్తే 7,228 యూనిట్లతో, విక్రయాల వృద్ధి 15 శాతంగా నమోదైంది.

✦ కొత్త ప్రాజెక్ట్‌ల్లో 54 శాతం పెరుగుదల నమోదైంది. అధిక వాటా పశ్చిమ హైదరాబాద్ (84%)లోనే.

✦ కొత్త ప్రాజెక్ట్‌ల్లో రూ.50 లక్షల ధరల లోపు 43 శాతం ఉన్నాయి. అత్యధిక కొత్త ప్రాజెక్ట్‌లు రూ.50-రూ.75 లక్షల శ్రేణిలో రావడం పెరిగిన ధరలను సూచిస్తోంది.



ముంబయి, దిల్లీలతో పోటీ: 2018 ద్వితీయార్థంలోనే వాణిజ్య మార్కెట్ లీజింగ్ 43 లక్షల చదరపు అడుగులు నమోదైంది. ఐటీ, ఐటీ ఆధారిత సంస్థలే కాకుండా కోవర్కింగ్ కార్యాలయాల రాకతో డిమాండ్ పెరిగింది.

✦ వార్షిక లీజుల లావాదేవీలు 70 లక్షలకు చేరడం.. గత ఏడేళ్లలో ఇదే అత్యధికం. ఏకంగా 24 శాతం పెరుగుదల నమోదైంది. ముంబయి, దిల్లీ రాజధాని ప్రాంతంలోని వాణిజ్య మార్కెట్లతో హైదరాబాద్ పోటీపడటం విశేషం.

✦ వాణిజ్య, కార్యాలయ మార్కెట్ పెరగడం అంటే రాబోయే రోజుల్లో గృహ నిర్మాణ మార్కెట్‌కు మరింత డిమాండ్ ఉండనుంది. కొనుగోలుదారులు జాప్యం చేయకుండా నిర్ణయం తీసుకోవడం మేలని నివేదిక సూచించింది.



కపిల్‌దేవ్‌ను సన్మానిస్తున్న వైకాపా నాయకులు

దక్షిణభారత్ అంటే చాలా ఇష్టం

క్రికెట్ దిగ్గజం కపిల్‌దేవ్

ఈనాడు, విశాఖపట్నం: 'నాకు విశాఖ అన్నా.. దక్షిణ భారతదేశం అన్నా చాలా ఇష్టం. నేను క్రికెట్లోకి వచ్చిన కొత్తలో నువ్వు దక్షిణ భారతదేశం నుంచి వచ్చావా? అని చాలామంది అడిగేవారు. వారలా ఎందుకంటున్నారో తెలిసేది కాదు. నాకు కనీసం ఇక్కడి భాషలు కూడా వచ్చేవి కావు. కానీ క్రికెట్టే ఎందరో అభిమానులను సంపాదించిపెట్టింది' అని వెటరన్ క్రికెటర్, భారత జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ అన్నారు. మంగళవారం ఆయన విశాఖ వచ్చారు. స్థానిక వైకాపా నాయకులు 500కుపైగా జట్లతో నెలరోజులకుపైగా నిర్వహించిన టీ-10 క్రికెట్‌టోర్నీలో విజేతలకు గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కపిల్ మాట్లాడుతూ.. తాజాగా ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్‌ను ఆ దేశ గడ్డపై భారత్ గెలిచినందుకు సంతోషం వ్యక్తం చేశారు. జట్టుకు అభినందనలు తెలిపారు. కపిల్ 60వ జన్మదినోత్సవాన్ని (ఆయన పుట్టిన తేదీ జనవరి 6) వైకాపా నాయకులు ఘనంగా జరిపారు. తలపాగా, గజమాలతో సత్కరించి కేక్ కట్ చేయించారు. టీ-10 టోర్నమెంట్‌ను నిర్వహించిన వైకాపా విశాఖ పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణను కపిల్ అభినందించారు.

జలవనరుల కార్పొరేషన్‌కు మరో 2 ప్రాజెక్టులు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ జలవనరుల కార్పొరేషన్‌కు మరో 2 సాగునీటి ప్రాజెక్టులు బదలాయిస్తూ ఆ శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటికే 10 సాగునీటి ప్రాజెక్టులను గతంలో ఈ కార్పొరేషన్‌కు బదలాయించారు. ఇప్పుడు కొత్తగా గోదావరి పెన్నా అనుసంధానం తొలి దశ ప్రాజెక్టు, కొండవీటి వాగు ఎత్తిపోతల ప్రాజెక్టులను బదలాయించారు. ఈ ప్రాజెక్టుల ఆస్తులు, అప్పులు ఆ కార్పొరేషన్‌కు చెందనున్నాయి. రూ.6020 కోట్ల అంచనా వ్యయంతో గోదావరి పెన్నా తొలిదశ పనులు చేపడుతున్నారు. రూ.237 కోట్ల అంచనా వ్యయంతో కొండవీటి వాగు ఎత్తిపోతల పనులను ఇందులో జత చేశారు. మొత్తం ఇంతవరకు రూ.149.73 కోట్ల వరకు దీనిపై ఖర్చు చేశారు. ఈ రెండు ప్రాజెక్టుల అప్పులు, ఆస్తులు జలవనరుల కార్పొరేషన్‌కు బదలాయించారు.

ఆకాశవాణి జాతీయ ఛానల్ మూసివేత తగదు

ఈనాడు, హైదరాబాద్: ఆకాశవాణి జాతీయ ఛానెల్, ప్రాంతీయ శిక్షణ కేంద్రాల మూసివేత తగదని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్), నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్(ఎన్ఏజే) అభిప్రాయపడ్డాయి. ఖర్చులు తగ్గించుకునే పేరుతో మూడు దశాబ్దాలుగా నడుస్తున్న ఆకాశవాణి జాతీయ ఛానెల్‌ను, హైదరాబాద్, అహ్మదాబాద్, లఖ్‌నవూ, షిల్లాంగ్, తిరువనంతపురంలలోని ప్రాంతీయ శిక్షణ కేంద్రాలను మూసివేయడం వల్ల వచ్చే మేలు కంటే కీడే ఎక్కువని ఫెడరేషన్ పేర్కొంది. ఈ మేరకు కార్యదర్శి ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, ఎన్ఏజే సెక్రటరీ జనరల్ ఎం.కోటేశ్వరరావు సంయుక్తంగా ప్రకటన విడదల చేశారు.

అభయంతో నిర్భయం

మహిళల భద్రతకు కొత్త ప్రాజెక్టు రూపకల్పన	ఆటోలు, క్యాబ్‌ల్లో తిరిగే వారికి శ్రీరామరక్ష	తొలి దశలో విజయవాడ, విశాఖ నగరాల్లో అమలు	లక్ష ఆటోల్లో ఐవోటీ పరికరాల పెట్టెల అమరిక	ఈ నెల 10 నుంచి అందుబాటులోకి భద్రత వ్యవస్థ	భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి

ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళలు, బాలికలు తిరిగి వచ్చే వరకూ కుటుంబసభ్యులు ఆందోళన చెందే పరిస్థితి ఉంది. ఏ క్షణంలో ఏం జరగకూడనిది జరుగుతుందోనన్న బెంగ తొలుస్తూనే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో అతివల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ 'అభయ' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ప్రయాణికుల రవాణా వాహనాల్లో మహిళలు, బాలికలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర రవాణాశాఖ ఆధ్వర్యంలో దీనిని చేపడుతోంది. తొలి దశలో విజయవాడ, విశాఖపట్నం నగరాల్లోని లక్ష ఆటోల్లో ఈ సదుపాయం కల్పించనుంది. దశలవారీగా రాష్ట్రంలోని మిగతా అన్ని ప్రాంతాలకూ విస్తరించనుంది. ఈ నెల 10 నుంచి ఈ నూతన భద్రత వ్యవస్థ అందుబాటులోకి రానుంది.



ఏపీలోని మొత్తం ప్రయాణికుల వాహనాలు: 5.49 లక్షలు
ఇతర ప్రయాణికుల వాహనాలు: 1.20 లక్షలు
ఆటో రిక్షాలు: 4.29 లక్షలు
తొలి దశలో: లక్ష వాహనాల్లో ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు.







దిల్లీలో నిర్భయ ఘటన నేపథ్యంలో ప్రయాణికుల రవాణా వాహనాల్లో మహిళల భద్రత కోసం తీసుకొచ్చిన కొత్త వ్యవస్థే 'అభయ'. ప్రయాణ సమయంలో డ్రైవర్ వాహనాన్ని దారి మళ్లించినా, అసభ్యంగా ప్రవర్తించినా, ఇబ్బందికి గురిచేసినా, ఇతరత్రా ఎలాంటి సమస్యలకు లోను చేసినా మహిళలు తమ సెల్‌ఫోన్‌లోని ఓ మీట నొక్కితే వారు ఆపదలో ఉన్నారనే సమాచారం పోలీసు కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. పోలీసులు అప్రమత్తమై రక్షణ చర్యలు చేపడతారు.

లైసెన్సును స్వైప్ చేస్తేనే వాహనం కదిలేది

ఈ వాహనాలన్నింటిలోనూ ఐవోటీ పరికరాల పెట్టెను బిగిస్తారు. వీటిని పూర్తి ఉచితంగా అమరుస్తున్నారు. దీనిలో గ్లోబల్ నేవిగేషన్ సిస్టమ్, రియల్ టైమ్ లొకేషన్ ట్రాకింగ్, రియల్ టైమ్ డేటా అనాలసిస్ వంటి సాంకేతికతలు ఉంటాయి. ఇవన్నీ రవాణా, పోలీసు శాఖ వద్ద ఉండే సర్వర్‌కు అనుసంధానమై ఉంటాయి. డ్రైవర్ తన లైసెన్సును ఐవోటీ పెట్టెలో స్వైప్ చేస్తేనే ఇంజిన్ స్టార్ట్ అవుతుంది.

భద్రత ఇలా...

మహిళా ప్రయాణికులు అభయ యాప్‌ను తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఏదైనా ఆటో ఎక్కినప్పుడు ఆ యాప్‌ను ఓపెన్ చేసి వాహనంలో అమర్చిన ఐవోటీ పెట్టెను క్యూఆర్ కోడ్‌తో స్కాన్ చేయాలి. దీంతో డ్రైవర్ పేరు, చిరునామా, వయసు, ఆటో నెంబరు, అతని ఫొటో తదితర వివరాలన్నీ ప్రయాణికురాలి మొబైల్ తెరపై ప్రత్యక్షమవుతాయి. వాహనం నడుపుతున్న వ్యక్తి, ఐవోటీ పెట్టెలో వివరాలు నమోదు చేయించుకున్న వ్యక్తి ఒకరేనా? కాదా? అనేది కూడా పరిశీలించుకునేందుకు వీలవుతుంది. ఆపై వాహనదారుడికి తాను చేరాల్సిన గమ్యస్థానాన్ని చెప్పిన తర్వాత... ఆ వివరాలను ప్రయాణికురాలు యాప్‌లో నమోదు చేసుకుంటే తన ప్రారంభ స్థానం నుంచి గమ్యస్థానానికి వెళ్లేందుకు అవకాశమున్న మూడు వేర్వేరు మార్గాలు మొబైల్ తెరపై ప్రత్యక్షమవుతాయి. అవి కాకుండా వేరే మార్గంలో తీసుకెళ్తున్నా, నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్తున్నా ప్రయాణికురాలికి వెంటనే అప్రమత్త సందేశం వస్తుంది. దాని ఆధారంగా తాను ఇబ్బందుల్లో ఉన్నట్లు ప్రయాణికురాలు భావిస్తే.. మొబైల్ యాప్‌ను గట్టిగా పట్టి నొక్కడం లేదా వాహనంలో అమర్చిన ఐవోటీ పెట్టెలోని ప్యానిక్ బటన్‌ను నొక్కడం చేస్తే వెంటనే ఈ సమాచారం సమీపంలోని పోలీసు కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. అక్కడ ఏం జరుగుతుందో చూపించే వీడియో కూడా పోలీసు కంట్రోల్ రూమ్ తెరపై కనిపిస్తుంది.

- ప్రయాణికురాలు తన యాప్‌లో నమోదు చేసుకున్న సంరక్షకులు, కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్లకు కూడా ఆమె ఆపదలో ఉందనే సమాచారం వెంటనే చేరుతుంది.
- ఐవోటీ పెట్టెపై ఉండే ప్యానిక్ బటన్ నొక్కితే వాహనంలోని సైరన్ మోగుతుంది. తద్వారా ఇతరుల సాయాన్ని అర్థించేందుకు అవకాశం ఉంటుంది.

సత్వర స్పందన

పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారమందిన వెంటనే ఆ వాహనం ఎక్కడుందో గుర్తించి... ఆ సమీపంలోని గస్తీ వాహనాలను అక్కడకు వెనువెంటనే పంపిస్తారు. తమ వద్దనున్న రిమోట్ వ్యవస్థ ద్వారా వాహనం ఉన్న చోట నుంచి కదలకుండా నియంత్రిస్తారు. బాధితురాలిని రక్షించి...నిందితులను అదుపులోకి తీసుకుంటారు.

–ఈనాడు, అమరావతి

జలాలు తరలించి అన్నం పెడితే తప్పేంటి?

- ఫిర్యాదుదారులను ప్రశ్నించిన ఎన్జీటీ
- నదుల అనుసంధానంపై పర్యావరణ శాఖకు నోటీసులు

ఈనాడు, దిల్లీ: నదుల అనుసంధానంతో ఇతర ప్రాంతాలకు జలాలను తరలించి, అక్కడి రైతులకు అన్నం పెడితే తప్పేమిటని జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయెల్ ఫిర్యాదుదారులను ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా, పెన్నా నదులను అనుసంధానిస్తున్నారని, ఇందులో ఎలాంటి నిబంధనలు పాటించడం లేదని మాజీ మంత్రి వట్టి వసంతకుమార్, వైకాపా రైతు సంఘం నేత త్రినాథ్‌రెడ్డి ఎన్జీటీని ఆశ్రయించారు. ఈ క్రమంలో జస్టిస్ గోయెల్ వారిని ఉద్దేశించి పైవిధంగా నిలదీశారు. అనుమతులు లేకుండానే ఆంధ్రప్రదేశ్‌లో నదుల అనుసంధానం చేస్తున్నారనే ఫిర్యాదు నేపథ్యంగా కేంద్ర పర్యావరణ శాఖ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి(ఏపీపీసీబీ)కి జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ) మంగళవారం నోటీసులు జారీచేసింది. ఫిర్యాదుదారుల తరపు న్యాయవాది శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఎత్తిపోతల పథకాలతో నీటిని తరలిస్తున్నందున గోదావరి డెల్టాకు నీటి కేటాయింపులు తగ్గిపోతున్నాయని తెలిపారు. పురుషోత్తపట్నం, చింతలపూడి ఇతర ఎత్తిపోతల పథకాల్లో అక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. జస్టిస్ పి.వాంగ్ది జోక్యం చేసుకొని పదివేల ఎకరాలకు పైబడి సాగులోకి వచ్చే ప్రాజెక్టులు నిర్మించేటప్పుడు కేంద్ర జలవనరుల శాఖ(సీడబ్ల్యూసీ), పర్యావరణ శాఖల అనుమతి తప్పనిసరని పేర్కొన్నారు. ఈ మేరకు ఆ శాఖలకు, ఏపీపీసీబీకి ధర్మాసనం నోటీసులు జారీచేస్తూ అనుమతులపై స్పష్టత ఇవ్వాలని సూచించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 22కు వాయిదా వేసింది.

ఆంధ్రప్రదేశ్‌లో 9 జిల్లాల్లో కరవు

కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ సీజన్‌లో తొమ్మిది జిల్లాల్లో తక్కువ వర్షపాతం వల్ల కరవు నెలకొందని గుర్తించినట్లు కేంద్రం పేర్కొంది. తొలి దశలో నాలుగు జిల్లాల్లో కరవు తొలగించడానికి చర్యలు చేపట్టినట్లు ఎంఐఎం సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మంగళవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

బీటీ కాటన్ వల్ల ఉత్పత్తి తగ్గలేదు

బీటీ కాటన్ పంటలు వేయడం వల్ల దేశంలో ఉత్పత్తి తగ్గలేదని కేంద్రం పేర్కొంది. 2002-03లో హెక్టారుకు 191 కేజీల ఉత్పాదకత ఉంటే 2017-18లో హెక్టారుకి 477 కేజీలు ఉందని తెలిపింది. జన్యుమార్పిడి పంటలకు కఠిన చట్టాలతో నియంత్రిస్తూ అనుమతులు ఇస్తున్నట్లు మంగళవారం లోక్‌సభలో భాజపా ఎంపీ కంభంపాటి హరిబాబు అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి రుపాలా లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

హజ్ సబ్సిడీని మైనార్టీ బాలికల విద్యకు వినియోగిస్తున్నాం

2018 నుంచి హజ్ యాత్రకు సబ్సిడీ నిలిపివేయడం ద్వారా ఆదా అయిన సొమ్మును మైనార్టీ బాలికల విద్యకు వినియోగిస్తున్నామని కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ముఖ్తార్ అబ్బాస్ నక్వీ తెలిపారు. మంగళవారం రాజ్యసభలో వైకాపా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఆరు జిల్లాల్లో ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

ఆంధ్రప్రదేశ్‌లోని ఆరు జిల్లాల్లో ఉమ్మడి ఆరోగ్య సూచిక ప్రాతిపదిక ప్రకారం ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేంద్రం తెలిపింది. విశాఖపట్నం, విజయనగరం, కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరుల్లో ప్రజారోగ్యం మెరుగు కోసం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని జాతీయ ఆరోగ్య మిషన్ అధ్యయనంలో తేలిందని వైకాపా సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంగళవారం రాజ్యసభలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి నడ్డా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

ప్రధాని పద్ధతి మార్చుకోవాలి

- తెదేపా ఎంపీల సూచన
- ఈబీసీ బిల్లును స్వాగతించిన నేతలు

ఈనాడు, దిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ తన పద్ధతి మార్చుకోవాలని తెదేపా ఎంపీలు హితవు పలికారు. నియంత పోకడలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్తారని వారన్నారు. మంగళవారం పార్లమెంటు ప్రాంగణంలోని గాంధీ విగ్రహం, గేటు నంబరు 1 వద్ద తెదేపా ఎంపీలు సుజనాచౌదరి, తోట నరసింహం, అశోక్‌గజపతిరాజు, రామ్మోహన్‌నాయుడు, అవంతిశ్రీనివాస్, మాగంటి బాబు, మురళీమోహన్, రవీంద్రబాబు, కొనకళ్ల నారాయణ, గల్లా జయదేవ్, జేసీ దివాకర్‌రెడ్డి, నిమ్మల కిష్టప్ప, శివప్రసాద్, మాల్యాద్రిశ్రీరాం, కనకమేడల రవీంద్రకుమార్, టీజీ వెంకటేశ్, తోట సీతారామలక్ష్మి, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహనరావులు ప్రత్యేకహోదా డిమాండు చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం సుజనాచౌదరి మీడియాతో మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు (ఈబీసీ) రిజర్వేషన్ల బిల్లు ఎన్నికల కోసమే తెరమీదకు తీసుకొచ్చారన్నారు. ఏ పార్టీని సంప్రదించకుండా బిల్లు తీసుకురావడం సరికాదన్నారు. ఈబీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని తెదేపా మొదటి నుంచి కోరుతోందన్నారు. ఆ సమయంలో అనేక పార్టీలు వ్యతిరేకించాయని ఆయన గుర్తు చేశారు. రాజ్యాంగ సవరణ చేసేటప్పుడు వివిధ పార్టీలతో మాట్లాడి బిల్లును పరిశీలించే అవకాశం ఇవ్వాలని రామ్మోహన్‌నాయుడు అన్నారు. ప్రజల్ని మోసం చేయడానికే తప్పా చిత్తశుద్ధితో బిల్లు తెచ్చినట్లు లేదని జేసీ దివాకర్‌రెడ్డి విమర్శించారు. ఈబీసీ రిజర్వేషన్ల బిల్లు స్వాగతించదగిందే అయినా బిల్లు తీసుకొచ్చిన పద్ధతి సరైంది కాదని ఎంపీ రవీంద్రబాబు అన్నారు. కాపు రిజర్వేషన్లు ఇవ్వాలని కోరితే అలవికాని హామీలని విమర్శించారని ఇప్పుడు ఎన్నికలు దృష్టిలో పెట్టుకొనే ఈబీసీ బిల్లు తీసుకొచ్చారని ఎంపీ అవంతి శ్రీనివాస్ ఆరోపించారు. మోదీ నిర్ణయాల్ని సుప్రీంకోర్టు కూడా తప్పుపట్టిందని ఈ విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలని ఎంపీ మురళీమోహన్ అన్నారు. చాణక్య వేషధారణలో వచ్చిన ఎంపీ శివప్రసాద్ తనదైనశైలిలో ప్రధాని మోదీని విమర్శించారు.



విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి ఆర్థిక సాయం చేయాలంటూ పార్లమెంటు ఆవరణలో మంగళవారం నిరసన తెలుపుతున్న తెదేపా ఎంపీలు, చాణుక్యుడి వేషధారణలో చిత్తూరు ఎంపీ శివప్రసాద్

తెదేపా ఎంపీలపై సస్పెన్షన్ తొలగించండి

తెదేపా సభ్యులపై సస్పెన్షన్ ఎత్తివేయాలని సభాపతి సుమిత్రా మహాజన్‌కు ఎంపీ రామ్మోహన్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం ఆయన ఓ లేఖ రాశారు. ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారికి 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకొచ్చిన కీలకమైన బిల్లుపై చర్చలో పాల్గొనే అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు తెదేపా ఎంపీలందరిపైనా సస్పెన్షన్ తొలగించాలన్నారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల గురించి అర్థవంతంగా చర్చించి బిల్లు పాస్ అయ్యేలా చూడాలని విన్నవించారు.

రాష్ట్ర సమస్యల పైనే నిరసన: అవంతి శ్రీనివాస్

రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసమే నిరసన తెలుపుతూ వెల్‌లోకి వచ్చామని తమపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరినా సభాపతి సుమిత్రామహాజన్ పట్టించుకోలేదని తెదేపా ఎంపీ అవంతి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు.

బడ్జెట్‌కు మించి చంద్రబాబు అవినీతి: వైకాపా

ఈనాడు, దిల్లీ: రాష్ట్ర బడ్జెట్‌కు మించి ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతి చేశారని వైకాపా నేతలు ఆరోపించారు. నాలుగున్నరేళ్లలో రూ.6లక్షల కోట్లు అవినీతి చేశారన్నారు. మంగళవారం ఇక్కడ వైకాపా ఎంపీలు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాద్‌లు 'చంద్రబాబు ఎంపరర్ ఆఫ్ కరప్షన్' పుస్తకాన్ని విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అవినీతిని జాతీయస్థాయి నాయకుల దృష్టికి తీసుకురావడానికి పూర్తి వివరాలతో పుస్తకం రూపొందించినట్లు మేకపాటి తెలిపారు. బాబు అవినీతిపై కేంద్రం దర్యాప్తు చేయాలని వైవీ సుబ్బారెడ్డి డిమాండు చేశారు. అవినీతి వ్యవహారాల కోసమే చంద్రబాబు దిల్లీకి వస్తున్నారని, పారిశ్రామికవేత్తలను కలిసి విరాళాలు సేకరిస్తున్నారని విజయసాయిరెడ్డి ఆరోపించారు.

గాంధీ విగ్రహం వద్ద నిరసన

ప్రత్యేకహోదా, విభజన హామీలు అమలు చేయాలంటూ పార్లమెంటులోని గాంధీ విగ్రహం వద్ద వైకాపా ఎంపీలు విజయసాయిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ వరప్రసాద్‌లు నిరసన తెలిపారు. ప్లకార్డులు పట్టుకొని డిమాండ్లు నెరవేర్చాలని నినాదాలు చేశారు.

గుండ్లకమ్మ బాధితులకు పునరావాసమేది?

- కాగ్ అక్షింతలు

ఈనాడు – దిల్లీ

గుండ్లకమ్మ ప్రాజెక్టు కింద పూర్తిగా ముంపునకు గురైన బాధితులకు 2017 జూన్ నాటికి కూడా సహాయ, పునరావాస కార్యక్రమాలు మొదలుపెట్టలేదని కాగ్ ఆక్షేపించింది. దీనికితోడు 48.27 హెక్టార్ల భూసేకరణ నిలిచిపోయిందని పేర్కొంది. భూసేకరణ పూర్తికాకపోవడం, ఆర్ అండ్ ఆర్ పనులు సాగకపోవడం వల్ల ఆయకట్టు సృష్టి సాధ్యపడలేదని, దీనికితోడు కాలువ పనులు పూర్తి కాకపోవడం వల్ల సాగునీటి సౌకర్యకల్పన తగ్గిపోయిందని వివరించింది. దేశంలో ఏఐబీపీ పథకం కింద చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై అధ్యయనం జరిపి కాగ్ రూపొందించిన నివేదికను మంగళవారం పార్లమెంటు ముందుపెట్టారు. అందులో ఆంధ్రప్రదేశ్‌లోని గుండ్లకమ్మ, వెలిగల్లు, బనవాసి మినీ రిజర్వాయర్ ప్రాజెక్టుల తీరుపై కాగ్ తన నివేదికలో విశ్లేషించింది.

బనవాసి చెరువు: ప్రకాశం జిల్లాలోని ఈ చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చేందుకు తొలుత రూ.27 కోట్లతో అంచనాలు రూపొందించారు. తర్వాత రూ.47.72 కోట్లకు పెంచారు. దీనివల్ల రూ.20.72 కోట్లు పెరిగింది.



➤ రిజర్వాయర్ కోసం 188.47 హెక్టార్ల భూమిని సేకరించడానికి ఎల్ఏఓ వద్ద 2010లో రూ.9 కోట్లు డిపాజిట్ చేశారు. కానీ 2017 నాటికీ ఎల్ఏఓ కేవలం 77 హెక్టార్లు మాత్రమే సేకరించగలిగారు. ఏడేళ్ల తర్వాత కూడా పూర్తి స్థాయిలో భూమి సేకరించలేకపోయారు.

వెలిగల్లు: ఈ ప్రాజెక్టు 2007 ఆగస్టులో పూర్తయింది. అయితే 2010 నవంబర్‌లో క్షేత్రస్థాయి పరిశీలన జరిపినప్పుడు పలు లోపాలు కనిపించాయి. వాటిని సరిదిద్దాలని కాంట్రాక్టర్‌కు నోటీసు ఇచ్చినా సరిచేయకపోవడంతో పొలాలకు నీరందలేదు. ఈ లోపాలు సరిదిద్దడానికి రూ.16 కోట్ల ఖర్చవుతుందని నీటిపారుదల శాఖ అంచనా వేసింది. ఆ పనులు ఇంతవరకూ మొదలుకాలేదు.

స్వర్ణముఖి: ఈ ప్రాజెక్టు 2008-09లోనే పూర్తయినట్లు ప్రకటించారు. 2017 మార్చినాటికి ఈ ప్రాజెక్టు ద్వారా 4,565 హెక్టార్లకు నీరు అందాల్సి ఉండగా కేవలం 3,651 హెక్టార్లకు మాత్రమే అందింది.

తారకరామ తీర్థసాగర్: ఈ ప్రాజెక్టు అలైన్‌మెంట్ మార్చడం, కాలువల నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల దీని కింద సాగునీటి కల్పనే సాధ్యం కాలేదు. భూసేకరణ పూర్తి కాకపోవడం వల్ల ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదు.


ఏపీ ప్రాజెక్టుల వ్యయం పెరిగిన తీరిదీ...

ప్రాజెక్టు	వాస్తవధర	పెంచిన ధర	పెరిగిన మొత్తం	వృద్ధి%	జాప్యం (ఏళ్లలో)
తాడిపూడి ఎత్తిపోతల	376.96	568.00	191.04	51	11
తారకరామతీర్థ సాగరం	220.11	471.31	251.20	114	9
గుండ్లకమ్మ రిజర్వాయర్	165.22	753.83	588.61	356	10

ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం

పాదయాత్ర @3648 కి.మీ





పాదయాత్ర సాగిందిలా..

యాత్ర ప్రారంభం
కడప జిల్లా ఇడుపులపాయలో

ఎప్పుడు?	ఎన్ని రోజులు
2017 నవంబరు 6 న	341

నడిచిన దూరం	జిల్లాలు	అసెంబ్లీ స్థానాలు
3,648 కిలోమీటర్లు	13	134

మండలాలు	నగర పాలికలు	పురపాలికలు	గ్రామాలు
231	8	54	2,516

బహిరంగ సభలు: 124 | ఆత్మీయ సమావేశాలు : 55

ఎక్కడ ఎంత దూరం నడక

- వారం పాటు కడప జిల్లాలో 90 కి.మీ.లకు పైగా..
- కర్నూలు నుంచి శ్రీకాకుళం వరకు ప్రతి జిల్లాలో సగటున 250 కిలో మీటర్లకుపైగా..
- కర్నూలు నుంచి కృష్ణా జిల్లా వరకూ ఒక్కో జిల్లాలో సగటున 20 నుంచి 25 రోజులపాటు.
- ప.గోదావరి జిల్లాలో 300 కిలోమీటర్లకుపైగా నడక.. 11 బహిరంగ సభలు, 5 ఆత్మీయ సమావేశాలు
- తూ.గోదావరిలో 50 రోజుల పాటు 400 కిలోమీటర్లకుపైగా నడక.. 15 బహిరంగ సభలు, 2 ఆత్మీయ సమావేశాలు
- శ్రీకాకుళంలో పాదయాత్ర బుధవారం నాటికి 37 రోజులు.. ఈ జిల్లాలో సుమారు 330 కిలోమీటర్లకుపైగా..



ఇచ్చిన నినాదం
'అన్న వస్తున్నాడు.. మంచి రోజులొస్తున్నాయి'

నేడు బహిరంగసభ

పాదయాత్ర ముగింపు సందర్భంగా ఇచ్ఛాపురంలో భారీ బహిరంగ సభను వైకాపా నిర్వహిస్తోంది. జగన్ బుధవారం ఉదయం పాదయాత్ర కొనసాగిస్తారు. ఇచ్ఛాపురానికి సమీపంలో ఏర్పాటుచేసిన విజయ స్తూపాన్ని ఆవిష్కరించిన తర్వాత- మధ్యాహ్నం ఒంటి గంటకు బహిరంగ సభ మొదలవుతుంది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు ఇందులో పాల్గొనే ఏర్పాట్లుచేశారు.



నాడు ఇడుపులపాయలో శంఖారావంతో ఆరంభం

నేడు ముగింపు

జగన్ 2017 నవంబరు 5న తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని, ఇడుపులపాయకు వచ్చి పాదయాత్ర ప్రారంభించారు. ఇచ్ఛాపురంలో బుధవారం పాదయాత్ర, సభ ముగిశాక.. ఆయన రాత్రికి విజయనగరం చేరుకుంటారు. అక్కడ్నుంచి రైల్లో తిరుపతికి వెళతారు. గురువారం ఉదయం అలిపిరి నుంచి కాలినడకన తిరుమలకు చేరుకుంటారు. శ్రీవారి దర్శనానంతరం రాత్రికి తిరుమలలోనే బసచేస్తారు. 11న ఉదయం తిరుమల నుంచి నేరుగా కడప చేరుకుని పెద్ద దర్గాను దర్శించుకుంటారు. తర్వాత పులివెందులలో చర్చికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. చివరగా ఇడుపులపాయ ఎస్టేట్ చేరుకుని అక్కడ వైఎస్ సమాధివద్ద నివాళినర్పిస్తారు. దీంతో ఇడుపులపాయ నుంచి ప్రారంభమైన పాదయాత్ర కార్యక్రమం తిరిగి అక్కడే సమాప్తమవుతుందని పార్టీ వర్గాలు చెప్పాయి.


ఇచ్చిన హామీలు

- వైకాపా ప్రధాన హామీలైన నవరత్నాల గురించి అన్ని బహిరంగ సభల్లోనూ ప్రస్తావన
- 'మత్స్యకారులు ప్రమాదవశాత్తూ మరణిస్తే 3 నెలల్లో రూ.10 లక్షల పరిహారం
- మత్స్యకార మహిళలకు 45 ఏళ్లకే పింఛను
- మాదిగ, మాల, రెల్లి తదితర కులాలన్నింటికీ వేర్వేరుగా కార్పొరేషన్ల ఏర్పాటు
- దళితుల ఇంట పెళ్లిళ్లకు చేయూత, వైఎస్సార్ పెళ్లి కానుక కింద రూ.లక్ష సాయం
- కాపుల సంక్షేమానికి రూ.5 వేల కోట్ల కేటాయింపు

యాత్రకు గుర్తుగా..

జగన్ ప్రజా సంకల్ప పాదయాత్రకు గుర్తుగా ఇచ్ఛాపురం ముఖద్వారంలోని లొద్దపుట్టి వద్ద భారీ స్తూపాన్ని వైకాపా ఏర్పాటు చేసింది. ఈ స్తూపం నిర్మాణానికి ముందుకొచ్చిన వైకాపా నాయకుడు కాయల వెంకటరెడ్డి(కేవీఆర్) 35 సెంట్ల స్థలాన్ని కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్కిటెక్ట్ బృందంతో స్తూపం నమూనాను తయారు చేయించారు. పనులన్నీ కేవీఆర్ తన అనుచరుల పర్యవేక్షణలో రాత్రీ పగలు చేయించారు.

స్తూపం ఇలా...



- స్తూపం ఎత్తు- 88 అడుగులు. 13 జిల్లాలను గుర్తు చేసేలా 13 మెట్లుంటాయి. పైన 15 అడుగుల ఎత్తున పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.
- 4 స్తంభాల ఆధారంగా 3 అంతస్తులుగా నిర్మించే ఈ స్తూపంపై మొదటి అంతస్తు(మెట్ల పైభాగం) ఖాళీగా వేదికలా ఉంటుంది. రెండో దానిపై జగన్ పాదయాత్ర చేస్తున్న నిలువెత్తు గ్రానైట్ చిత్రాలు అమర్చారు.
- తరువాతి అంతస్తులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రాలను అమర్చారు. వీటన్నింటినీ హైదరాబాద్‌లో తయారు చేసి ఇచ్ఛాపురానికి తీసుకొచ్చారు. స్తంభాలన్నీ గ్రానైట్ పలకలతో ఉంటాయి.
- చుట్టూ ఉన్న ప్రహరీపై ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రారంభం నుంచి ముగింపు వరకూ ఉన్న చిత్రాలను అమర్చారు.

ఈనాడు, అమరావతి, ఇచ్ఛాపురం-న్యూస్‌టుడే

అవినీతికి అంబాసిడర్

- జగన్‌పై మంత్రి గంటా ధ్వజం

ఈనాడు, విశాఖపట్నం: 'మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ కూడా ఆశ్చర్యపోయేలా వైకాపా అధినేత వైఎస్ జగన్ ఆస్తులు సంపాదించారు, అవినీతికి ఆయన అంబాసిడర్..అటువంటి వ్యక్తి రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడును విమర్శించడం సిగ్గుచేటు' అని మంత్రి గంటా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం విశాఖపట్నంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే హైదరాబాద్‌లో వేల మంది నివాసానికి సరిపోయేలా లోటస్‌పాండ్ భవనం, బెంగళూరులోని 31 ఎకరాల్లో రూ.350 కోట్లతో నిర్మించిన మరో భవంతి ఉండగా.. తాజాగా అమరావతిలో 5 ఎకరాల్లో రూ.50 కోట్లతో జగన్ ఇంటిని నిర్మిస్తున్నారని మంత్రి వెల్లడించారు. ఇంత డబ్బు ఎక్కడి నుంచి వస్తుందో తెలియడం లేదని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అవ్వకముందు, అయిన తరువాత జగన్ ఆస్తులు చూసుకుంటే ఏకంగా 770 రెట్లు పెరగడం ప్రపంచ కుబేరులకే ఆశ్చర్యం కలిగించే విషయమన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడి, క్విడ్‌ప్రోకో ద్వారా కంపెనీలలో షేర్లు పెట్టించుకొని ఎన్నో మోసపూరిత విధానాలకు తెరలేపిన జగన్ సీఎం చంద్రబాబునాయుడు మీద ఆరోపణలు చేస్తే జనం నవ్వుకుంటారన్నారు. రఫేల్ కుంభకోణంపై ప్రధాని మోదీని దేశంలో ప్రతిపార్టీ వ్యతిరేకించినా వైకాపా మాత్రం కనీసం మాట్లాడకపోవడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వైకాపా మునిగిపోయే నౌకని, త్వరలో మరికొందరు తెదేపాలోకి వస్తారని చెప్పారు.

ఆధారాలున్నాయా జగన్?

- విపక్ష నేతకు మంత్రుల సవాల్

ఈనాడు యంత్రాంగం: తన దోపిడీని కప్పిపుచ్చుకునేందుకే వైకాపా అధ్యక్షుడు జగన్.. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర మంత్రులు విమర్శించారు. తెదేపా అధికారంలోకి వచ్చాక పెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లను మించి.. రూ.6.18 లక్షల కోట్ల అవినీతి జరిగిందని పుస్తకాలు వేయడానికి సిగ్గు పడాలని వ్యాఖ్యానించారు. అక్రమాస్తుల కేసులో నిందితుడికి అవినీతిపై పుస్తకం వేసే అర్హత ఉందా అని ప్రశ్నించారు.

విపక్ష నేతది కుటిలనీతి

తెదేపా నేతలపై చేస్తున్న అవినీతి ఆరోపణలపై జగన్ ఆధారాలు చూపించాలి. బహిరంగ చర్చకు రావాలి. నీటి ప్రాజెక్టులకు రూ.62 వేల కోట్లు ఖర్చు చేశారని చెబుతూనే లక్ష కోట్ల అవినీతి జరిగిందనడం ఆయన కుటిల నీతికి నిదర్శనం. రాజధాని పరిధిలో మంత్రి నారాయణ 3,129 ఎకరాలు కొనుగోలు చేశారంటున్న జగన్ దమ్ము.. ధైర్యముంటే నిరూపించాలి. సీఆర్‌డీఏ పరిధిలో ఇప్పటివరకు 2 వేల ఎకరాలు మాత్రమే క్రయవిక్రయాలు జరిగాయి. **- మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు**

జనం దృష్టి మరల్చేందుకే

తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని లక్ష కోట్లకు మించి దోపిడీ చేసిన జగన్.. జనం దృష్టి మరల్చేందుకే రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. ఎమ్మెల్యేగా నా రాజీనామా కోరే హక్కు జగన్‌కు లేదు. నేను గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే వైకాపాలో చేరాను. అప్పట్లో నన్ను రాజీనామా చేసి పార్టీలోకి రమ్మనలేదు. **- మంత్రి ఆదినారాయణరెడ్డి**

నిష్ప్రయోజన పాదయాత్ర

ప్రతిపక్ష నేత పాదయాత్రతో ప్రజలకు ఏం మేలు జరిగింది? అది సర్కస్ యాత్రలా ఉంది. ఏదో ఘన కార్యం చేసినట్లు ముగింపు వేడుకలు శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించటం సిగ్గుచేటు. తిత్లీ తుపాను బాధితులను పరామర్శించేందుకు తీరికలేని జగన్.. ఇచ్ఛాపురంలో ముగింపు సభ నిర్వహించడం సరికాదు.
- మంత్రులు కళా వెంకటరావు, అచ్చెన్నాయుడు

పరాకాష్టకు చేరిన జగన్ పదవీ వ్యామోహం

జగన్‌కు ముఖ్యమంత్రి పదవీ వ్యామోహం పరాకాష్టకు చేరింది. చరిత్రలో నిలిచిపోయేలా పోలవరం ప్రాజెక్టు వద్ద 24 గంటల్లో 32,315 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు వేస్తే, దీనిపై విషం చిమ్ముతూ.. కాంక్రీటును పూతగా అభివర్ణించడం వైకాపా దుర్మార్గం. పోలవరంలో 24 గంటల పాటు వేసిన కాంక్రీటుతో 1000 చదరపు అడుగులు కలిగిన 650 గృహాలను నిర్మించవచ్చు.
- మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

మూత్రపిండాల వ్యాధి నిర్మూలనకు చర్యలు

- వైకాపా అధ్యక్షుడు జగన్ వెల్లడి

కవిటి గ్రామీణం, విశాఖపట్నం లీగల్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం ప్రాంత ప్రజలను పట్టిపీడిస్తున్న మూత్రపిండాల వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకుంటానని వైకాపా అధ్యక్షుడు వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర మంగళవారం శ్రీకాకుళం జిల్లా కవిటి మండలంలో సాగింది. ఈ సందర్భంగా తొత్తడిపుట్టుగలో మూత్రపిండాల వ్యాధిగ్రస్థులు వినతిపత్రం అందజేశారు. బాధితుల గోడు విన్న జగన్ స్పందిస్తూ.. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యాధిగ్రస్థులకు డయాలసిస్ దశలో రూ.10 వేల పింఛనుతోపాటు ప్రాథమిక దశలో కొంత నగదు పింఛను రూపంలో అందజేస్తామన్నారు. స్థానికంగా సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించడంతోపాటు తాగునీటి కల్పనకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేస్తామన్నారు. జగతి నుంచి ప్రారంభమైన పాదయాత్ర కవిటి, బొర్రపుట్టుగ, తొత్తిడిపుట్టుగ, రాజపురం, అగ్రహారం మీదుగా కొజ్జిరియా వరకు 12 కిలోమీటర్ల మేర సాగింది. తిత్లీ తుపాను నష్టం, పింఛన్లు, స్థానిక సమస్యలను ప్రజలు జగన్ దృష్టికి తెచ్చారు. పాదయాత్రలో జిల్లా, నియోజకవర్గ నాయకులు రెడ్డిశాంతి, తమ్మినేని సీతారాం, సాయిరాజ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై దాడి కేసు విచారణ విజయవాడకు బదిలీ: ప్రతిపక్ష నాయకుడు, వైకాపా అధ్యక్షుడు జగన్మోహనరెడ్డిపై విశాఖ విమానాశ్రయంలో జరిగిన దాడి కేసు విచారణ విశాఖ న్యాయస్థానం నుంచి విజయవాడకు బదిలీ అయింది. ఈ మేరకు జాతీయ దర్యాప్తు సంస్థ కేసులను విచారించే ప్రత్యేక కోర్టు కమ్ మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఈ కేసు విశాఖలోని ఏడో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రాథమిక విచారణ స్థాయిలో ఉంది. ఈ కేసులో నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావు విశాఖలోని కేంద్ర కారాగారంలో రిమాండు ఖైదీగా ఉన్నాడు.



పాము మెడ.. పక్షి భళా

మెడ పాములా కనిపిస్తోన్న ఈ పక్షి పేరు 'డార్టర్ స్నేక్ బర్డ్'. కొలనులు, సరస్సులలో ఉండే చెట్లపై ఇది నివసిస్తుంది. నీటిలో ఉండే చేపలను ఒక్క వేటులో పొడిచి తినడం దీని ప్రత్యేకత. ఈ అరుదైన పక్షి వరంగల్ రూరల్ జిల్లాలోని పాకాల సరస్సులో 'ఈనాడు' కెమెరాకు చిక్కింది. రుచిగా ఉండటంతో చాలా ప్రాంతాల్లో జాలర్లు వీటి గుడ్లను తింటారని.. ఈ క్రమంలో వీటి జాతి అంతరించి పోయే ప్రమాదంలో పడిందని హైదరాబాద్‌లోని జూ అధికారులు పేర్కొన్నారు. **- ఈనాడు, హైదరాబాద్**

అవకాశం ఇచ్చిన పార్టీకే జై


- తెదేపా అంటే అభిమానం
- మంత్రి గంటాతో సినీ నటుడు అలీ భేటీ

ఈనాడు, విశాఖపట్నం: ఎన్నికల్లో పోటీ చేయడానికి తనకు అవకాశం ఇచ్చిన పార్టీకే జై అంటానని సినీ హాస్యనటుడు అలీ పేర్కొన్నారు. 'పండుగాడి ఫొటోస్టూడియో' సినిమా చిత్రీకరణ కోసం విశాఖకు వచ్చిన ఆయన.. మంగళవారం సాయంత్రం రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావుతో భేటీ అయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. తనకు ఒక గురువు ఉన్నారని, ఈనెల 16 వరకు రోజులు బాగా లేవని ఆయన చెప్పారని, ఆ తేదీ తరువాత తాను ఏ పార్టీకి మద్దతిస్తానో ప్రకటిస్తానని వెల్లడించారు. తెలుగుదేశమంటే తనకు అభిమానమని.. ముఖ్యమంత్రి చంద్రబాబు, పలువురు మంత్రులు తనకు బాగా తెలుసని, తనను వారు తమ్ముడిలా చూసుకుంటారని తెలిపారు. గతంలో తాను గంటాకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలోనూ పాల్గొన్నానని వివరించారు. మంత్రి గంటాకు తాను చెప్పాల్సింది చెప్పానని, ఆయన తనను సిఫారసు చేస్తారని భావిస్తున్నానని పేర్కొన్నారు. 20 ఏళ్ల నుంచి తాను కార్యకర్తగానే ఉన్నానని, ఇక అభ్యర్థిగా ఉండాలన్నది తన ఉద్దేశమని అన్నారు. అనంతరం మంత్రి గంటా మాట్లాడుతూ.. అలీ గురించి ముఖ్యమంత్రికి తెలుసని, ఆయన ఉద్దేశాలను సీఎం పరిగణనలోకి తీసుకుంటారని భావిస్తున్నానని వివరించారు. తాను కూడా ముఖ్యమంత్రికి చెప్పాల్సిన అంశాలను చెబుతానన్నారు. గుంటూరునుంచి పోటీ చేయడానికి అలీ ఆసక్తిగా ఉన్నారని తెలిపారు.



మంత్రి గంటా శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న అలీ

వీరి వీరి వంకాయ.. దీని పేరు యహోదా!



భారీగా ఉన్న యహోదా వంకాయలు

- కుప్పంలో సాగవుతున్న భారీ వంకాయ రకం పంట
- ఒక్కో కాయ బరువు కేజీపైనే
- ఉత్తరాదికి ఎగుమతి లక్ష్యంగా అభివృద్ధి
- ఔత్సాహికులకు 90 శాతం రాయితీపై మొక్కలందిస్తామంటున్న ఉద్యానశాఖ

ఈనాడు, అమరావతి: తాజా కూరలలో రాజా ఎవరంటే.. వంకాయేనని పాక ప్రియులు పేర్కొంటుంటారు. అలా వినుతికెక్కిన వంకాయకు తాజాగా మరో విశేషం వచ్చి చేరింది. రుచిలోనే కాదు ఆకారంలోనూ, బరువులోనూ భారీతనం వంటబట్టింది. యహోదా అనే పేరుగల ఈ కొత్తరకం వంకాయలను చిత్తూరు జిల్లా కుప్పంలోని ఉద్యానశాఖ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అభివృద్ధి పరచి పండిస్తున్నారు.

కిలో లోపు ఉంటే మేలు

ఈ రకం వంకాయలను సగటున అర కిలో నుంచి కిలో లోపుగా ఉన్నప్పుడు కోసి మార్కెట్లో అమ్ముకోవచ్చు. అంతకుమించితే కాస్త ముదిరినట్లు అన్పిస్తుంది.

ఎందుకొచ్చిందీ ఆలోచన?

ఉత్తర భారత దేశపు మార్కెట్ కోసం ఈ రకం వంగను అభివృద్ధి చేయాలనేది ఉద్యానశాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి ఆలోచన. అక్కడ లావుపాటి వంకాయలు(సుమారు 300 నుంచి 400 గ్రాములు) ఎక్కువగా ఉపయోగిస్తారు. వీటితో బేంగన్ భరత అనే వంటకం తయారు చేస్తారు. ఇదంటే అక్కడి ప్రజలకు ఎంతో మక్కువ. వంకాయకు రంధ్రాలు పెట్టి నాలుగు వైపులా వెల్లుల్లి రెబ్బలు ఉంచి.. నిప్పులపై కాలుస్తారు. తర్వాత తోలు తీసివేసి గుజ్జుతో కూర తయారు చేస్తారు. చపాతిలోకి ఇదెంతో రుచికరంగా ఉంటుంది.

★ చిత్తూరులో పండించే మామిడి, టమోటాకు ఉత్తర భారతంలో ఎంతో మార్కెట్ ఉంది.

ఈ క్రమంలో ఈ భారీ వంకాయలనూ ఆ ప్రాంతానికి ఎగుమతి చేయాలని ఉద్యానశాఖ యోచిస్తోంది. ఇందులో భాగంగానే ఈ రకాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఇక్రిశాట్ శాస్త్రవేత్త కృష్ణ కిశోర్ వెల్లడించారు.



భారీ వంకాయలతో కుప్పం ఉద్యాన కేంద్ర ఏడీ యు.కోటేశ్వరరావు, ఇక్రిశాట్ శాస్త్రవేత్త కిశోర్

ఒక్కో మొక్క రూ. 8

ఉద్యానశాఖ కేంద్రంలో మొక్క ధరను రూ.8 చొప్పున నిర్ణయించారు. ఉద్యానశాఖ 50 శాతం రాయితీపై రూ.4లకు అందిస్తుంది. పెద్దమొత్తంలో సాగు చేయటానికి ముందుకొచ్చే ఔత్సాహికులకు 90 శాతం రాయితీపై మొక్కలు ఇస్తారు. వ్యాపారులతో సంప్రదించి పండించిన పంటను కొనుగోలు చేయించే దిశగానూ ప్రయత్నాలు చేస్తున్నారు.

యహోదా వంకాయల ప్రత్యేకత

- ఒక్కో వంకాయ కిలో నుంచి 1.800 కిలోలు తూగుతుంది.
- సాధారణ వంకాయల కంటే ఎంతో రుచికరంగా ఉంటుంది.
- దీన్లో 5 శాతం మాత్రమే విత్తనాలు ఉంటాయి.
- కాయ కింద కొద్ది భాగాన్ని తొలగిస్తే విత్తనాలు కిందకు రాలిపోతాయి.
- ఎడారిలో పండే వంగ రకం ఇది.
- ఆరుబయటైతే నాలుగు రోజులు, శీతల వాతావరణంలో 20 రోజుల వరకు తాజాగా ఉంటాయి.
- ఉద్యానశాఖ, ఇక్రిశాట్, హేయర్‌లూమ్ సీడ్ లింక్స్ ప్రైవేటు లిమిటెడ్ సంయుక్తంగా తొమ్మిదేళ్ల నుంచి దీన్ని అభివృద్ధి చేశాయి.

స్వాగతిస్తున్నాం.. కానీ

- అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లపై ప్రధాన పార్టీల భిన్నాభిప్రాయాలు

ఈనాడు, న్యూస్‌టుడే యంత్రాంగం: అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి విద్య, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్, తెదేపాలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెబుతూనే.. ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న కుతంత్రంతోనే భాజపా అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించాయి. మాజీ ప్రధాని దేవేగౌడ సంపూర్ణ మద్దతు ప్రకటించగా.. ఈ అంశం సుప్రీంకోర్టులో నిలవదని అంబేడ్కర్ మనవడు ప్రకాష్ అంబేడ్కర్ వ్యాఖ్యానించారు. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏపీ బీసీ సంక్షేమ సంఘం ఆందోళన వ్యక్తం చేసింది.

చిత్తశుద్ధితో అమలు చేయాలి



కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ దురుద్దేశంతో కాకుండా చిత్తశుద్ధితో అమలు చేయాలి. భాజపా రిజర్వేషన్లకు వ్యతిరేకం. వీపీ సింగ్ హయాంలో మండల్ కమిషన్ సిఫారసుల్ని అమలు చేసినప్పుడు దేశంలో ఆందోళనలు రెచ్చగొట్టింది ఆ పార్టీనే. అలాంటి భాజపా ఇప్పుడు కపట ప్రేమ చూపిస్తోంది. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మను పునర్నియమిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులివ్వడం నరేంద్రమోదీ ప్రభుత్వానికి చెంపపెట్టు.
- మంత్రులు యనమల రామకృష్ణుడు, గంటా శ్రీనివాసరావు

పేదలకు ఫలాలు

ప్రభుత్వ ఫలాలను పేదలకు చేర్చటమే భాజపా సిద్ధాంతం. అందులో భాగంగానే ఎవరూ అడగకున్నా అగ్రవర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రధానమంత్రి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ప్రధానిని చోర్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఒక్క గంట కూడా ఆయన సీఎంగా ఉండటానికి తగరు. **- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ**

నిజాయతీ కనిపించడం లేదు

2019లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు ఇస్తామని ఇప్పటికే మేం ఇంటింటి ప్రచారం చేశాం. కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల కాలం గడిపి ఇప్పుడు హడావుడిగా ఈ ప్రకటన చేయటంలో నిజాయతీ కనిపించడం లేదు. **- రఘువీరారెడ్డి, పీసీసీ అధ్యక్షుడు**

సంపూర్ణ మద్దతు

నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకున్న ఈ అపురూపమైన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. పేదల బాగు కోసం ఏ ప్రభుత్వం ఉత్తమ నిర్ణయాలు తీసుకున్నా మా సహకారం ఉంటుంది.
- దేవేగౌడ, మాజీ ప్రధానమంత్రి (ట్విటర్‌లో)

కులాల మధ్య చిచ్చు పెట్టడానికే

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలను మభ్యపెట్టడానికి, కులాల మధ్య కుంపటి పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించడానికి ముందుకొచ్చింది.
- తెదేపా అధికార ప్రతినిధి యామినిశర్మ

రాజ్యాంగానికి వ్యతిరేకం

ఏమాత్రం సామాజిక వివక్షకు గురవ్వని అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగానికి వ్యతిరేకం. బీసీలకు జనాభా దామాషా మేరకు 56 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏళ్ల తరబడి పోరాడుతున్నా కేంద్రం పట్టించుకోలేదు. ఓసీలకు రిజర్వేషన్లపై వెనక్కి తగ్గకుంటే పోరాటాలను ఉద్ధృతం చేస్తాం.
- కేశన శంకరరావు, ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధం



భాజపా ప్రభుత్వ నిర్ణయం ఎన్నికల్లో లబ్ధి కోసమే. నిర్మాణాత్మకమైన చర్చ లేకుండా, ఆలోచన చేయకుండా నిర్ణయం తీసుకోవడం తప్పు. ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు ఇవ్వడానికి మేము వ్యతిరేకం కాదు. కానీ, కల్పించే విధానమే తప్పు. ఈ అంశం సుప్రీం కోర్టులో నిలవదు. అది రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధం.
- డా.బీఆర్ అంబేడ్కర్ మనవడు ప్రకాష్ అంబేడ్కర్ (అనంతపురంలో)

కాపు రిజర్వేషన్ల సమస్య పరిష్కరించండి

అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ల కల్పన తరహాలోనే.. కాపు రిజర్వేషన్ల దస్త్రాన్ని వెంటనే పరిష్కరించాలి.
- కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం (అనంతపురంలో)

ఐఎమ్‌ఎఫ్ ప్రధాన ఆర్థికవేత్తగా

గీతా గోపీనాథ్

తొలి మహిళగా ఘనత



వాషింగ్టన్: అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎమ్ఎఫ్) ప్రధాన ఆర్థికవేత్తగా ప్రముఖ భారతీయ అమెరికన్ అర్థశాస్త్ర నిపుణురాలు గీతా గోపీనాథ్ బాధ్యతలు అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. అంతకుముందు ఈ బాధ్యతల్లో ఉన్న మరీస్ ఆబ్స్ట్‌ఫెల్డ్ డిసెంబర్ 31న పదవీ విరమణ పొందారు. ఆ మరుసటి రోజు ఆయన స్థానాన్ని గీతా గోపీనాథ్ భర్తీ చేశారు. ప్రధాన ఆర్థికవేత్తగా ఐఎమ్ఎఫ్ పరిశోధక విభాగానికి డైరెక్టర్‌గానూ ఆమె సేవలందిస్తారు. గీతా గోపీనాథ్ నియామకం విషయాన్ని అక్టోబర్ 1నే ఐఎమ్ఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టీన్ లగార్డ్ ప్రకటించారు. ప్రపంచంలోని అత్యుత్తమ ఆర్థికవేత్తల్లో ఆమె ఒకరని అభివర్ణించారు. తన నియామకం పట్ల గీతా కూడా సంతోషం వ్యక్తం చేశారు. కర్ణాటకలోని మైసూరులో గీతా గోపీనాథ్ జన్మించారు. అమెరికాలోని వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలో ఎమ్ఏ, ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రిన్స్‌టన్‌లో వుడ్రో విల్సన్ ఫెలోషిప్ పురస్కారం ఆమెకు దక్కింది. హార్వర్డ్ వర్సిటీలో ప్రతిష్ఠాత్మక 'జాన్ జ్వాన్‌స్ట్రా ప్రొఫెసర్‌షిప్' గౌరవాన్ని కూడా ఆమె పొందారు. కేరళ సీఎంకు ఆర్థిక సలహాదారుగా ఉండటంతోపాటు పలు కీలక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

చైనాలో భారత రాయబారిగా విక్రమ్

బీజింగ్: చైనాలో భారత రాయబారిగా విక్రమ్ మిస్రీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1989వ బ్యాచ్ 'ఇండియన్ ఫారిన్ సర్వీసు(ఐఎఫ్ఎస్)' అధికారి. గతంలో ఐరోపా, ఆఫ్రికా, ఆసియా, ఉత్తర అమెరికాల్లోని దౌత్య కార్యాలయాల్లో మిస్రీ పనిచేశారు. చైనాలో రాయబారిగా పనిచేసిన గౌతం బంబావాలె గత ఏడాది నవంబరులో పదవీ విరమణ పొందారు.

ఆలోక్‌కు మళ్లీ పగ్గాలు

- సీబీఐ డైరెక్టర్‌ను బదిలీ చేసే అధికారం ప్రభుత్వానికి లేదు: సుప్రీంకోర్టు

దిల్లీ

సీబీఐ అంతర్గత కుమ్ములాట అంశంపై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆ దర్యాప్తు సంస్థ డైరెక్టర్ ఆలోక్ వర్మను తిరిగి ఆ పదవిని చేపట్టేందుకు సర్వోన్నత న్యాయస్థానం అనుమతించింది. అనూహ్య రీతిలో ఆయన అధికారాలను ఉపసంహరించి, బలవంతపు సెలవుపై పంపుతూ కేంద్రం, కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) గత ఏడాది అక్టోబరులో అర్ధరాత్రి సమయంలో ఇచ్చిన ఉత్తర్వులను కోర్టు మంగళవారం కొట్టేసింది. సీబీఐ డైరెక్టర్ తాత్కాలిక సస్పెన్షన్ లేదా తొలగింపునకు సంబంధించి చట్టంలో ఎలాంటి నిబంధనలు లేవని పేర్కొంది. అలాంటి నిర్ణయాలను ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన అత్యున్నత స్థాయి కమిటీ అనుమతితో మాత్రమే తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ తీర్పు వర్మకు పాక్షిక ఊరటే. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సీవీసీ దర్యాప్తు జరుపుతున్న నేపథ్యంలో ఆయన కొనసాగింపుపై అత్యున్నత స్థాయి కమిటీ ఒక నిర్ణయానికి రావొచ్చని కోర్టు సూచించింది. అప్పటివరకూ విధానపరమైన ముఖ్య నిర్ణయాలేమీ తీసుకోరాదని వర్మకు స్పష్టం చేసింది. ఈ కమిటీ వారంలోగా సమావేశం కావాలని నిర్దేశించింది. వర్మ రెండేళ్ల పదవీకాలం ఈ నెల 31తో ముగుస్తుంది.

వర్మ, సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాలు పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకుంటూ రచ్చకెక్కడంతో వారిద్దరి అధికారాలను వెనక్కి తీసుకొని, వారిని బలవంతపు సెలవుపై పంపుతూ సీవీసీ, కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 23న ఉత్తర్వులు జారీ చేశాయి. అదే




రోజున 1986 బ్యాచ్ ఒడిశా క్యాడర్ అధికారి ఎం.నాగేశ్వరరావును సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా నియమించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను సవాల్ చేస్తూ వర్మ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

ఆయన పిటిషన్‌పై సుప్రీం కోర్టులో తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. వర్మ, అస్థానాలు ఘర్షణ పడుతూ సీబీఐని నవ్వులపాల్జేశారని కేంద్రం వాదించింది. ఇలాంటి పరిస్థితుల్లో జోక్యం చేసుకొని, ఆ ఇద్దరు అధికారులను సెలవుపై పంపే అధికారం కేంద్రానికి ఉందని తెలిపింది. అయితే చట్టప్రకారం ఆయనకు రెండేళ్ల పదవీకాలం ఉందని, ఆలోగా బదిలీ కుదరదని వర్మ తరఫు న్యాయవాది ఫాలి నారిమన్ పేర్కొన్నారు. ఎంపిక కమిటీ అనుమతి లేకుండా ఇలా చేయడం కుదరదన్నారు. దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన ఈ కేసుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.కె.కౌల్, జస్టిస్ కె.ఎం.జోసెఫ్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం 44 పేజీల తీర్పును వెలువరించింది. ఈ తీర్పును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి రాశారు. అయితే ఆయన సెలవుపై ఉండటంతో ధర్మాసనంలోని మిగతా న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.కె.కౌల్, జస్టిస్ కె.ఎం. జోసెఫ్‌లు దాన్ని వెలువరించారు.

స్వతంత్రంగానే ఉండాలి

అత్యున్నత స్థాయి కమిటీ నుంచి ముందస్తు అనుమతి లేకుండా సీబీఐ డైరెక్టర్ అధికారాలు, విధులను వెనక్కి తీసుకునేందుకు ప్రభుత్వానికి చట్ట ప్రకారం ఎలాంటి అధికారం లేదని ధర్మాసనం పేర్కొంది. అత్యున్నత స్థాయి ప్రభుత్వ అధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి 1997లో వినీత్ నారాయణ్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును, ఆ తర్వాత జరిగిన చట్ట సవరణను ప్రస్తావించింది. (సీబీఐ డైరెక్టర్‌కు రెండేళ్ల పదవీకాలాన్ని సదరు తీర్పులోనే న్యాయస్థానం నిర్దేశించింది.) అనంతరం దీనిపై జరిగిన చట్ట సవరణకు సంబంధించి పార్లమెంటు ఉద్దేశాలపై తాజా తీర్పు భాష్యం చెప్పింది. అన్నిరకాల బాహ్య ప్రభావాల నుంచి సీబీఐ డైరెక్టర్ కార్యాలయాన్ని రక్షించడం, ఈ దర్యాప్తు సంస్థ నిబద్ధత, స్వతంత్రతను కాపాడటమే దాని ఉద్దేశమని తెలిపింది. అత్యున్నత స్థాయి ఎంపిక కమిటీ అనుమతి లేకుండా సీబీఐ డైరెక్టర్‌ను బదిలీ చేయరాదని దిల్లీ ప్రత్యేక పోలీసు వ్యవస్థ చట్టంలోని నిబంధనలు చెబుతున్నాయని పేర్కొంది. ప్రస్తుతం తలెత్తిన తరహా పరిస్థితుల్లో సీబీఐ డైరెక్టర్‌కు వ్యతిరేకంగా తాత్కాలిక చర్యలను చేపట్టే అధికారాన్ని ప్రభుత్వానికి ఆ శాసనం ఇవ్వలేదని చెప్పింది. 'బదిలీ' అనే పదాన్ని 'ఒక పదవి నుంచి మరో పదవిలోకి మార్పిడి' అని అన్వయించుకుంటూ దానికే అత్యున్నత స్థాయి కమిటీ అనుమతి అవసరమన్న నిర్ధారణకు వస్తే పార్లమెంటు ఉద్దేశాలకు విఘాతం కలిగించినట్లవుతుందని వ్యాఖ్యానించింది. తాజా కేసులో అత్యున్నత స్థాయి కమిటీ నిర్ణయం తీసుకునేవరకూ ఆలోక్ వర్మ ప్రస్తుతం కొనసాగుతున్న రోజువారీ విధులను మాత్రమే నిర్వహించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. విధానపరమైన అంశాల్లోనూ లేదా సంస్థాగతంగా ప్రభావం చూపే నిర్ణయాలను, కొత్త చర్యలను తీసుకోరాదంది.



దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో చర్చలు జరిపేందుకు వస్తున్న నార్వే ప్రధాని ఇర్నా సోల్‌బర్గ్, భారత ప్రధాని మోదీ

మోదీతో నార్వే ప్రధాని భేటీ

దిల్లీ: ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు కలిసికట్టుగా కృషిచేయాలని భారత్, నార్వే నిర్ణయించుకున్నాయి. తొలిసారిగా భారత పర్యటనకు విచ్చేసిన నార్వే ప్రధాని ఇర్నా సోల్‌బర్గ్ దిల్లీలో ప్రధాని మోదీతో మంగళవారం భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలకు నూతన శక్తిని, సరికొత్త మార్గదర్శకత్వాన్ని అందించడంపై ఇరువురు నేతలు చర్చించారు. 'భారత్-నార్వే మహాసముద్ర చర్చలు' నిర్వహించేందుకు అవగాహన ఒప్పందం పై ఇరుదేశాలు సంతకాలు చేశాయి.

రక్షణ సహకారంపై మోదీ, ట్రంప్ మంతనాలు

దిల్లీ, వాషింగ్టన్: ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం సాయంత్రం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఉగ్రవాదంపై పోరాటం, రక్షణ రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత మెరుగుపర్చుకోవడంపై చర్చించుకున్నారు. ఇరువురు నేతలు తొలుత పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

29న ప్రధాని 'పరీక్షా పే చర్చా' కార్యక్రమం

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 29న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో 'పరీక్షా పే చర్చా' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 9 నుంచి 12వ తరగతుల విద్యార్థులు, గ్రాడ్యుయేట్, అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సులు చేస్తున్న కళాశాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు. MyGov.in లో పేర్లు నమోదు చేసుకోవాలి. ఎంపిక చేసిన విద్యార్థులకు ఈ నెల 29న ఇక్కడి తాల్కాతోరా స్టేడియంలో నిర్వహించే 'పరీక్షా పే చర్చా' కార్యక్రమం ద్వారా ప్రధానితో మాట్లాడే అవకాశం లభిస్తుంది.

పైరసీకి పాల్పడితే రూ.పదిలక్షల జరిమానా

దిల్లీ: పైరసీని అరికట్టడానికి సినిమాటోగ్రాఫ్ చట్టం, 1952కు సవరణలు చేయాలని కేంద్ర సమాచార, ప్రసార శాఖ నిర్ణయించింది. పైరసీకి పాల్పడినవారికి గరిష్ఠంగా మూడేళ్ల జైలుశిక్ష లేదా రూ.పది లక్షల జరిమానా లేదా రెండూ విధించేలా కొత్త నిబంధన చేర్చాలని ముసాయిదాపత్రాన్ని సిద్ధం చేసింది. దీనిపై ప్రజలు జనవరి 14లోపు తమ సూచనలు, సలహాలు పంచుకోవచ్చని మంత్రిత్వశాఖ పేర్కొంది..

దేశవ్యాప్తంగా బంద్ ప్రశాంతం

- రాజస్థాన్, పశ్చిమబెంగాల్‌లో ఘర్షణలు

దిల్లీ, కోల్‌కతా, తిరువనంతపురం: దేశవ్యాప్తంగా పది కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె తొలిరోజైన మంగళవారం చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా సాగింది. కేరళ, ఒడిశా, పశ్చిమబెంగాల్‌లో రోడ్డురవాణా, రైలు సేవలకు ఎక్కువగా అంతరాయం కలిగింది. కర్ణాటకలోని కొన్ని జిల్లాల్లో బంద్ వాతావరణం కనిపించింది. ముంబయి పౌరరవాణా విభాగానికి చెందిన 32వేలమంది ఉద్యోగులు సమ్మె చేయడంతో సుమారు 25లక్షలమంది ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మరోవైపు సమ్మెలో పాల్గొంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కేంద్రప్రభుత్వం హెచ్చరించింది. కేరళలో పాఠశాలలు, కళాశాలలు మూసేశారు. పశ్చిమబెంగాల్‌లో ఆందోళనకారులు విధ్వంసాలకు పాల్పడ్డారు. రాజస్థాన్‌లోని జపాన్ కంపెనీ ఆవరణలోకి ప్రవేశించి సమ్మెలో పాల్గొనాలని కార్మికులకు నచ్చజెప్పడానికి వెళ్తున్నవారిని పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి అదుపు తప్పింది. పోలీసులు, ఆందోళనకారులకు మధ్య జరిగిన ఘర్షణలో 22మంది పోలీసులు, 50మంది ఆందోళనకారులు గాయపడ్డారు.



మంగళవారం గువాహటిలో రైళ్ల రాకపోకలను అడ్డుకుంటున్న వామపక్ష కార్యకర్తలు

ఎఫ్‌ఎంలో ఆలిండియా రేడియో వార్తలు

- ఆంగ్లం, హిందీ భాషల్లో ప్రసారం

దిల్లీ: ఎఫ్ఎం రేడియో ఛానళ్లంటే పాటలు, మాటలు, ప్రకటనలే కాదు.. ఇకపై వార్తలూ వినొచ్చు. ఆలిండియా రేడియో (ఏఐఆర్) వార్తల బులెటిన్లను ప్రైవేటు ఎఫ్ఎం రేడియో ఛానళ్లలో ప్రసారం చేసేందుకు అనుమతించనున్నారు. కొన్ని షరతులు, నిబంధనలకు లోబడి వార్తలు ఆంగ్లం, హిందీ భాషల్లో నిర్దిష్ట షెడ్యూలుకు అనుగుణంగా ప్రసారం కానున్నాయి. ఆలిండియా రేడియో వార్తల్ని ప్రైవేట్ ఎఫ్ఎం ప్రసార సంస్థలతో పంచుకునే కార్యక్రమాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ప్రజల్లో చైతన్యం పెంచాలనేదే ప్రభుత్వ ప్రాధాన్యమని, ఆదాయ సంపాదనకు ద్వితీయ ప్రాధాన్యమని, అందుకని వార్తా సేవల్ని ఉచితంగానే అందిస్తున్నామని తెలిపారు. ఇది పౌరులకు సాధికారతను కల్పిస్తుందని, ప్రజాస్వామ్యానికి ఇంతకన్నా ఏం కావాలని వ్యాఖ్యానించారు. ఇది చరిత్రాత్మక ఘట్టమని ప్రసార భారతి ఛైర్మన్ ఎ.సూర్యప్రకాశ్ తన సందేశంలో పేర్కొన్నారు. తమ వేదికల ద్వారా వార్తలు ప్రసారం చేయాలనే సుదీర్ఘకాలంగా ఉన్న డిమాండ్‌ను ఆమోదించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు భారత రేడియో ఆపరేటర్ల సంఘం అధ్యక్షురాలు అనురాధ ప్రసాద్ పేర్కొన్నారు.



వార్తల బులెటిన్లను ప్రసారం చేయాలని భావించే ప్రైవేటు ఎఫ్ఎం ఛానళ్లు ముందుగా ఆలిండియా రేడియో వార్తల సేవా విభాగంలో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఏఐఆర్ వార్తల్ని ఎలాంటి మార్పుచేర్పులు లేకుండా సంపూర్తిగా ప్రసారం చేయాల్సి ఉంటుంది. వార్తలకు సంబంధించిన క్రెడిట్‌ను మాత్రం ఏఐఆర్‌కే ఇవ్వాలి. ఈ సేవల్ని ట్రయల్స్ రూపంలో ఈ ఏడాది మే 31దాకా అందజేస్తారు.

'అయోధ్య'పై రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు

రేపటి నుంచి సుప్రీంకోర్టులో వాదనలు

దిల్లీ: రామ్ జన్మభూమి- బాబ్రీ మసీదు స్థలవివాదంపై వాదనలు వినడానికి ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని సుప్రీంకోర్టు మంగళవారం ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి నేతృత్వంలో న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.ఎ.బోబ్డే, జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సభ్యులుగా ఈ ధర్మాసనం ఏర్పాటయింది. ఈ నెల 10న ఉదయం 10.30 నుంచి ఈ ధర్మాసనం వాదనలు వింటుందని సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్ పేర్కొంది. ధర్మాసనంలో పేర్కొన్న పేర్ల వరుసక్రమం ఆసక్తికరంగా ఉంది. జస్టిస్ రంజన్ గొగొయి ప్రస్తుతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన పదవీ విరమణ తరువాత జస్టిస్ బోబ్డే, ఆపై జస్టిస్ ఎన్.వి.రమణ, అనంతరం జస్టిస్ యు.యు.లలిత్, అటుపై జస్టిస్ డి.వై.చంద్రచూడ్ వరుసగా ప్రధాన న్యాయమూర్తులుగా బాధ్యతలు చేపట్టనున్నారు. 2.77 ఎకరాల వివాదాస్పద భూమిని సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహి అఖాడా, రామ్‌లల్లా మధ్య సమానంగా పంపిణీ చేయాలని 2010లో అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుతో సంతృప్తి చెందని పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వ్యక్తులు, ధార్మికసంస్థల తరపున 14 వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వ్యాజ్యాలు పరిశీలించిన సుప్రీంకోర్టు 2019 జనవరి మొదటివారంలో ధర్మాసనానికి నివేదిస్తామని గత ఏడాది అక్టోబరు 29న పేర్కొంది. జనవరి 4న కొలువుదీరిన సుప్రీంకోర్టు.. జనవరి 10నాటికి వ్యాజ్యాలన్నింటినీ విచారించడానికి ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పింది. అందుకు అనుగుణంగానే తేదీతో పాటు రాజ్యాంగ ధర్మాసనం సభ్యులను సుప్రీంకోర్టు మంగళవారం ప్రకటించింది.

అత్యంత గోప్యంగా..

కోటాను చివరి క్షణాల్లో కేబినెట్ నోట్‌లో చేర్చిన కేంద్రం

దిల్లీ: అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించే విషయాన్ని ప్రకటించడంలో కేంద్రప్రభుత్వం అత్యంత గోప్యంగా వ్యవహరించింది. మంత్రివర్గ ఆమోదానికి ముందు సమాచారం బయటకు పొక్కకుండా సైనిక వ్యవహారాల మాదిరిగా జాగ్రత్తలు తీసుకుంది. ప్రధానిమోదీ అధికారిక నివాసంలో సోమవారం జరిగిన మంత్రివర్గ ప్రత్యేక సమావేశానికి మూడు రోజుల ముందే కేబినెట్ నోట్‌ను సిద్ధం చేశారు. అందులో కోటా బిల్లును ప్రస్తావించలేదు. సమావేశ ప్రారంభానికి ముందు చివరి క్షణాల్లో ప్రతిపాదనను చేర్చారు. ఎన్నికలకు ముందు ఎక్కుపెట్టిన అస్త్రంగా భావిస్తున్న ఈ రిజర్వేషన్ ప్రతిపాదన ఇప్పటికిప్పుడు వచ్చిందేమీ కాదు. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల(ఈబీసీ) రిజర్వేషన్ కోసం ఓ కేటగిరీని రూపొందించాలని 2010లో ఎస్.ఆర్.సిన్హో కమిషన్ సిఫార్సు చేసింది. తద్వారా ఈబీసీలకు ఇతర వెనుకబడిన తరగతుల(ఓబీసీ) తరహాలో ప్రయోజనాలు చేకూరుతాయని సూచించింది. 2013లో కేంద్రంలో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు ఈ అంశంపై చర్చ జరిగింది. మోదీ ప్రభుత్వం గతేడాది జులైలో తొలిసారిగా అగ్రవర్ణాల రిజర్వేషన్ విషయాన్ని పరిశీలించింది. అయితే, వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించేందుకుగాను ప్రవేశపెట్టిన బిల్లు తమకు సత్ఫలితాలనిస్తుందని అప్పట్లో భాజపా భావించింది. అగ్రవర్ణాలు ఆ బిల్లుతో తమపై ఆగ్రహించబోరని అభిప్రాయపడింది. ఇటీవల రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో పరిస్థితిని అర్థం చేసుకున్న భాజపా అగ్రవర్ణాలకు రిజర్వేషన్ కల్పించేందుకు సిద్ధమైంది.

రిజర్వేషన్ బిల్లులో ఏముంది?

దిల్లీ: అగ్రవర్ణాల పేదలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన 124వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఇంతవరకు రిజర్వేషన్లు వర్తించనివారిలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రయోజనం కల్పించడమే తమ ఉద్దేశమని కేంద్ర మంత్రి థావర్‌చంద్ గహ్లోత్ స్పష్టం చేశారు. సమాజ్‌వాదీ పార్టీ సభ్యుల నిరసనల నడుమ ఆయన బిల్లును ప్రవేశపెడుతూ ముఖ్యాంశాలను వివరించారు.

'ప్రస్తుతం ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాలు ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వోద్యోగాలు పొందడంలో ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్నవారితో పోటీ పడలేకపోతున్నారు. వాటికి వారు దూరమవుతున్నారు. దీని దృష్ట్యా రాజ్యాంగంలోని 15వ అధికరణను సవరించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. ప్రజల్లో ఆర్థికంగా వెనుకబడిన ఏ వర్గానికైనా ప్రయోజనాలు కల్పించడానికి రాష్ట్రాలకు ప్రత్యేక అనుమతి లభించేందుకు వీలుగా ఒక నిబంధనను చేర్చాలనేది ప్రతిపాదన. ప్రభుత్వ సాయంతో నడిచే విద్యాసంస్థలు, ప్రైవేటు విద్యా సంస్థలు సహా అన్నింటిలో (మైనారిటీ విద్యాసంస్థలు మినహా) ప్రవేశాలకు ఈ నిబంధనలు వీలు కల్పిస్తాయి. ప్రస్తుత రిజర్వేషన్లకు ఇవి అదనం. ప్రతీ విభాగంలో ఉన్న మొత్తం సీట్లలో గరిష్ఠంగా 10 శాతానికి మించకుండా ఈ రిజర్వేషన్‌ను వర్తింపజేస్తాం' అని బిల్లులో పేర్కొన్నారు.

సముచిత అవకాశాల కోసం ఈ సవరణ

'రాజ్యాంగంలోని 46వ అధికరణలో పొందుపరిచిన ఆదేశిక సూత్రాల ప్రకారం బలహీన వర్గాల ప్రజల, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీల విద్య, ఆర్థిక ప్రయోజనాలపై



ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనపరచాల్సి ఉంది. సామాజిక అన్యాయాలు, అన్ని రూపాల్లోని దోపిడీ నుంచి వారిని పరిరక్షించాలి. (అగ్రవర్ణాల్లో) ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారు ప్రస్తుత రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడానికి అర్హులు కాదు. 46వ అధికరణను పూర్తిస్థాయిలో నెరవేర్చడానికి, ఆర్థికంగా బలహీనంగా ఉన్న పౌరులు విద్య, ఉద్యోగ రంగాల్లో సముచిత అవకాశాలు పొందడానికి భారత రాజ్యాంగాన్ని సవరించాలని నిర్ణయించాం.' అని బిల్లు లక్ష్యాల్లో ప్రభుత్వం పేర్కొంది.

ఉన్నత విద్యా సంస్థల్లో కోటా అమలుకు కసరత్తు

దిల్లీ: అగ్రవర్ణ పేదలకు ఉన్నత విద్యా సంస్థల్లో పది శాతం రిజర్వేషన్ కల్పించే విషయమై కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ (హెచ్ఆర్‌డీ) దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి విధి విధానాల రూపకల్పనకు చర్యలు ఆరంభించింది. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యావకాశాల్లో అగ్రవర్ణ పేదలకు పదో వంతు కోటా కల్పించేందుకు సోమవారం కేంద్ర మంత్రివర్గం నిర్ణయించిన క్రమంలో ఈ క్రతువు చేపట్టినట్టు మంగళవారం హెచ్ఆర్‌డీ వర్గాలు తెలిపాయి. "పది శాతం కోటాను ఎలా అమలు చేయాలన్న దానిపై కసరత్తు జరుగుతోంది. విశ్వవిద్యాలయాల నిధుల సంఘం గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు వర్సిటీలు ఈ కోటాను కల్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు సీట్ల పెంపు విషయమై ఆలోచిస్తున్నాం. దేశ వ్యాప్తంగా ఐఐటీలు, ఐఐఎంలు, విశ్వవిద్యాలయాలన్నింటిలో కలిపి మొత్తం పది లక్షల మేర సీట్ల సంఖ్యను పెంచాల్సి వస్తుందని ప్రాథమిక అంచనాకు వచ్చాం" అని పేర్కొన్నాయి. అఖిలభారత ఉన్నత విద్యా సర్వే (2017-18) ప్రకారం... దేశవ్యాప్తంగా 903 విశ్వవిద్యాలయాలు, 39 వేల కళాశాలలు, 10 వేల స్వతంత్ర విద్యా సంస్థలు ఉన్నాయి. వీటన్నింటిలో ఇప్పుడు కోర్సుల వారీగా సీట్ల సంఖ్యను పెంచుతారని తెలుస్తోంది.

రాజ్యాంగ విరుద్ధం...

కోటా బిల్లుపై న్యాయ నిపుణుల వ్యాఖ్య

దిల్లీ: అగ్రవర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్లు కల్పించేందుకు లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లు 'రాజ్యాంగ విరుద్ధం', 'రాజకీయ ఆయుధం' అని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. బిల్లును న్యాయస్థానాల్లో సవాల్ చేసే అవకాశాలున్నాయని సీనియర్ న్యాయవాదులు రాకేష్ ద్వివేది, రాజీవ్ ధావన్, అజిత్ సిన్హా అభిప్రాయపడ్డారు. ఇందిరా సాహ్నీ కేసులో వెలువడిన తీర్పు... ప్రభుత్వ నిర్ణయానికి అడ్డంకిగా మారుతుందని చెప్పారు. ఇది ఎన్నికల ఎత్తుగడ అని ద్వివేది చెప్పారు. రిజర్వేషన్లకు గరిష్ఠ పరిమితిని 50 శాతంగా గతంలో సుప్రీంకోర్టు చెప్పినా దానిని "ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చలేనిదిగా" పరిగణించకూడదని చెప్పారు. ప్రత్యేక కారణాలుంటే దీనిని అధిగమించి రిజర్వేషన్లు కల్పించవచ్చని, అవి సహేతుకమా కాదా అనేదే కోర్టు చూస్తుందని అన్నారు. బిల్లు మాత్రం రాజ్యాంగ విరుద్ధమని ధావన్ చెప్పారు. అదనపు రిజర్వేషన్ల అంశం న్యాయసమీక్షలో నెగ్గాల్సిందేనని సిన్హా చెప్పారు.

కమల్‌నాథ్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి భాజపా కుట్ర: దిగ్విజయ్‌సింగ్

భోపాల్: కమల్‌నాథ్ నేతృత్వంలోని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి రాష్ట్ర భాజపా నాయకులు.. తమ పార్టీ ఎమ్మెల్యేకు రూ.వంద కోట్లు ఎర జూపారని మాజీ ముఖ్యమంత్రి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దిగ్విజయ్‌సింగ్ ఆరోపించారు. భాజపా ప్రభుత్వంలో మంత్రి పదవి కూడా ఎర చూపారని, అప్పటికప్పుడు ప్రైవేటు విమానంలో తీసుకెళ్లడానికి ఏర్పాట్లు చేసుకున్నారన్నారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దిగ్విజయ్ మాట్లాడారు. "మా పార్టీ ఎమ్మెల్యే అయిన బైజ్‌నాథ్ కుష్వాహాను భాజపా ఎమ్మెల్యే నారాయణ్ త్రిపాఠి ఇటీవల ఓ దాబాకు తీసుకెళ్లారు. అప్పటికే అక్కడ మాజీ భాజపా మంత్రులు నరోత్తమ్‌మిశ్ర, విశ్వాస్ సరంగ్ ఉన్నారు. రూ.వందకోట్ల నగదుతో పాటు మంత్రిపదవి ఆశ చూపారు. ఇంకా పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్నట్లు వెల్లడించారు" అని దిగ్విజయ్ ఆరోపించారు. దిగ్విజయ్ ఆరోపణలను భాజపా నాయకులైన మిశ్ర, ప్రతిపక్ష నాయకుడు గోపాల్ భార్గవ ఖండించారు. సాక్ష్యాలుంటే నిరూపించాలని సవాల్ చేశారు. 230 మంది సభ్యులు గల మధ్యప్రదేశ్ అసెంబ్లీలో కాంగ్రెస్‌కు 114 మంది, భాజపాకు 109 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

భారత్ స్పందించట్లేదు: ఇమ్రాన్

ఇస్లామాబాద్: శాంతి కోసం తాము చేస్తున్న అభ్యర్థనలకు భారత్ స్పందించడం లేదని పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఆరోపించారు. అణ్వాయుధ దేశాల మధ్య జరిగే ఎలాంటి యుద్ధమైనా ఇరు పక్షాలకు ఆత్మహత్యా సదృశమే అవుతుందని హెచ్చరించారు. కశ్మీర్ ప్రజల హక్కులను అణిచివేయడం భారత్‌కు సాధ్యపడదని ఓ ముఖాముఖిలో పేర్కొన్నారు.

మహిళా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ట్రాన్స్‌జెండర్ అప్సర

దిల్లీ: మహిళా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ట్రాన్స్‌జెండర్ అప్సరా రెడ్డి నియమితులయ్యారు. కాంగ్రెస్ చరిత్రలో పార్టీ ఆఫీసుబేరర్‌గా ఓ ట్రాన్స్‌జెండర్‌ను నియమించడం ఇదే ప్రథమం. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, తదితరులతో అప్సరా రెడ్డి ఉన్న ఫొటోను కాంగ్రెస్ మంగళవారం ట్విటర్‌లో ఉంచింది.

పౌరసత్వ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

దిల్లీ, గువాహటి: పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌లకు చెందిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన 'పౌరసత్వ సవరణ బిల్లు-2018'ను మంగళవారం లోక్‌సభ ఆమోదించింది. ఆ దేశాల నుంచి భారత్‌కు వచ్చి, ఎలాంటి పత్రాలు లేకపోయినా ఆరేళ్లుగా నివాసముంటున్న హిందువులు, జైనులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్శీలకు భారత పౌరసత్వం ఇవ్వాలన్నది ఈ బిల్లు సారాంశం. అసోం ఒడంబడికకు అనుగుణంగా ఈ బిల్లు లేదని కాంగ్రెస్ పేర్కొంది. ఓటు బ్యాంకు రాజకీయాలకు పరాకాష్ఠగా తృణమూల్ కాంగ్రెస్ ఈ బిల్లును అభివర్ణించింది. అసోం గణ పరిషత్, శివసేన, జేడీ(యూ)లు కూడా దీన్ని వ్యతిరేకించాయి.

★ నేరస్థులు, క్షతగాత్రులతో పాటు తప్పిపోయిన వారిని గుర్తించేందుకు వీలుగా డీఎన్ఏ సాంకేతికతను వినియోగించేందుకు వీలు కల్పించే 'డీఎన్ఏ సాంకేతికత వినియోగ, వర్తింపు బిల్లు'ను శాస్త్ర, సాంకేతికశాఖ మంత్రి హర్షవర్ధన్ ప్రవేశపెట్టారు. సీబీఐని దుర్వినియోగం చేస్తున్నారని, దీనిపై చర్చించాలని విపక్షాలు చేపట్టిన ఆందోళనతో రాజ్యసభ పలుమార్లు వాయిదాపడింది. నిరసన మధ్యే ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా భారత వైద్యమండలి సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. విపక్ష నేతలు, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో సంప్రదింపులు నిర్వహించిన ఛైర్మన్ వెంకయ్యనాయుడు... సమావేశాలను బుధవారం వరకూ(ఒకరోజు) పొడిగించారు.



పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా త్రిపురలో బలగాలపైకి రాళ్లు రువ్వుతున్న నిరసనకారులు

అట్టుడికిన అసోం

పౌరసత్వ బిల్లును లోక్‌సభ ఆమోదించడంతో అసోం అట్టుడికింది. అఖిల అసోం విద్యార్థుల సంఘం మంగళవారం బంద్ నిర్వహించడంతో జనజీవనం స్తంభించింది. సీఎం సర్బానంద, విద్యుత్తు మంత్రి తపన్‌కుమార్ ఇళ్ల ముట్టడికి ఆందోళనకారులు ప్రయత్నించారు. ఈశాన్య రాష్ట్రాల బంద్ కూడా విజయవంతమైంది. పోలీసుల లాఠీఛార్జి, కాల్పుల్లో ఏడుగురు గాయపడ్డారు.

★ ఎన్డీయేతో తెగతెంపులు చేసుకున్నట్టు, రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు ఏజీపీ అధ్యక్షుడు మహంత ప్రకటించారు.

రైలులో భాజపా నేత హత్య

అహ్మదాబాద్: గుజరాత్‌లో కదులుతున్న రైలులోనే ఓ సీనియర్ భాజపా నేత హత్యకు గురయ్యారు. భుజ్-దాదర్ ఎక్స్‌ప్రెస్‌లో మాజీ ఎమ్మెల్యే జయంతి భానుశాలి భుజ్ నుంచి అహ్మదాబాద్‌కు తిరిగివస్తున్న సమయంలో మంగళవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆయనను కాల్చి చంపారు. భానుశాలి నిద్రపోతున్న సమయంలో ఆయన ఛాతిలోకి, నుదురుపైన దుండగులు కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. ఆయన ప్రయాణిస్తున్న ఏసీ మొదటి తరగతి కోచ్‌లో రాత్రివేళ నిద్రలేచిన ఓ వ్యక్తి భానుశాలి మృతదేహాన్ని చూసి రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. అయితే ప్రయాణికులెవరూ తాము దుండగులను చూడలేదని, కాల్పుల శబ్దం కూడా వినలేదని చెబుతున్నారు. దీన్ని కాల్పుల్లో ఆరితేరిన వ్యక్తుల పనిగా పోలీసులు భావిస్తున్నారు. భానుశాలి గతంలో గుజరాత్ భాజపా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. అప్పట్లో ఆయన తనపై అత్యాచారం జరిపినట్లు ఓ మహిళ ఆరోపించడంతో గతేడాది జులైలో పదవి నుంచి వైదొలిగారు. అనంతరం గుజరాత్ హైకోర్టు ఆ కేసును కొట్టివేసింది. ఈ హత్య వెనుక తమ రాజకీయ ప్రత్యర్థి, మరో భాజపా నేత ఛబిల్ పటేల్ హస్తం ఉందని భానుశాలి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. పటేల్ కూడా గతేడాది ఓ అత్యాచారం కేసులో అరెస్టయ్యారు.



రాత్రిపూట చలిలో గజగజ వణికిపోయే నిరాశ్రయుల కోసం దిల్లీలో ప్రభుత్వం నడుపుతున్న శరణాలయమిది. మంగళవారం ఇక్కడ నిద్రించేందుకు వచ్చినవారి సంఖ్య పెరిగింది.

తుపానులు వణికించాయి..
కేంద్రం వెక్కిరిస్తోంది..

- తిత్లీ, పెథాయ్ విపత్తుల వేళ రాష్ట్రంలో భారీగా తడిసి రంగుమారిన ధాన్యం
- కొనుగోలుకు నిబంధనలు సడలించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి
- నేటికీ రాని స్పందన.. ఆందోళనలో అన్నదాతలు



ఆంధ్రప్రదేశ్‌ను గత కొన్నినెలల కాలంలో వరుసగా తుపాన్లు వణికించాయి. తిత్లీ, పెథాయ్ రూపాల్లో ఇవి ముంచుకురావడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. వీటి ప్రభావంతో పలు జిల్లాల్లో ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో కూరుకుపోయారు. ఈ కష్టకాలంలో ఆదుకోవాల్సిన కేంద్రం నుంచి కనీస స్పందన కనిపించని పరిస్థితి. రంగుమారిన, దెబ్బతిన్న ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం అనుమతించండంటూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న విజ్ఞప్తికి నేటికీ ప్రతిస్పందన లేదు. తిత్లీ సమయంలో దెబ్బతిన్న ధాన్యం కొనేందుకు రెండు నెలల కిందట పంపిన ప్రతిపాదనలకూ అతీగతీ లేదు. పెథాయ్ నష్టంపై మూడు వారాల కిందట నివేదిక పంపినా.. ధాన్యం కొనుగోలుకు సంబంధించి నిబంధనల సడలింపుపై కనీస సమాచారం రాలేదు. మరోవైపు, సంబంధిత ధాన్యాన్ని అమ్ముకోలేక, ప్రభుత్వం కొంటుందో లేదోనన్న స్పష్టత లేక రైతులు కలత చెందుతున్నారు.

సడలింపు ఎందుకు..?

ప్రతి ఏటా ధాన్యం కొనుగోలుపై కేంద్రం తన విధానాన్ని ప్రకటిస్తుంది. సర్కారు కొనే ధాన్యంలో తేమ శాతం ఎంతవరకు ఉండాలి? అపరిపక్వ, దెబ్బతిన్న ధాన్యాన్ని ఎంతశాతం మేర అనుమతిస్తారనేదీ ఈ సందర్భంగా స్పష్టం చేస్తుంది. దాని ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కర్షకుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధర మేరకు చెల్లింపులు చేస్తుంది. అనంతరం ఆ డబ్బును కేంద్రం రాష్ట్రానికి తిరిగి చెల్లిస్తుంది. తుపాను సమయాల్లో ధాన్యం దెబ్బతినడం, రంగు మారడం తదితర సమస్యలు అధికంగా కనిపిస్తాయి. వీటి కొనుగోలు విషయం కేంద్రం ప్రకటించిన నిబంధనల పరిధిలోకి రాదు. ఈ నేపథ్యంలో నిబంధనలను సడలించాలని రాష్ట్రం కోరుతుంది. దీంతో కొన్నిసార్లు కేంద్రం సడలింపునిస్తుంది. కానీ, తిత్లీ, పెథాయ్ సందర్భంగా తడిసిన ధాన్యం విషయంలో నేటికీ స్పందన లేకపోవడం రైతులకు ఇబ్బందికరంగా మారింది.

పెథాయ్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఆరు జిల్లాల్లో సుమారు లక్ష టన్నుల మేర ధాన్యం దెబ్బతిన్నట్లు తొలుత అంచనా వేశారు. అనంతరం ప్రాథమిక అంచనా మేరకు 11,700 హెక్టార్లలో 70 వేల టన్నుల ధాన్యం దెబ్బతిందని, దాన్ని కొనేందుకు అనుమతించాలని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖకు మూడు వారాల కిందటే నివేదించింది. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు విధానం-2018లోని నిబంధనల ప్రకారం ఈ ధాన్యాన్ని కొనేందుకు అవకాశం లేకపోవడంతో నిబంధనలను కాస్త సడలించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది.

బస్తా రూ.800 లకే..!

కనీస మద్దతు ధర ప్రకారం సాధారణ రకం ధాన్యం 75 కేజీల బస్తాకు రూ. 1312. 50, 80 కేజీల బస్తాకైతే రూ. 1400 రైతుకు దక్కాల్సి ఉంది. కానీ, తుపాను కారణంగా దెబ్బ తిన్న ధాన్యాన్ని శ్రీకాకుళంలో 80 కేజీల బస్తా రూ. 800లకు, గరిష్ఠంగా కొన్నిచోట్ల మాత్రం రూ. వేయి వరకు కొంటున్నామని మిల్లర్లే చెబుతున్నారంటే రైతుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో స్పష్టమవుతోంది. ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోనూ ధాన్యం దెబ్బ తిన్న నేపథ్యంలో నిబంధనల సడలింపునకు కేంద్రం అనుమతినిస్తేనే మేలు జరుగుతుందని పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు.


కనీసం 2శాతం...!


మద్దతు ధరతో ధాన్యం కొనేందుకుగాను ఖరీఫ్ విధానంలో నిబంధనలను సడించాలని రాష్ట్రం కేంద్రాన్ని కోరింది. ఈ నేపథ్యంలో కొంతమేర దెబ్బతిన్న, రంగుమారిన ధాన్యాన్ని కొనేందుకుగాను ఖరీఫ్-2018 విధానంలో అనుమతించింది. దీంతో ఈ విధానంలో ప్రకటించిన నిబంధనల్లో ప్రతిదానికి కనీసం 2శాతం అదనంగా సడలింపునివ్వాలని రాష్ట్రం ప్రతిపాదించింది.

ఖరీఫ్ విధానం–2018 ప్రకారం అనుమతించినవి

వివరణ	శాతం
ఆర్గానిక్ ధాన్యం	1
దెబ్బతిన్న, రంగుమారిన ధాన్యం	5
అపరిపక్వత, ముడుచుకున్నవి..	3
తక్కువ నాణ్యత ఉన్న మిశ్రమాన్ని కలపడం	6
తేమ	17

ప్రాథమిక అంచనా ప్రకారం కేంద్రానికి నివేదించిన ధాన్యం నష్టం వివరాలు





- ఈనాడు, అమరావతి



తాటిఉత్పత్తుల తయారీ కేంద్రంలో తయారు చేసిన పానీయాన్ని రుచి చూస్తున్న మంత్రి సోమిరెడ్డి

వ్యవసాయ వృద్ధిలో రాష్ట్రానికి ప్రథమ స్థానం

- మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెల్లడి
- తూ.గో. జిల్లాలో తాటి ఉత్పత్తుల తయారీ కేంద్రం ప్రారంభం

రంపచోడవరం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని వ్యవసాయ శాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం మండలం పందిరిమామిడిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన తాటి ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో వ్యవసాయరంగంలో 11 శాతం వృద్ధితో దేశంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. ఉద్యానరంగంలో 17 శాతం వృద్ధి సాధించినట్లు వివరించారు. సాంకేతికత వినియోగించుకోవడంలో రాష్ట్రం ముందుందని చెప్పారు. ఇక్కడి తాటి ఉత్పత్తుల తయారీ కేంద్రంలో నీరా నుంచి తాటిబెల్లం, చక్కెర, ద్రావకం తయారు చేస్తారని మంత్రి వివరించారు.

20 ఏళ్లకే శిఖరంలా ఎదిగాడు!

5 ఎత్తైన పర్వతాలు ఎక్కి సత్తా చాటిన తెలుగు బిడ్డ



ఉత్తర అమెరికాలోని అకాంకాగువా పర్వతంపై సురేష్ విజయ సంకేతం

కడప, ఈనాడు: పర్వతారోహణలో తెలుగు బిడ్డ సత్తా చాటాడు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా వెరవకుండా రెండు పదుల వయసులోనే ప్రపంచంలోని ఐదు ఎత్తైన పర్వతాలను అధిరోహించి రికార్డు సృష్టించాడు. దక్షిణభారత దేశంలోనే ఈ ఘనత సాధించిన అత్యంత పిన్నవయస్కుడిగా గుర్తింపు పొందాడు. 4 రోజుల కిందట ఉత్తర అమెరికాలోని అర్జెంటీనా పరిధిలో గల అకాంకాగువా పర్వతాన్ని అధిరోహించి రికార్డు సృష్టించాడు కర్నూలు జిల్లా గోనెగండ్లకు చెందిన జి. సురేష్‌బాబు. కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇతనికి పర్వతాలు అధిరోహించడమంటే ఆసక్తి. రెండేళ్లుగా ఎత్తైన పర్వతాలను అధిరోహించడాన్ని అలవాటుగా చేసుకొని.. తొలుత 2017 మే 13న ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్టు శిఖరాన్ని బృంద సభ్యునిగా, అదే ఏడాది డిసెంబరు 25న ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని, 2018 ఆగస్టు 5న రష్యాలోని ఎల్‌బ్రూస్‌ను పర్వతాన్ని, 2018 సెప్టెంబరు 28న నేపాల్‌లోని మౌంట్ మానస్‌లూను పర్వతాన్ని, తాజాగా జనవరి 4న అమెరికాలోని అకాంకాగువా పర్వతాన్ని అధిరోహించాడు. 6963 మీటర్ల ఎత్తైన అకాంకాగువా పర్వతం అధిరోహించడానికి సురేష్‌కు 10 రోజులు పట్టింది. డిసెంబరు 25న పర్వతారోహణ ప్రారంభించగా జనవరి 4కు లక్ష్యానికి చేరుకున్నాడు. ఆండీస్ పర్వతాల్లో అత్యున్నత శిఖరంగా అకాంకాగువాను పిలుస్తారు. ఈ ప్రయాణంలో సురేష్‌తోపాటు ఆయన టీం లీడర్ భరత్ తమ్మినేని ఉన్నారు. దీంతో 20 ఏళ్ల వయసులో ఐదు పర్వతాలు అధిరోహించిన చిన్న వయస్కుడిగా సురేష్ రికార్డు సృష్టించాడు.



కియా పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హోం మంత్రి చినరాజప్ప, డీజీపీ ఆర్‌పీ ఠాకూర్, కియా ముఖ్య పరిపాలన అధికారి చాంద్, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు

కియా పరిశ్రమ అనంతకు వరం

- ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్ద పీట వేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి చినరాజప్ప అన్నారు. మంగళవారం అనంతపురం జిల్లా పెనుకొండ మండలం అమ్మవారిపల్లిలో కియా పారిశ్రామిక ప్రాంత పోలీస్‌స్టేషన్ ప్రారంభానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీసుల గౌరవవందనం అనంతరం పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుస్టేషన్లకు మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఇక్కడి ఎర్రమంచిలో కూడా ప్రభుత్వం స్థలం కేటాయించిన వెంటనే రూ.3 కోట్లతో మోడల్ పోలీస్‌స్టేషన్ నిర్మిస్తామన్నారు. కియా పరిశ్రమ రావటం అనంతపురం జిల్లా ప్రజలకు వరమని, ముఖ్యమంత్రి కృషి, పట్టుదలతోనే ఇది సాకారమైందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ ఆర్పీ ఠాకూర్, అనంతపురం రేంజ్ డీఐజీ కాంతిరాణా టాటా, కలెక్టర్ వీరపాండియన్, ఎస్పీ అశోక్‌కుమార్, పెనుకొండ ఎమ్మెల్యే బి.కె.పార్థసారథి, జిల్లా పరిషత్ ఛైర్మన్ పూల నాగరాజు, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

- మిలీషియా సభ్యులు కూడా

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మావోయిస్టు పార్టీ శబరి ఏరియా కమిటీ సభ్యులు ముగ్గురితో పాటు మరో ఆరుగురు మిలీషియా సభ్యులు తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ ఎదుట లొంగిపోయారు. దళ సభ్యులు దిర్ది జోగయ్య, మడకం జోగయ్య, దిర్ది సోమయ్య, మిలీషియ సభ్యులు కుంజ బండి, ముచ్చిక మల్లి, ముచ్చిక ఉంగమ్మ, సోడి ఇడమయ్య, మడకం దిలీప్, పంజం పాండులు లొంగిపోయారు. వివరాలను కాకినాడలోని ఎస్పీ కార్యాలయంలో చింతూరు ఓఎస్డీ అమిత్ బర్దర్, చింతూరు డీఎస్పీ ఒ.దిలీప్ కిరణ్‌తో కలిసి ఎస్పీ విశాల్‌గున్ని మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. చింతూరు మండలం పొంగుట్టకు చెందిన దిర్ది జోగయ్య అలియాస్ పెరమయ్య అలియాస్ ముఖేశ్ 2015 నుంచి శబరి లోకల్ ఆపరేటర్ స్క్వాడ్‌లో దళ సభ్యుడు. హరిభూషణ్ అలియాస్ లక్మా దాదాకు గార్డుగా పనిచేసేవాడు. మడకం జోగయ్య అలియాస్ రఘు 2015 నుంచి 2017 వరకు శబరి దళంలో సభ్యుడిగా ఉంటూ 12 చోట్ల మందుపాతర్లు అమర్చాడు. దిర్ది సోమయ్య 2015 నుంచి శబరి ఏరియా దళంలో మిలీషియ సభ్యుడిగా పనిచేస్తూ దళ కమాండర్‌గా ఎదిగాడు. 9 ప్రాంతాల్లో మందుపాతరలు అమర్చాడు. వీరంతా లొంగిపోవడటానికి సహకరించిన చింతూరు సీఐ కె.దుర్గాప్రసాద్, ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్, జిల్లా స్పెషల్ పార్టీ ఏఎన్ఎస్, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ 42(సి) సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలిపారు.



లొంగిపోయిన దళ సభ్యులతో ఎస్పీ విశాల్‌గున్ని, ఇతర పోలీస్ సిబ్బంది

తేనె 'కుప్పం'

- తేనెటీగల ఉత్పత్తి, తేనె శుద్ధి పరిశ్రమ ఏర్పాటుకు నిర్ణయం
- సీఎం ఆమోదంతో వడివడిగా అడుగులు
- రైతులకు భరోసా, ఉపాధి కల్పనే లక్ష్యం

చిత్తూరు(జిల్లా పంచాయతీ) – న్యూస్‌టుడే

చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం తియ్యటి ప్రాజెక్టుకు వేదికైంది. తేనె ఉత్పత్తి, శుద్ధికి సంబంధించి ఇక్కడ ఓ పరిశ్రమను ఏర్పాటుచేసి ఎగుమతులు దిశగా అడుగులు వేసేందుకు రంగం సిద్ధమైంది. దేశంలోనే తొలిసారిగా తేనెటీగల ఉత్పత్తి, తేనె శుద్ధి ఒక్కచోటే చేపట్టేలా జిల్లా అధికారులు రూపొందించిన ప్రణాళికకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆమోద ముద్ర వేశారు. త్వరితగతిన ఈ పరిశ్రమను ఏర్పాటుచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో అన్నదాతలకు వర్షాధారిత వ్యవసాయమే జీవనం. దీంతో కరవు సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యాన పంటల వైపు అడుగులు వేసినా వారి కష్టాలు పూర్తిగా తీరడం లేదు. ఈ నేపథ్యంలో రైతుల ఆదాయాన్ని మెరుగుపరిచేలా ఏదైనా చేయాలనుకున్న కలెక్టర్ ప్రద్యుమ్న జిల్లాలోని కుప్పం, పాలసముద్రం, పలమనేరు తదితర ప్రాంతాల్లో తేనె ఉత్పత్తికి అవకాశాలు ఉన్నట్లు గుర్తించారు. తేనె పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధంచేసి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అంగీకరించడంతో తొలిగా కుప్పం నుంచే దీన్ని ప్రారంభించి దశల వారీగా విస్తరించాలని నిర్ణయించారు. ముందుగా రూ.కోటి నిధులతో పనులు ప్రారంభించనున్నారు. పరిశ్రమ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించి పనిలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) నిమగ్నమైంది. పరిశ్రమ నిర్మాణం ఒక రూపు సంతరించుకోగానే తేనె ఉత్పత్తి శుద్ధికి అవసరమైన చర్యలు చేడతారు. రాణీ ఈగలను ఎక్కువగా ఇక్కడ ఉత్పత్తి చేయాలని భావిస్తున్నారు. ఈ పరిశ్రమ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాక జిల్లాలో తేనె ఉత్పత్తిదారులకు అవసరమైన సామగ్రి, ఈగలను ఇక్కడి నుంచే సరఫరా చేయనున్నారు. దీనివల్ల వంద మందికి ప్రత్యక్షంగా 10వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.



తేనె ఉత్పత్తికి వినియోగించే పెట్టెలు



తేనెటీగల పెంపకంపై మహిళలకు శిక్షణ

తితిదేకు సరఫరా

తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యప్రసాదాలు, ఇతరత్రా కార్యక్రమాల్లో తేనెను విరివిగా వినియోగిస్తోంది. జిల్లాలో ఉత్పత్తయ్యే తేనెను ఉపయోగించుకోవాలనే జిల్లా కలెక్టర్ చేసిన ప్రతిపాదనకు తితిదే అంగీకారం తెలిపింది.

తేనె పరిశ్రమను అభివృద్ధి చేస్తాం..

వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా జిల్లాలో తేనె పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. రూ.30 వేలకు ఆరు పెట్టెలను అందజేస్తున్నాం. 40 శాతం రాయితీ ఇస్తున్నాం. ఒక్కో పెట్టె ద్వారా నెలకు మూడు నుంచి నాలుగు కిలోల మంచి తేనె ఉత్పత్తవుతుంది. అటవీ ప్రాంతంతో పాటు పూల సాగు ఎక్కువగా ఉన్న కుప్పంలో తేనె అధికంగా వస్తుంది. అందుకే పరిశ్రమ ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాం. క్రమంగా అంతటా విస్తరిస్తాం.

– రవిప్రకాష్ రెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

భాజపా నేతలపై భౌతికదాడులు నిరోధించండి

డీజీపీకి వినతి

మంగళగిరి, న్యూస్‌టుడే: భాజపా నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా జరుగుతున్న భౌతిక దాడులను నిరోధించాలని ఆ పార్టీ నాయకులు డీజీపీ ఆర్.పి.ఠాకూర్‌ను కోరారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం సమర్పించారు. సీఎం చంద్రబాబునాయుడి కాకినాడ పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలు, అనంతరం భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఇంటి వద్ద తెదేపా శ్రేణులు చేసిన నిరసనలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యదర్శి జమ్ముల శ్యామ్‌కిషోర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తురగ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నంలో దివ్యాంగుల జాతీయ క్రీడా కేంద్రం

ఈనాడు, దిల్లీ: విశాఖపట్నంలో దివ్యాంగుల జాతీయ క్రీడా కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి థావర్ చంద్ గహ్లోత్ తెలిపారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా దివ్యాంగుల జాతీయ క్రీడా కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో తెలపాలని జహీరాబాద్ లోక్‌సభ సభ్యుడు బీబీ పాటిల్ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశ్నించారు. దేశంలో అయిదు చోట్ల వీటిని ఏర్పాటు చేయనున్నామని కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు. దక్షిణాది జోన్‌కు సంబంధించి విశాఖపట్నం, జిర్కాపూర్ (ఉత్తర జోన్), గ్వాలియర్ (మధ్య జోన్), షిల్లాంగ్ (ఈస్ట్ జోన్)ల్లో ఏర్పాటు చేయనున్నట్లు పశ్చిమ జోన్‌కు సంబంధించి ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆయన వివరించారు.

విత్తన సదస్సుకు ముమ్మర ఏర్పాట్లు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : అంతర్జాతీయ విత్తన పరీక్ష సంస్థ (ఐఎస్‌టీఏ) ఆధ్వర్యాన హెచ్‌ఐసీసీలో జూన్ 26 నుంచి జులై 3 వరకు జరిగే 32వ సదస్సుకు పూర్వ సమీక్ష సమావేశాన్ని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం, ఆహార-వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) సహకారంతో నిర్వహించే కార్యక్రమంపై మంగళవారం సచివాలయంలో సంబంధిత అధికారులతో చర్చించారు. జూన్ 26న ప్రారంభ కార్యక్రమం, 28 వరకు విత్తన సదస్సు, ప్రదర్శన, 28న వ్యవసాయదారుల సమావేశం ఉంటాయి. అదే నెల 29- జులై 3 మధ్య సంస్థ వార్షిక సభలు జరుగుతాయని సీఎస్ తెలిపారు. విత్తన ప్రదర్శనలో వివిధ దేశాల తరపున 200 కంపెనీలు పాల్గొంటాయన్నారు. కొత్త ఉత్పత్తులు, విత్తన శుద్ధి, ప్యాకింగ్ యంత్రాలు, అత్యాధునిక సాంకేతికతలపై ప్రదర్శనలు ఉంటాయన్నారు. సదస్సుకు హాజరయ్యే 400మంది విదేశీ ప్రతినిధులకు భద్రత, వసతి, రవాణా సదుపాయాల గురించి కూడా ఆయన సమీక్షించారు. సదస్సు ప్రచార పత్రాన్ని సీఎస్ ఆవిష్కరించారు. సమీక్షలో ఐఎస్‌టీఏ ప్రధాన కార్యదర్శి ఆండ్రియాస్ వైజ్, స్విట్జర్లాండ్ ప్రతినిధి ఓల్గా స్టోకీ, రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి పాల్గొన్నారు.

తిరుమలలో జానపదుల ఆందోళన

- స్పందించిన తితిదే పాలకమండలి
- ప్రయాణ భత్యం చెల్లింపునకు నిర్ణయం



శంఖుమిట్ట వలయంలో రహదారిపై బైఠాయించిన జానపద కళాకారులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల దివ్యక్షేత్రంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో తితిదే ఆలయాల్లో, మనగుడి కార్యక్రమాల్లో భజనలు చేసే జానపద కళాకారులకు ప్రయాణ భత్యం చెల్లించాలని తితిదే పాలకమండలి నిర్ణయించింది. తమ దీర్ఘకాల డిమాండును నెరవేర్చాలంటూ వేలాదిగా కళాకారులు తిరుమలకు వచ్చి ఆందోళనకు దిగడంతో ఈ నిర్ణయం తీసుకుంది. కళాకారుల సంఘం ప్రతినిధులు పులిమామిడి యాదగిరి ఆధ్వర్యంలో మంగళవారం వేకువజామున 3 గంటల సమయంలో తిరుమల శంఖుమిట్ట కూడలికి చేరుకున్నారు. ధర్మకర్తల మండలి సమావేశం జరిగే అన్నమయ్య భవనానికి వెళ్లే మార్గంలో బైఠాయించారు. గజగజలాడించే చలిలో ఉదయం వరకూ అక్కడే నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న విజిలెన్స్, పోలీసు అధికారులు వ్యవహారాన్ని తితిదే అధ్యక్షుడు పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో కళాకారుల సంఘం అధ్యక్షుడితో పాటు ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించారు. మండలి సభ్యులు నూతలపాటి శ్రీకృష్ణ, చల్లా రామచంద్రారెడ్డి బోర్డు సమావేశంలో వీరి డిమాండ్లపై స్పందించారు. అధ్యక్షుడితో పాటు ఇతర సభ్యులు కూడా న్యాయం చేయాలన్న అభిప్రాయానికి వచ్చారు. దూరాన్ని బట్టి కళాకారులకు ప్రయాణ భత్యం చెల్లించాలని నిర్ణయించారు. ఈ ప్రకటన వెలువడటంతో కళాకారులు ధర్మకర్తల మండలికి కృతజ్ఞతలు తెలిపి నిరసన విరమించారు.

చింతలే'కుంట' సాగు!





నాగులుప్పలపాడు నుంచి ఇంకొల్లు వెళ్లే రహదారి వెంట తవ్విన కుంటల్లో ఊటనీరు ★ సమీపంలో ఏపుగా పెరిగిన మిరప పంట

ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం కల్లకుంటలో రైతులు తవ్వించుకున్న నీటి కుంటలివి. గతేడాది నవంబరులో ఊరిలోని రైతులందరూ కలిసి.. పొక్లెయిన్లతో నీటి కుంటలు తవ్వించారు. ఒక్కోటి 25 అడుగుల లోతున సుమారు 40 కుంటలు తవ్వగా వాటిలో 15 అడుగుల వరకు నీరు చేరింది. మరోవైపు, ఇటీవల గుండ్లకమ్మ జలాశయం నుంచి కాలువల ద్వారా సాగు నీటిని విడుదల చేశారు. అందులో కొంత నీటిని పంటలకు వాడుతూ, మరికొంత నీటిని ఈ కుంటల్లో నింపుతున్నారు. అవసరమైనప్పుడు కుంటల్లోని నీటిని మోటార్లతో తోడుకుని రైతులు పంటలు సాగుచేస్తున్నారు. ఫలితంగా కుంటల చుట్టూ ఉన్న పొలాలు ఆకుపచ్చగా కళకళలాడుతున్నాయి. –ఈనాడు, ఒంగోలు

అడ్డగోలుగా విభజించి అన్యాయం చేశారు: కోడెల

గ్రామీణ నరసరావుపేట, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించి అన్యాయం చేశారని సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు అన్నారు. గురవాయపాలెంలో మంగళవారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'కాంగ్రెస్, భాజపా కలిసి అక్రమంగా ఆంధ్రప్రదేశ్‌ను రెండు ముక్కలు చేశాయి. మనం విభజనకు వ్యతిరేకంగా ఆందోళనలు, ధర్నాలు చేసినా పట్టించుకోలేదు. ఆస్తులు తెలంగాణకు ఇచ్చి మనకు అరచేతిలో వైకుంఠం చూపార'ని ఆయన విమర్శించారు. పాలనాదక్షుడు అధికారంలో ఉంటే ఎంత అభివృద్ధి సాధించవచ్చో నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసి చూపించారన్నారు. తెదేపా హయాంలో ప్రజలంతా సుఖశాంతులతో ఉన్నారని ఎమ్మెల్సీ సునీత అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ బొడ్డపాటి పేరయ్య, ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరిత వనం.. అందాల తోరణం!



పార్కు నిర్మాణంలో భాగంగా పెంచుతున్న పచ్చదనం

- 300 ఎకరాల్లో ఏర్పాటవుతున్న శాఖమూరు పార్కు
- గాంధీజీ, అంబేడ్కర్‌ల స్మృతివనాలు సహా వివిధ నిర్మాణాలు
- రాజధానికే ప్రత్యేక ఆకర్షణ
- ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో పలు ప్రాజెక్టులు

జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌లను నిత్యం స్మరించుకునేలా రెండు స్మృతివనాలు..! మధ్యలో పెద్ద జలాశయం! ఎటుచూసినా రంగురంగుల ఫౌంటెయిన్లు.. భారతీయ హస్త కళాకృతులకు నిలయంగా క్రాఫ్ట్స్‌బజార్.. గ్రామీణ వృత్తుల్ని, జీవన విధానాన్ని కళ్లకు కట్టే క్రాఫ్ట్స్ విలేజ్. మరోపక్క ఐదు నక్షత్రాల హోటళ్లు, వెల్‌నెస్ సెంటర్, పట్టాల్లేకుండా నడిచే మ్యాగ్నెటిక్ ట్రైన్, స్నోవరల్డ్, వాటర్‌స్పోర్ట్స్... ఇలా పిల్లలనుంచి పెద్దల వరకు అందరినీ ఆకట్టుకునేలా, విశేషాల సమాహారంగా రాజధాని అమరావతిలో 300 ఎకరాల్లో రీజినల్ పార్కును అభివృద్ధి చేస్తున్నారు. పరిపాలన నగరం ఉత్తరాన కృష్ణా తీరం నుంచి మొదలైతే, దీనికి కొనసాగింపుగా నిర్మిస్తున్న న్యాయనగరానికి చివర్లో దక్షిణాన శాఖమూరు పార్కు ఏర్పాటవుతోంది. అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఆధ్వర్యంలో పార్కు అభివృద్ధి చేపట్టారు. పార్కులో ఏర్పాటుచేసే వివిధ సదుపాయాలను వేర్వేరు ప్రాజెక్టులుగా విభజించారు. కొన్ని ఏడీసీ స్వయంగా చేపడుతుండగా.. మరి కొన్ని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం సివిల్ పనులు జరుగుతున్నాయి.



శాఖమూరు పార్కు నిర్మాణంలో భాగంగా జరుగుతున్న పనులు

నాలుగు రోడ్ల మధ్యలో..

పార్కు వైశాల్యం 300 ఎకరాలు. పార్కుకు నాలుగువైపులా ఇ8, ఇ9, ఎన్11, ఎన్12 రహదారులు వెళుతున్నాయి. పార్కు చుట్టు కొలత 4.4 కి.మీ.లు. పార్కు చుట్టూ చెట్లుంటాయి. జాగింగ్ ట్రాక్ ఏర్పాటుచేస్తున్నారు. పార్కు మధ్యలో 50 ఎకరాల్లో జలాశయాన్ని అభివృద్ధి చేస్తారు. జలాశయంలో బోటింగ్, ఎత్తైన ఫౌంటెయిన్, లేజర్‌షో వంటివి ఏర్పాటుచేస్తారు. జలాశయం చుట్టూ నడక మార్గాన్ని అభివృద్ధి చేస్తారు. ప్రపంచబ్యాంకు నిధులతో జలాశయం అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

గాంధీ, అంబేడ్కర్ స్మృతివనాలు

పార్కులో 19 ఎకరాల్లో గాంధీ స్మృతివనాన్ని అభివృద్ధి చేస్తారు. దీని ప్రణాళికలు, ఆకృతులను సిద్ధం చేస్తున్నారు. 20 ఎకరాల్లో అంబేడ్కర్ స్మృతివనం ఏర్పాటుచేస్తారు. దీన్ని సాంఘిక సంక్షేమశాఖ అభివృద్ధి చేయనుంది. 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం, స్మారక గ్యాలరీ, బౌద్ధ ధ్యాన కేంద్రం, గ్రంథాలయం వంటివి ఏర్పాటుచేస్తారు.

మొత్తం పూర్తయ్యేసరికి రెండేళ్లు

పార్కును ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి తెలిపారు. 'ఈ పార్కు రాజధానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. పార్కును మేమే అభివృద్ధి చేయాలని మొదట అనుకున్నాం. పార్కు నిర్మాణానికయ్యే వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో చేపట్టాలన్న నిర్ణయానికి వచ్చాం. ఇప్పటికే పనులు మొదలయ్యాయి. మౌలిక వసతుల పనులు జరుగుతున్నాయి. మరోపక్క ప్రగతి రిసార్ట్స్, రివర్‌బే వంటి సంస్థలూ పనులు ప్రారంభించాయి. త్వరలో కొన్ని వసతులైనా కల్పిస్తాం. పూర్తిస్థాయిలో పార్కును అభివృద్ధి చేయాలంటే రెండేళ్లు పడుతుంది' అని లక్ష్మీపార్థసారథి వెల్లడించారు.

- ఈనాడు, అమరావతి

పార్కులో చేపట్టే ఇతర ప్రాజెక్టులు

అంబేడ్కర్ పార్కు పక్కనే 7.50 ఎకరాల్లో క్రాఫ్ట్స్‌బజార్ ఏర్పాటవుతుంది. శిల్పారామం తరహాలో యాంఫీ థియేటర్, భారతీయ నిర్మాణశైలికి అద్దం పట్టేలా ఇతర నిర్మాణాలు చేపడతారు. క్రాఫ్ట్స్‌విలేజీ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ క్రాఫ్ట్స్ కౌన్సిల్‌కు ఎకరం కేటాయించారు. దీనిలో వివిధ కళాకృతుల విక్రయశాలలు, ఆర్గానిక్ ఫుడ్‌రెస్టారెంట్లు ఉంటాయి.

అంబేడ్కర్ పార్కుకు రెండోవైపు 20 ఎకరాల్లో రోజ్‌గార్డెన్ ఏర్పాటుచేస్తున్నారు. వివిధ రకాల పూలతోటలను అభివృద్ధి చేస్తారు.

శాఖమూరు రిజర్వాయరులో బోటింగ్ ప్రాజెక్టును కోస్టామెరీనా సంస్థకు అప్పగించారు. పదెకరాల్లో అడ్వెంచర్ పార్కు ఏర్పాటుచేస్తారు. స్నోవరల్డ్ సంస్థ దీన్ని అభివృద్ధి చేయనుంది.

30 ఎకరాల్లో అమ్యూజ్‌మెంట్ పార్కు అభివృద్ధి చేస్తారు. రివర్‌బే సంస్థ ఈ ప్రాజెక్టును చేపడుతోంది. వాటర్‌స్పోర్ట్స్, వాటర్‌స్లైడ్స్ వంటివి ఇందులో వస్తాయి.

పదెకరాల్లో ఎకోరిసార్ట్‌ను ఏర్పాటుచేస్తున్నారు. శారదా ఎకోరిసార్ట్స్ సంస్థ అభివృద్ధి చేయనుంది.

20 ఎకరాల్లో ప్రగతి రిసార్ట్స్ సంస్థ వెల్డర్‌నెస్ పార్కును అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే 1200 మొక్కలు నాటారు. మొదటి దశలో నక్షత్ర, రాశి, నవగ్రహ, పంచభూత, గణపతి వనాలను అభివృద్ధి చేస్తారు. ఈ పార్కులో ఒక్కో నడకదారి పక్కన ఒకే రకం మొక్కలు నాటుతారు. పారిజాతం, నాగలింగం, మారేడు, రావి... ఇలా ఒక్కో మార్గం వెంట ఒక్కో జాతి మొక్కలు నాటుతారు.

పార్కులో మొత్తం నాలుగు ఐదు నక్షత్రాల హోటళ్లు, ఒక త్రీస్టార్ రిసార్టు ఏర్పాటు చేయాలన్నది యోచన. ఫైవ్‌స్టార్ హోటల్ ఏర్పాటుకు హయత్ వంటి సంస్థలు ముందుకువచ్చాయి. రెండు స్టార్‌హోటళ్లకు ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన ఇచ్చారు. మూడెకరాల్లో స్పోర్ట్స్ రిక్రియేషన్ క్లబ్ ఏర్పాటవుతుంది.

రిజర్వాయర్‌లో ఫౌంటెయిన్, లేజర్‌షో ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. వచ్చిన ప్రతిపాదనలు సంతృప్తికరంగా లేకపోవడంతో మళ్లీ టెండర్లకు వెళుతున్నారు.

జలాశయం చుట్టూ నడకదారి అభివృద్ధి చేస్తారు. ఆ మార్గంలో సంచరించేవారికి ఆహ్లాదకర వాతావరణం ఉండేలా కొబ్బరి చెట్లు వంటివి నాటుతారు.

రికార్డు ఎఫ్‌డీఐగా ఏపీపీ పెట్టుబడి

- రాష్ట్రంలో రూ.24,500 కోట్లు పెట్టనున్న ఇండోనేషియా సంస్థ
- నేడు కాగిత గుజ్జు పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్న సీఎం

ఈనాడు, అమరావతి: ఈ ఆర్థిక సంవత్సరం(2018-2019)లో మన దేశంలోకి వచ్చిన అతిభారీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి(ఎఫ్‌డీఐ)గా ఏషియా పల్ప్, పేపర్ (ఏపీపీ) గ్రూపు పెట్టుబడి రికార్డు సృష్టించింది. ఆ పెట్టుబడి కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు రావడం విశేషంగా మారింది. ఇండోనేషియాకు చెందిన సదరు సంస్థ ఏకంగా రూ.24,500 కోట్లను ఏపీలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం రాష్ట్రం సాధిస్తున్న పారిశ్రామిక ప్రగతికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత దక్షిణ కొరియాకు చెందిన కియా మోటార్స్ అనంతపురం జిల్లాలో రూ.13 వేల కోట్ల భారీ పెట్టుబడితో కార్ల పరిశ్రమను ఏర్పాటు చేస్తుండగా తాజాగా అంతకు రెండింతల పెట్టుబడితో ఏపీపీ గ్రూపు కాగితపు గుజ్జు పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలం చేవూరులో 2,500 ఎకరాల విస్తీర్ణంలో ఈ పరిశ్రమను నెలకొల్పుతోంది. ఈ పరిశ్రమ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 15 వేల మందికి ఉపాధి లభించనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం శంకుస్థాపన చేసే ఈ కార్యక్రమంలో ఏపీపీ గ్రూపు, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మండలి (ఏపీఈడీబీ)తో అవగాహన ఒప్పందం చేసుకోనుంది. పలు రాయితీలు, ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాలు కల్పించి ఏపీపీ గ్రూపును రప్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విజయవంతమైంది. కాగిత గుజ్జు తయారీకి అందుబాటులో ముడిసరకు, రామాయపట్నంలో పోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వ చర్యలు, తగినంత భూమి లభ్యత వంటివన్నీ ప్రకాశం జిల్లాలో ఇండోనేషియా సంస్థ పెట్టుబడులకు కలిసొచ్చిన అంశాలని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఒకేచోట ఇంత భారీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి రావడం ఇదే మొదటిసారని ఈడీబీ సీఈవో జాస్తి కృష్ణకిశోర్ అభిప్రాయపడ్డారు.

'లైట్ ఆటో కంపోనెంట్' రూ.300 కోట్ల పెట్టుబడులు

- మెగ్నీషియంతో వాహన విడిభాగాల తయారీ
- ఆర్థికాభివృద్ధి మండలితో అవగాహన ఒప్పందం

ఈనాడు, అమరావతి: వాహనాల విడిభాగాల తయారీ రంగంలో రూ.300 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు లైట్ ఆటో కంపోనెంట్ ప్రయివేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో ఏదో ఒక ప్రాంతంలో అల్యూమినియానికి ప్రత్యామ్నాయంగా మెగ్నీషియంతో వాహన విడిభాగాల తయారీలో ఈ సంస్థ పెట్టుబడులు పెట్టనుంది. సచివాలయంలో మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ సమక్షంలో లైట్ ఆటో కంపోనెంట్ మేనేజింగ్ డైరక్టర్ బాల ఆనంద బాలాజీ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మండలి సీఈవో జాస్తి కృష్ణకిశోర్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నారు. మొదటి దశలో రూ.100 కోట్లు, రెండో దశలో రూ.200 కోట్ల పెట్టుబడులు పెట్టి నెలకొల్పే పరిశ్రమతో ప్రత్యక్షంగా 250, పరోక్షంగా మరో 350 మందికి ఉపాధి లభిస్తుందని సంస్థ ఎండీ తెలిపారు. మెగ్నీషియంతో వాహనాల విడిభాగాలతో వాహనాల బరువు తగ్గడంతోపాటు ఇంధన సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని కంపెనీ సీఈవో సుభాచరణ్ వెల్లడించారు. హిందుస్థాన్ మెగ్నీషియం కంపెనీ మరో రూ.200 కోట్లతో లైట్ ఆటో చక్రాలు తయారు చేసే పరిశ్రమ ఏర్పాటుకు కూడా ఈ సందర్భంగా ఈడీబీ సీఈవోతో ఒప్పందం చేసుకుంది.

గన్నవరం విమానాశ్రయంలో.. టోనీ బ్లెయిర్‌కు వీడ్కోలు

విమానాశ్రయం (గన్నవరం), న్యూస్‌టుడే: బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌కు గన్నవరం విమానాశ్రయంలో పలువురు మంత్రులు, అధికారులు మంగళవారం వీడ్కోలు పలికారు. ఆర్టీజీఎస్ పనితీరు పరిశీలనకు సోమవారం ఆయన అమరావతికి వచ్చిన విషయం తెలిసిందే. రాత్రి విజయవాడ నోవాటెల్ హోటల్‌లో బస చేశారు. మంగళవారం ఉదయం 8.26 గంటలకు గన్నవరం విమానాశ్రయంనుంచి ప్రత్యేక విమానంలో దిల్లీ బయలుదేరి వెళ్లారు. ఆయనకు వీడ్కోలు పలికిన వారిలో మంత్రులు లోకేశ్, నక్కా ఆనందబాబు, విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, ప్రొటోకాల్ అధికారి కల్నల్ అశోక్‌బాబు, విజయవాడ డీసీపీ గజరావు భూపాల్ తదితరులు ఉన్నారు.

పారిశ్రామిక పార్కుకు రుసుముల మినహాయింపు

ఈనాడు, అమరావతి: విశాఖపట్నం-కాకినాడ ఇంధన-రసాయనాలు పెట్టుబడుల ప్రాంత (వీకే పీసీపీఐఆర్) పరిధిలో కాకినాడ సెజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పారిశ్రామిక పార్కుకు లేఅవుట్, మాస్టర్ ప్లాను అనుమతుల కోసం చెల్లించాల్సిన రుసుంల నుంచి మినహాయింపులిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తూర్పు గోదావరి జిల్లాలో 10,400 ఎకరాల్లో పారిశ్రామిక పార్కుని అభివృద్ధి చేయనున్నారు.

★ విశాఖ-చెన్నై పారిశ్రామిక నడవలో భూ సేకరణకు రూ.106.75 కోట్లు పరిహారం కింద చెల్లించేందుకు పరిపాలన అనుమతులిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.



విజయవాడ లెనిన్‌కూడలిలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు తదితరులు

కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలు వ్యతిరేకిస్తూ నిరసనలు

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన సమ్మెలో భాగంగా వ్యవస్థీకృత, అసంఘటిత రంగ కార్మికులు పలుచోట్ల నిరసన ప్రదర్శనలు చేశారు. మంగళవారం విధులు బహిష్కరించి ఆందోళనలు నిర్వహించారు. పలు ఉద్యోగ సంఘాలు సమ్మెకు మద్దతు ప్రకటించాయి. విజయవాడ లెనిన్‌నగర్ కూడలిలో ముఠా కార్మికుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. విశాఖపట్నంలోనూ ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులు ఆందోళనలో పాల్గొన్నారు. తిరుపతిలోనూ పాక్షిక ప్రభావం కన్పించింది. విజయవాడలో నిర్వహించిన సభలో పలువురు నేతలు పాల్గొన్నారు. కార్మికులకు కనీస వేతనం, పని భద్రత, సౌకర్యాల కల్పనను విస్మరించిన ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనాలందించి కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓబులేసు, సీఐటీయూ నాయకులు వెంకటేశ్వర్లు, మునిశంకర్, కుటుంబరావు, ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కాపులకూ రిజర్వేషన్లు కల్పించాలి

- వాల్మీకులను ఎస్టీల్లో, రజకులను ఎస్సీల్లో చేర్చాలని డిమాండ్ చేస్తు న్నా
- ఎన్నికలొస్తున్నందునే అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు
- వాల్మీకులకు 100కోట్లు ప్రకటిస్తున్నా
- మోదీ, కేసీఆర్, జగన్ అవినీతి నాటకాలు చెల్లవు
- కర్నూలు జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబునాయుడు
- ఓర్వకల్లు విమానాశ్రయం, సౌరపార్కు జాతికి అంకితం





కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయంలో విమానం దిగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ★ పౌర విమానయాన సంస్థ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న అధికారులు. చిత్రంలో ఎమ్మెల్యేలు జనార్దనరెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్

ఈనాడు డిజిటల్ - కర్నూలు: 'వాల్మీకులను గిరిజనులుగా చేర్చమని, కాపులకు రిజర్వేషన్లు కల్పించమని, రజకులను ఎస్సీల్లో చేర్చాలని కేంద్రానికి నివేదిక పంపాం. కేంద్రం ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు ఇవి కూడా చేయాల్సిన అవసరం ఉందని గట్టిగా డిమాండ్ చేస్తున్నా' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. 'వాల్మీకులు ఎప్పుడూ తెదేపాతోనే ఉన్నారు. పక్క రాష్ట్రంలో వారు ఎస్టీలుగా ఉంటే మన రాష్ట్రంలో బీసీలుగా ఉన్నారు. ప్రొఫెసర్ సత్యపాల్ కమిటీ వేసి అధ్యయన నివేదికలు కేంద్రానికి పంపాం. అసెంబ్లీలో బిల్లు కూడా చేశాం. వారికి చేతివృత్తులు లేవు. నచ్చిన పనిచేసుకోవడానికి రాష్ట్రంలో రూ.100కోట్లు ప్రకటిస్తున్నా. త్వరలో కార్యక్రమాలు చేపడతాం' అని వెల్లడించారు. ఎన్నికలు వస్తున్నందునే కేంద్రం ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు 10శాతం రిజర్వేషన్లు పెడుతోందన్నారు. కర్నూలు జిల్లా కోసిగి 'జన్మభూమి- మా ఊరు' సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి ఓర్వకల్లు విమానాశ్రయం, రూ.7వేల 0కోట్ల పెట్టుబడితో సౌరపార్కును ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. మంత్రి నారా లోకేష్‌తో కలిసి 'జలధార', 'మా ఊరిబాట' పథకాల పైలాన్‌ను ఆవిష్కరించారు.

కేంద్రం చేసిన అన్యాయాన్ని గట్టిగా నినదించారు

రాష్ట్రం, దేశంలోని 15మంది నిపుణులతో జయప్రకాశ్‌నారాయణ ఒక కమిటీ వేసి ఇంకా కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు రూ.85 వేల కోట్లు ఇవ్వాలని స్పష్టం చేశారని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ విషయంలో మేధావులను అభినందించాల్సి ఉందని, మన కోసం సంఘీభావం తెలియజేయడమే కాకుండా కేంద్రం చేసిన అన్యాయాన్ని గట్టిగా నినదించారని చెప్పారు. ఉపాధి హామీ కింద ఈ సంవత్సరం ఇప్పటికే రూ.1700 కోట్లు ఇవ్వాలని, పాత నిధులు అన్నీ కలిపి మొత్తం మీద రూ.3,311 కోట్లు ఇవ్వకుండా కేంద్రం కాలయాపన చేస్తోందన్నారు.

అవినీతిపరులపై మేం కఠినంగా ఉంటాం

'జగన్ అవినీతి వల్ల ఐఏఎస్ అధికారులు జైలుకెళ్లారు. పారిశ్రామికవేత్తలు, పక్కనున్న వాళ్లు జైలుకు పోయారు. అవినీతిపరులపై మేం కఠినంగా ఉంటాం. ఎవ్వరినీ వదలిపెట్టం. ఎవరైనా మాపై అవినీతి రుద్దాలని చూస్తే ఊరుకోం. రూ.43వేల కోట్ల అవినీతి చేశారని సీబీఐ కోర్టులో ఛార్జిషీటు వేసింది' అని చంద్రబాబు ధ్వజమెత్తారు. తనకు ఒక్క రూపాయి అవినీతి చేసే అవసరం లేదని స్పష్టం చేశారు. 'మోదీ దేశాన్ని భ్రష్టు పట్టించారు. రాష్ట్రంపై దాడి చేస్తూ బలహీనం చేసి పేదవాళ్లకు అన్యాయం చేసే పరిస్థితికొచ్చారు. కేంద్రం అన్నింటిలో 670 అవార్డులిచ్చి ఈ రోజు అభాండాలు వేస్తోంది. ఇది దుర్మార్గమైన చర్య. మోదీ, కేసీఆర్, జగన్ అంతా కలిసి నాటకాలు ఆడుతున్నారు. ఆ నాటకాలు చెల్లవని మనం చెప్పాల్సిన అవసరం ఉంది' అని పేర్కొన్నారు.

> మోదీ అవినీతి చేస్తే జగన్ మాట్లాడరు. ఏ ప్రాజెక్టు వచ్చినా అడ్డుకుంటారు. అమరావతిలో స్వచ్ఛందంగా రైతులే భూములిస్తే, పోలవరం పాత ధరలకే చేయిస్తే అందులో అవినీతి జరిగిందంటారు. అవినీతి చక్రవర్తులకు రాష్ట్రమంతా అవినీతే కనిపిస్తుంది. రాష్ట్రంలో రూ.6లక్షల కోట్ల అవినీతి జరిగిందని విమర్శిస్తున్నారు. అసలు రాష్ట్ర బడ్జెట్టే అంత లేదు. ఆయన అవినీతిలో కూరుకుపోయి నాకు అంటించాలని చూస్తున్నారు. ఆ బురద నా మీద చల్లలేరు.
>
> - ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

'సూర్యోదయ ఆంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దుతా

ఆంధ్రప్రదేశ్ దేశంలో తూర్పున మధ్యభాగంలో ఉందని, సూర్యరశ్మిని ఉపయోగించుకుని సౌరవిద్యుత్తును ఉత్పత్తి చేసి రాష్ట్రాన్ని 'సూర్యోదయ ఆంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దుతానని చంద్రబాబు పేర్కొన్నారు. కర్నూలు జిల్లా గని-శకునాల సౌర ప్రాజెక్టు వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ప్రపంచంలో మూడో స్థానంలో ఉందన్నారు. పిన్నాపురంలో ఐదువేల మెగావాట్ల సామర్థ్యంతో సౌర పరిశ్రమ, హైబ్రీడ్ స్టోరేజి ప్లాంటు ఏర్పాటుకు మంత్రి మండలి తీర్మానం పూర్తయిందని చెప్పారు. తొలిసారిగా విద్యుత్తును నిల్వచేసే పద్ధతికి శ్రీకారం చుట్టామన్నారు. కర్నూలుకు విమానాశ్రయం వస్తుందని ఎవ్వరూ అనుకోలేదని, రూ.88.5 కోట్లు ఖర్చు చేసి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి చేసిందన్నారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

జలధారతో నూతన చరిత్రకు శ్రీకారం

జలధారతో నూతన చరిత్రకు శ్రీకారం చుట్టామని చంద్రబాబు చెప్పారు. 2019-20 సంవత్సరానికి మొదటివిడతగా రూ.16వేల కోట్లు, అదనంగా మరో రూ.6వేల కోట్లు ప్రతిపాదనలతో ఇంటింటికి నీళ్లు ఇవ్వడానికి నిర్ణయించామన్నారు. 'మా ఊరి బాట' పథకం ద్వారా గ్రామాల్లో మట్టిరోడ్డు అనేది లేకుండా... రెండు సంవత్సరాల్లో 3,278 గ్రామాల్లో రూ.4.234 కోట్లతో రోడ్లు వేస్తామని చెప్పారు.

ఏం తమ్ముళ్లూ హుషారుగా ఉన్నారా?

ఏం తమ్ముళ్లు హుషారుగా ఉన్నారా? ఆడబిడ్డలు మీరు ఎలా ఉన్నారంటూ సీఎం ఆప్యాయంగా పలకరిస్తూ సభను ప్రారంభించారు. కోసిగి ప్రజలు చూపిన ఉత్సాహం, స్వాగతం భవిష్యత్తులో కొండనైనా ఢీకొట్ట గల ధైర్యమిచ్చిందన్నారు. అన్ని గ్రామాల్లో కనీస పౌర సదుపాయాలు పూర్తి చేశామని చెప్పారు. 'నరేగా పనుల్లో ఈ ఐదేళ్లలో 23,950కి.మీ. రూ.5,568కోట్లు ఖర్చు పెట్టాం. చిన్నతరహా చెరువుల పునరుద్ధరణకు 45,391పనులను రూ.2,695కోట్లతో చేశాం. 6.11లక్షల పంట సంజీవని కుంటలు తీశాం. 9.13లక్షల మరుగుదొడ్లు, 3.59 లక్షల ఎకరాల్లో ఉద్యానవన పంటలు అభివృద్ధి చేశాం. రాష్ట్రంలో 5,700 అంగన్‌వాడీ కేంద్రాలు, 2,300 శ్మశానాల అభివృద్ధిని చేసి 2,121 కి.మీ. కాంపౌండ్‌వాల్ నిర్మించామని వివరించారు. కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా రూ.120కోట్లతో కర్నూలు వైద్యశాలలో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు, 800ఎకరాల్లో ఫార్మా క్లస్టర్‌కు, ఎంఎస్ఎంఈలో మూడు పార్కులకు శంకుస్థాపన చేశారు. ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మంత్రులు కాల్వ శ్రీనివాసులు, ఫరూక్, ఎంపీలు బుట్టా రేణుక, ఎస్పీవై రెడ్డి, ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామాయపట్నానికి కాకినాడ ఆదాయం


- పదేళ్లపాటు వెచ్చించేందుకు ప్రభుత్వం నిర్ణయం
- రూ.4,500 కోట్లతో రామాయపట్నం రేవు
- నేడు ముఖ్యమంత్రి శంకుస్థాపన

ఈనాడు, అమరావతి: ప్రకాశం జిల్లా రామాయపట్నం ఓడరేవు నిర్మాణానికి కాకినాడ పోర్టు గ్రూపు పరిధిలో వచ్చే ఆదాయాన్ని పదేళ్లపాటు వెచ్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాకినాడ పరిధిలోని మూడు పోర్టులనుంచి ప్రస్తుతం ఏటా దాదాపు రూ.150 కోట్ల ఆదాయం వస్తోంది. ఈ మొత్తాలను బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకోడానికి పూచీకత్తుగా, ఇతర అవసరాలకు వినియోగించనున్నారు. 2020లో పనులు ప్రారంభించి 2022లో కార్యకలాపాలు చేపట్టే పోర్టు నిర్మాణానికి రూ.4,240 కోట్లకుపైగా అవసరమవుతుందని అంచనా. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పోర్టులను కాకినాడ, మచిలీపట్నం పేరుతో రెండు గ్రూపులుగా విభజించారు. కాకినాడ గ్రూపు పరిధిలోని కాకినాడ, గంగవరం, రవ్వ ఓడరేవుల నుంచి వచ్చే ఆదాయాన్ని రామాయపట్నం పోర్టు నిర్మాణ బాధ్యతలు చూసే 'ఏపీ మారిటైం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సంస్థ'కు జమ చేస్తారు. 3,092 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టే పోర్టు 2020-21 నాటికి 20.26 మిలియన్ మె.టన్నుల సరకు రవాణా సామర్థ్యం కలిగి ఉంటుంది. 2040-41 నాటికి 138.54 మి.మెట్రిక్ టన్నులకు విస్తరిస్తుందని అంచనా వేస్తున్నారు. ఓడరేవు నుంచి గ్రానైట్ బ్లాకులు, వ్యవసాయ ఉత్పత్తులు, బొగ్గు, ఎరువులు, ఎడిబుల్ ఆయిల్, సిమెంట్ ఎగుమతులకు అవకాశం ఉంది.

మొదటి విడతలో ఎనిమిది బెర్తులు

పోర్టులో మొదటి విడత ఎనిమిది బెర్తులు అందుబాటులోకి రానున్నాయి. ఇది 4.9 కిలోమీటర్ల అత్యంత పొడవైన బ్యాక్‌వాటర్ కలిగిన పోర్టు అని రాష్ట్ర ఓడరేవుల సంచాలకులు కోయ ప్రవీణ్ మంగళవారం విజయవాడలో విలేకరులకు తెలిపారు. తమిళనాడులోని ట్యూటికోరిన్ పోర్టు ఇప్పటివరకు 3.8 కిలోమీటర్ల బ్యాక్‌వాటర్ కలిగి ఉందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్మించే పోర్టుల మధ్య వ్యత్యాసం ఉండదని, రాష్ట్ర ప్రభుత్వ నేతృత్వంలో చేపట్టేది మైనర్, కేంద్ర ప్రభుత్వం నిర్మించేది మేజర్ పోర్టుగా మాత్రమే పిలుస్తారని సంచాలకులు వివరించారు. రామాయపట్నం పోర్టు నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ఉదయం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి నెలాఖరులో శంకుస్థాపన చేసే అవకాశం ఉందని, భావనపాడు పోర్టు నిర్వాసితుల కోసం ఈనెల 11న ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రామాయపట్నం పోర్టుకు కావలసిన భూములు:	3092.43 ఎకరాలు
అంచనా వ్యయం:	రూ.4240 కోట్లు
పోర్టు బ్యాక్‌వాటర్ పొడవు:	4.9 కిలోమీటర్లు
అందుబాటులోకి వచ్చే బెర్తులు:	8
పోర్టు సామర్థ్యం:	ఏటా 40 మె.టన్నులు
పనులు ప్రారంభించేది:	జనవరి 2020
కార్యకలాపాల ప్రారంభం:	జనవరి 2022



రామాయపట్నం పోర్టు నిర్మాణ లేఅవుట్‌ను చూపిస్తున్న రాష్ట్ర ఓడరేవుల సంచాలకులు ప్రవీణ్



విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలంలో వాగు దాటుతూ, కొండ దిగుతూ సిసోడియా పర్యటన

ఓటు వేయవోయి.. బతుకు బాగుపడునోయి

గిరిజనగూడేల్లో వాగులు దాటి, సిసోడియా పర్యటన

గిరిజనులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాంప్రకాష్ సిసోడియా మంగళవారం కాలినడకన ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించారు. వాగులు దాటారు, కాలినడకన 10 కిలోమీటర్ల మేర కొండలు ఎక్కారు. గిరిజన గూడేల్లోకి వెళ్లి వారితో ముచ్చటించారు. ఓటుహక్కు ఉందా, లేదా? సొంతంగానే ఓటు వేస్తున్నారా? ఎవరైనా ప్రలోభాలు పెడుతున్నారా?.. వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం డబ్బులిచ్చేవారిని గ్రామాల నుంచి తరిమికొట్టాలని, ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకుని మంచి వ్యక్తిని ఎన్నుకున్నప్పుడే బతుకులు బాగుపడే అవకాశముందని సిసోడియా గిరిజనులకు హితవు పలికారు. రాళ్ల రహదారిలో కొండ లెక్కి తమ గ్రామాలకు అధికారులు రావడం పట్ల గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. సిసోడియాతోపాటు పార్వతీపురం ఐటీడీఏ పీవో లక్ష్మీ, ఉప కలెక్టర్ చేతన్ ఉన్నారు

- న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం





మూడో స్థానానికి పుజారా

దుబాయ్: ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో అద్భుతంగా రాణించిన చెతేశ్వర్ పుజారా ఐసీసీ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో ఎగబాకాడు. తాజాగా ఓ స్థానం మెరుగుపర్చుకుని మూడో ర్యాంకుకు దూసుకెళ్లాడు. రిషబ్ పంత్ ఏకంగా 21 స్థానాలు ఎగబాకి 17 స్థానంలో నిలిచాడు. అత్యుతమ ర్యాంకు సంపాదించిన భారత స్పెషలిస్ట్ వికెట్ కీపర్‌గా అతడు ఫరూక్ ఇంజినీర్ (1973)ను సమం చేశాడు. కెప్టెన్ విరాట్ కోహ్లి నంబర్‌వన్ బ్యాట్స్‌మన్‌గా కొనసాగుతున్నాడు. మయాంక్ అగర్వాల్ 62వ స్థానంలో ఉన్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో కుల్‌దీప్ యాదవ్ ఏడు స్థానాలు ఎగబాకి కెరీర్‌లోనే అత్యుత్తమంగా 45వ ర్యాంకు సాధించాడు. ఆసీస్‌తో చివరి టెస్టులో అతడు 99 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టిన సంగతి తెలిసిందే. బుమ్రా 16వ స్థానంలో కొనసాగుతున్నాడు. షమి ఓ స్థానం మెరుగుపర్చుకుని 22వ స్థానంలో నిలిచాడు. జడేజా ఆరు నుంచి ఐదో స్థానానికి చేరుకున్నాడు. టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్ నంబర్‌వన్ జట్టుగా కొనసాగుతోంది.

ఐపీఎల్ ఈసారి మార్చి 23 నుంచే..


ఎన్నికలున్నా పూర్తిగా భారత్‌లోనే నిర్వహణ



దిల్లీ

సార్వత్రిక ఎన్నికలు జరగనున్నప్పటికీ ఈసారి ఐపీఎల్ భారత్‌లోనే జరగనుంది. కాకపోతే కాస్త ముందుగానే ఆరంభంకానుంది. ఎన్నికలతో పాటు మే ఆఖర్లో వన్డే ప్రపంచకప్ ఆరంభమవనున్న నేపథ్యంలో.. ఎప్పటిలా ఏప్రిల్‌లో కాకుండా.. ఈసారి మార్చిలోనే టీ20 లీగ్‌ను షురూ చేయాలని బీసీసీఐ పాలకుల కమిటీ (సీఓఏ) నిర్ణయించింది. మార్చి 23ని ముహూర్తంగా ఖరారు చేసింది. వేదికలు, మ్యాచ్‌ల షెడ్యూల్‌పై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఫ్రాంఛైజీల ప్రధాన వేదికలకు ఈసారి ప్రత్యామ్నాయ వేదికలనూ సిద్ధం చేస్తామని సీఓఏ ఛైర్మన్ వినోద్‌రాయ్ ప్రకటించాడు. వినోద్ రాయ్, సీఓఏ సభ్యురాలు డయానా ఎడుల్జీల బృందం మంగళవారం ఐపీఎల్ నిర్వహణపై సమావేశమైంది. ఎన్నికల నేపథ్యంలో ఈసారి ఐపీఎల్‌లో కొంత భాగం విదేశాల్లో నిర్వహించే అవకాశముందని మొదట వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఐతే అలాంటిదేం లేదని సీఓఏ తేల్చేసింది. "ఐపీఎల్ పూర్తిగా భారత్‌లోనే జరుగుతుంది. వివిధ ప్రభుత్వ శాఖలతో పాటు ఐపీఎల్‌తో ముడిపడిన అన్ని వర్గాలతో చర్చించాక మ్యాచ్‌ల షెడ్యూల్‌ను వెల్లడిస్తాం. ఈసారి ప్రతి వేదికకు ప్రత్యామ్నాయ వేదికనూ సిద్ధంగా ఉంచుతాం. ఎన్నికలు, రీకౌంటింగ్ లేదా ప్రధానమంత్రి ర్యాలీ ఇలా ఏదైనా కారణంతో హఠాత్తుగా మ్యాచ్‌ను తరలించాల్సి వస్తే.. మరో వేదికలో మ్యాచ్‌ను నిర్వహిస్తాం. దేశంలో వివిధ దశల్లో ఎన్నికలు ఉంటాయి కాబట్టి.. ఐపీఎల్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదు" అని వినోద్ రాయ్ వివరించాడు. 2010 తర్వాత ఐపీఎల్‌ను మార్చిలో ఆరంభించడం ఇదే తొలిసారి. ఎన్నికల కారణంగా 2009 ఐపీఎల్‌ను దక్షిణాఫ్రికాలో నిర్వహించిన సంగతి తెలిసిందే. 2014లో కొంత భాగం లీగ్‌ను యూఏఈలో నిర్వహించారు. ఈసారి లీగ్‌కు సంబంధించి షెడ్యూల్‌ను ఫిబ్రవరిలో విడుదల చేసే అవకాశముంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాక అందుకు తగ్గట్టుగా కాస్త మార్పులు చేయొచ్చు. ఫైనల్‌ను మే 15లోపు నిర్వహించే అవకాశముంది. బీసీసీఐ కొత్త రాజ్యాంగం ప్రకారం ప్రపంచకప్ ఆరంభానికి పదిహేను రోజుల్లోపు ఐపీఎల్ ముగియాలి. మే 30న ఇంగ్లాండ్‌లో వన్డే ప్రపంచకప్ ఆరంభంకానున్న సంగతి తెలిసిందే.

ఇంకా సంబరాల్లోనే..



ఆస్ట్రేలియాపై చరిత్రాత్మక సిరీస్ విజయాన్ని విరాట్ కోహ్లి, అనుష్క ఇంకా ఆస్వాదిస్తూనే ఉన్నారు. సోమవారం సిడ్నీ మైదానమంతా కలియదిరిగిన ఈ జంట.. తర్వాత హోటల్ గదికి వెళ్లి అక్కడా సంబరాలు చేసుకుంది. అనుష్కకు కేక్ తినిపించిన కోహ్లి.. తన స్నేహితులకు విందు ఇచ్చాడు. ఈ ఫొటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

కోహ్లీసేనకు బీసీసీఐ నజరానా

దిల్లీ: ఆస్ట్రేలియాపై చారిత్రక టెస్టు సిరీస్ విజయం సాధించిన కోహ్లీసేనకు బీసీసీఐ నజరానా ప్రకటించింది. నాలుగు టెస్టుల సిరీస్‌లో తుది జట్టులో ఉన్న ప్రతి ఆటగాడికీ మ్యాచ్‌కు రూ.15 లక్షల చొప్పున ప్రత్యేక పారితోషకం అందుతుంది. నాలుగు టెస్టులూ ఆడితే రూ.60 లక్షలు అందుతాయి. తుది జట్టులో లేని ఆటగాడికి మ్యాచ్‌కు రూ.7.5 లక్షల చొప్పున.. కోచ్‌లు ఒక్కొక్కరికి సిరీస్ మొత్తానికి కలిపి రూ.25 లక్షల చొప్పున నజరానా ప్రకటించింది బీసీసీఐ.



పంత్ ప్రపంచకప్ ప్రణాళికల్లో ఉన్నాడు

ముంబయి: యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ కచ్చితంగా ప్రపంచకప్ ప్రణాళికల్లో ఉన్నాడని భారత క్రికెట్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ స్పష్టం చేశాడు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు పంత్‌ను పక్కన పెట్టడంతో తలెత్తిన సందేహాలకు అతను సమాధానం ఇచ్చాడు. "అతను ప్రపంచకప్ కోసం ఉద్దేశించిన వికెట్ కీపర్లలో ఒకడు. ఈ టోర్నీ కోసం కుదించిన వికెట్ కీపర్ల జాబితాలో ఉన్న వారంతా సత్తా చాటుతున్నారు. పంత్ కచ్చితంగా ప్రపంచప్ ప్రణాళికల్లో భాగమే. ఈ రోజుల్లో మేం చాలా మంది ఆటగాళ్లకు విశ్రాంతి ఇస్తున్నాం. ఈ కుర్రాడు ఆస్ట్రేలియాతో టీ20లు ఆడాడు. టెస్టు సిరీస్‌లోనూ పాల్గొన్నాడు. శరీరం అలసటకు గురై ఉంటుంది. పంత్‌కు చిన్న ఇబ్బందులున్నాయి. వాటి నుంచి కోలుకోవడానికే విశ్రాంతి ఇచ్చాం" అని ప్రసాద్ అన్నాడు.



70ల్లో విండీస్‌లా.. 90ల్లో ఆసీస్‌లా!

ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాపై తొలిసారి టెస్టు సిరీస్ గెలిచిన కోహ్లీసేనపై దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఇది భారత క్రికెట్ చరిత్రలోనే అతి పెద్ద విజయాల్లో ఒకటని అన్నాడు. ఈ ఊపును కొనసాగిస్తూ ప్రపంచ క్రికెట్లో ఏళ్ల పాటు భారత జట్టు ఆధిపత్యం చలాయించాలని గావస్కర్ అభిలషించాడు. ఈ చారిత్రక విజయంపై సన్నీ ఒక ఇంటర్వ్యూలో ఇంకా ఏమన్నాడంటే..

- టీమ్‌ఇండియా ఆధిపత్యం సాగాలి
- అప్పుడే అసలైన నంబర్‌వన్ అనిపించుకుంటుంది: గావస్కర్

1971లో వెస్టిండీస్‌ను వెస్టిండీస్‌లో, ఆపై ఇంగ్లాండ్‌ను ఇంగ్లాండ్‌లో ఓడించాక భారత జట్టు సాధించిన అతి గొప్ప టెస్టు సిరీస్ విజయం ఇదే. ఎక్కడైనా సరే తొలిసారి సాధించే విజయం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఇది చారిత్రక సందర్భం. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతి నుంచి భారత జట్లు ఆస్ట్రేలియాకు వెళ్తూనే ఉన్నాయి. 1986లో ఒక్కసారి సిరీస్ డ్రా చేసుకున్నాం. ఆ సిరీస్‌లో ఆస్ట్రేలియాకు భారత్ ఫాలోఆన్ కూడా ఇచ్చింది. ఇప్పట్లా తటస్థ అంపైర్లుంటే ఆ మ్యాచ్ గెలిచి సిరీస్ సాధించేవాళ్లం. ఇదంతా పక్కన పెడితే ప్రస్తుత విజయం చాలా పెద్దది.

ఆ రెండు జట్లలా..: ఈ విజయానికి పునాది పడింది 2014-15లో. అప్పట్నుంచి భారత జట్టు నిలకడగా విజయాలు సాధిస్తోంది. 2015 నుంచి ఇప్పటిదాకా నడిచింది సంధి దశ. ప్రస్తుత జట్టులో అత్యుత్తమ విషయం ఏంటంటే.. జట్టులోని చాలామంది 30 ఏళ్ల లోపు వాళ్లే. ఇంకో 8-10 ఏళ్లు వీళ్లు దేశానికి ఆడగలరు. మూణ్నాలుగేళ్లుగా నంబర్‌వన్‌గా ఉంటున్న జట్టుకు ముందుముందు పెద్ద సమస్యలేమీ ఉండవు. 70లు, 80ల్లో వెస్టిండీస్‌లా.. 90ల నుంచి ఆస్ట్రేలియాలా ఆధిపత్యం చలాయించాలి. అప్పుడే నిజమైన నంబర్‌వన్ అనిపించుకుంటాం.


బుమ్రా మార్గదర్శి.. పుజారా గొప్పోడు: భారత క్రికెట్లో కపిల్ దేవ్ మినహాయిస్తే ఫాస్ట్‌బౌలర్లలో ఎవ్వరూ మార్గదర్శులుగా నిలవలేదు. ఐతే ఇప్పుడు బుమ్రా విదేశాల్లో భారత జట్టుకు అద్భుత విజయాలందించాడు కాబట్టి అతను యువతకు మార్గదర్శిగా నిలుస్తాడని.. చాలా మంది ఫాస్ట్‌బౌలింగ్‌ను కెరీర్‌గా ఎంచుకునేలా స్ఫూర్తినిస్తాడని ఆశిస్తున్నా. భారత క్రికెట్లో అత్యుత్తమ పేస్ దళం ప్రస్తుత బృందమే. పుజారా ఇన్నాళ్లూ మెరుగైన ఆటగాడిగా ఉన్నాడు. ఇప్పుడు గొప్ప ఆటగాడయ్యాడు. అతను బ్యాటింగ్‌లో కొన్ని కీలకమైన మార్పులు చేసుకున్నాడు. స్టాన్స్ మార్చుకున్నాడు. టెస్టు సిరీస్ ఎలా గెలవొచ్చో తన బ్యాటింగ్‌తో అతను చూపించాడు.

విరాట్ పాఠాలు నేర్చాడు

దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్‌ల్లో జట్టు ఎంపికకు సంబంధించి విరాట్ కొన్ని తప్పులు చేశాడు. లార్డ్స్‌లో కుల్‌దీప్‌ను ఎంచుకోవడం, పెర్త్‌లో స్పిన్నర్‌ను ఆడించకపోవడం సరి కాదు. కానీ వాటిని ఇక్కడ దిద్దుకున్నాడు. మెల్‌బోర్న్‌లో ఇద్దరు కొత్త ఓపెనర్లతో బరిలోకి దిగడం సాహసోపేత నిర్ణయం. బ్యాట్స్‌మన్‌గా విరాట్‌కు సాటి లేదు. అతను గొప్ప కెప్టెన్ కూడా.

ఒకసారి ఓడిస్తే చాలు

ఆస్ట్రేలియా జట్టు బలహీనంగా ఉందా అంటే.. ప్రత్యర్థి జట్టును ఎంపిక చేసేది మనం కాదు కదా. మనకు మైదానంలో ఎదురయ్యే జట్టును ఓడించడం మన కర్తవ్యం. అంతే. ఆస్ట్రేలియాను దాని సొంతగడ్డపై ఓడించడం వల్ల ఇక దేనికీ ఆశ్చర్యపోయే పరిస్థితి ఉండదు. ఇక్కడ 1983లో మేం వెస్టిండీస్‌ను ఓడించిన ఉదంతాన్ని గుర్తు చేస్తా. వెస్టిండీస్‌ను ఓడించడం ఎవరి వల్లా కాదనుకుంటున్న తరుణంలో ఆ ఏడాది ఒక మ్యాచ్‌లో ఆ జట్టుపై నెగ్గాం. మళ్లీ వాళ్లను ఓడించగలమన్న ఆత్మవిశ్వాసంతో ప్రపంచకప్‌కు వెళ్లాం. వారిని ఓడించి ప్రపంచకప్ గెలిచాం.



ఆ క్షణాన సన్నీ కంట నీరు!

తన పేరున నెలకొల్పిన ట్రోఫీని ఆస్ట్రేలియా గడ్డపై కోహ్లీసేన సగర్వంగా తలకెత్తుకున్న సందర్భంగా సునీల్ గావస్కర్ ఉద్వేగానికి గురయ్యాడట. 2017లో సొంతగడ్డపై ఆస్ట్రేలియాను ఓడించి బోర్డర్-గావస్కర్ ట్రోఫీని సొంతం చేసుకున్న భారత జట్టు.. ఇప్పుడు ఆస్ట్రేలియాను దాని గడ్డపై 2-1తో ఓడించి ట్రోఫీని నిలబెట్టుకున్న సంగతి తెలిసిందే. సాధారణంగా ఈ ట్రోఫీ ప్రదానోత్సవానికి గావస్కర్ హాజరవుతాడు. ఐతే ఈసారి అతడికి క్రికెట్ ఆస్ట్రేలియా ఆహ్వానం పలకలేదు. దీంతో టీవీలో బహుమతి ప్రదానోత్సవం చూస్తూ ఆస్వాదించినట్లు సన్నీ తెలిపాడు. "భారత జట్టు ఆ ట్రోఫీని ఎత్తుకోవడం చూసి ఎంతో గర్వించాను. అది చారిత్రక సందర్భం. అందుకే నా కళ్లలోంచి నీళ్లు వచ్చాయి. నేను అక్కడే ఉండి ట్రోఫీ ప్రదానం చేస్తే బాగుండేది. కానీ మన వాళ్లు ఆ ట్రోఫీని ఎత్తుకుంటున్న దృశ్యాన్ని చూడటం కూడా నాకెంతో సంతోషాన్నిచ్చింది" అని సన్నీ అన్నాడు.

ఈ ఆనందంతో జీవించేస్తా



వీవీఎస్ లక్ష్మణ్

ఆస్ట్రేలియాలో సిరీస్ నెగ్గి చరిత్ర సృష్టించిన కోహ్లీసేనను చూసి ఎంతలా గర్వపడుతున్నానో మాటల్లో చెప్పలేను. కంగారూ గడ్డపై సిరీస్ గెలిచిన జట్టులో ఉండాలన్నది నా కల. అది నెరవేరకున్నా కూడా ప్రస్తుత జట్టు దాన్ని నిజం చేసిందనే ఆనందంతో జీవించేస్తా. పెర్త్‌లో పరాజయం తర్వాత టీమ్ ఇండియా చూపిన పట్టుదల అద్భుతం. ప్రత్యర్థి గడ్డపై తిరిగి పుంజుకోవాలంటే మానసిక స్థైర్యం ఎంతో ముఖ్యం. ఆ విషయంలో టీమ్‌ఇండియా పరిణతి చూపించింది. 2-1తో సిరీస్ ముగించడం ఆనందంగా ఉంది. 3-1తో గెలిచుంటే ఇంకా బాగుండేది. బ్యాటింగ్ భారాన్ని భుజాలపై వేసుకొని ప్రశాంతంగా తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించిన పుజారా పట్ల సంతోషంగా ఉంది. క్రీజులో కుదురుకొని ప్రత్యర్థి బౌలర్ల లయను దెబ్బతీసే విషయంలో అతని ఆట ఓ పాఠం. క్రీజులో అతను నిలుచున్న గంటలు, చేసిన పరుగులే రెండు జట్ల మధ్య ప్రధాన తేడా. కోహ్లి, రహానె కీలక సమయాల్లో మెరిశారు. యువ త్రయం మయాంక్, విహారి, రిషబ్ ప్రదర్శన నన్నెంతో ఆకట్టుకుంది. ఈ సిరీస్ విజయం భారత క్రికెట్లో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుంది.

మధ్యప్రదేశ్‌పై ఆంధ్రకు ఆధిక్యం

ఇండోర్: పేసర్ గిరినాథ్‌రెడ్డి (6/29) విజృంభించడంతో రంజీ ట్రోఫీ గ్రూప్-బి మ్యాచ్‌లో మధ్యప్రదేశ్‌పై ఆంధ్ర ఆధిక్యం సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోరు 24/3తో మంగళవారం ఉదయం ఆట కొనసాగించిన మధ్యప్రదేశ్ 35.5 ఓవర్లలో 91 పరుగులకే కుప్పకూలింది. ఆంధ్రకు 41 పరుగుల ఆధిక్యం లభించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో 64 ఓవర్లలో 7 వికెట్లకు 198 పరుగులు చేసింది. జ్ఞానేశ్వర్ (43), ప్రశాంత్ (44), కరణ్ షిండే (45 బ్యాటింగ్) రాణించారు.



నిలిచిన బెంగళూరు సెమీస్ ఆశలు

బెంగళూరు: కెప్టెన్ కిదాంబి శ్రీకాంత్ ముందుండి నడిపించడంతో ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో బెంగళూరు రాప్టర్స్ సెమీఫైనల్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. మంగళవారం జరిగిన పోరులో బెంగళూరు 5-0తో ముంబయి రాకెట్స్‌ను చిత్తు చేసింది. మొదట మహిళల సింగిల్స్‌లో వుతి ట్రాంగ్ 15-4, 11-15, 15-7తో శ్రేయాంశి పరదేశిపై గెలిచి బెంగళూరుకు శుభారంభం అందించింది. డబుల్స్‌లో అహ్‌సాన్-సెతియవాన్ 15-11, 15-11తో జంగ్-డేపై గెలిచి బెంగళూరు ఆధిక్యాన్ని రెట్టింపు చేశారు. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 15-14, 15-13తో ఆండ్రెస్ ఆంటోనెన్‌పై గెలిచి రాప్టర్స్ విజయాన్ని ఖాయం చేశాడు. బెంగళూరు ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకున్న మరో సింగిల్స్‌లో సాయిప్రణీత్ 12-15, 15-5, 15-13తో సౌరభ్‌వర్మపై గెలవగా.. మిక్స్‌డ్ డబుల్స్‌లో బెంగళూరు షట్లర్లు ఎలిస్-స్మిత్ 14-15, 13-15తో జంగ్-బెర్నెడెత్ చేతిలో ఓడినా బెంగళూరు విజయం అప్పటికే ఖాయమైంది.

సిరాజ్‌కు పిలుపు.. బుమ్రాకు విశ్రాంతి

ఆస్ట్రేలియాతో వన్డేలు, కివీస్ పర్యటనకు దూరం

సిడ్నీ: ఆస్ట్రేలియాపై చారిత్రక టెస్టు సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన టీమ్‌ఇండియా ఫాస్ట్‌బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాకు సత్వర విశ్రాంతి అవసరమని జట్టు యాజమాన్యం భావించింది. శనివారం ఆస్ట్రేలియాతో ఆరంభమయ్యే వన్డే సిరీస్‌కు.. ఆ తర్వాత న్యూజిలాండ్ పర్యటనకు అతడిని సెలక్టర్లు దూరం పెట్టారు. మార్చి నెలాఖరు



నుంచి ఐపీఎల్.. ఆ తర్వాత ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్ ఆడాల్సి ఉన్న నేపథ్యంలో బుమ్రాకు విశ్రాంతి ఇచ్చారు. బుమ్రా స్థానంలో హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌ను ఎంపిక చేసినట్లు బీసీసీఐ వెల్లడించింది. "బుమ్రాపై పని భారాన్ని దృష్టిలో ఉంచుకుని అతడికి విశ్రాంతినిచ్చాం. ఆస్ట్రేలియాతో వన్డేలతో పాటు న్యూజిలాండ్ పర్యటన కోసం అతడి స్థానంలోకి సిరాజ్‌ను ఎంపిక చేశాం" అని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. న్యూజిలాండ్‌తో మూడు టీ20ల సిరీస్‌కు పంజాబ్ పేసర్ సిద్దార్థ్ కౌల్‌ను కూడా ఎంపిక చేసినట్లు బీసీసీఐ తెలిపింది. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల అనంతరం న్యూజిలాండ్‌కు వెళ్లనున్న కోహ్లీసేన.. అక్కడ ఐదు వన్డేలు, మూడు టీ20లు ఆడుతుంది.

టేలర్, నికోలస్ శతకాలు


శ్రీలంకతో సిరీస్ కివీస్ క్లీన్‌స్వీప్


టేలర్

నెల్సన్ (న్యూజిలాండ్): శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య న్యూజిలాండ్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. మంగళవారం జరిగిన మూడో వన్డేలో కివీస్ 115 పరుగుల తేడాతో లంకను చిత్తు చేసింది. రాస్ టేలర్ (137), నికోలస్ (124 నాటౌట్) శతకాలు బాదడంతో మొదట న్యూజిలాండ్ 4 వికెట్లకు 364 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో శ్రీలంక తడబడింది. ఫెర్గ్యూసన్ (4/40), ఇష్ సోధి (3/40) ధాటికి 41.4 ఓవర్లలో 249 పరుగులకే ఆలౌటైంది. తిసార పెరీరా (80) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. టేలర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

అశ్రుత్ కథ

సమస్యలకు ఉజ్రాధాని!




ఛత్తీస్‌గఢ్: అభివృద్ధికి అర్థమే తెలియని ఓ పల్లె కథ ఇది. సమస్యలతో సహవాసానికి అలవాటు పడిపోయిన అక్కడి ప్రజలకు విద్యుత్తు, తాగునీరు, రహదారులు వంటి సౌకర్యాలు కూడా ఉంటాయని తెలీదంటే అతిశయోక్తి కాదు. కోర్బా జిల్లాలోని ఆ గ్రామమే అశ్రుత్. దీన్ని 'ఛత్తీస్‌గఢ్ ఉజ్రాధాని'గా కూడా పిలుస్తారు. చిత్రమేమంటే ఉజ్రాధాని అంటే వెలుగు అని అర్థం. కానీ అశ్రుత్ గ్రామానికి వెలుగే లేదు. పొద్దుగుంకితే అంతా చీకటే. ఇక్కడి పిల్లలు బడికి వెళ్లాలంటే తక్కువలో తక్కువగా 15 కి.మీ.లు నడవాలి. ఇక ఎవరైనా అనారోగ్యం బారిన పడ్డారంటే 25 కి.మీ.ల దూరం తీసుకెళ్లాలి. గ్రామంలో ఓ మందుల దుకాణం ఉన్నా ఎప్పుడు తెరుస్తారో తెలీదు. పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు.. విద్యుత్తు లేని గ్రామమే ఉండకూడదు.. అంటూ ఘనంగా చెబుతున్న నేతలకు ఈ పల్లె సంగతి పట్టడం లేదు. తమ గ్రామాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆక్రోశించడం, అప్పుడప్పుడు ఆగ్రహం చెందడం తప్ప ఆ గ్రామస్థులు ఏమీ చేయలేని నిస్సహాయులై పోయారు.

అద్భుతాలయ చరిత

కొండల నడుమ ఓ కోణార్క్!

రాజస్థాన్: చుట్టూ దట్టమైన అడవులు.. కొండలు.. జలపాతాలు.. సుందరమైన ప్రకృతి నడుమ సంక్రాంతి సంబరాలకు సిద్ధమవుతున్న ఓ సుందర ఆలయం రాజస్థాన్‌లో ఉంది. దేశ, విదేశాల నుంచి పెద్దఎత్తున పర్యాటకులు తరలి వచ్చే ఇక్కడి ఆలయం అనేక విశేషాల సమాహారం. జైపుర్ నుంచి తూర్పువైపునకు కొంతదూరం వెళితే ఈ గల్తాజీ ఆలయం వస్తుంది. ఓ సాధువు పేరిట ఈ ఆలయాన్ని పిలుస్తున్నప్పటికీ ఇది సూర్య దేవాలయం. దీన్ని కోతుల గుడి అని కూడా పిలుస్తారు. గోముఖి నదికి చెందిన మూడు జలపాతాలు ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ. ఆలయం మొత్తం గులాబీ



రంగు రాతితో నిర్మితమై ఉంటుంది. వాటిపై శ్రీకృష్ణుడి చిన్ననాటి అల్లర్లు చెక్కి ఉంటాయి. మకర సంక్రాంతి రోజున పెద్దఎత్తున భక్తులు తరలి వస్తారు. గాలావ్ అనే సాధువు వందేళ్లు తపస్సు చేయగా దేవుడు ప్రత్యక్షమై.. ఇది గొప్ప పుణ్యక్షేత్రంగా కూడా విలసిల్లుతుందని, ఈ ప్రాంతంలో నీళ్లు పుష్కలంగా ఉంటాయని వరమిచ్చినట్లు పౌరాణిక గాథ ఒకటి ప్రాచుర్యంలో ఉంది. ఆ సాధువు గుర్తుగానే ఇక్కడ ఆలయం నిర్మించినట్లు చెబుతారు. భక్తులు ఇక్కడి కొలనులో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. చుట్టూ అడవులుండటంతో పెద్దసంఖ్యలో కోతులు ఇక్కడికి వస్తుంటాయి. వాటితో మాత్రం పర్యాటకులకు తిప్పలు తప్పడం లేదు.

నిరుద్యోగులకు ఉద్యోగ సమాచారం

నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రత్యేక పోర్టల్

ఈనాడు, అమరావతి: నిరుద్యోగ యువతకు ఉద్యోగ సమాచారాన్ని అందించేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించింది. సాఫ్ట్‌వేర్ సంస్థలు, పరిశ్రమలకు అవసరమయ్యే పోస్టులు, అర్హతలు అందుబాటులో ఉంచుతున్నారు. అభ్యర్థులు ఈ పోర్టల్‌కు వెళ్లి నేరుగా ఆయా సంస్థలు, కంపెనీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంజినీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఇతరాత్ర అర్హతలతో లభించే ఉద్యోగాలను అందుబాటులో ఉంచుతున్నారు. ఇన్ఫోసిస్, విప్రో, ఏసియన్ పెయింట్స్, జెన్‌ప్యాక్, డాక్టర్ రెడ్డీస్, ఇసూజులాంటి సంస్థల నియామక వివరాలను పొందుపర్చుతున్నారు. నిరుద్యోగ అభ్యర్థులకు, నియామక సంస్థలకు మధ్య నైపుణ్యాభివృద్ధి సంస్థ వారధిగా పని చేస్తోంది. ఇందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇటీవల కంపెనీల తరపున ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రత్యేక ఉద్యోగమేళాలను నిర్వహించింది. ముఖ్యమంత్రి యువనేస్తంలో దరఖాస్తు చేసుకున్న దాదాపు 4లక్షల మందికి వారి అర్హతలను అనుసరించి నేరుగా ఫోన్లకు సంక్షిప్త సందేశాలు పంపిస్తున్నారు. యువనేస్తంలో నమోదు కాని వారు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. వెబ్‌సైట్ jobskills.apssdc.in లో నమోదు చేసుకోవచ్చు.

సంక్రాంతికి అప్పులే గతి: కళ్లేపల్లి

ఈనాడు, అమరావతి: జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగులు, పింఛన్‌దారులు సంక్రాంతి పండగకు అప్పులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కళ్లేపల్లి మధుసూదనరాజు ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంతవరకు జీతాలు, పింఛన్లు చెల్లించలేదని, దీంతో పండగకు అప్పులు తప్పేలా లేవని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి జీతాలు, పింఛన్లు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు.

శ్వేతపత్రంలో మేం చెప్పిందీ అదే

- సాయంపై రాష్ట్రం వాదనను నిపుణుల కమిటీ ధ్రువీకరించింది
- కేంద్రం ఇప్పటికైనా కళ్లు తెరిచి నిధులివ్వాలి: కుటుంబరావు

ఈనాడు, అమరావతి: పునర్వ్యవస్థీకరణ చట్టం, అప్పటి ప్రధాని ఇచ్చిన హామీల ప్రకారం కేంద్రం నుంచి ఇంకా ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన నిధులపై రాష్ట్ర ప్రభుత్వ వాదననే జయప్రకాశ్ నారాయణ ఆధ్వర్యంలోని నిపుణుల కమిటీ నివేదిక ధ్రువీకరించిందని ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు సి.కుటుంబరావు పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలోని అంశాలు, నిపుణుల కమిటీ నిగ్గుతేల్చిన అంశాలు అవేనని తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయం ఆ నివేదికతో మరోసారి బయటపడిందని చెప్పారు. కేంద్రం ఇప్పటికైనా కళ్లు తెరిచి రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులన్నీ ఇవ్వాలని డిమాండు చేశారు. మంగళవారమిక్కడ ఆయన విలేకరులతో మాట్లాడారు.

పదే పదే అవే అబద్ధాలు

'వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం రూ.23 వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఐదేళ్లలో ఇచ్చింది రూ.1050 కోట్లే. రాష్ట్ర ప్రభుత్వం యూసీలన్నీ ఇచ్చిందని నిపుణుల కమిటీ ధ్రువీకరించింది. కానీ ప్రధాని మోదీ మాత్రం... రాష్ట్రం యూసీలు ఇవ్వలేదని పదే పదే అబద్ధాలు చెబుతున్నారు' అని కుటుంబరావు విమర్శించారు. శ్వేతపత్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన వాస్తవాలపై ప్రజల దృష్టి మళ్లించేందుకే వైకాపా ఒక పుస్తకం ప్రచురించిందని, రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని గగ్గోలు పెడుతోందని మండిపడ్డారు. 'దానిలో 0.1 శాతం వాస్తవాలున్నా ఎప్పుడో దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేసేవారు కదా? ఇన్నాళ్లూ నిద్రపోతున్నారా?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానిలో జరుగుతున్న అభివృద్ధి చూసి తట్టుకోలేక అవాకులు చవాకులు రాస్తున్నారని మండిపడ్డారు. ఒక్కో ప్రభుత్వశాఖపై వారి బడ్జెట్ కంటే పదింతలు ఎక్కువ అభాండాలు వేశారని పేర్కొన్నారు. ఆర్థిక ఉగ్రవాది విజయసాయిరెడ్డి ఆ పుస్తకానికి సంపాదకత్వం వహించారని, ట్వీట్లలో ఆయన వాడే భాష చాలా చౌకబారుగా ఉంటోందని కుటుంబరావు ధ్వజమెత్తారు.

కేంద్రాన్ని అడుగుతుంటే ఆయనకేం బాధ?

కేంద్రానికి వచ్చే పన్నుల్లో రాష్ట్రానికి 42శాతం వాటా ఇచ్చిన తర్వాత కూడా... 2015- 20 ఆర్థిక సంవత్సరాల మధ్య ఆంధ్రప్రదేశ్‌కు రూ.22,113 కోట్ల రెవెన్యూ లోటు, తెలంగాణకు రూ.1,17,000 కోట్ల మిగులు ఉంటుందని ఆర్థిక సంఘం లెక్క తేల్చిందని కుటుంబరావు తెలిపారు. అంత రెవెన్యూ లోటు ఉంటుంది కాబట్టి న్యాయం చేస్తామని ఆర్థిక సంఘం చెబితే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, ఆ రాష్ట్ర అధికారులకు ఉలుకెందుకో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు.

నగదు రహిత వైద్య సేవలకు దూరం

ఈనాడు, అమరావతి: చెల్లింపులు చేపట్టే వరకు నగదు రహిత వైద్య సేవలను కొనసాగించేది లేదని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్(ఆషా) వెల్లడించింది. విజయవాడలో మంగళవారం 'ఆషా' నిర్వహించిన సమావేశంలో వివిధ ఆస్పత్రుల ముఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆషా విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నట్లు చెబుతున్నా నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లింపులు లేవని పేర్కొంది. నగదు చెల్లింపులు పూర్తి స్థాయిలో జరిగేవరకు వైద్య సేవలకు దూరంగా ఉంటామని, అత్యవసర కేసులు మినహా మిగిలిన వాటిని చూడలేమని పేర్కొంది. పెండింగులో ఉన్న బిల్లుల్లో 70శాతం చెల్లించేందుకు వీలుగా జీఓ జారీ చేయాలని కోరింది. మరోవైపు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు సీఈఓ సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం విడతలవారీగా జారీచేసిన సుమారు రూ.200 కోట్లకు సంబంధించి ఆస్పత్రులకు చెల్లింపులు మొదలయ్యాయని అన్నారు. బిల్లుల్లో 50 శాతం అడ్వాన్సు రూపంలో చెల్లించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించారని వివరించారు. జనవరి ఒకటో తేదీ నుంచి కొన్ని ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్య సేవల నిలిపివేత మొదలైంది. మరో అసోసియేషన్‌కు చెందిన ఆస్పత్రుల్లో యథావిధిగా సేవలు కొనసాగుతున్నాయి.

చుక్కల భూమి లెక్క తేల్చాలి

సినీ నటుడు శివాజీ డిమాండ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ భూములకు సంబంధించి వెంటనే తెలంగాణ తరహాలో సర్వే నిర్వహించి 'చుక్కల భూముల' లెక్క తేల్చాలని సినీ నటుడు శివాజీ డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. చుక్కల భూములకు పట్టాలు ఇస్తారు, రుణాలు ఇస్తారు.. అవి మాత్రం ప్రభుత్వ భూములని పేర్కొంటూ రిజిస్ట్రేషన్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అసైన్డ్ భూముల్లో నుంచి చుక్కల భూమిని వేరు చేయాలని గతంలో హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు.

జనరల్ కోటాకూ 'మినహాయింపు' అభ్యర్థులు


ఏపీపీఎస్సీ ఉద్యోగాల భర్తీపై కీలక నిర్ణయం

ఈనాడు, అమరావతి: ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్న ఉద్యోగాల్లో మినహాయింపు పొందిన రిజర్వేషన్ అభ్యర్థుల ఎంపికలో స్పష్టతనిస్తూ సాధారణ పరిపాలన శాఖ మంగళవారం కీలక ఉత్తర్వులనిచ్చింది. ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ ఇటీవల ప్రకటనలు ఇచ్చింది. ప్రకటన నంబరు 9/2018లో పేరా 15(2) ప్రకారం మినహాయింపులు పొందిన అభ్యర్థులను సంబంధిత రిజర్వుడు కేటగిరి ఉద్యోగాలకు మాత్రమే ఎంపిక చేస్తామని పేర్కొంది. మినహాయింపులు (వయోపరిమితి, కటాఫ్ తగ్గింపు వంటివి) పొందిన వారిని జనరల్ కోటా ఉద్యోగాలకు కూడా పరిగణనలోకి తీసుకోవాలని అభ్యర్థులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ క్రమంలో సాధారణ పరిపాలన శాఖ మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రకటనలోని పేరా-15(2)లో పేర్కొన్న మినహాయింపుల అంశాన్ని తొలగించాలని పేర్కొంది. మినహాయింపు అభ్యర్థులను జనరల్ కోటా ఉద్యోగాలకు కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఏపీపీఎస్సీకి పంపిన లేఖలో పేర్కొంది. హైకోర్టు జారీ చేసిన రెండు వేర్వేరు ఉత్తర్వులను ఇందులో ఉదహరించింది. ఈ ఉత్తర్వుల వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు ప్రయోజనం చేకూరుతుందని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి వీఎం రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ పరిపాలన శాఖ జారీచేసిన ఉత్తర్వులకు అనుగుణంగా వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీపీఎస్సీని కోరారు. మరోవంక వయోపరిమితిపరంగా మినహాయింపు పొందిన అభ్యర్థి విషయంలో హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో అప్పీలు చేసినట్లు ఏపీపీఎస్సీ వర్గాలు తెలిపాయి.

24లోగా చుక్కల భూముల సమస్యను పరిష్కరించాలి

జిల్లా అధికారులకు రెవెన్యూ శాఖ ఆదేశం

ఈనాడు, అమరావతి: చుక్కల భూముల సమస్యలను ఈ నెల 24లోగా పరిష్కరించాలని జిల్లాల సంయుక్త కలెక్టర్లను రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ ఆదేశించారు. మంగళవారం రాత్రి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విజయవాడ నుంచి సంయుక్త కలెక్టర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబరు 31వ తేదీనాటికి చుక్కల భూములను నిషిద్ధ జాబితా నుంచి తప్పించాల్సి ఉందని అన్నారు. జన్మభూమి కార్యక్రమాల దృష్ట్యా ఈనెల 24వ తేదీ వరకు గడువునిచ్చినట్లు వెల్లడించారు. చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి ఇటీవల జారీచేసిన సుమోటో ఉత్తర్వులను అనుసరించి యుద్ధప్రాతిపాదికన చర్యలు తీసుకుని బాధిత రైతులకు వెంటనే న్యాయం చేయాలని ఆదేశించారు.



Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

ఈనాడు సినిమా

ఆ విషయంలో చైతూ కఠినమే

సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే కథానాయిక సమంత. ట్విటర్‌లో తన అభిమానులతో ఎప్పుడూ టచ్‌లో ఉంటుంటుంది. తన అభిప్రాయాల్ని నిర్మొహమాటంగా పంచుకోవడానికి సామాజిక మాధ్యమాలని ఓ వేదికగా మార్చుకుంది. "సోషల్ మీడియా నాకు చాలా మేలు చేసింది. ఎవరెలా ఆలోచిస్తున్నారు? నేనెలా ఆలోచించాలి? అనే విషయాల్ని తెలుసుకున్నాను. ప్లస్ ఉన్న చోటే మైనస్ కూడా ఉంటుంది. సోషల్ మీడియా వల్ల కొన్ని తలనొప్పులు తప్పవు. అవి నాకూ ఎదురయ్యాయి. అయితే.. నచ్చని వ్యక్తుల్ని పక్కన పెట్టే సౌలభ్యం కూడా ఉంది కదా. దాన్ని నేను బాగా వాడుకుంటా" అంటోంది. ఈ విషయంలో నాగ చైతన్య ఆలోచనలు ఎలా ఉంటాయి? అనే విషయంపై ఆమె మాట్లాడుతూ "చైతూ నాలా కాదు. తను సోషల్ మీడియాకు దూరం. 'నాకు సంబంధించిన ఫొటోలు, సమాచారం మాత్రం పోస్ట్ చేయకు' అని చెబుతుంటాడు. ఈ విషయంలో చైతూ కొన్ని రూల్స్ పెట్టాడు. కఠినంగానే ఉంటాడు. అది నాక్కూడా అలవాటై పోయింది" అంటోంది.


సమంత

గీతోపదేశం

అందరి చెమటా చిందించాడు
సంపద ఎంతో పెంచాడు
పంపకమంటూ వచ్చేసరికి
అంతా తనదే అన్నాడు
ధనమే హెచ్చి గుణమే చచ్చి
నరుడే ఈనాడు వానరుడైనాడు

గీతం: మంచిని మరచి వంచన నేర్చి...
చిత్రం: ఒకే కుటుంబం
రచన: దాశరథి

– పంపినవారు: జి.మధుసూదన్, నిజామాబాద్




రసూల్‌కి అరుదైన గౌరవం

ప్రముఖ సౌండ్ డిజైనర్, ఆస్కార్ పురస్కార గ్రహీత రసూల్ పుకుట్టికి అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్ఠాత్మకమైన 'మోషన్ పిక్చర్స్ సౌండ్ ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ అమెరికా' సంస్థ ఆయనను సభ్యుడిగా ఎంపిక చేసుకుంది. ఈ విషయాన్ని ట్విటర్‌లో వెల్లడించారు పుకుట్టి. "సినీ పరిశ్రమకు చెందిన అత్యంత ప్రముఖుల సరసన నాకు స్థానం లభించినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇది భారతీయ చిత్రసీమకు దక్కిన గొప్ప గౌరవం. మన పరిశ్రమ నుంచి ఇలాంటి ఘనత సాధించడం ఇదే తొలిసారి" అని ట్వీట్ చేశారు పుకుట్టి. ఆయన రెండేళ్ల పాటు సభ్యుడిగా కొనసాగుతారు.

క్యాన్సర్ వచ్చినా ధైర్యంగా ఉన్నారు నాన్న

బాలీవుడ్ ప్రముఖులు వరసగా క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఇర్ఫాన్ ఖాన్, సోనాలీ బింద్రే క్యాన్సర్ వ్యాధి నుంచి పూర్తిగా తేరుకోకముందే మరో చేదు వార్త వినాల్సి వచ్చింది. ప్రముఖ బాలీవుడ్ నిర్మాత, హృతిక్ రోషన్ తండ్రి రాకేష్ రోషన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. మంగళవారం ఈ విషయాన్ని హృతిక్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలియజేశారు. "ఈ రోజు ఉదయం మీతో ఫొటో దిగాలని ఉందని నాన్నను అడిగాను. శస్త్ర చికిత్స రోజున ఆయన జిమ్‌కు రావడం మానరని తెలుసు. ఆయన దృఢమైన వ్యక్తి.


రాకేష్ రోషన్, హృతిక్ రోషన్

కొన్ని వారాల క్రితమే ఆయనకు గొంతు క్యాన్సర్ ఉందని తెలిసింది. కానీ ఆయన ధైర్యంగా ఉన్నారు. ఈ రోజు క్యాన్సర్‌తో యుద్ధం చేయబోతున్నారు. మా కుటుంబంలో ఆయన లాంటి లీడర్ ఉండడం మా అదృష్టం. ఐ లవ్ యూ డాడ్" అని రాశారు హృతిక్. రాకేష్ కూతురు సునైనా గతంలో క్యాన్సర్ బారిన పడి కోలుకున్నారు. ప్రస్తుతం రాకేష్ రోషన్ 'క్రిష్ 4'ని తెరకెక్కించే సన్నాహాల్లో ఉన్నారు. రాకేష్ ఆరోగ్య పరిస్థితి గురించి ప్రధాని మోదీ ట్విటర్‌లో స్పందిస్తూ "డియర్ హృతిక్.. నాన్న ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని కోరుకుంటున్నాను. ఆయన ఈ సవాల్‌ను ధైర్యంగా ఎదుర్కోగలరని విశ్వసిస్తున్నాన"ని తెలిపారు.



'ధృవ' తరవాత రామ్ చరణ్ ఆలోచనలు బాగా మారాయి. కమర్షియల్ కథల్ని ఎంచుకుంటూనే అందులోనూ కొత్తదనం చూపించడానికి ప్రయత్నిస్తున్నారు. 'రంగస్థలం'తో తన కెరీర్‌లోనే మర్చిపోలేని విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు 'వినయ విధేయ రామ'గా మారిపోయారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందించిన ఈ చిత్రం ఈ సంక్రాంతికి విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు చరణ్. ఆ సంగతులివీ...



నాన్న కోసమే

కొణిదెల ప్రొడక్షన్స్ సంస్థను కేవలం నాన్నగారి కోసమే స్థాపించాను. ఆయనతోనే సినిమాలు చేస్తాను. అంతెందుకు.. నా సినిమాల్ని కూడా ఈ బ్యానర్‌లో చేయను. నాన్నే కదా పారితోషికం ఇవ్వకపోయినా ఫర్వాలేదని కాదు. దక్షిణాదిన అత్యధిక పారితోషికం తీసుకునే కథానాయకుడు ఆయన. ఏ నిర్మాతా ఇవ్వనంత పారితోషికాన్ని ఆయనకు ఇస్తున్నా. కొరటాల శివ దర్శకత్వంలో ఆయనో సినిమా చేస్తారు. త్రివిక్రమ్‌తో ఓ సినిమా ఉంది. నేనూ కొరటాల శివ గారితో పనిచేయాలనుకున్నా. కానీ రాజమౌళితో సినిమా ఉంది కదా, అందుకే ఆలస్యం అవుతోంది. తప్పకుండా కొరటాలతో ఓ సినిమా చేస్తా.

అందులో నిజం లేదు

సైరా రీషూట్లు జరుపుకుంటుందన్న విషయంలో నిజం లేదు. అంత బడ్జెట్ మాకు లేదు.. (నవ్వుతూ). ఓ పెద్ద సినిమా తీస్తున్నప్పుడు చిన్నపాటి అవాంతరాలు వస్తుంటాయి. చిత్రీకరణలో జాప్యం జరిగింది. ఈ ఏడాది వేసవిలో విడుదల చేద్దామనుకున్నాం. కానీ దసరాకి వస్తుందేమో. దాదాపు రూ.200 కోట్లతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. బాలీవుడ్‌లో విడుదల చేయాలన్న ఆలోచన ఉన్నా, మా దృష్టంతా సౌత్ ఇండియాపైనే. అమిత్ త్రివేది సంగీతం అందిస్తున్నారు. ఇటీవలే ఆయన ఓ ట్యూన్ ఇచ్చారు. విన్న వెంటనే... నచ్చేసింది. ఎలాంటి మార్పు లేకుండా.. ఓ ట్యూన్ యథాతథంగా ఓకే చెప్పడం ఈమధ్యకాలంలో ఇదే తొలిసారి.

ఎవ్వరూ ఇవ్వనంత పారితోషికం డాడీకిచ్చా

'వినయ విధేయ రామ'లో వినయం ఎంత? విధేయత ఎంత? విధ్వంసం ఎంత?

అన్నీ సమపాళ్లలో ఉంటాయి. ప్రతి ఒక్కరిలోనూ రెండు ఛాయలు ఉంటాయి. రాముడూ అంతే. అయోధ్యలో ఒకలా ఉంటాడు, రణరంగంలో మరోలా ఉంటాడు. ఇవన్నీ ఈ సినిమాలో కనిపిస్తాయి.

ఈ సినిమాని అభిమానులు 'గ్యాంగ్ లీడర్'తో పోలుస్తున్నారు కదా?

నాక్కూడా 'గ్యాంగ్ లీడర్' అంటే చాలా ఇష్టం. కానీ ఈ రెండు కథలూ వేరు. ఒకదానితో మరోదానికి సంబంధమే ఉండదు. నలుగురు అన్నదమ్ముల కథ ఇది. వాళ్ల మధ్య ఏం జరిగింది? కథానాయకుడు ఎవరి కోసం, ఎవరితో పోరాడాడు? అనేది ఆసక్తికరం.

బోయపాటి శ్రీను సినిమా అంటే రక్తపాతం, హింస ఎక్కువగా కనిపిస్తాయి. ఇందులోనూ అంతేనా?

అలా అనిపిస్తుంది గానీ, వాస్తవానికి ఆయన కుటుంబ బంధాల్ని బాగా చూపిస్తారు. ఈ సినిమాలో యాక్షన్ ఉంటుంది గానీ, మితిమీరి ఉండదు. పండక్కి కుటుంబ సమేతంగా చూసేలానే ఈ సినిమా ఉంటుంది.

టైటిల్ వినగానే ఏం అనిపించింది? ఇంకొంచెం మాస్ టచ్ ఉంటే బాగుంటుంది కదా అని అనుకున్నారా?

అలా ఏం అనుకోలేదు. బోయపాటి గారి టైటిళ్లు చాలా శక్తిమంతంగా ఉంటాయి. కాకపోతే 'జయ జానకి నాయక' టైటిల్ అంటే నాకు చాలా ఇష్టం. అలాంటి మంచి టైటిల్ ఈ సినిమాకీ కుదిరింది. కథకు కూడా సరిపోతుంది.

ప్రచార చిత్రాలు చూస్తుంటే ఓ చోట రాంబో లుక్‌లో కనిపిస్తున్నారు. ఆ ఆలోచన ఎవరిది?

బోయపాటి శ్రీనుగారిదే. ఈ కథ చెప్పేటప్పుడే ఆ లుక్ గురించి నాకు వివరించారు. వెండి తెరపై రాంబో లాంటి పాత్రల్ని చూస్తూ పెరిగాం. అలాంటి గెటప్‌లో కనిపించడం సంతోషమే కదా? అందుకు సంబంధించిన సన్నివేశాల్ని అజర్ బైజాన్‌లో తీశాం. అక్కడ చలి తీవ్రత చాలా ఎక్కువ. అలాంటి చోట చొక్కా లేకుండా ఫైట్లు చేయడం కొంచెం కష్టం అనిపించింది.



అంతకంటే సంతోషమా

రికార్డుల గురించి నేనేం పట్టించుకోవడం లేదు. నా పోస్టరుపై రికార్డులు వేయకండి అని నిర్మాతలకు చెప్పా. కానీ వేయాలో.. వద్దో నిర్ణయించుకోవాల్సింది వాళ్లే. 'రంగస్థలం'కి మంచి వసూళ్లు వచ్చాయి. నిర్మాతలు, పంపిణీదారులు లాభపడ్డారు. ఓ కథానాయకుడిగా అంతకంటే సంతోషం ఏముంటుంది? 'నా సినిమాకి ఇన్ని వసూళ్లు వచ్చాయి' అని చెప్పుకోవడం వల్ల కొత్త తలనొప్పులు వస్తుంటాయి. ఈతరం కథానాయకులెవరూ అంకెల గురించి ఆలోచించడం లేదు. పోటీ అనేది మంచి పాత్రలు ఎంచుకోవడంలో, మంచి సినిమాలు చేయడంలోనూ ఉండాలి. ఇలాంటి విషయల్లో కాదు.

'రంగస్థలం' తరవాత మీ సినిమాలపై అంచనాలు పెరిగాయి కదా? ప్రతిసారీ అలాంటి కొత్త కథలతో రావడం కష్టం అనిపిస్తుందా?

అంచనాలు పెరగడం వాస్తవమే. కాకపోతే ప్రతిసారీ అలాంటి కథలే చేయలేం. నటుడిగా అన్ని రకాల జోనర్లూ చేయాలి. అందుకే 'రంగస్థలం' తరవాత ఇలాంటి కథని ఎంచుకున్నా.

ప్రతి సినిమాకీ బడ్జెట్లు పెరుగుతున్నాయి కదా?

రాబడి బాగానే ఉన్నప్పుడు బడ్జెట్ల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. ఒకవేళ పెట్టుబడికి రాబడికీ పొంతన లేకపోతే అందరం కూర్చుని మాట్లాడుకుని బడ్జెట్లు తగ్గించుకోవచ్చు.

ఈ మధ్య మీలో చాలా మార్పు కనిపిస్తోంది. మిగిలిన కథానాయకులతో చనువుగా ఉంటున్నారు. మీ సిబ్బందికి బహుమతులు ఇస్తున్నారు..

నేను ముందు నుంచీ ఇలానే ఉంటున్నా. ఇప్పుడు సోషల్ మీడియా పెరిగిపోయింది కాబట్టి, నేనేం చేసినా తొందరగా బయటకు వచ్చేస్తోందంతే. నా సినిమాకి నాతో పాటు పనిచేసిన నా సిబ్బందికి చిన్న చిన్న బహుమానాలు ఇస్తుంటాను. నిర్మాతగా మారాను కదా. నా సినిమాకి పని చేస్తున్న వాళ్లంతా నా మనుషుల కిందే లెక్క. ఇంటికి దూరంగా వచ్చి, నా సినిమా కోసం కష్టపడుతున్నారు కదా. అందులో నా స్వార్థం కూడా ఉంది. ఇంకొంచెం బాగా పనిచేస్తారు.

రాజమౌళి మల్టీస్టారర్ ఎంత వరకూ వచ్చింది?

ఒక షెడ్యూల్ పూర్తయింది. పండగ తరవాత మరో దఫా చిత్రీకరణ మొదలవుతుంది. ఎన్టీఆర్‌తో కొన్ని సన్నివేశాల్లో నటించాను. ఎప్పటినుంచో తను మంచి స్నేహితుడు. కాబట్టి తనతో నటించడం కొత్తగా అనిపించలేదు.

అసలు రాజమౌళి ఈ ఆలోచన చెప్పగానే మీ మొదటి స్పందన ఏంటి?

నిశ్శబ్దంగా ఉండిపోయాను. మాటలు రాలేదు. ఇలాక్కూడా ఆలోచించొచ్చా? అనిపించింది. ఇద్దరు హీరోలున్నారు కదా అని రాజమౌళిగారు సినిమా తీయడం లేదు. అలాంటి కథ దొరికింది. కథ తయారయ్యాకే మేం కలిశాం.

వెండితెరపై మెరుపు దాడులు



'ఉరీ: ది సర్జికల్ స్ట్రైక్'

యథార్థ సంఘటనల ఆధారంగా బాలీవుడ్‌లో తరచుగా చిత్రాలు తెరకెక్కుతున్నాయి. ఆ కోవలో వస్తున్న మరో చిత్రం 'ఉరీ: ది సర్జికల్ స్ట్రైక్'. 2016లో భారత సైన్యం పాకిస్థాన్‌పై చేపట్టిన మెరుపు దాడుల ఆధారంగా రూపొందిన చిత్రమిది. విక్కీ కౌశల్, పరేష్ రావల్, యామీ గౌతమ్, మోహిత్ రైనా తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. నూతన దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించాడు. రోనీ స్క్రూవాలా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదలవుతోంది.

ఉరీలో భారత సైనికులను దారుణంగా హతమార్చిన పాకిస్థాన్ ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పేందుకు భారత సైన్యం మెరుపు దాడులు చేపట్టడం అంతర్జాతీయంగా సంచలనం సృష్టించింది. పటిష్ఠ వ్యూహంతో, అత్యంత ధైర్య సాహసాలతో చేసిన ఈ దాడులతో భారత సైన్యానికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తాయి. అయితే ఈ దాడులు చేపట్టడానికి భారత సైన్యం ఎలా సన్నద్ధమైంది? ఎలాంటి వ్యూహాలు అమలుపర్చారు? దాడులు చేస్తున్న సమయంలో వారికి ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి? ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న సైనికుల కుటుంబాల మానసిక పరిస్థితి ఏంటి? ఇలాంటి ఎన్నో ఆసక్తికరమైన సంఘటనలను కళ్లకు కట్టేలా ఈ చిత్రం ఆవిష్కరించినట్లు చిత్రబృందం తెలిపింది. విక్కీ కౌశల్ ఆర్మీ మేజర్ పాత్రలో నటించారు. ఈ మెరుపు దాడుల వెనుక కీలక పాత్ర పోషించిన అజిత్ దోవల్ పాత్రలో పరేష్ రావల్ కనిపించనున్నారు.

నిన్ను తలచి మైమరచా!


స్టెఫీ పాటెల్, వంశీ

వంశీ, స్టెఫీ పాటెల్ జంటగా నటించిన చిత్రం 'నిన్ను తలచి'. అనిల్ తోట దర్శకుడు. అజిత్ రెడ్డి, నేదురుమల్లి నిర్మాతలు. హైదరాబాద్‌లో ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రేమ గొప్పతనాన్ని చెప్పే చిత్రమిది. నాయకానాయికలు కొత్తవారయినా పాత్రల్ని పండించార"న్నారు. అజిత్ రెడ్డి మాట్లాడుతూ "యువతరమే కాదు.. పెద్దలూ చూడదగ్గ ప్రేమ కథాచిత్రం. కొత్తకోణంలో దర్శకుడు తెరకెక్కించారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామ"న్నారు.

పంచ్ డైలాగ్

ఆశీర్వదించడం ఐశ్వర్యం కోసం కాదు.
సంతోషంగా ఉండటం కోసం.
చిత్రం: మనసున్న మారాజు

– పంపినవారు: తాళాబత్తుల రీతిక, కూర్మన్నపాలెం

మరో ప్రేమకథ


వర్ష, శివ కందుకూరి

'పెళ్లిచూపులు', 'మెంటల్ మదిలో' చిత్రాలతో విజయాల్ని అందుకున్నారు నిర్మాత రాజ్ కందుకూరి. ఆయన తనయుడు శివ కందుకూరి కథానాయకుడిగా ఓ చిత్రం ప్రారంభమైంది. శేష సింధురావ్ దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. వర్ష కథానాయిక. ఈ సందర్భంగా నిర్మాత రాజ్ కందుకూరి మాట్లాడుతూ "అమెరికాలో ఉన్నత చదువులు పూర్తి చేసుకుని శివ ఈమధ్యే ఇండియా వచ్చాడు. తనకు సినిమాలంటే ఆసక్తి. తనకు సరిపడ మంచి ప్రేమ కథ దొరికింది. క్రిష్, సుకుమార్‌ల దగ్గర సహాయకురాలిగా పనిచేశారు సింధూరావ్. డి.సురేష్‌బాబు, మధురశ్రీధర్ నిర్మాణంలో పాలుపంచుకుంటార"న్నారు. ఛాయాగ్రహణం: వేద వర్మ, సంగీతం: గోపీ సుందర్

అమ్మచేత కమ్మగా

బ్రెడ్ పాన్‌కేక్




ఎంతసేపని పిల్లలకు బ్రెడ్ జామ్ వడ్డిస్తాం చెప్పండి. అందుకే ఈసారి బ్రెడ్‌తోనే నోరూరించే పాన్‌కేక్ చేసి పెడదాం.

కావల్సినవి: బ్రెడ్‌స్లైసులు - పది, పాలు - కప్పు, ఉల్లిపాయలు - రెండు, క్యాప్సికం, టొమాటో - ఒక్కోటి చొప్పున, పచ్చిమిర్చి - రెండు, అల్లం తరుగు - చెంచా, కొత్తిమీర - కట్ట, ఉప్పు - తగినంత, బంగాళాదుంప - ఒకటి (చెక్కుతీసి తురమాలి), కారం - అరచెంచా, నూనె - పావుకప్పు.

తయారీ: ముందుగా బ్రెడ్ స్లైసుల అంచులు తీసేసి ఓ గిన్నెలో వేసుకోవాలి. ఈ స్లైసుల్ని చేత్తో మెత్తగా చేసుకుని అందులో సగం కప్పు పాలు కలిపి పది నిమిషాలు నాననివ్వాలి. ఐదు నిమిషాలయ్యాక నూనె, మిగిలిన పాలు తప్ప ఇతర పదార్థాలన్నీ వేసి బాగా కలపాలి. మరో పది నిమిషాలకు పిండి తయారవుతుంది. అందులో మిగిలిన పాలు కలపాలి. ఇప్పుడు పొయ్యిమీద పెనం పెట్టి ఈ పిండిని కొద్దిగా తీసుకుని దోశలా పరవాలి. రెండువైపులా నూనె వేసి కాలిస్తే చాలు. ఈ పిండి కాస్త గట్టిగానే ఉండాలి కాబట్టి నీళ్లు కలకపోవడమే మంచిది.

రంగవల్లిక



వి.సుష్మ, కాకినాడ



16 చుక్కలు, 4 వరుసలు. 4 వచ్చేవరకు.

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
అబ్దుల్లాపూర్‌మెట్
మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512.
✦ email: vasundhara@eenadu.net

ముత్యాల ముగ్గుల పోటీ

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ జనవరి 7, 2019 విజేతలు

1. సి.దేవి, బద్వేల్ 2. ఆర్.సుస్మిత, ముసల్రెడ్డిపల్లి - కడప 3. డి.మంగమ్మ, ఎస్.ఆర్.నగర్ - హైదరాబాద్ 4. సిహెచ్.సంధ్యారాణి, గుంటూరు 5. ఎస్.పార్వతీదేవి, పెరవలి - ప.గో.జిల్లా 6. ఎం.భారతి, అనంతపురం 7. ఈ.కోటేశ్వరమ్మ, దర్శి 8. టి.ధనలక్ష్మి, ప్రొద్దుటూరు 9. ఈ.నాగకుమారి, నందికొట్కూరు 10. డి.ప్రియాంక, మాచర్ల

వాళ్లిచ్చిన డబ్బు దాచాలనుకుంటున్నా!

మా అమ్మానాన్న నా పెళ్లి సమయంలో పన్నెండు లక్షల రూపాయలను పెళ్లి కానుకగా ఇచ్చారు. ఈ డబ్బును నేను దీర్ఘకాలం పాటు పెట్టుబడిగా పెట్టాలనుకుంటున్నా. నష్టభయం లేకుండా మంచి మొత్తం రావాలంటే ఎందులో పెట్టుబడి పెట్టాలో చెప్పండి?

- నందిత



- స్వప్న కంతేటి, ఆర్థిక రంగ నిపుణురాలు

● పెళ్లి కానుకగా వచ్చిన నగదును భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు చేయాలనుకుంటున్నందుకు ముందుగా మీకు అభినందనలు. మీ డబ్బు సురక్షితంగా ఎలాంటి నష్టభయం లేకుండా ఉండాలంటే పీపీఎఫ్‌లో జమ చేయడమే ఉత్తమం. దీని కోసం మీరు మీ దగ్గరలోని పోస్టాఫీసులో ఖాతా తెరవొచ్చు. మీ డబ్బుకు భద్రత కూడా ఉంటుంది. ఏడు నుంచి ఎనిమిది శాతం వడ్డీ కూడా వస్తుంది. 80 సీ కింద పన్ను మినహాయింపు ఉంటుంది. దేశంలోని ఏ పోస్టాఫీసు నుంచైనా మీరు దీన్ని నిర్వర్తించవచ్చు. న్యూ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్) అనేది మరో కొత్త పథకం. దీన్ని ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకుల్లో ఎక్కడైనా తీసుకోవచ్చు. భద్రత, మంచి రిటర్న్స్‌తోపాటు పన్ను మినహాయింపు ఉంటుంది. వడ్డీ ఎనిమిది నుంచి పదిశాతం వరకు పొందొచ్చు. కాబట్టి దీన్ని కూడా మీరు పరిశీలించవచ్చు. మ్యూచువల్ ఫండ్స్‌లో డెట్ ఫండ్స్ అని ఉంటాయి. వీటిలో నష్టభయం చాలా తక్కువ. రాబడి కూడా బాగుంటుంది. వడ్డీ తొమ్మిది నుంచి పదకొండు శాతం వరకు ఉంటుంది. అయితే కొన్నిసార్లు హెచ్చుతగ్గులు ఉండొచ్చు. ఇవే కాకుండా కొన్ని ప్రభుత్వ బాండ్లను కూడా చూడొచ్చు. దీర్ఘకాలం పెట్టుబడి పెడతామంటున్నారు కాబట్టి కొంచెం రిస్క్ తీసుకుంటే మీకు అధిక మొత్తంలో రాబడి వచ్చే అవకాశముంది. మ్యూచువల్ ఫండ్స్‌లో డైవర్సిఫైడ్ అండ్ బ్యాలెన్స్‌డ్ ఫండ్స్ కూడా ఉంటాయి. వీటి గురించి కూడా ఓసారి సమగ్రంగా తెలుసుకోండి. పెట్టే పెట్టుబడి కాలం ఎక్కువ కాబట్టి నష్టభయం అంతగా ఉండకపోవచ్చు. అంతేకాదు రాబడి కూడా దాదాపు పది నుంచి పదిహేను శాతం వచ్చే అవకాశం ఉంది. వీటితోపాటు కార్పొరేట్ బాండ్లను కూడా మీరు పరిశీలించవచ్చు. కార్పొరేట్ ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో కూడా మీ డబ్బును పెట్టుబడిగా పెట్టేందుకు ప్రయత్నించొచ్చు. ఆర్‌బీఐ బాండ్లు కూడా బాగుంటాయి. అయితే వీటిలో రిటర్న్స్ చాలా తక్కువ. గోల్డ్ బ్యాండ్, గోల్డ్ ఈటీఎఫ్‌లను కూడా చూడొచ్చు. వీటిలో రిటర్న్స్ తక్కువ. అలాగే డబ్బు మొత్తం ఒకేదానిలో కాకుండా రెండు మూడు పథకాల్లో పెట్టుబడి పెడితే బాగుంటుంది.

మీ ప్రశ్నలు ఇకపై **vasufin@eenadu.net** కు పంపించగలరు.

స్వశక్తి



ఓ నష్టం...
ఓ అనుభవం...
ఓ ఆలోచన...

ఆమెను వ్యాపారవేత్తను చేశాయి. పసిపిల్లలకు, బాలింతలకు బొట్టు, కాటుక నుంచి సబ్బులు, నూనెల వంటి సంప్రదాయ ఉత్పత్తులు అందిస్తోంది. విదేశాలకూ ఎగుమతి చేస్తోంది. కేవలం రెండొందల రూపాయల పెట్టుబడితో వ్యాపారం మొదలుపెట్టిన ఆమె ఇప్పుడు లక్షల రూపాయల ఆదాయం అందుకునే స్థాయికి చేరుకుంది. ఆమే గుంటూరుకు చెందిన ఆశా సేకూరు.

రూ.200 పెట్టుబడి... లక్షల్లో ఆదాయం!

పరిస్థితులు, అనుభవాలే నన్ను వ్యాపారవేత్తను చేశాయి. మర్చిపోయిన కొన్ని సంప్రదాయాలను మళ్లీ తిరిగి తీసుకురావాలనేదే నా తపన. అందుకే తల్లులకు, పిల్లలకు రకరకాల ఉత్పత్తులు తయారుచేసి అందిస్తున్నా. ముఖ్యంగా గర్భిణులకు హార్మోన్ల తేడా వల్ల చర్మం రంగు మారడం, స్ట్రెచ్ మార్క్స్, జుట్టు రాలడం... వంటి సమస్యలు ఎదురవుతాయి. శారీరకంగా బలహీనమవుతారు. నడుము భాగం పట్టు తగ్గుతుంది. అలాంటి వారికోసం పోషకాల లడ్డు, రాగిపిండి కేకు, డార్క్ చాక్లెట్లు వంటివి అందిస్తా. ఫేస్‌ప్యాక్‌లు కూడా ఉంటాయి. ఎలాంటి రసాయనాలు, ప్రిజర్వేటివ్‌లు కలపని ప్రత్యేక నూనెలు, షాంపూలు పిల్లలకోసం తయారు చేస్తున్నా. పిల్లల సంరక్షణకు అవసరమైన అన్నిరకాల వస్తువుల్ని కిట్ రూపంలో ఇస్తా. ఈ సేవల్ని 2014లో 'తన్వీ నేచురల్స్' పేరుతో ప్రారంభించా.

సమస్యలు ఎదురైనా...

సహజసిద్ధమైన పదార్థాలతోనే ఈ ఉత్పత్తులు చేస్తున్నా కాబట్టి... మొదట్లో వాటికి అవసరమైన ముడిసరకు కోసం రకరకాల చోట్లకు వెళ్లేదాన్ని. పండ్ల తొక్కలు, పూరేకల కోసం గుంటూరు, విజయవాడలోని పండ్ల రసాల సెంటర్లు, కాళేశ్వరరావు మార్కెట్, పండ్ల దుకాణాలు, రైతుబజార్లను సంప్రదించేదాన్ని. ఉదయం పాప పనులు చూసి దాన్ని మా అమ్మకి అప్పగించి బయటకు వచ్చేదాన్ని. అర్డర్లు కుదుర్చుకుని కొంత సరకు కొనుక్కుని మళ్లీ సాయంత్రానికి వచ్చేదాన్ని. పాప పడుకున్నాక సబ్బులు, పిల్లల ఒంటికి చేసే మర్దననూనె, తలనూనెలు, డైపర్‌నూనెలు, సున్నిపిండి, బొట్టు, కాటుకలు తయారు చేసేదాన్ని. వీటిని ఎంతో ఉత్సాహంగా చేసినా ఓ నెలన్నర వరకూ ఎవరూ తీసుకోలేదు. క్రమంగా నోటి ప్రచారంతో నా ఉత్పత్తుల గురించి చాలామందికి తెలిసి ఆర్డర్లు వచ్చేవి. పాపని చూసుకుంటూనే అన్నీ చేసేదాన్ని. ఇప్పుడు విదేశాల్లో ఉంటున్నవారూ నన్ను సంప్రదిస్తున్నారు. మొదట్లో అలా ఆర్డర్లు వచ్చినప్పుడు అక్కడకు వెళ్లే వారికి వస్తువులు ఇచ్చి పంపేదాన్ని. ఆ తరువాత ఇంపోర్ట్ ఎక్స్‌పోర్ట్, కస్టమ్స్ లైసెన్స్ తీసుకుని నేనే నేరుగా పంపుతున్నా. నా ఉత్పత్తులన్నింటికీ ఫుడ్ అండ్ డ్రగ్ విభాగం నుంచి అనుమతులు ఉన్నాయి. ఏడాదిగా అమెరికా, కెనడా, సౌదీ అరేబియా, ఆస్ట్రేలియా వంటి దేశాలకు పంపుతున్నా. గుంటూరుతోపాటు విజయవాడ, వైజాగ్, రాజమండ్రి, హైదరాబాద్, బెంగళూరు, ముంబయి, చెన్నైలోని పలు ప్రాంతాలకు ఈ ఉత్పత్తులన్నీ వెళ్తాయి. ఇప్పుడిప్పుడే ఫేస్‌బుక్ పేజీ ద్వారా ప్రచారం చేస్తున్నా. అలాగే ఒక్కో ఉత్పత్తి అని కాకుండా బేబీ కిట్, మదర్ కిట్ అని ప్రత్యేకంగా అందిస్తున్నా.

బేబీ కిట్: సబ్బు, సున్నిపిండి, మర్దన, తల నూనె, డైపర్ నూనె, షాంపూ, షాంపూబార్, పౌడర్, బొట్టు, కాటుక



పాలు కొనే డబ్బు లేక...

మాది గుంటూరు. మా వారికి వ్యాపారం ఉండేది. ఆ తరువాత కొన్నాళ్లకి హైదరాబాద్‌లోనూ ఓ శాఖను ప్రారంభించారు. నేను కూడా ఆయనతోపాటు హైదరాబాద్ వచ్చా. అప్పుడే గర్భవతినయ్యా. మొదటిసారి కావడంతో గర్భిణులకు యోగా నేర్పించే డాక్టర్ జెస్సీ నాయుడు దగ్గర శిక్షణ తీసుకున్నా. మామూలుగా గర్భిణులకు ఫోలిక్ యాసిడ్, ఐరన్, క్యాల్షియం వంటి సప్లిమెంట్లు ఇస్తారు. యోగా శిక్షణలో భాగంగా ఆ సప్లిమెంట్లకు బదులు ఆహారం నుంచే అవి అందేలా చూసుకునేదాన్ని. యోగా, ధ్యానంతో బిడ్డ ఆరోగ్యం, ఎదుగుదల విషయంలో జాగ్రత్త పడ్డా. ఎనిమిదో నెల వచ్చింది. హాయిగా సాగిపోతోందనుకుంటోన్న సమయంలో మా వారు హైదరాబాద్‌లో పెట్టిన శాఖలో భాగస్వాములు మోసం చేశారు. ఎనభై లక్షల రూపాయల నష్టం వచ్చింది. నేను బాధపడతానని కొన్నిరోజులు నాకు చెప్పలేదు. చివరకు వేరే వాళ్ల ద్వారా విషయం తెలియడంతో తట్టుకోలేకపోయా. గట్టిగా అరుస్తూ రెండు రోజులు ఏడ్చా. ఆహారం సరిగా తీసుకోలేదు. దాంతో వెంటనే ప్రసవమైంది.

పాప రంగుమారింది: ఎనిమిదో నెలలో పుట్టిన బిడ్డలకు ప్రమాదముంటుంది. కానీ నేను తీసుకున్న జాగ్రత్తల వల్ల మా పాప పూర్తి ఆరోగ్యంతో 2.6కేజీల బరువుతో పుట్టింది. సహజంగా నేను తీసుకున్న జాగ్రత్తల వల్లే బిడ్డ ఆరోగ్యంగా ఉందని వైద్యులు చెప్పడంతో ఆశ్చర్యపోయా. పాప పుట్టిన సమయానికి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి ఉన్నాం. దాని పాల డబ్బా కొనడానికి కూడా డబ్బుల్లేవప్పుడు. నాకు, మావారికి చాలా బాధేసేది. నేను డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా. క్రమంగా పాప పెంపకంలో పడి బాధల్ని మర్చిపోవడానికి ప్రయత్నించా. బజార్లో దొరికే రకరకాల ఉత్పత్తులు వాడటంతో కొన్నాళ్లకి మా అమ్మాయి నల్లగా అయిపోయింది. అప్పుడే మన పూర్వీకులు ఏం చేశారో తెలుసుకుందామని అనిపించింది. మా వారి అమ్మమ్మతో మాట్లాడా.

అధ్యయనం చేశా: సాదు బొట్టు, కాటుకను సహజ పద్ధతిలో చేయడం గురించి నానమ్మ చెప్పారు. పైగా వాటిని తయారు చేసేటప్పుడు ఎవరూ చూడకూడదట. వాటిని ఆధ్యాత్మిక భావనతో చేస్తే ఇంకా మంచిదట. అలానే మా బంధువుల్లో ఆయుర్వేదం, నాచురోపతి వైద్యులు ఉన్నారు. వారితో మాట్లాడి పిల్లల ఆరోగ్యానికి, చర్మానికి ఏవి మంచివో తెలుసుకున్నా. సున్నిపిండి, సబ్బు, బాదం, నువ్వులు, అవిసెనూనెల గురించి చెప్పారు. ఇవన్నీ చర్మానికి మేలు చేస్తాయని అర్థమైంది. అందుకే నేనే వాటిని ఇంట్లో ఎందుకు తయారు చేయకూడదని అనిపించింది.

పాపని చూసుకుంటూనే: వ్యాపారం పెట్టాలనుకున్నప్పుడు నా చేతిలో ఉన్నవి 200 రూపాయలే. వాటితో కొన్ని ముడిపదార్థాలు కొని సహజసిద్ధమైన సబ్బుల్ని తయారు చేశా. వాటిని బంధువులు, స్నేహితులకు ఇస్తే బాగున్నాయని... ఇంకా కావాలని అడిగారు. బాదం, అవిసెనూనె తీసే యంత్రాన్ని రాయ్‌చూర్ నుంచి తెచ్చుకున్నా. దాని ఖరీదు ఐదువేల రూపాయలు. దాన్ని చేత్తో తిప్పాలి. అందులో బాదం పప్పు వేసి తిప్పుతూ ఉండాలి. కేజీ పప్పు నుంచి నూనె తీయాలంటే మూడు రోజులు పట్టింది. ఆ నూనెని మా అమ్మాయికి వాడితే తక్కువ సమయంలోనే చక్కటి రంగు వచ్చింది. అది గమనించి నా స్నేహితురాళ్లు ఆ నూనెలు తీసుకోవడం మొదలుపెట్టారు. మావారి అమ్మమ్మ సాయంతో బొట్టు, కాటుక చేయడం నేర్చుకున్నా. ఆ విషయాలు, వివరాలన్నీ.. నా వాట్సాప్‌లో ఉన్న మదర్స్ గ్రూపులో పెట్టా. అప్పుడు జెస్సీ మేడమ్.. 'నువ్వే ఎందుకు దీన్ని వ్యాపారంలా చేయకూడదు...' అని చెప్పారు. అలా వ్యాపారంలోకి వచ్చా. ఇప్పుడు నాకు వచ్చే ఆదాయంతో నూనెలు తీయడానికి ఆధునిక యంత్రాలు కొన్నా. ప్రస్తుతం లక్షల్లోనే ఆదాయం అందుకుంటున్నా.

మదర్ కిట్: సబ్బు, సున్నిపిండి, స్ట్రెచ్‌మార్క్ ఆయిల్, ఫేస్‌ప్యాక్, తలనూనె, కాజల్, లిప్‌బామ్,

- పద్మ వడ్డె

గర్భిణులకు ఆరోగ్యసూత్రాలు వివరించడం మొదలు... బాల్యవివాహాలు ఆపడం, పిల్లల్ని బడిమానేయకుండా చూడటం వరకూ... ఎన్నో బాధ్యతలు అంగన్‌వాడీ టీచర్లదే. వాటన్నింటినీ విజయవంతంగా పూర్తిచేశారు వీళ్లు. ఆ కృషే వీళ్లకు గుర్తింపు తెచ్చింది. దేశవ్యాప్తంగా ఎంతోమంది అంగన్‌వాడీ టీచర్లు ఉన్నా... తెలుగురాష్ట్రాల నుంచి వీళ్లు అరుదైన గుర్తింపు తెచ్చుకున్నారు. ఇంతకీ వాళ్లెవరు... వాళ్లకొచ్చిన గుర్తింపు ఏంటంటే...

సంక్షేమ అంగనలు

'గ్రామాభివృద్ధే.. దేశాభివృద్ధి... గ్రామీణుల ఆరోగ్యాన్ని కాపాడటం మా లక్ష్యం' అని చెప్పే ఈ అంగన్‌వాడీ టీచర్లు తాజాగా జాతీయస్థాయిలో గుర్తింపు సాధించారు. సోమవారం దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి మేనకాగాంధీ నుంచి అవార్డులు అందుకొన్నారు. దేశవ్యాప్తంగా 97 మందికి గుర్తింపు వస్తే... తెలంగాణాలో ఇద్దరు, ఆంధ్రప్రదేశ్ నుంచి నలుగురు ఈ అవార్డుల్ని అందుకున్నారు.

బాల్యవివాహాలు తగ్గించినందుకే...



ఆమె పేరు సుశీల. తెలంగాణ ఖమ్మం జిల్లా, ఏన్కూరులో 26 ఏళ్లగా అంగన్‌వాడి టీచర్‌గా పని చేస్తోంది. సుశీల చదివింది పదో తరగతే. మాతాశిశువు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం, గర్భిణులకు పోషకాహారం అందేలా చూడటం... పుట్టిన పాపాయికి వ్యాధినిరోధక టీకాలు వేయించడం వీళ్ల విధుల్లో భాగం. వీటన్నింటితోపాటు బాల్యవివాహాలను అరికట్టడంలో ఎక్కువగా కృషి చేసింది. 'కూలీ పనులకు వెళ్లే పిల్లల్ని, బడిమానేసిన వారిని గుర్తించి మళ్లీ చదువుకునేలా చేశా. పిల్లలకే కాదు, తల్లిదండ్రులకు కూడా చదువు విలువ చెబుతా. క్రమంగా చాలామంది తల్లిదండ్రులు, పిల్లల్లో మార్పు వచ్చింది. చిన్నారుల్ని చదువుకునేలా చేయడమే నా పని. అంటే వాళ్లకు పరోక్షంగా మంచి భవిష్యత్తును ఇస్తున్నట్లేగా. అంతకన్నా కావాల్సిందేముంటుంది...' అని చెబుతుంది సుశీల. ఆమెది వ్యవసాయ నేపథ్యం. బయటి ప్రపంచం గురించి తెలుసుకోవాలనే ఆసక్తితోనే ఇందులో చేరింది. తన ఇద్దరమ్మాయిల్ని చదివించుకుంటోంది.

బోరుబావి గుంతల్ని మూయించి...



వికారాబాద్ మండలం సిద్దులూరు గ్రామం విజయలక్ష్మిది. ఆమెకు 13వ ఏటే పెళ్లైంది. అత్తింటివాళ్ల సహకారంతో డిగ్రీ పూర్తిచేసింది. సామాజిక సేవ పట్ల ఆసక్తితో ఈ ఉద్యోగాన్ని ఎంచుకుంది. 'పెళ్లై, గర్భం దాల్చేవరకు మహిళలకు ఆరోగ్యం పట్ల అవగాహన అందిస్తా. పోషకాహారం ప్రాధాన్యం వివరిస్తా. ఎలాంటివి తింటే ఆరోగ్యానికి మంచిదో చెప్పడమూ మా పనే. మావారు 12 ఏళ్లక్రితం చనిపోయారు. అప్పటి నుంచి కుటుంబ బాధ్యత నాదైంది. నాకు ఇద్దరబ్బాయిలు, ఒకమ్మాయి. ఓసారి బోరుబావిలో పడి ఒక చిన్నారి మృతి చెందిన వార్త నన్ను ఆలోచించేలా చేసింది. మళ్లీ అలాంటి సంఘటన నేనున్న గ్రామంలో జరగకూడదనుకున్నా. దాంతో స్థానిక అధికారులతో మాట్లాడి గ్రామంలోని బోరుబావి గుంతలన్నింటినీ మూయించేశా. గతంలో కలెక్టర్ల చేతుల మీదుగా ఆరుసార్లు అవార్డులందుకున్నా. కేంద్రం నుంచి ఈ గుర్తింపు రావడం ఇదే మొదటిసారి...' అని చెబుతుందామె.

బడిబాట పట్టేలా...



కృష్ణాజిల్లా, ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలం, ఏకమూరు గ్రామం మందిడ సువర్ణలతది. 23 ఏళ్లగా అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తోంది. అంగన్‌వాడి స్కూలుకు వచ్చే పిల్లలు ఆ తరువాత ప్రభుత్వపాఠశాలల్లోనే చేరేలా చూస్తోంది. 'తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్య వివాహాలు చేయకుండా వాళ్లతో సంతకాలు తీసుకుంటా. అలా కొన్ని బాల్యవివాహాలను ఆపగలిగా...' అని అంటుంది సువర్ణలత. కృష్ణాజిల్లా, తిరువూరు, గంపలగూడెం మండలం, గోసవీడు అంగన్‌వాడి సెంటర్‌లో పనిచేస్తోన్న జి.వెంకటరావమ్మ కూడా పిల్లల్ని బడిబాట పట్టేలా చేసింది. ఆమె చదివింది పదో తరగతే. భర్త ఎలక్ట్రిషియన్. ముగ్గురు మగపిల్లలూ పెద్ద చదువులు చదువుతున్నారు. 'ఈ ఉద్యోగంలోకి వచ్చాకే చదువు విలువ తెలిసింది. కూలీకి వెళ్లే పిల్లలు, డ్రాప్ అవుట్‌లను గుర్తించి, మళ్లీ చదువుకునేలా చేస్తున్నా. ఆటపాటల ద్వారా చదువుపట్ల ఆసక్తి కలిగిస్తున్నా...' అని చెబుతుందామె.

ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చేలా...




కుటుంబ సర్వే, ఇంటింటికీ రేషన్ పంపిణీ, పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ, పోషకాహారం పంపిణీ, వ్యాధినిరోధక టీకాలు అందివ్వడంలో తన బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించింది అనంతపురం జిల్లా, కుడాయిర్ తొలువూరుకు చెందిన జె.రమాదేవి. ఆమెది వ్యవసాయ కుటుంబం. ఇద్దరు అబ్బాయిలు. ఆసక్తితో ఇటువైపు వచ్చిన ఆమె ఇప్పటికే జిల్లా స్థాయిలో పలుమార్లు అవార్డులు అందుకుంది. అలాగే అనంతపురం జిల్లా, అమరాపురానికి చెందిన ఎం.పి పద్మావతి కూడా ఈ అవార్డును అందుకుంది.


బంగారం వెండి

8న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	3,037	3,044
వెండి (గ్రా)	42.10	42.60



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	32,960	32,820	32,550	32,550	32,570	32,520	32,780	32,840	32,630	32,480
ఆర్నమెంట్	30,690	30,660	30,200	30,200	30,700	30,300	30,370	30,440	30,350	30,210
వెండి(కిలో)	39,980	39,950	40,200	40,200	39,900	40,000	40,000	40,100	40,500	40,500



చదువు

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

అలహాబాద్ ఎంఎన్ఎన్ఐటీలో ఫ్యాకల్టీ పోస్టులు

ప్రయాగ్‌రాజ్(ఉత్తర్‌ప్రదేశ్)లోని మోతీలాల్ నెహ్రూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అలహాబాద్‌లో కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు.

పోస్టు-ఖాళీలు: అసిస్టెంట్ ప్రొఫెసర్- 142.
విభాగాలు: అప్లయిడ్ మెకానిక్స్, బయోటెక్నాలజీ, కెమికల్, సివిల్, సీఎస్ఈ, ఎలక్ట్రికల్, ఈసీఈ, మెకానికల్ ఇంజినీరింగ్, మ్యాథ్స్, హెచ్ఎస్ఎస్, ఫిజిక్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్, జీఐఎస్. **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ, బోధన/ పరిశోధనానుభవం ఉండాలి. **వయసు:** 60 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష, ప్రజెంటేషన్/ సెమినార్, ఇంటర్వ్యూ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: 31.01.2019.

హార్డుకాపీలు పంపేందుకు చివరితేది: 05.02.2019.

వెబ్‌సైట్: www.mnnit.ac.in

జోధ్‌పూర్ ఎయిమ్స్‌లో క్లర్కు పోస్టులు

జోధ్‌పూర్(రాజస్థాన్)లోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు-ఖాళీలు: చీఫ్ క్యాషియర్- 01, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్- 01, స్టోర్ కీపర్- 21, క్యాషియర్- 11, స్టోర్ కీపర్-కమ్-క్లర్కు- 85. మొత్తం ఖాళీలు- 119. **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్, పీజీ, డిప్లొమా, కంప్యూటర్ పరిజ్ఞానంతోపాటు పని అనుభవం ఉండాలి. **ఎంపిక:** రాత, నైపుణ్య పరీక్షల ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేది: 04.02.2019.

వెబ్‌సైట్: www.aiimsjodhpur.edu.in

ప్రవేశాలు

ఏపీ ఆదర్శ పాఠశాలలు

ఆంధ్రప్రదేశ్‌లోని 164 ఆదర్శ పాఠశాలల్లో 2019-20 సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ ప్రకటన వెలువడింది. **అర్హత:** సంబంధిత జిల్లాల్లో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో అయిదో తరగతి చదివే విద్యార్థులు అర్హులు. **వయసు:** ఓసీ, బీసీ విద్యార్థులు 01.09.2007 నుంచి 31.08.2009; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01.09.2005 నుంచి 31.08.2009 మధ్య జన్మించి ఉండాలి. **ఎంపిక:** ప్రవేశపరీక్ష మార్కుల ఆధారంగా. **ఆన్‌లైన్‌లో పరీక్ష రుసుం చెల్లింపు తేదీలు:** 10.01.2019 నుంచి 11.02.2019 వరకు. **ప్రవేశపరీక్ష తేది:** 01.04.2019. **గమనిక:** పూర్తి వివరాలకు సంబంధిత ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపల్/ ఎంఈఓను సంప్రదించవచ్చు. https://apms.ap.gov.in/apms/

టీఎస్ సాంఘిక సంక్షేమ గురుకులాలు

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని వివిధ జూనియర్ కళాశాలల్లో 2019-20 సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశ ప్రకటన విడుదలైంది.
ప్రవేశాలు కల్పిస్తోన్న కళాశాలలు: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల- సైనిక్ జూనియర్ కాలేజీ, నాన్-స్పెషలైజ్డ్, ఒకేషనల్ జూనియర్ కళాశాలలు.
అర్హత: మార్చి-2019లో ఎస్సెస్సీ/ సీబీఎస్ఈ/ ఐసీఎస్ఈ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు అర్హులు. **ఎంపిక:** ప్రవేశపరీక్ష ఆధారంగా.

ప్రవేశ పరీక్ష తేది: 17.02.2019.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ తేదీలు: 09.01.2019 నుంచి 23.01.2019 వరకు. **గమనిక:** పూర్తి వివరాలకు సంస్థ అధికారిక వెబ్‌సైట్ చూడవచ్చు.

వెబ్‌సైట్: www.tswreis.in

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

అవకాశాల పాలపుంత.. అంతరిక్షం!





కెరియర్ గైడెన్స్ స్పేస్ సైన్స్

ఒక చిన్న ఉపగ్రహాన్ని స్పేస్‌లోకి ప్రవేశపెట్టగానే ఇంత పెద్ద దేశం పండగ చేసుకుంటుంది. శాస్త్రవేత్తలను ప్రధాని ప్రశంసలతో ముంచెత్తుతారు. వేల కోట్ల ఖర్చు.. క్షణ క్షణం నరాలు తెగే ఉత్కంఠ.. అంతరిక్ష విజయంతో అందరిలోనూ ఆనందం. అలా విశ్వవీధిలోకి చేరిన శాటిలైట్ల సహకారంతోనే మన టీవీలు, రేడియోలు, ఫోన్లు, విమానాలు... ఇలా ఎన్నో పనిచేస్తుంటాయి. వీటి వెనుక ఎందరో పరిశోధకులు, ఎన్నో రకాల నిపుణుల కృషి ఉంటుంది. వారిలో ఒకరిగా ఆ ఉత్సవాల్లో భాగస్వాములు కావాలంటే అంతరిక్షాన్ని అర్థం చేసుకోవాలి. పాలపుంతలపై పరీక్షలు రాయాలి. అప్పుడే అనంత విశ్వంలోని అపార అవకాశాలను అందిపుచ్చుకోగలుగుతారు. అందుకోసం స్పేస్ సైన్స్ కోర్సులు చదవాలి.

నిరంతర కృషి అవసరం



ఖగోళశాస్త్రం విశ్వం గురించి చేసే అధ్యయనం. మానవుడు దీని అధ్యయనంలో ఎంత పరిశోధన చేసినా తెలుసుకోవాల్సింది ఇంకా ఎంతో ఉంది. ఈ ప్రక్రియలో ఎన్నో వైవిధ్యమైన కోర్సులతో ఖగోళశాస్త్రం ముందంజలో ఉంది. పరిశోధనా రంగంలో యువ మేధస్సుకు అనేక అవకాశాలను కల్పిస్తోంది. అంతుచిక్కని ఎన్నో ప్రశ్నలకు సమాధానాలను తెలుపుతూ ప్రజలలోని మూఢనమ్మకాలను పారదోలడానికి కృషి చేస్తోంది.

ఒక విద్యార్థి ఈ రంగంలో స్థిరపడాలనుకుంటే నిరంతర కృషి, పట్టుదల, దూరదృష్టి, సహనం కలిగి ఉండాలి. దీనికి సంబంధించి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ ప్రాజెక్టులు (టీఎంటీ- థర్టీ మీటర్ టెలిస్కోప్, జీఎంటీ- జెయింట్ మెజెలెన్ టెలిస్కోప్, ఎల్ఐజీఓ - లేజర్ ఇంటర్‌ఫెరోమీటర్ గ్రావిటేషనల్ - వేవ్ అబ్జర్వేటరీ) రానున్నాయి. కాబట్టి యువతకు ఖగోళశాస్త్ర పరిశోధన రంగంలో ఎన్నో అవకాశాలు వచ్చే ఆస్కారం ఉంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ రంగాన్ని నిస్సందేహంగా ఎంచుకోవచ్చు.

- డాక్టర్ డి. శాంతిప్రియ, హెడ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆస్ట్రానమీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్

భవిష్యత్‌లో అంతరిక్ష యుగం మొదలవుతుంది. ఎలాంటి విపత్తులు ఎదురైనా మానవాళి మనుగడను కాపాడేందుకు ఇతర గ్రహాల్లో అన్వేషణలు, భూమికి ప్రత్యామ్నాయ గ్రహాన్ని కనుగొనడం చాలా కీలకం. ఇందుకనుగుణంగా సన్నాహాలు చేస్తున్నారు. వీటన్నింటి కారణంగా అంతరిక్షరంగ ప్రాధాన్యం పెరుగుతోంది. భారత ప్రభుత్వం ఈ రంగానికి బడ్జెట్‌లో భారీ నిధులు కేటాయిస్తోంది. 2022లో చేపట్టే మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'కు రూ.10వేల కోట్లకు ఆమోదం తెలిపింది. ఈ యాత్రవల్ల దీర్ఘకాలంలో అనేక ఉద్యోగాలను సృష్టించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎక్కువ శాతం ఉద్యోగాలు పరిశ్రమల్లోనూ, మిగతావి విద్యాసంస్థల్లో వస్తాయని అంచనా. 2020లో ఒక మానవరహిత యాత్రనూ భారత్ చేపట్టనుంది. ఈ ఏడాది సంక్లిష్టమైన చంద్రయాన్ -2 సహా 32 అంతరిక్ష ప్రయోగాలు చేపట్టనున్నట్లు భారత అంతరిక్షసంస్థ- ఇస్రో ప్రకటించింది.

స్పేస్ సైన్స్ అంటే విశ్వం గురించి చేసే శాస్త్రీయ అధ్యయనం. ప్రత్యేకించి దీని కదలిక, పొజిషన్స్, పరిమాణం, కంపోజిషన్‌తోపాటు ఖగోళ వస్తువుల ప్రవర్తన గురించి పరిశోధనలు చేయడం. టీవీ, రేడియో, ఫోన్ సిగ్నల్స్; కార్లు, విమానాలలో వాడే శాటిలైట్ నావిగేషన్లు అంతరిక్షంలోని ఉపగ్రహాలు మనకు పంపించే సమాచారం ఆధారంగానే పనిచేస్తున్నాయి. కార్లు, మోటారు బైక్‌ల నుంచి వెలువడే కాలుష్యం కారణంగా ఓజోన్ పొర ఎలా దెబ్బతింటోంది?, వాతావరణం, మహాసముద్రాలు, అడవులు, ఎడారులు, వివిధ మారుమూల ప్రాంతాల గురించి మనం తెలుసుకునే సమాచారమంతా శాటిలైట్లు పంపించేదే. వాతావరణ పరిస్థితులను ముందుగానే తెలుసుకుని ప్రకృతి వైపరీత్యాలను అంచనా వేయడంలోనూ ఉపగ్రహాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి.

ఏ కోర్సులు చేయటం మేలు?

★ ఈ రంగంలో స్థిరపడాలంటే ఇంటర్‌లో తప్పనిసరిగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ సబ్జెక్ట్‌ను తీసుకోవాలి. జేఈఈ అడ్వాన్స్‌డ్, జెస్ట్, సీఎస్ఐఆర్ నెట్ లాంటి ప్రవేశపరీక్షల ఆధారంగా కోర్సుల్లో చేరొచ్చు.

★ ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కాలవ్యవధి అయిదేళ్లు. ఫిజిక్స్ ప్రధానాంశంగా డిగ్రీ చేసి ఎంఎస్సీ ఫిజిక్స్, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ (ఫిజిక్స్) చేయొచ్చు.

★ బీఈ- స్పేస్ టెక్నాలజీ వ్యవధి నాలుగేళ్లు. ఆస్ట్రానమీ, ఆస్ట్రోఫిజిక్స్, కాస్మాలజీ, స్టెల్లార్ సైన్స్, ప్లానెటరీ సైన్స్ గురించి చదువుతారు. ఏర్‌క్రాఫ్ట్ నిర్మాణం, రూపకల్పనలో అభిరుచి ఉన్నవారు ఈ కోర్సులో చేరొచ్చు.

★ బీటెక్ ఏవియానిక్స్ ఇంజినీరింగ్ వ్యవధి నాలుగేళ్లు. విశ్లేషణ సామర్థ్యం, లాజికల్, రీజనింగ్ స్కిల్స్, గణితంలో నైపుణ్యం ఉన్నవారు ఈ కోర్సును అధ్యయనం చేస్తే కెరియర్ బాగుంటుంది.

★ బీటెక్ స్పేస్ టెక్నాలజీ కోర్సు నాలుగేళ్లు. సోలార్ సిస్టమ్, భూమి, ఇతర గ్రహాలు, అంతరిక్షం మొదలైన విషయాలను గురించి తెలుసుకుంటారు.

★ ఎంటెక్ క్రయోజనిక్ ఇంజినీరింగ్ రెండేళ్ల కోర్సు. బీఈ/బీటెక్ తర్వాత ప్రవేశపరీక్ష ఆధారంగా చేరొచ్చు. ఇది మెకానికల్, కెమికల్ ఇంజినీరింగ్‌ల కలయిక. రాకెట్ ప్రొపెల్షన్‌లో క్రయోజనిక్‌ది కీలకపాత్ర.

★ డిప్లొమా ఇన్ స్పేస్ టెక్నాలజీ వ్యవధి మూడేళ్లు. పదో తరగతి తర్వాత చేయాలి. విద్యార్థులు మేథమేటిక్స్, ఎలక్ట్రానిక్స్, థర్మోడైనమిక్స్ సంబంధిత సబ్జెక్టులు అధ్యయనం చేస్తారు. ఈ కోర్సు పూర్తి చేసినవారు మాస్టర్ డిగ్రీలో చేరొచ్చు లేదా రిసెర్చ్‌వైపూ వెళ్లొచ్చు.

★ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఎయిర్ పొల్యూషన్ మెజర్‌మెంట్ అండ్ కంట్రోల్ ఇంజినీరింగ్ కాలవ్యవధి సంవత్సరం. ఇంటర్ (ఎంపీసీ) తర్వాత చేయొచ్చు. జాదవ్‌పూర్ యూనివర్సిటీలో ఉంది.

కోర్సులు, ఉపాధి అవకాశాలను అందిస్తున్న సంస్థల వివరాలు www.eenadupratibha.net లో.

ఉద్యోగావకాశాలు



ఆస్ట్రోనాట్స్: ఆస్ట్రోనాట్ కావడానికి సంబంధిత విభాగానికి చెందిన సైన్స్ లేదా మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ చేసి, తప్పనిసరిగా అనుభవం పొందిన పైలట్ అయి ఉండాలి. ఫిట్‌నెస్ ప్రమాణాలనూ పాటించాలి. ఇందుకు కఠినమైన శిక్షణ ఉంటుంది. వీరు అంతరిక్ష అన్వేషణ కార్యక్రమంలో పాల్గొంటారు.

స్పేస్ ఇంజినీర్స్: స్పేస్ ఇంజినీర్లు తమ సాంకేతిక నైపుణ్యంతో అంతరిక్ష యాత్రను విజయవంతం చేస్తారు. వీరు స్పేస్ - క్రాఫ్ట్స్, స్పేస్ వెహికల్, స్పేస్ స్టేషన్లను రూపొందిస్తారు. అలాగే ఒక ఉపగ్రహ వాహనానికి కావాల్సిన వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తారు. దాని ప్రసార, కమ్యూనికేషన్‌ను సులభతరం చేస్తారు.

స్పేస్ సైంటిస్ట్: అనేక విభాగాల్లోని శాస్త్రవేత్తలు స్పేస్‌సైన్స్‌లో శాస్త్రవేత్తలుగా మారొచ్చు. ఉదాహరణకి ఫార్మాలజీ శాస్త్రవేత్త స్పేస్ యాత్రలో లభించిన ఉల్కల లాంటి పదార్థాలతో మందులను తయారు చేయడం.

టెక్నాలజిస్టు, టెక్నీషియన్స్: స్పేస్ సైంటిస్టులు, ఇంజినీర్లు వివిధ స్పేస్ ప్రాజెక్టులు, సాంకేతిక ఆవిష్కరణల నిర్మాణం, అభివృద్ధి, వాటికి సంబంధించి పరీక్షలను జరిపినపుడు టెక్నాలజిస్టు, టెక్నీషియన్స్ సహాయపడతారు. వీరే కమ్యూనికేషన్ టెక్నీషియన్లు. కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్ (సీఏడీ) ఆపరేటర్స్, డ్రాఫ్టర్స్, ఎలక్ట్రీషియన్స్, లేజర్ టెక్నీషియన్స్, క్వాలిటీ అస్యూరెన్స్ స్పెషలిస్ట్స్, రాడార్ టెక్నీషియన్స్, రోబోటిక్ టెక్నీషియన్లు, ఉపగ్రహ సాంకేతిక నిపుణులు ఈ విభాగంలోకి వస్తారు.

✦ అంతరిక్ష శాస్త్రవేత్తలు విశ్వవిద్యాలయాల్లో ఫ్యాకల్టీగా, పీహెచ్‌డీ విద్యార్థులకు గైడ్‌గా, పేపర్ల పబ్లిషర్‌గా, అకడమిక్ కమిటీల్లో సభ్యుడిగా, ప్రతిపాదనలను రాయడం, పబ్లికేషన్స్‌కు పేపర్లను రిఫర్ చేసేవారిగా పని చేయవచ్చు. ఇవే కాకుండా అబ్జర్వేటరీస్, సైన్స్ మ్యూజియం, అంతరిక్ష పరిశోధన సంస్థలు మొదలైనవాటిలో ఆస్ట్రానమర్లు, ఆస్ట్రోఫిజిస్ట్‌లుగా పని చేయవచ్చు.

✦ స్పేస్ సైన్స్ నిపుణులు సాఫ్ట్‌వేర్ లేదా టెక్నాలజీకి సంబంధించిన వ్యాసాలు రాయడం, టెలిస్కోప్ డిజైనింగ్, మ్యానుఫాక్చరింగ్, స్పేస్ ల్యాబొరేటరీల్లో పనిచేయవచ్చు. వీటితో పాటు ఆర్‌అండ్‌డీ కేంద్రాలు, మిలటరీ ఆపరేషన్స్‌లో స్పేస్ క్రాఫ్ట్ రూపకల్పన, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయవచ్చు. అలాగే స్పేస్ టూరిజం ఆపరేటర్లుగానూ ఉండొచ్చు.

✦ ఇస్రో శాటిలైట్ సెంటర్, ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, స్పేస్ అప్లికేషన్ సెంటర్, డాక్టర్ విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లు అంతరిక్ష శాస్త్రవేత్తలకు పరిశోధనలకు అవకాశాలు కల్పిస్తున్నాయి.

సైంటిస్టులకు వారి విద్యార్హత, పని తీరు, సంస్థను బట్టి వేతనం ఉంటుంది. నైపుణ్యం బాగుంటే వేతనాలూ అధికంగానే ఉంటాయి.

ఇస్రోలో కోర్సు, కొలువు

ప్రపంచంలోనే అతి పెద్ద అంతరిక్ష సంస్థల్లో ఆరోదైన తిరువనంతపురం(కేరళ)లోని ఇస్రోను 1969లో విక్రం సారాభాయ్ నేతృత్వంలో నెలకొల్పారు. ఈ సంస్థ బ్రాడ్‌కాస్ట్ అండ్ కమ్యూనికేషన్, జియోగ్రాఫిక్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్స్, వెదర్ ఫోర్‌కాస్ట్, టెలిమెడిసిన్, కార్టోగ్రఫీ, నేవిగేషన్, డెడికేటెడ్ డిస్టన్స్ ఎడ్యుకేషన్ శాటిలైట్స్ ద్వారా భారత్‌కు అంతరిక్ష సేవలను అందిస్తోంది. ఈ సంస్థకు ఎంతోమంది నిపుణుల అవసరముంది.

❖ 2019 కిగానూ ఏరోస్పేస్ ఇంజినీరింగ్, ఏవియానిక్స్‌లో బీటెక్ చేయడానికి, అయిదేళ్ల డ్యూయల్ డిగ్రీ (బీటెక్ అండ్ మాస్టర్ ఆఫ్ సైన్స్/ఎంటెక్) ప్రోగ్రామ్‌కు సంబంధించి ఇస్రో నోటిఫికేషన్ విడుదలైంది. మే 22 నుంచి జూన్ 5లోపు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. **అర్హత:** ఈ కోర్సులకు అప్లై చేసే అభ్యర్థి తప్పనిసరిగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసిఉండాలి. మరిన్ని వివరాలకు www.iist.ac.in/admissions/undergraduate ను చూడొచ్చు.

❖ 2019 సంవత్సరానికి ఇస్రో సైంటిస్ట్ పోస్టులను ప్రకటించింది. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా తీసుకుంటారు. **అర్హత:** భారతీయ పౌరుడై ఉండాలి. కనీస వయసు 21. జనవరి 15, 2019 నాటికి 35 ఏళ్లు మించకూడదు. కనీసం 65%తో సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత.

చివరితేది: జనవరి 15, **రాతపరీక్ష:** మార్చి 10.
వెబ్‌సైట్: http://www.isro.gov.in/ career

ఫారెస్ట్రీలో ఏయే కోర్సులు?

›› ఫారెస్ట్రీలో ఉండే కోర్సులు, వాటిని అందించే సంస్థల వివరాలను తెలపండి.

- కొమరపు జయరాం

ఫారెస్ట్రీలో కోర్సు చేయాలనుకునేవారు 10+2లో బైపీసీని పూర్తిచేసి ఉండాలి. ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రిసెర్చ్ (ఐసీఏఆర్) వారు నిర్వహించే పరీక్ష ద్వారా కొన్ని అగ్రికల్చర్ యూనివర్సిటీలు అందించే ఫారెస్ట్రీ కోర్సుల్లో ప్రవేశాన్ని పొందొచ్చు. పోస్టుగ్రాడ్యుయేట్ స్థాయిలో వివిధ స్పెషలైజేషన్లు ఫారెస్ట్ మేనేజ్‌మెంట్, ఫారెస్ట్ ఎకనామిక్స్, కమర్షియల్ ఫారెస్ట్రీ, వుడ్ సైన్స్, అగ్రోఫారెస్ట్రీ, వైల్డ్ లైఫ్ కన్జర్వేషన్ వంటి వాటిని ఎంచుకోవచ్చు. ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్- డెహ్రాడూన్ మనదేశంలో ఫారెస్ట్రీ విద్యకు ప్రతిష్ఠాత్మక సంస్థ. ఇంటిగ్రల్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫారెస్ట్రీ- మహారాష్ట్ర గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను అందిస్తోంది.

ఎంఎస్‌సీనా? ఎంబీఏనా?

›› బీఎస్‌సీ (ఎంపీసీఎస్) చివరి సంవత్సరం చదువుతున్నాను. తరువాత ఎంఎస్‌సీ (మేథ్స్/ ఫిజిక్స్), ఎంబీఏల్లో ఏది చేస్తే మేలు? వేటిలో ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉన్నాయి?

- భవాని

పీజీ విద్యను ఎంచుకునే ముందు మీ అభిరుచి, ఏ ఉద్యోగావకాశాలను పొందాలనుకుంటున్నారో బేరీజు వేసుకోండి. కోర్ ఉద్యోగంలో స్థిరపడాలనుకుంటే గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక ఎంఎస్‌సీ (మేథ్స్/ ఫిజిక్స్/ స్టాటిస్టిక్స్)ను ఎంచుకోండి. ప్రత్యామ్నాయంగా ఎంఎస్‌సీ- ఎకనామెట్రిక్స్ అండ్ మేథమేటిక్స్‌ను కూడా పరిశీలించొచ్చు. వీటిలోనూ మంచి ఉద్యోగావకాశాలున్నాయి. నలుగురూ చేరే కోర్సులు కాకుండా స్పెషలైజ్‌డ్ ఏరియాల్లో పీజీ చేస్తే మంచి కెరియర్‌ను సొంతం చేసుకోవచ్చు.

ఇక ఎంబీఏ విషయానికొస్తే.. వ్యూహరచన, వ్యాపారం పట్ల ఆసక్తి, చురుకుదనం, కమ్యూనికేషన్, నెట్‌వర్కింగ్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు ఉంటే ఎంచుకోవచ్చు. కానీ ఈ కోర్సును క్యాట్‌లో ఉత్తీర్ణత సాధించి, ప్రఖ్యాత బిజినెస్ స్కూళ్లలో అభ్యసిస్తే మంచిది. ఇది మీ కెరియర్‌కు బాసటగా నిలుస్తుంది. కాబట్టి, ఎంబీఏ/ ఎంఎస్‌సీ రెండింటికీ మంచి ఉపాధి అవకాశాలున్నాయి. రెండింటిలో ఒకటి తక్కువ, ఎక్కువ అనే భేదం లేదు. ఆసక్తి, అభిరుచిని బట్టి ఎంచుకోవాలి.



అమ్మాయిలకు ఫోరెన్సిక్ సైన్స్ మంచిదేనా?

›› మా అమ్మాయిని దిల్లీలో బీఎస్‌సీ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులో చేర్చాం. కానీ అది అమ్మాయిలకు అంత మంచి రంగం కాదని అంటున్నారు. నిజమేనా? కాదంటే.. కోర్సు చదివిన తరువాత ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో తనకుండే ఉద్యోగావకాశాలేంటి? ఉన్నతవిద్య ఏం చదివితే తనకు మంచి అవకాశాలుంటాయి? - సుధాకర్

నేటితరం అమ్మాయిలు ప్రతి రంగంలో తమదైన ముద్ర వేస్తున్నారు. ఈ రంగంలో అమ్మాయిలు విజయం సాధించలేరు అని ఏ ఒక్కదాన్నీ చెప్పలేం. మీరు అధైర్య పడకుండా మీ అమ్మాయిలో ఆత్మవిశ్వాసాన్ని నింపండి. నేర పరిశోధనలో విజ్ఞాన సూత్రాలను వర్తింపజేసి, సాధారణ దృష్టిని తప్పించుకునే ఆధారాలను కనుగొనే శాస్త్రమే ఫోరెన్సిక్ సైన్స్. ప్రభుత్వ రంగంలో పోలీసు శాఖ, ఎన్ఐఏ, సీఐడీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ల్లో ఉద్యోగావకాశాలున్నాయి. ప్రైవేటు రంగంలో డిటెక్టివ్ సంస్థల్లో, నేర పరిశోధన, రిసెర్చ్ సంస్థల్లో ఉద్యోగాలున్నాయి. పై చదువులకు విదేశాల్లో ఎంఎస్ (ఫోరెన్సిక్ సైన్స్) చదివి, పీహెచ్‌డీ చేస్తే పరిశోధనలో, బోధనావకాశాలు మెండుగా ఉన్నాయి. కాబట్టి, ఇతరుల మాటల గురించి దిగులు పడకుండా మీ అమ్మాయిని భవిష్యత్తు దిశగా ప్రోత్సహించండి.

- ప్రొ. బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్